Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆర్. ఎస్. సుదర్శనం

సాహిత్య నేపథ్యం

వ్యాసావళి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

8276

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Forwarded free of cost
With the compliments of
Department of Education
Govt. of India, New Delhi

సాహిత్య నైవేద్యం

8276

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

DONATION

ఆర్. ఎస్. సుదర్శనం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రథమ ముద్రణ : 1983 జనవరి

ద్వితీయ ముద్రణ : 1989 (రివైజ్‌డ్)

అన్ని హక్కులు : రచయితవి

వెల : రు. 25/-

ప్రచురణ :

శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

9/258, కమ్మవీధి,

మదనపల్లి - 517 325

ముద్రణ :

శ్రీ రత్నా ప్రింటర్స్
ముత్తంగివారి వీధి
రాజమండ్రి - 1

SAHITYA NEPATHYAM (Essays on Literary Criticism) by R. S. Sudarshanam - Second Print, 1989. Published by Smt. R. Vasundhara Devi at 9-258, Kamma Street, Madanapalli - 517 325.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందులో....

		రచనా కాలం	పుట
1.	ఆధునిక సాహిత్యంలో 'కాలం'	(1964)	1
2.	మానవత్వము : ఆధునికత	(1970)	16
3.	సాహిత్యము : ఆధునికత	(1987)	37
4.	మార్క్స్ దృష్టిలో సాహిత్యం	(1979)	54
5.	విప్లవము : సాహిత్యము	(1972)	79
6.	సాహిత్యంలో సామాజికస్పృహ	(1978)	100
7.	తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదము	(1976)	108
8.	తెలుగులో తాత్త్విక నవల	(1979)	134
9.	తెలుగు కవిత్వ పరిణామం : ఉద్యమాలు	(1981)	142
10.	అనుభూతి కవిత్వం	(1989)	148
11.	తెలుగు కథ : శిల్పం	(1974)	161
12.	సాహిత్యంలో సృజన	(1976)	177
13.	సాహిత్య విమర్శ స్వరూపం	(1968)	132
14.	సాహిత్య లక్ష్యం	(1981)	195

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంకితం :

పితృపాదులు

దాదాజీకి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాసావళి : రెండవకూర్పు

దీని మొదటి ముద్రణ 1983లో వెలువడింది. రచయితలు, సాహిత్య విద్యార్థులు చూపిన ఆదరణవల్ల నేడు రెండవ ముద్రణ అవసరం ఏర్పడింది. ఈమధ్యకాలంలో వ్రాసిన రెండు వ్యాసాలు- 'సాహిత్యము : ఆధునికత', 'అనుభూతి కవిత్వం' ఇందులో చేర్చాను.

'సాహిత్యము : ఆధునికత'లో 19-20శతాబ్దాలలో సాహిత్య పరిణామంయొక్క సమగ్ర చిత్రణద్వారా 'ఆధునికత'ను గూర్చి ఏర్పడిఉన్న అపోహల్ని తొలగించే ప్రయత్నం చేశాను.'ఆధునికత' అనేది సాపేక్షము అని గుర్తించాలి.

'అనుభూతి కవిత్వం' ఏమిటో లక్షణ నిర్దేశం చేసే ప్రయత్నంలో ఆధునిక కవుల, విమర్శకుల, మేధావుల అభిప్రాయాల్ని సమన్వయించి పాఠకుల్లో కొత్త దృక్పథాన్నిగూర్చిన అవగాహన, స్పృహా కలిగించేలా వ్యాసాన్ని మలిచాను. సామాజిక ప్రయోజనం, సామాజిక స్పృహవంటి నినాదాలతో హోరెత్తిన వాళ్ళకు, అనుభూతి కవిత్వం తాలూకు ఆనందం, నిశ్శబ్దం వెంటనే రుచించదు! పాఠకుల అభిరుచిలో మార్పు ప్రారంభమైన సూచనలు స్పష్టంగా ఉన్నాయి. మారుతున్న ఆ యువతరం పాఠకులకే ఈ వ్యాసం ఉద్దేశింపబడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోతే, పాతవ్యాసాల్లో విమర్శకు, వివాదానికి గురియైనవి - మార్క్సు దృష్టిలో సాహిత్యం, విప్లవము : సాహిత్యము, సాహిత్యంలో సామాజిక స్పృహ. ఆ విమర్శలన్నీ వామపక్ష రాజకీయ వాదులనుంచీ వచ్చినవే ! వారప్పటికింకా స్టాలినిజమ్ యినుప సంకెళ్ళలో పరప్రత్యయ నీయబుద్ధులుగానే ఉన్నారు. గొర్బాచెవ్ ప్రవేశపెట్టిన 'పెరిస్త్రోయికా', 'గ్లాస్‌నోస్త్' సంస్కరణలతో రష్యాలో రాజకీయ, సామాజిక, సాహిత్యక వాతావరణమే మారిపోయింది ! పోలండ్, హంగరీ, తూర్పుజర్మనీ దేశాల్లో గొప్ప పరిణామాలు వచ్చాయి ! ఇవన్నీ కూడా 1972-79 కాలంలో మార్క్సు మౌలిక దృక్పథానికి నేనిచ్చిన వివరణలూ, వ్యాఖ్యానాలూ (పై మూడు వ్యాసాల్లో నిక్షిప్తమైన భావాలన్నీ) సరియైనవీ, సక్రమమైనవీ అని రుజువుచేస్తున్న నేటి సంఘటనలు ! మానవతావాదం వక్రమార్గం వదలిపెట్టి రుజుమార్గాన పయనిస్తున్నదని తెలిసి సంతోషించేవారిలో నే నొకణ్ణి.

గత యిరవై అయిదేళ్ళలో అప్పుడప్పుడు వ్రాసిన ఈ వ్యాసాల్లో దిద్దవలసిన, కాలదోషం పట్టిన అభిప్రాయాలు ఏవీ నాకు కనిపించకపోవడం ఒక విశేషం ! సాహిత్య విద్యార్థులకీ వ్యాసావళి నేటికీ సాహిత్య నేపథ్యంగా, వారి అవగాహనకు తోడ్పడుతున్నందువల్లనే ఈ రెండో కూర్పు. వారందరికీ నా అభివాదాలు !

3-11-1989

—రచయిత.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధునిక సాహిత్యంలో 'కాలం'

సాహిత్య సౌధంలో అధికారంతో విహరించేందుకు శాస్త్ర పరిజ్ఞానం తాళం చెవిలాంటిది, శాస్త్ర పరిజ్ఞానం అంటే అలంకార శాస్త్ర పరిజ్ఞానం మాత్రమే కాదు, ఆ పాత తాళంచెవితో ఆధునిక సాహిత్యసౌధం ద్వారాలు తెరవబడటం లేదు ! పాత తాళంచెవితో కొత్త ఇంటికి వెళితే చుట్టూ తిరిగిచూచి వెనక్కి మళ్ళవలసి వస్తోంది. లోపలికి ప్రవేశం లభించడం లేదు. ఈ కొత్త ఇంటి తాళం చెవులెక్కడున్నాయి? ఈ శతాబ్దిలో అభివృద్ధి చెందిన శాస్త్ర పరిజ్ఞానాన్ని మూడు శాఖలుగా విభజిస్తే, అవి (1) మనస్తత్వ శాస్త్రం (2) సాంఘిక-ఆర్థిక శాస్త్రాలు (3) భౌతిక, రసాయనిక - జీవశాస్త్రాలు, అనే తాళం చెవులు. ఈ మూడింటివల్లా ప్రభావితమైన దార్శనిక భావాలు (Philosophical ideas) ఆధునిక సాహిత్యానికి కొన్ని అపూర్వ లక్షణాలను - భాషలో, వస్తువులో, ప్రక్రియా నిర్మాణంలో - ప్రసాదించినట్లు తెలుస్తోంది. ఒక విధంగా సాహిత్యాన్ని మూడు విధాలుగా విభజించవచ్చు (1) వ్యక్తికి ప్రాధాన్యమిస్తూ, వ్యక్తిగతమైన మనోవిశ్లేషణం ధ్యేయంగా పెట్టుకొన్న రచనల్లో మనస్తత్వ శాస్త్ర ప్రభావం _ అంటే ఫ్రాయిడ్, యుంగ్, అడ్లర్, పావ్లావ్, వాట్సన్ మొదలగు వారి పరిశోధనల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. (2) సంఘంలో పరిణామాలను ప్రధాన వస్తువుగా చిత్రిస్తూ సామూహిక ప్రయోజనం ఆకాంక్షించే రచనల్లో సాంఘిక - ఆర్థిక శాస్త్రాల ప్రభావం, అంటే మార్క్స్, టాల్‌స్టాయ్, గాంధి వంటివారి ప్రభావం - వ్యక్తమౌతూ ఉంటుంది (3) సైంటిఫిక్ రొమాన్సస్, డిటెక్టివ్ సాహిత్యంలో భౌతిక-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రసాయనిక - జీవశాస్త్రాల విజ్ఞానం ఎదురౌతూ ఉంటుంది, కాని ఈ విభజన కేవలం స్థూల విభజన. మూడురకాల ప్రభావాలూ సమ్మేళనం చెందటం కాని, అవి ఏ ఏ పాళ్ళలో ఏ విధంగా కలిశాయి అనే విషయం కాని, రచయిత ప్రతిభావ్యుత్పత్తుల మీద ఆధారపడక తప్పదు.

శాస్త్రాలు భిన్నశాఖలుగా ప్రవృద్ధమాన మౌతున్నప్పటికీ, కొన్ని శాస్త్రాల మధ్య విభేదం అంతరిస్తూ ఉండటం, ఒక శాస్త్రం మరియొక శాస్త్రంమీద ఆధారపడుతూ ఉండటం, ఇరవయ్యో శతాబ్దంలో ఏర్పడుతున్న కొత్త పరిస్థితి. ఉదాహరణకు రసాయనికశాస్త్రం, భౌతికశాస్త్రం ఆదిలో ప్రత్యేక శాస్త్రాలుగా ఉంటూ ఉన్నా, చరమ దశలో వాటికి అద్వైతం పట్టే పరిస్థితి ఉంది. విశ్వంలో మూలవస్తువు పదార్థమా (matter) శక్తియా (Energy) అనే జిజ్ఞాస వచ్చేటప్పటికి ఆ శాస్త్రాలు రెండింటికీ భేదం అంతరిస్తోంది. భౌతిక, రసాయనిక, శాస్త్రాలు సాధించిన ప్రగతి, తత్త్వ జిజ్ఞాస మీదా, వ్యక్తి దృక్పథం మీదా, విస్తరిస్తున్న సంఘజీవనంలో పారిశ్రామిక వ్యవస్థయొక్క అవసరాలు, ఆపేక్షలూ మళ్ళీ శాస్త్ర పరిశోధన మీదా—ఇలా ఒకదాని మీద ఒకటి ప్రభావం చూపుతూ, ఆధారపడుతూ ఆవర్తంకావటం, దాని ననుగమించి మానవ దృక్పథం, జీవితం, మారుతూ ఉండటం యీ యుగంలో ముఖ్యంగా గమనించి అర్థం చేసుకోదగిన సంగతి. ఎవరైనా ఈ మార్పుని గుర్తించటానికి నిరాకరించినప్పుడు, ఈ యుగం సాహిత్యాన్ని అర్థం చేసుకునే అధికారం వారికి లభ్యంకాదన్న మాటకు తిరుగులేదు.

ఈ శతాబ్దంలో మారిన దృక్పథాన్ని అవగాహన చేసుకోవాలంటే స్పృశించ వలసిన కీలకమైన విషయాలలో 'కాలం' ఒకటి. శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉన్నదున్నట్లు సేకరించటం శ్రమతోకూడిన పని. దానికి ఓపికా, తీరికా అందరికీ ఉండదు. కాని సాహిత్యానికి సంబంధించినంతవరకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధునిక శాస్త్ర విజ్ఞానంవల్ల కొన్ని కీలకమైన విషయాల్లో ఎటువంటి భావ పరివర్తనం, భావవిప్లవం, జరిగిందో చర్చించటం, వివరించటం, ప్రస్తుతం సాహిత్యవిమర్శ చేయవలసిన ముఖ్యకార్యాల్లో ఒకటి అని తోస్తుంది. కాలాన్ని గూర్చి జరిగిన శాస్త్రపరిశోధనలూ, తాత్త్విక జిజ్ఞాసా, ఈ శతాబ్ది సాహిత్యంలో ఎలా ప్రతిఫలించాయో కొంతవరకు పరిశీలించటమే ఈ వ్యాసంయొక్క ఉద్దేశ్యం. ఇది పెద్దవిషయం. దీన్నిగూర్చి విపులంగా ఒక గ్రంథం వ్రాయవచ్చు. ఇక్కడ కేవలం ఆంగ్లాంధ్ర సాహిత్యాలను రెండింటిని మాత్రమే తడవుతూ కొన్ని ఉదాహరణలు ఇవ్వటానికే సాధ్యమౌతున్నది.

ఐన్‌స్టీన్ 'సాపేక్షతా సిద్ధాంతము' (Theory of Relativity) వలన సర్వత్ర ఒకటియైన, విశ్వజనీనమైన కాలమంటూ (Universal Cosmic Time) ఏదీ లేదని నిరూపణ అయింది. సంఘటనల క్రమం కాని (Order of events) యౌగపద్యము గాని (Simultaneity) ద్రష్ట (Observer) మీద ఆధారపడి ఉంటుంది. ద్రష్టను బట్టి మారుతుంది. అందువల్ల రెండు సంఘటనల మధ్య యింత కాలవ్యత్యాసమున్నదనీ, రెండు ప్రదేశాలమధ్య ఇంత దూరం ఉన్నదనీ మామూలుగా వ్యవహరించటంలో వస్తుతః యథార్థత్వము (Objective truth) లేదు. 'కాలా'నికి 'దేశ' నిర్దేశమూ, 'దేశా'నికి 'కాల' నిర్దేశమూ అవశ్యమౌతుంది. ఈ దేశకాల సంయోగమునకు 'దేశకాలావిరతకము' (Space-time-continuity) అని పేరు. ప్రతి వస్తువుకూ మనిషికీ తన చలనంతో సంబంధించి 'కాలం' భిన్నంగా ఉంటోంది. దీన్నే ఆ వస్తువుకూ ఆ మనిషికీ సంబంధించిన 'ప్రత్యేక కాలం' అంటారు. (For each body, there is definite time-order for the events in its neighbourhood, this may be called the proper time for that body. Our own experience is governed by the 'proper' time for our own

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

body—'ABC of Relativity' by B. Russell.) పురాణాల్లో కల్పము, బ్రహ్మకల్పము, మానవకాలాపేక్షము ఉంటాయనటం ఎటువంటి వైజ్ఞానిక సత్యమో దీనివల్ల విదితమౌతుంది, ప్రతి మనిషికీ, వస్తువుకూ, కాలం భిన్నంగా ఉంటున్నప్పటికీ మనమందరూ ఒకే భూమిమీద యించుమించు చలనం లేకుండా ఉండటంవల్లా, మన మధ్య చలనభేదం ఉన్నా అది వెలుతురు యొక్క వేగంతో పోలిస్తే అల్పాతిఅల్పం కావటం వల్లా వ్యవహారరీత్యా మనందరికీ సామాన్యమైన కాలం ఒకటి ఉన్నట్లే భ్రమించ టానికి వీలౌతున్నది.....కాలాన్ని గూర్చిన ఈ యథార్థాన్ని నిరూపించిన పరిశోధనల్లో వెలుతురు వేగం (సెకనుకు 186,000 మైళ్లు) కీలకమైన హద్దుగా ఉంటోంది, మానవుని శక్తికి యిది అన్ని విధాలా అనుల్లంఘనీ యమైన హద్దుగానే కనిపిస్తోంది.

కాని ఆశకూ ఊహకూ హద్దులు లేవు. ఒక సంఘటన తాలూకు వెలుగుకిరణాలు రోదసిలో అనంతంగా ప్రయాణం చేస్తుంటాయని భావిస్తే మూడేళ్ళ క్రితం జరిగిన సంఘటనల తాలూకు వెలుతురు కిరణాలతో మనం పోటీపడి వాటిని అందుకోగలిగితే, మళ్ళీ ఆ నాటి సంఘటనల్ని కళ్ళతో దర్శించగలుగుతా మనటంలో ఆక్షేపణలేదు. వెలుతురు వేగాన్ని మించిన వేగంతో ప్రయాణం చేసే యంత్రం ఇందుకు అవసరం. ఈ ఊహ ఆధారంగా తీసుకుని హెచ్. జీ. వెల్స్ "టైమ్-మెషిన్" (Time Machine) అనే కల్పనిక నవల వ్రాశారు.

దేశకాలావిరతకము (Space - time Continuity) ఐన్‌స్టీన్ ప్రతి పాదించిన తరువాత, దాన్ని ఆధారంగా తీసుకొని దర్శనము నిర్మించిన వారిలో ఎన్నదగిన వాడు గణితశాస్త్రజ్ఞుడు, మేధావి, యోగి అయిన పి. డి. ఆస్పెన్స్కీ. (P. D. Ouspensky.) 'దేశాని'కి మూడు పరిమాణాలు__ పొడవు, వెడల్పు, ఎత్తు లేక లోతు_ఉన్నాయి. ఐన్‌స్టీన్ ప్రతిపాదన్ననుస

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రించి కాలాన్ని నాలుగవ పరిమాణంగా (Fourth Dimension) తీసుకొన వచ్చు. ఈ ఆధారంమీద అస్పెన్స్కీ విశ్వతత్త్వాన్ని గూర్చి, చావు బ్రతుకులను, జన్మపునర్జన్మలను గూర్చి జిజ్ఞాస చేశారు. ఇందులో పునరావృత్తిని (Recurrence) గూర్చిన విచారణ ముఖ్యమైనది. హైందవ విశ్వాసమైన పునర్జన్మకు, జన్మపరంపరకు ఇదొక వ్యాఖ్యానము వంటిది. అస్పెన్స్కీ ప్రబోధంవల్ల ప్రభావితుడై ప్రసిద్ధ ఆంగ్లరచయిత, జె. బి. ప్రీస్ట్లీ J.B. Priestley) 'టైమ్ అండ్ ది కాన్వేస్, (Time and the Conways) 'ఐ హావ్ బీన్ హియర్ బిఫోర్' (I Have Been Here Before) అను నాటికలు వ్రాశారు. మొదటి నాటికలో కాన్వే కుటుంబంలోని వ్యక్తులమీద కాలం తెచ్చే మార్పు హృదయంగమంగా చిత్రింపబడ్డది. రెండవ నాటికలో ఒక వ్యక్తి కీలకమైన ఒక సన్నివేశంలో పూర్వజన్మస్మృతివల్ల మళ్ళీ మొదటి జన్మలో చేసిన నిర్ణయమే చేస్తాడా లేదా అనే విషయం తర్కించబడ్డది. జీవితంలో మనిషి చేసే నిర్ణయాలు కామ, క్రోధ లోభ, మోహాది ప్రవృత్తులకు లోబడి ఉంటాయి. ఆ నిర్ణయాలు విపరీత ఫలితాల్నీ, దుఃఖాన్నీ యిస్తాయి. కాని, మనిషి పాఠం నేర్చుకుంటాడా? అతనికి మరుజన్మలో మళ్ళీ అటువంటి అవకాశమే ఎదురైనప్పుడు, పూర్వజన్మ స్మృతిచ్ఛాయ కొంతకు కొంత కామాది ప్రవృత్తుల నుండి విముక్తుడయ్యేందుకు తోడ్పడవచ్చు. అందువల్ల నిర్ణయాలు మారవచ్చు. అప్పుడు ఆ వ్యక్తి జీవనపథం ఒక మెట్టు పైకి వెళ్తుంది. ఇది ప్రీస్ట్లీ నాటకంలోని సారాంశము. తెలుగులో ఈ వ్యాసకర్త 'భారతి'లో ప్రచురించిన 'కాలం తెచ్చిన మార్పు, 'అమృతుడు' అన్న కథల్లోనూ అస్పెన్స్కీ యొక్క పై భావాల ప్రభావం చూడవచ్చు.

కాలానికి జీవితానికి గల సంబంధాన్ని గూర్చి కవులు పూర్వంనుండి వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. కాని 20-వ శతాబ్దిలో యీ భావాలకు శాస్త్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విజ్ఞానం ద్వారా మంచి ఆలంబనం లభించటంతో ఎక్కువ ప్రాముఖ్యం, స్పష్టత ఏర్పడుతోంది. షేక్స్పియరు నాటకం 'హెన్రీ IV - 1 భాగం'లో క్రింది వాక్యాన్ని చూడండి.

> "......thought's the slave of life and life time's fool,
> And time, that takes survey of all the world,
> Must have a stop". (Act V. Sc 4)

జీవితం కాలానికి దాస్యం చేస్తున్నది, కాలంచేత మోసగింపబడుతున్నది. కాలం నిల్చిపోతే తప్ప, అంటే మానవుడు కాలాన్ని జయిస్తే తప్ప, సత్యదర్శనం కాదు, మానవునికి విముక్తిలేదు. ఈ విశేషార్థాన్ని పై వాక్యంలో దర్శించిన ఆల్డస్ హక్స్లీ "టైమ్ మస్ట్ హావ్ ఎ స్టాప్" (Time Must Have a Stop) అను నవల వ్రాశారు. ఇందులో మంచీ-చెడూ అన్న విభేదాన్ని గూర్చి తర్కిస్తూ, ఈ విభేదం కాలానికి లోబడినంతమేర ద్వైధీభావంచేత కలుషితమౌతూ ఉంటుందనీ, (అంటే వెలుగుతోపాటు నీడలాగా, మంచితోపాటు చెడూ తోడై ఉండటం) కాలానికి అతీతమైన మనఃస్థితి-నిస్సంగత్వం (Detachment) ఏర్పడటమే, అదే కలుషితం కాని మంచి అనీ, అదే విముక్తి మార్గమనీ హక్స్లీ గ్రహించారు. లోకవృత్తంలో, మనిషి మనస్సులో 'మంచీ - చెడూ' అనే ద్వంద్వాన్ని సమదృష్టితో అనగా ద్వంద్వాతీతమైన అద్వైత (Non-dual) దృష్టితో చూడగలగటమే కాలాన్ని జయించటమని చెబుతుంది యీ నవల.

తెలుగులో కాలాన్ని జయించటాన్ని గూర్చిన యిలాంటి వ్యాఖ్యానమే శ్రీ శ్రీ రచించిన "చతురస్రం" అనే నాటికలోనూ ఉంది. "రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినా మానవజాతికింకా మానసిక స్వాతంత్ర్యం ఏర్పడలేదు .... అరణ్యాలు మన మనస్సులు ....

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మానసిక స్వాతంత్ర్యం సాధించడమే ఈనాటి మానవ సమస్య ....” అని గుర్తించటంతో ఈ నాటికలో మానవుల మనస్సుల మధ్య విభేదాలను జయించటం ఎలా? అనే సమస్యకు పరిష్కారం అన్వేషిస్తూ శ్రీ శ్రీ కాలాన్ని జయించటమే దానికి పరిష్కారం అనే నిర్ణయానికి వచ్చారు. “సృష్టి సమానాంతర రేఖలలో ప్రవహిస్తుందని నేటి వైజ్ఞానికులలో కొందరంటున్నారు. ఇది ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి విరుద్ధమని కొందరంటున్నారు .... మరికొంత తెలిసేదాకా దీని విషయము యిదమిత్థమని నిర్ణయింపలేము. కాని ఒకటి నిశ్చయమనే చెప్పవచ్చును. మానవ మనస్సులో అనేక చతురస్రాలున్నాయి. రెండేసి రెండేసి సమానాంతర రేఖలు నిలువుగా ప్రవహిస్తున్నాయనుకోండి. అప్పుడు వాటి మధ్య ఎన్నో చతురస్రాలు ఏర్పడుతాయి కదా .... ప్రవహిస్తున్న అడ్డ నిలువు సమానాంతర రేఖలుగా కాలాన్ని నేను భావిస్తున్నాను. మానవుడు టైమ్‌ని స్క్వేర్ చెయ్యాలి....” ఈ నాటికలో చతురస్రాన్ని కాలాన్ని జయించిన మానవుని మనస్సుకు ప్రతీకగా తీసుకొన్నారు శ్రీ శ్రీ. మరో విధంగా కూడా చతురస్రానికి స్ఫూర్తి ఉంది. మనస్తత్వ శాస్త్రవేత్త యుంగ్, “చతురస్రం” అనాదిగా, ఆత్మజ్ఞానం సాధించి అతీతుడైన పూర్ణమానవుని మనస్సుకు యోగ విద్యలో ప్రతీకగా ఉంటోన్నదంటాడు. శ్రీ శ్రీ తన నాటికలో చంద్ర మండలం నుంచి అమృతం వచ్చినట్లూ, అది అందరికీ పంచిపెట్టడంతో వయోభేదాలు నశించి పిల్లలు, పెద్దలు అందరూ 30 ఏళ్ళ వాళ్ళయి పోయినట్లు ఒక సన్నివేశాన్ని పరిపూర్ణ మానవత్వ సిద్ధికి (Integration of human personality) సంకేతంగా ప్రవేశపెట్టారు. దాని ద్వారా పరిపూర్ణత (Integration) అంటే ఏమిటో, కాలాన్ని జయించడమంటే ఏమిటో, నాటకాంతంలో వివరించటానికి అవకాశం కల్పించుకొని, వివాహం వంటి సాంఘిక వ్యవస్థ దేనిమీద ఆధారపడి ఉంది? అని ప్రశ్నించారు. యౌవనాన్ని కాలం హరించగానే, స్త్రీ పురుష బంధం సడలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోతుందేమోనన్న భయం యీ వ్యవస్థకు ఒక ముఖ్య ఆధారం అనుకొంటే కాలాన్ని జయించటం యీ భయాన్ని జయించటమే! ఈ భయం పోగానే వివాహ వ్యవస్థే అనవసరమై పోతుందేమో! అసలీ పెళ్ళి అవసరమా?' అనే సందేహం వెలిబుచ్చుతారు నాటికలో పాత్రలు. పెళ్ళి వద్దనుకున్నా 'ఎవరిని ప్రేమించాలి నేను!' అనే ప్రశ్న మాత్రం మిగిలే ఉంది. కాని నిజానికి యీ ప్రశ్నకు అర్థం లేదు. నేపథ్యం నుంచి ఒక స్త్రీ కంఠం వినిపిస్తుంది. "నేను దైవాన్ని, నేను సత్యాన్ని, దైవాన్ని నేను మాట్లాడుతున్నాను, మానవుణ్ని నేను సృష్టించలేదు, మానవుడే నన్ను సృష్టించాడు, అతని మనస్సు నన్ను సృష్టించింది, నాకు ఆకారం లేదు, వయసు లేదు, నేను ఆడాకాదు, మగాకాదు, నేను దైవాన్ని, నేనే కాలాన్ని, నేనే సత్యాన్ని మరణాన్ని మానవుడు జయిస్తే కాలాన్ని మానవుడు జయిస్తే, తన మనస్సునే మానవుడు గెలిస్తే — అప్పుడు నేను లేను. ఇప్పుడున్నాను నేను...."ప్రచారంలో ఉన్న దైవం మానవునికి భిన్నంగా ఊహింపబడుతున్న దైవం, కేవలం మనస్సు కల్పిస్తున్న భ్రమ, కాలం చేస్తున్న గారడీ అని నొక్కి చెప్పటం యిది. అయితే కాలాన్ని జయించటం ఎప్పుడు? ఎక్కడ? అని ప్రశ్న. ఇప్పుడు, ఇక్కడే అని సమాధానం. కాలాన్ని జయించగా మిగిలింది నీవే- నేను, నేనే- నీవు. ఆడా- మగా, మానవుడూ - మాధవుడూ ఒక్కటే అనే సత్యం. $1 + 1 = 1$. గణితాని కతీతమైన భాషలో ఒకటీ ఒకటీ ఒకటే. "ఈ అతీత స్థితిని పొందినా, కవి పాడటం మానగలడా? అయితే దేన్ని గురించి పాడుతాడు? "రెండు గురించి". కాలాన్ని జయించిన కవి, మనస్సును చతురస్రం చేసుకొన్న కవి, ఈ లోకంలో ఉన్నంత కాలమూ "రెండు" గురించి పాడక తప్పదు. కాని అతని 'రెండు _ పాట' లో ఎప్పుడూ ద్వంద్వంతో పాటు ఏకత్వం ధ్వనిస్తూనే ఉంటుంది. ఉదా: "పెలిగ్రామ్య భాషలు" అనటంలో నగరాన్నీ గ్రామాన్నీ ఆ రెండు జీవన విధానాల మధ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భేదాన్ని సూచిస్తూనే కవి తన దృష్టిలో వాటి ఏకత్వాన్ని ధ్వనింపజేస్తాడు. నాటకాంతంలో ఉన్న యీ గీతం ఆధునిక కవిత్వంలో ఉత్తమశ్రేణికి చెందిన ఉదాహరణ అని చెప్పాలి. "భ్రమా భ్రమర భ్రమణ భ్రమరణ భ్రమావరణ బ్రహ్మ వైవస్వతమన్వంతరాలు" అనటంలో యీ సృష్టి, విశ్వం, కాలం, సర్వం భ్రమ అన్న అనుభూతిని విశ్వరూప సందర్శనంలా కలిగిస్తున్నాడు కవి. గీతం చివరి వాక్కు : "రెండు కళ్ళు తెరచినా పిడికిళ్ళు బిగించిన మానవసరోవరంలో వికసించిన మందారాక్షరాల మరచిపోలేని మద్రాక్షసము ద్రాక్షసరాలు". విజ్ఞానం అనే కళ్ళు తెరచినా మానవాళి పిడికిళ్ళు బిగించటం మానలేదు. ఈ మానవ సమాజంలో వికసించిన అందరి ఎఱ్ఱటి కళ్ళూ తనవేనని, ఆ రాక్షసముద్ర యొక్క దృక్కులే తన కవితా ముద్రాక్షరాలనీ, చివర మానవాళితో కవి ఆత్మైక్యాన్ని పలుకుతూ విప్లవకాంక్షను ధ్వనిస్తాడు.

ఆధునిక కవిత్వంలో శ్రీ శ్రీ మొదలైన వారికి మార్గదర్శి అయిన ఆంగ్లకవీ, యుగకర్తా. టి. యస్. ఎలియట్. ఆయన కావ్యాలలో ఉత్తమమైనది. నోబెల్ బహుమతిని అందుకున్నదీ అయిన 'ఫోర్ క్వార్టెట్స్' కావ్యములో వస్తువుకూడా కాలాన్ని జయించటమే ; అంటే కాలాతీతమైన అద్వైతానుభూతిని అనన్య సామాన్యమైన కవితాశిల్పం ద్వారా వ్యక్తం చేసే ప్రయత్నం.

'ఫోర్ క్వార్టెట్స్' నిర్మాణానికీ అందులోని వస్తువు అవినాభావ సంబంధం ఉంది. భూత భవిష్యాలనుండి విడదీయబడిన క్షణమే అనంతానికి ద్వారం. అవి ద్వారంకాదు. ఒక నిశ్చలిత కేంద్రం. నిశ్చలిత కేంద్రమైనా అది స్తబ్ధంకాదు. ఆనందమయ నృత్యం, నృత్యంకాదు, గులాబిపూవు. పూవుకాదు ప్రజ్వలిస్తున్న అగ్ని. —ఆ కేంద్రం యివి అన్నీ, యివి ఏవీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాదు....ఆ కేంద్రం నాల్గు మూలతత్త్వాల సంగమం. ఈ విధంగా తర్జుమా చేసి చెప్పటం టి. ఎస్. ఎలియట్ కవిత్వానికి కేవలం అపచారం చెయ్యటమే అవుతుంది.

"Not the intense moment
Isolated, with no before and after
But a life - time burning in every moment
And not the life - time of one man only
But of old stones that cannot be deciphered."

అనంతానుభూతిని కేంద్రీకరించుకొన్న క్షణంలో నిశ్చలిత బిందువును గూర్చి యిలా అంటాడు :

"At the still point of the turning world. Neither flesh nor fleshless.

Neither from nor towards, at the still point, there the dance is.

But neither arrest nor movement. And do not call it fixity.

Where past and future are gathered. Neither movement from nor towards.

Neither ascent nor decline. Except for the point. the still point.

There would be no dance, and there is only the dance"

ఆ బిందువుతో అద్వైత స్థితి. సమాధ్యవస్థను గూర్చిన వాక్యాలు :

"Quick now, here, now, always-
A condition of complete simplicity

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(Costing not less than everything)
And all shall be well and
All manner of things shall be well
When the tongues of flame are infolded
Into the crowned knot of fire
And the fire and rose are one."

వర్తమానక్షణంలో ఆత్మానుభూతి ద్వారా అనంతకాల, అనంత విశ్వానుభూతిని పొందటమనే విషయం పూర్వంనుంచీ యోగులు చెబుతున్న మాటే: కాని, సాహిత్యదృక్పథం యింత స్పష్టంగా, అసందిగ్ధంగా కాలాతీతమైన అనుభూతివైపు మొగ్గటం ఈ శతాబ్దిలోనే జరుగుతున్నది. "మాయాకల్పిత దేశకాల కలనావైచిత్ర్య చిత్రీకృతం" అని శంకరులు జగత్తును గూర్చి అన్న వాక్కునే దృష్టిలో పెట్టుకొన్న రీతిగా 'మాయ' నుండి విడివడటాన్ని అన్వేషిస్తూ, ఆధునిక సాహిత్యం, కాలం మీదా, తార్కిక నియమాలకు లోబడిన భాషమీదా, హేతువాదం మీదా తిరుగుబాటు చేస్తోంది.

తెలుగులో కాలాన్ని కాదు - తెలంగాణా ఉద్యమాన్ని ప్రధాన వస్తువుగా తీసుకొన్న కావ్యం. ఆరుద్ర వ్రాసిన 'త్వమేవాహం' "ఎందులోంచి ఎప్పుడు ఎలాగ లొంగదీయటానికే కవి ప్రయత్నం" అట:

"ఊహకందని ఊహల కీకారణ్యంలో
కాలాన్ని బట్టితెచ్చి రాటకేసి కట్టేస్తాను........
కాలాన్ని మీకు బానిసగా చేస్తాను
కళ్ళలో జ్యోతులు వెలిగిస్తాను

భూతల స్వర్గానికి తలుపులు తీస్తాను." అంటాడు. తర్వాత కావ్య భాగాలకు ఇసుక గడియారం, నీటి గడియారం, పెద్దముల్లు, చిన్నముల్లు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సెకండ్లు, నిముషాలు వగైరా పేర్లు పెట్టటం కాలాన్ని విప్లవ సంకేతంగా సూచించటానికే; కావ్యమంతా చదివాక కాలతత్త్వం నిరూపణ కావటం కాని, కాలాన్ని జయించటం కాని ఏమీ జరగలేదని తెలుస్తుంది. జరిగింది అప్పటి తెలంగాణా ప్రభుత్వ వ్యవస్థలోని కుళ్ళును, అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని చిత్రించి, విప్లవం యీ వ్యక్తులకు స్వస్తి చెబుతుంది అన్న హెచ్చరికతో ముగించటం. ఇందులో కవి 'కాలా'నికీ తెలంగాణా వ్యవస్థకీ తాదాత్మ్యం ఊహించుకొని రచన చేశాడు. శ్రీ శ్రీ యీ సంకేతాన్ని సమర్థించాడు : "కావ్యం అంతటా తీవ్రమైన మృత్యుఝంఝ ప్రసరిస్తుంది. అల్లకల్లోలమైన అశాంతిచేసే రణగొణధ్వనులు మనకి వినపడుతూ ఉంటాయి. కాని అదే ఈ నాటి యాథార్థ్యం. సమకాలీన సంక్షోభంలో కవి తన అవినాభావ సంబంధం 'త్వమేవాహం' అనే శీర్షికలో ప్రకటిస్తున్నాడు. ఈ సంబంధం మృత్యువును కూడా అధిగమించి కాలంలో తన ఏకత్వాన్ని స్థాపించుకుంటుంది." "త్వమేవాహం" అన్న శీర్షిక శ్రీ శ్రీ ప్రసాదించిందే అన్న సంగతిని గుర్తుంచుకుంటే, ఇందులోని ఔచిత్యం మరీ అర్థమౌతుంది. కాలంతో కవి తన ఏకత్వాన్ని స్థాపించుకోవటం కాలంమీద విజయం సాధించటమనే తాత్త్వికదృష్టి ఆరుద్రకు శీర్షిక ద్వారా శ్రీ శ్రీ ప్రసాదించాడు అని చెప్పాలి.

తర్కమునందు 'అతీతాదివ్యవహార హేతు: కాలం' అని కాలము నిర్వచింపబడినది. కాలానికీ కార్య - కారణ నిర్ణయానికీ గల సంబంధము తెలిసే ఉన్నది. ఐన్‌స్టీన్‌కు పూర్వం కాలం విశ్వజనీనమైన దనుకోవటంలో కార్యకారణ సంబంధానికి వస్తుతః యథార్థత్వమున్నదనే అభిప్రాయముండేది సంఘటనల అనుగతి క్రమంగా, నీ యౌగపద్యము (Simultaniety) కానీ ద్రేష్టమీద ఆధారపడి ఉంటుంది అన్నభావం నేటి సాహిత్యంలో నవలా నిర్మాణంలో, పాత్రోన్మీలనంలో పెద్ద మార్పు తెచ్చింది. ఈ మార్పునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాలాన్ని గూర్చిన భావమేకాదు, మనస్తత్వ శాస్త్రమూ ఎక్కువగా దోహదం చేసిందని చెప్పుకోవాలి. కాని నవలా నిర్మాణంలో కాలంమీద ఆధునిక ప్రక్రియ చేసిన తిరుగుబాటు గమనింపదగ్గది. స్కాట్, డికెన్స్ వంటి వారి నవలల్ని వర్జీనియా ఊల్ఫ్, జేమ్సుజాయ్స్ వ్రాసిన నవలల్తో పోలిస్తే రెండూ ఒక ప్రక్రియకి చెందినవేనా? అన్న సందేహం రాక తప్పదు. 18, 19 శతాబ్ది నవలల్లో కార్య - కారణ సంబంధాన్ని మనస్సులో పెట్టుకొని సంఘటనలను కూర్చటం పద్ధతి. 20 వ శతాబ్ది నవలలో - ముఖ్యంగా "చైతన్యస్రవంతి" శైలిలో వ్రాయబడిన నవలలో - కార్య కారణ సంబంధానికి గౌరవం లేదు. ఇది హేతువాదం మీదా, కాలంయొక్క కర్కశ నిర్బంధంమీదా తిరుగుబాటు. తర్కానికీ, కాలానికీ అతీతమైన మానవత్వపు విలువలకోసం అన్వేషణ. ఒక వ్యక్తి జీవితంలో ప్రతి క్షణమూ అతని మొత్తం జీవితకాలానికి సమానమే. ఆ వ్యక్తి తత్త్వం, గుణగణాలు, తెలుసుకోవటానికి కొన్ని సంవత్సరాల జీవితకాలంలో ముఖ్య ఘట్టాలనే తడవనవసరంలేదు. ఒక్క గడియ, ఒక్కరోజు చాలు- అని యీతిరుగుబాటు. 'యులిసెస్' (Ulysses) 'మిసెస్ డాలోవే' (Mrs. Dalloway) వంటి నవలలు ఇందుకు ఉదాహరణలు. ఇక్కడ నవల మొత్తం ఒక వ్యక్తియొక్క ఆంతర్యానికి దర్పణం. వ్యక్తిలోని చైతన్య స్రవంతిని ఆలోచనా స్రవంతిగా యథాతథంగా రూపొందించటమే పద్ధతి. కాని ఎంత యథాతథం అయినా కళకూ, సాహిత్యానికీ ముఖ్యమైన ఎన్నిక, (Selection) 'నేర్పు' (Skill) రచనలో ఉండక తప్పదు. ఇది కేవలం శిల్పంలో కొత్తపద్ధతి అని భ్రమించి అనుసరించటానికి ప్రయత్నాలు జరిగాయి. కాని రచయిత యథార్థాన్ని దర్శించే విధానంతో, అతని తాత్త్విక దృష్టితో అవినాభావ సంబంధం కలిగినట్టి శైలి కావటంతో యిది అన్నిటికీ నప్పదు. తెలుగులో ఈ పద్ధతిలో వచ్చిన రచనల్లో బుచ్చిబాబు "చైతన్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్రవంతి" విఫలప్రయత్నం. వినుకొండ నాగరాజు "తాగుబోతు", నవీన్ 'అంపశయ్య' ఎన్నదగిన రచనలు.

ఆధునిక నవలా నిర్మాణంలో గమనింపదగిన సంగతి మరొక్కటి ఉన్నది. కాలం విశ్వ జనీనం అనుకున్నప్పుడు రచయిత సర్వజ్ఞుడు అనే ధీమాతో తన కథలోని పాత్రలందరి మనస్సుల్లోనూ ఏమి జరుగుతూ ఉందో స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పేవాడు. ఒక కథ జరిగిన తీరు, దాని తాలూకు యథార్థ్యం రచయితకు తెలుసనీ. అంతకు మించిన యాథార్థ్యం లేదనీ కూడా అప్పటి అభిప్రాయం. కాలాన్ని గూర్చి సాపేక్షతా సిద్ధాంతం వచ్చిన తర్వాత రచయిత తన సర్వజ్ఞత్వాన్ని వదలుకోవలసి వచ్చింది. ఎవరైనా తన మనస్సులో తన ఎదుట జరుగుతున్న దానికి సాక్షీభూతులు కావటమొక్కటే సాధ్యం. అదైనా ద్రష్ట ఊహాపోహలతో రాగద్వేషాలతో రంగులు దిద్దుకున్న సంకీర్ణ చిత్రంగానే ఉంటుంది. ఇలా దృశ్యమాన మౌతున్న యథార్థాన్ని ఒక వ్యక్తి మనస్సు ద్వారా చిత్రించటమే జీవితపు యథార్థ చిత్రణ అనే భావం, ఆధునిక నవలకూ, చైతన్యస్రవంతి పద్ధతికీ మూలాధారం. లారెన్స్‌డరెల్ (Lawrence Durrell) వ్రాసిన "అలెగ్జాండ్రియా క్వార్టెట్" అను నాల్గు నవలల సంపుటి పై సూత్రానికి చక్కని ఉదాహరణ. ఇందులో వస్తువు అలెగ్జాండ్రియా పట్టణంలో కొందరు వ్యక్తుల మధ్య జరిగిన కొన్ని సంఘటనలు. ఈ సంఘటనల కార్య - కారణ సంబంధం, ఒక్కొక్క వ్యక్తి దృష్టిని బట్టి ఎంత విచిత్రంగా భిన్నమై ఉంటుందో నిరూపించేందుకు అవే సంఘటనలను ముగ్గురు వ్యక్తుల భిన్నదృక్పథాల నుంచీ మొదటి మూడు నవలల్లోనూ వ్యాఖ్యానించాడు రచయిత. నాలుగవ నవలలో పై సంఘటనల వరుస తర్వాత జరిగిన పర్యవసానాన్ని వివరించాడు. ఇది ఆకర్షణీయమైన ప్రయోగము. ఇందులోనూ కాలంయొక్క సాపేక్షత ఎలా సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుందో గమనించవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇరవయ్యో శతాబ్దిలో కాలాన్ని అధిగమించాలనే ఆకాంక్ష, హేతు వాదాన్నీ, తర్కాన్నీ దాటిన మానవత్వపు విలువల్ని అందుకోవాలనే ఆశయం, మేధావుల్లో, రచయితల్లో కవుల్లో, దార్శనికుల్లో సర్వత్ర కనిపిస్తోంది. ఈ విషయం సవ్యంగా అందరికీ గోచరం కావటానికి యింకా కాలం పట్టుతుంది. కాలాన్ని కాలమే జయిస్తుంది - అంటే మనిషి తనను తనే జయిస్తాడని ఆశిద్దాం !

"కాల మడగించు జనుఁగ
ల్లోలిని గిరిఁద్రెంచు కరణి, లోభ క్రోధా
శీలత్వ కామ భయములఁ
దేలు జనుఁడు గాలవృత్తి తెలుఁగు నెఱుఁగునే !"

(తిక్కన : శాంతి పర్వము)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మానవత్వము : ఆధునికత

మానవత్వాన్ని మానవజీవితం దృష్ట్యా నిర్వచించే ప్రయత్నంలో పురుషార్థాల ప్రసక్తి తప్పదు. మానవుణ్ణి ధార్మిక మానవుడు (moral or ideological man), ఆర్థిక - రాజకీయ మానవుడు (economic and political man), శృంగార మానవుడు (erotic and aesthetic man), ఆధ్యాత్మిక మానవుడు (spiritual man) అంటూ ధర్మార్థ కామమోక్షాల ననుసరించి విభజన చేయవచ్చు.

ప్రతి యుగంలో ఆనాటి సాహిత్యక, సాంఘిక, రాజకీయ, తాత్త్విక వ్యవస్థలలో పై జెప్పిన పురుషార్థాలలో దేని ప్రాబల్యం ప్రధానంగా ఉన్నదో పరిశీలించి గుర్తించడం ఒక పద్ధతి. సాహిత్య వ్యవస్థ తీసుకుంటే పూర్వ సాహిత్యంలో, మతగ్రంథాల్లో, శాస్త్రాల్లో కనిపించేది ఆధ్యాత్మిక మానవుడు ధార్మిక మానవుడు, తర్వాతి కావ్యాల్లో కనిపించేది శృంగార మానవుడు. నేటి యుగంలో ఆర్థిక - రాజకీయ మానవునికి సాహిత్యంలో ప్రధాన స్థానం కల్పించే ప్రయత్నం జరిగింది. ఇది మారిన యుగలక్షణం. సాంఘిక వ్యవస్థ తీసుకుంటే ఒకానొక కాలంలో, సంఘంలో ఆధ్యాత్మిక మానవునిదే ప్రథమ స్థానం. తర్వాత ధార్మిక మానవుడు, ఆర్థిక మానవుడు ప్రాబల్యం వహించారు. నేడు రాజకీయ మానవుడు ప్రధాన స్థానంలో ఉన్నాడు, ఈ యుగం మార్పు చెందుతూ రాజకీయ మానవుని స్థానాన్ని భవిష్యత్తులో శృంగార మానవుడు ఆక్రమించే సూచనలు లేకపోలేదు. రాజకీయ వ్యవస్థ పరంగా ఆలోచిస్తే పూర్వం రాజ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధార్మికుడు. తర్వాత అర్థబలం, అంగబలం ప్రాధాన్యుడయ్యాడు. నేడు రాజకీయవాది. రేపు ఎలా మారుతాడో ఊహించడం కష్టం. తాత్త్విక వ్యవస్థలో ప్రథమంగా ఆధ్యాత్మిక మానవుని ప్రాబల్యమూ తర్వాత ధార్మిక మానవుని ప్రాబల్యమూ కనిపిస్తుంది. వైదికమతం తర్వాత బౌద్ధం వచ్చింది. బౌద్ధానికి ఆధ్యాత్మికత కంటే ధర్మమే (morality, righteousness) ప్రధానం. తర్వాత బౌద్ధం క్షీణించి, హిందూమత వికాసం దేవాలయ నిర్మాణం ప్రధానంగా సాగిన కాలంలో ఆర్థికతే ప్రాబల్యం వహించింది. దానిచే ఆకర్షింపబడి యిస్లాంమతం దాడులు ప్రారంభించిన తదుపరి భక్తి ప్రధానమైన ఉద్యమాలు ప్రబలిన కాలంలో శృంగారం ప్రధానమైంది. అటు తర్వాత నేటిదాకా తాత్త్వికంగా మన దేశంలో అవ్యవస్థ తప్ప వ్యవస్థ లేదు. రామకృష్ణ వివేకానందులు ఆధ్యాత్మికతను ప్రతిష్ఠించడానికి, గాంధీ ధార్మికతను ప్రతిష్ఠించడానికి ప్రయత్నించి విఫలు రయ్యారనే చెప్పాలి. అందుకు కారణం యీ యుగంలో వ్యవస్థలన్నింటిలో ఆర్థిక రాజకీయ వ్యవస్థకున్న ప్రాధాన్యం మరొకదానికిలేదు. సాహిత్యమూ, సంఘాచారమూ, తాత్త్విక దృక్పథమూ మూడూ కూడా ఆర్థిక - రాజకీయ వ్యవస్థకు లోబడి ఊడిగం చేస్తూ వున్న పరిస్థితి నేడు మనకు కనిపిస్తుంది.

'ఆధునికత' అంటే ఏమిటి ? నేటి మానవుని పరిస్థితినీ లక్షణాలనూ వ్యక్తం చెయ్యడానికి కాక, నేటి మానవునిలో భావి యుగాన్ని సూచించే వినూత్నమైన విలక్షణమైన ధోరణులు ఏవి వున్నాయో వాటిని గుర్తించి ఇక్కడ 'ఆధునికత' క్రింద వ్యవహరించడం జరుగుతుంది. అందువలన ఈ రచన ముఖ్యోద్దేశం 'నేటి మానవుని' లో రూపొందుతున్న 'భావి మానవుని' గుర్తించడమేనని వేరుగా చెప్పనక్కరలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ యుగంలో ఆర్థిక - రాజకీయ వ్యవస్థకున్న ప్రాధాన్యం మరే వ్యవస్థకూ లేదని చెప్పాను. అందువలననే గడచిన యుగాల చరిత్రను నేడు తిప్పి వ్రాస్తూ ఆయా కాలాల్లో ప్రాబల్యం వహించిన భిన్నమైన వ్యవస్థల నన్నింటినీ కేవలం ఆర్థిక - రాజకీయ వ్యవస్థమీద ఆధారపడినట్లే చిత్రించడం జరుగుతున్నది. ఉదాహరణకు : కార్ల్ - మార్క్స్, రాహుల్ సాంకృత్యాయన్‌ల రచనలు, సాహిత్యమూ, సంఘాచారమూ, సంస్కృతీ, మతమూ, యిప్పుడే కాదు, పూర్వం కూడా ఆర్థిక - రాజకీయ వ్యవస్థకు లోబడినవేనన్న ప్రతిపాదన ఈ రచనల్లో కన్పిస్తుంది. ఇది యీ యుగం తొడుక్కున్న రంగుటద్దాలు.

అయితే యీ యుగం మారుతున్నదా ? ఎలా మారుతున్నది ? రాబోయే యుగం యొక్క లక్షణాలు ఎలా ఉంటాయి ? ఈ ప్రశ్నకు సమాధానాలు అన్వేషిద్దాం.

1. ధార్మిక మానవుడు

ధార్మిక మానవునిపై ఆధునిక ప్రభావం ముఖ్యంగా ఆత్మ ధర్మ ప్రత్యాఖ్యాన సమస్యగా (self-alienation problem) భాసిస్తున్నది. దీనినే "Identity crisis" అని కూడా అంటున్నారు. పూర్వయుగాలలో మతమో సంఘమో వ్యక్తికి నియమితమైన ధర్మాన్ని స్పష్టంగా నిర్దేశించేది. దీనినే ఒక కాలంలో వర్ణాశ్రమ ధర్మముగా పేర్కొన్నారు. ఆ వైదికమతంనాటి పరిస్థితులు ఎప్పుడో మారినా సంఘవ్యవస్థలో వృత్తినిబట్టి, కుటుంబంలో స్థానాన్నిబట్టి, వ్యక్తి వయోధర్మాన్నిబట్టి వ్యక్తికి 'నే నెవరు ? నేనేం చెయ్యాలి ?, అనే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధంగానే ఉంటూ వచ్చాయి. వాటికి సమాధానాలు ఆలోచించి ఎవరికి వారు స్వయంగా వెతుక్కునే పరిస్థితి నిన్న మొన్నటిదాకా లేదు ! నేడు ఆ ప్రశ్నలే చాలా గడ్డు ప్రశ్నలుగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిణమించాయి. ఇది ఏ కొద్దిమందికో కాక చాలమందికి జరుగుతున్నది. అందువల్లనే సమస్య తీవ్రమౌతున్నది. పదిహేను యిరవై ఏళ్ళ మధ్య వయస్సులో యీ ప్రశ్న ప్రారంభం అవుతుంది, 'నే నెవరు?' అన్న ప్రశ్న వివృతమై 'నేను గాంధీనా? నెహ్రూనా? స్టాలిన్‌నా? మావోనా? నాగేశ్వ్రరావునా? రామారావునా? నేను డాక్టరవుతానా? కలెక్టరవుతానా? రాజకీయ నాయకుణ్ణౌతానా? గుమాస్తానా? కూలీనా? లేక నిరుద్యోగినా?' అన్న ప్రశ్న పరంపరలో దిక్కుతోచకుండా పోతున్నది వ్యక్తికి. మొదట ఒక ఆదర్శవ్యక్తి మనస్సులో మెదుల్తూ క్రమంగా అది వృత్తికీ జీవనోపాధికీ సంబంధించిన ప్రశ్నగా తయారౌతున్నది. గ్రామం నుంచీ, హరిజనవాడ నుంచీ, చదువుకో జీవనోపాధికో, నగరానికి వచ్చిన వ్యక్తి, ఊహించని నూతన పరిస్థితుల్లో, ఎదురు చూడని అనుభవాలకూ, ఆకర్షణలకూ గురౌతూ సందర్భాను సారంగా ప్రవర్తించవలసిరావటం ఒకటి. తను మనసారా ఆలోచించి నిర్ణయించుకునే లోపుగానే తన చేతలూ మాటలూ ప్రవర్తనా రూపొందిపోతూ వుండటం మరొకటి. అందులో తన యిష్టానికి, తనలోని 'తన'కు ఎటువంటి ప్రవేశమూ లేనివిధంగా తన బాహ్య ప్రవర్తనా, అనుభవాలూ, జీవితమూ రూపొంది వ్యక్తి దిగ్భ్రాంతి చెందుతున్నాడు. ఇక్కడ జీవితం యొక్క వేగం, ఉరవడి వ్యక్తిని లొంగదీసుకుని ఎక్కడికో తీసుకుపోతున్నవి. కొంతకాలానికి తను నిజంగా ఆశించినదేమిటో, చేస్తున్నదీ జరుగుతున్నదీ, దానికి ఎంత భిన్నంగా ఉన్నదో తెలిసిరావటం, వచ్చినా ఏమీ చెయ్యలేని పరిస్థితి; ప్రవాహానికి ఎదురీదలేని అశక్తత; ఇక వ్యక్తిత్వం నిలుపుకోవడం ఎక్కడ? తృప్తి, నైర్మల్యం, శాంతి, నిండుదనం ఎట్లా వస్తాయి? ఇదే ఆత్మధర్మ ప్రత్యాఖ్యాన సమస్య.

ఈ సమస్య పురుషునిది ఒక్కడిదే కాదు. నేడు స్త్రీలు అధిక సంఖ్యలో పురుషులతోపాటు ఆఫీసుల్లో, ఫ్యాక్టరీలలో, సంస్థల్లో ఉద్యోగం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోసం ప్రవేశిస్తున్నారు. వారికీ యిది క్రొత్తే. ఈ సమస్య వారిని కూడా ఎదుర్కొంటున్నది. అంతేకాక స్త్రీ పురుషు లిదరూ ఒకచోట కలిసి ఉద్యోగం చేస్తూ ఉండటం మరొకటి. తర్వాత ఏర్‌హోస్టెస్, రిసెప్షనిస్టు, పర్సనల్ సెక్రటరీ, సినిమాతారవంటి ఉద్యోగాల్లో ఎంతవరకు వృత్తి ధర్మం, ఎంతవరకు స్వధర్మం అని నిర్ణయించుకోవటం ఒక గడ్డు సమస్య. ఉదాహరణకు : ఒక స్త్రీ సినిమారంగంలో నటిగా ప్రవేశిస్తుంది. నటనలో పరాయివాడైన నటుణ్ణి కౌగలించుకోవటం వరకూ నేడు ఆ వృత్తిలో అంగీకరింపబడిన ధర్మం. అయితే నటనలో 'ముద్దుపెట్టుకోవడం' కూడా వృత్తి ధర్మంగా అంగీకరింపవచ్చునా ? లేదా ? అనేది నేడు చర్చింపబడు తున్న ప్రశ్న. పోనీ పై దేశాలలో అది కూడా వృత్తి ధర్మం అయింది అని యిక్కడ కూడా అంతదాకా వెళ్ళవచ్చుననుకున్నా, అటుపైన నేడు పాశ్చాత్యులు స్త్రీ పురుష సంయోగాన్నే 'నటింప జేసేదాకా వెళ్తున్నారు. మనం అంత దూరం వెళ్తామా ? వెళ్ళవచ్చునా ? లేదా ? అని ప్రశ్న, ఇది సమాజంచే సమిష్టిగా నిర్ణయించవలసిన ప్రశ్న అనుకోవడం నేడు జరుగు తున్నది. కాని యథార్థానికి యిది వ్యక్తిగతంగా నటియైన వ్యక్తి స్వయంగా నిర్ణయించుకోవలసిన స్వధర్మం. తనలోని 'తనకి' ఏది అంగీకారమో ఏది కాదో తేల్చుకోవలసిన ధర్మం. సమాజం నిర్ణయించినంతమాత్రాన ముద్దు కాని కౌగిలింతకాని స్వధర్మం కానేరదు. సినిమాలో నటించే వృత్తి స్వీక రించిన వారికి పై చేష్టలు వృత్తి ధర్మం అయినా స్వధర్మ విఘాతం కాకుండా ఉండటం ఆయా వ్యక్తి యొక్క చిత్తశుద్ధిమీదా, మనఃప్రవృత్తి మీదా ఆధారపడిఉంటుంది. అందువల్ల సమాజంలో స్త్రీ పురుషుల సామాన్య ధర్మాన్ని బట్టి ఒకానొక వృత్తిధర్మాన్ని యితిమిత్థం అని నిర్ణయించడంగాని, వృత్తిధర్మాన్ని బట్టి వ్యక్తి స్వధర్మాన్ని నిర్దేశించడం గాని కష్టమౌతున్నది. పూర్వం వ్యక్తి ధర్మానికీ వృత్తి ధర్మానికీ సామాజిక ధర్మానికీ పరస్పరం యిటువంటి సంఘర్షణ వచ్చేదికాదు. వచ్చినా చాలా అరుదు. రాజభక్తు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దైన కొడుకు రాజద్రోహియైన తండ్రిని చెరబట్టి తీసుకురావడం అటు వంటిది. కాని నేటి జీవన వైవిధ్యంలో ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు పై సంఘర్షణలు రావడం, ఆలోచనకు అవకాశం లేకుండానే నిర్ణయాలు జరుగుతూ ఉండడం, యాంత్రికంగా సంభవిస్తూ, తద్వారా వ్యక్తి ఆత్మ క్లేశానికి లోనవుతూ, పరిస్థితి ఆత్మధర్మ ప్రత్యాఖ్యానానికి దారితీస్తున్నది. స్వధర్మ నిర్ణయభారం నేడు వ్యక్తికి భరించరానిదౌతున్నది. అందరికీ సామాన్యమైన ధర్మం అంటూ ఏదీ కనిపించదు. ఈ పరిస్థితిలో 'నేనెవరు? నా యిష్టమనేది ఏమైనా ఉన్నదా? నాకు భిన్నంగా యీ నా జీవితం సాగు తున్నది. నాకు తృప్తి, ఆనందం లేవు. నేను అర్థాన్ని గడించినా బ్రతుకు అర్థశూన్యంగానే వుంటున్నదే, అనే నిర్వేదం కలుగుతున్నది.

8276

ఇలా ధార్మికమైన అవ్యవస్థ ప్రభావం, మధ్య వయస్కులు అర్థ శూన్యమైన ఆసక్తి శూన్యమైన జీవితాన్ని గడపడంగానూ, చిన్నవాళ్ళూ యువకులూ దౌర్జన్యాన్నీ విధ్వంసకాండనూ ఒక క్రీడలా భావించి, చీటికీ మాటికీ బీభత్సం చేస్తూ ఉండటంలోనూ వ్యక్తమౌతున్నది. "నా ధ్యేయం ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం లభించక పోవటంతో యువతరంలో వ్యక్తినిష్ఠమైన సృజనాత్మకశక్తి మార్గాంతరము లేక ఒక్కపెట్టున సామూ హిక పీడనం (group-pressure) ద్వారా నిప్పురవ్వ తగిలిన పెట్రోలు టాంక్‌లాగా భగ్గుమంటున్నది. లేకపోతే నిస్పృహకు, ఆత్మహత్యకు దారి తీస్తున్నది. పరీక్షపోయిన విద్యార్థికి ఆ పరీక్ష తప్ప మరొక విలువ ఏదీ ప్రధానంగా కనిపించక, చుట్టూ ఉన్నవాళ్ళు తనని చూచి నవ్వుతున్నారనే క్షణిక నిస్పృహ కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాడంటే అర్థం ఏమిటి? చుట్టూ ఆవరించిన గందరగోళంలో, అవ్యవస్థలో, అతని వ్యక్తి త్వానికి పట్టుగొమ్మ అంటూ ఒకటి లేకపోవడమే నన్నమాట. అలాంటి పట్టుగొమ్మ తల్లిదండ్రుల నుంచీ, ఉపాధ్యాయ వర్గంనుంచీ, సంఘ నాయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కులనుంచీ లభించవలసి ఉన్నది. కాని లభించడంలేదు. కారణం వాళ్ళు కూడా ధార్మికమైన అవ్యవస్థలో తల మునకలౌతూ ఉండటమే!

అధునికత ధార్మిక మానవునిమీద వ్యక్తిగతంగా స్వధర్మ నిర్ణయం అనే బాధ్యతాభారం పడవేస్తున్నది. పూర్వమెప్పుడూ సామాన్యుని మీద యీ భారం యిలా పడలేదు. ఏ కొందరు మేధావులో దార్శనికులో ఆయా కాలానుగుణంగా భారం వహించి ధర్మనిర్ణయంచేస్తే మిగతాజనం ఆ దారిలో నడిచారు. నిన్న నేటిదాకా గాంధీజం, మార్క్సిజం, ఆ కార్యమే నిర్వహించింది. కాని మారుతున్న సమాజంలో, ప్రారంభమౌతున్న నూత్న యుగంలో యిప్పటికప్పుడే గాంధీజం, మార్క్సిజంలో, చాలకపోవడాన్ని మనం చూస్తున్నాము. క్రమంగా ధర్మ నిర్ణయం విషయంలో 'ఎవరికి వారే యమునాతీరే' అనే పరిస్థితి ఏర్పడుతున్నది. ఒకరికోసం ఒకరు ధర్మ నిర్దేశం చెయ్యడం, ఒక జీవితానికి మరొకరు బాధ్యత వహించడం, అనేది లేకుండా పోతున్నది. ఒక విధంగా యిది వ్యక్తి స్వాతంత్ర్యం పరాకాష్ఠ చెందేపరిస్థితి. తత్ఫలితంగా కలిగే దుఃఖమూ, ఆవేదనా, వ్యక్తిగతంగానూ సామాజికంగానూ ఎంతో మేర ఉంటాయి. కాని యుగం మారుతూ ప్రస్ఫుటమౌతున్న యీ ధోరణిని అరికట్టే మార్గంలేదు - అన్న కఠిన సత్యాన్ని గుర్తించి ప్రతి వ్యక్తీ తన భారాన్ని వహించేందుకు సిద్ధం కావడమే కర్తవ్యం, లేకపోతే క్లేశం ఎలాగూ తప్పదు.

2. ఆర్థిక మానవుడు

ఆర్థిక మానవుని ప్రాబల్యం నేడు సర్వత్రా కన్పిస్తున్నది. అంటే జీవితంలో నేడు ధనేషణ ప్రధానంగా ఉంటున్నది. ఈ శతాబ్దిలో ఆర్థిక— రాజకీయ వ్యవస్థమీద మార్క్స్ ప్రభావం విస్తృతంగా ఉన్నది. మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చేదాకా రాజకీయ మానవునిమీద గాంధీజం ప్రభా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వమే ఎక్కువగా ఉండేది. మార్క్సువాదం ప్రకారం, సంస్కృతీ అభిరుచులూ, సమాజంలో ధనిక. దరిద్రవర్గాలలో కేవలం ఆర్థిక వ్యవస్థనుబట్టి ఏర్పడుతవి. అంటే ధనిక వర్గంవారి సంస్కృతీ, అభిరుచులూ, వారి ఆధిక్యాన్నీ, అవకాశాలనూ, అధికారాన్నీ పరిరక్షించుకోవడానికి ఏర్పడి తదనుగుణంగా ఉంటున్నవే తప్ప, వాటికి స్వతహా ఉత్కృష్టతా, విలువా లేదనీ, ఉందని అనటం మోసగించడమేననీ ఒక వాదం. ఆ విధంగా చూస్తే మతం అనేది నిద్రపుచ్చడానికి ఒక మత్తుమందు మాత్రమే। ఉదారవాదం లేక మానవతాదృక్పథం (Liberalism) కూడా క్రింది వర్గాల ప్రతారణ కోసమే; తీరికఉన్న వర్గాలవారికి వ్యక్తిగతంగా పథ్యమైన భావనాత్మక, సాంస్కృతిక, సాహిత్యక అభిరుచులన్నీ బలహీనతలుగా, సమాజ సమష్టి శ్రేయో విరుద్ధ ప్రవృత్తులుగా, లెక్కించటం జరిగింది. ఇటువంటి విమర్శ క్రింది వర్గం వారిలో ఆత్మవిశ్వాసాన్ని పురికొల్పటానికి (తాము అనాగరకులము, సంస్కార విహీనులము, తక్కువవారము అనే అల్పత్వ భావాన్ని పోగొట్టడానికి) ఉపయోగించింది. ధైర్యంగా సామాజిక విప్లవానికి నడుంకట్టడానికి లాభించింది. కాని యిలా జరగటంలో ఏర్పడిన ఫలితం మాత్రం విచిత్రంగా ఉన్నది ఫలితమేమంటే ప్రతి మనిషిలోనూ అంటే సంస్కృతి వాసనలు ఉన్న పైవర్గం వారిలోకూడా, ధనమే సర్వోత్కృష్టమైన, సర్వప్రధానమైన విలువ, లక్ష్యం అనే విశ్వాసం ఏర్పడడం. అందువల్ల నేటి మానవుడు ఏ వర్గంలో, ఏ రంగంలో, ఏ స్థితిలో, ఏ ఉద్యోగంలో ఉన్నా అతనికి ధనేషణే ముఖ్యం అయిపోయింది. మతము : దాని సంస్థలు, ప్రచారము; సాహిత్యం : దాని రచనా, ప్రచురణా; కళ : నాట్యమూ, సినిమా; ప్రేమ, వివాహము, విద్య, వైద్యమువంటి రంగాల్లో - హృదయోల్లాసము, మానసిక వికాసము, దైహిక సంక్షేమము, విజ్ఞానమూ, సేవాప్రధాన సూత్రాలు కావలసిన సందర్భాల్లో - ఆయా సంస్థల్లో వాటి కార్య భారం నిర్వహించే వ్యక్తుల్లో, ధనేషణేతప్ప నేడు మరేమీ కన్పించడం లేదు. పూర్వం యీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగాల్లో ధనస్పర్శ లేకపోలేదు. కాని అది ఉండవలసిన మోతాదులో దాని మేరకు అది ఉండేది. ఆ సంస్థ లేక ఆ శాఖయొక్క ధ్యేయానికీ కర్తవ్య నిర్వహణకూ భంగం కలిగించే విధంగా ఉండేది కాదు. నేడు ధనేషణ తర్వాతే ధ్యేయమూ కర్తవ్యమూ. అందుకే డబ్బు కొరతలేకుండా ఖర్చవుతున్నా అన్ని రంగాల్లోనూ, ఫలితం అసంతృప్తికరంగానే ఉంటున్నది.

పై జెప్పిన లక్షణం రాజకీయాల్లో మరీ స్పష్టంగా కనిపిస్తూ, రాజకీయాలను కలుషితం చేస్తున్నది. స్వాతంత్ర్యం రాకపూర్వం రాజకీయాలు దేశసర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా నడచిన ఉద్యమం. ఆ సర్వతోముఖాభివృద్ధిలో ఆర్థికాభ్యుదయం ముఖ్యభాగమే అయినా, ఒక భాగం మాత్రమే. గాంధీ దృష్టిలో భారతదేశం అంతర్జాతీయ రాజకీయాల్లో అహింసాపద్ధతికి మార్గదర్శియై తన వైశిష్ట్యాన్ని నిరూపించుకోవాలన్న ధ్యేయం దేశాభ్యుదయంలో ఒకానొక భాగం. రవీంద్రుని దృష్టిలో భారత సంస్కృతి ఇతరదేశాలకు ఆధ్యాత్మిక సందేశాన్ని యివ్వగలగడం ఒక ధ్యేయం. ఇవన్నీ నేడు విస్మరింపబడినవి. ఆర్థికాభ్యుదయం కూడా నేడు సమష్టి సంక్షేమంగా కాకుండా, రాజకీయ వర్గాల ధనేషణగా మారి, చివరకు రాజకీయవాదుల ధనేషణగా దిగజారి పోయింది. వారి ననుగమిస్తూ అన్ని రంగాలలోని ప్రజలూ ధనేషణనే ప్రధాన ధ్యేయంగా పరిగణించటం జరుగుతున్నది.

ఈ పరిస్థితిలో ఆధునికత ఏ విధంగా ఉన్నది? విపరీతంగా పెరిగిన ధనేషణపట్ల యువతరం వారిలో కలుగుతున్న వైముఖ్యం జీవితాన్నిగూర్చి క్రొత్త అనుభూతి మార్గాలు అన్వేషించడంగా వ్యక్తమవుతున్నది. జెట్ - సెట్, హిప్పీలు, బీటిల్స్ యితర దేశాల్లో యీ పరిణామాన్ని సూచిస్తున్నారు. ఇక్కడ కూడా ఇంద్రియ సుఖాన్వేషణ, విశృంఖల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జీవితమూ క్రమంగా ధనేషణ కంటే ప్రాధాన్యం వహించే సూచనలు కన్పిస్తున్నాయి. దేశంలో దారిద్ర్యం తీరకపోవడంవల్ల పై సూచనలు ప్రస్ఫుటం కావడానికి మరొక పది, ఇరవై ఏళ్ళు పట్టవచ్చు. ధనేషణకు తరువాత పరిణామం విశృంఖలమైన సుఖాన్వేషణం అనే మాట మాత్రం నిశ్చయం. ఇది రాబోయే యుగ లక్షణం. ధనేషణ ప్రాబల్యం తగ్గిపోయేం దుకు కారణం వ్యక్తిలో సహజంగా కలిగే వైముఖ్యమేకాదు. నేడు సామాజికంగా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో చేస్తున్న మార్పు అంతకంటే ముఖ్య కారణం అవుతుంది. ఒక స్థాయికి మించిన రాబడిని పన్నుల రూపేణా ప్రభుత్వపరం చేసుకోవడం; ఆస్తిపాస్తుల విషయంలోనూ అలాగే చెయ్యడం; కనీసవేతనం, కుటుంబానికి పెన్షన్ ఇన్సూరెన్స్ ఏర్పాట్లతో ఎవరికిగాని జీవనభృతికి లోటులేకుండా చెయ్యటం - ఈ మార్పులతోపాటు సంపాయించిన ఆస్తినీ, ధనాన్నీ, వారసులకు అందించే పరిస్థితి లేకపోవ టంతో మనిషి తప్పనిసరిగా ధనేషణనుంచి మళ్ళినవాడై అనుభవ వైవిధ్యం కోసం క్రొత్త మార్గాలలో సుఖాన్వేషణ చెయ్యటం జరుగుతుంది. నేటి యువతరంవారిలో మద్యం సేవించడం, విలాస జీవనం గడపడం ఎక్కువ అవుతూ ఉన్నట్లు ఒకఅంచనా, క్రమంగా యల్. యస్. డి. (L. S. D.) మార్ జువానా (Marjuana) కూడా ఉపయోగానికి వస్తాయనటంలో సందే హములేదు.

విద్యార్థి లోకంలో రాజకీయ సంచలనమూ, తిరుగుబాటూ, విప్ల వమూ నేడు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తూ ఉన్నది. మనదేశంలో ప్రథ మంగా స్వాతంత్ర్యోద్యమంలో విద్యార్థులు రాజకీయాల్లో ప్రవేశించారు. తర్వాత సోషలిజం మార్క్సిజం వారిని ప్రభావితుల్ని చేస్తూ వచ్చింది. ఇటీవల వచ్చిన మార్పు విద్యార్థులు తమ అలజడిని విధ్వంసకాండగా,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దానికదే సార్థకం అనే ధోరణిలో సాగిస్తూ ఉండడం, ఇక్కడ ఏ 'యిజం' ప్రభావమూ ఉద్యమ ప్రభావమూ నిర్దిష్టంగా లేదు. అమెరికాలో వియత్నాం యుద్ధం, ఫ్రాన్స్‌లో విశ్వవిద్యాలయ వ్యవస్థలో మార్పులు, అక్కడి విద్యార్థులు సాగించిన ఉద్యమాలకు కారణాలు. మనదేశంలో కారణాలనేవి ఎక్కడి కక్కడే కోకొల్లలు. అర్థంపర్థంలేని కోరికలూ, వ్యక్తులపట్ల విద్వేషాలూ, రాజకీయ వాదులకోసం చేసిపెట్టే అల్లర్లు వగైరాలుగా యీ కారణాలు కనిపిస్తాయేగాని అవి అన్నీ ఒక ఉద్యమ స్వరూపాన్ని నిర్ణయించే విధంగా లేవు. కాని విద్యార్థుల అలజడి వెనుక ఉన్న ఒక సత్యాన్ని మాత్రం గుర్తించక తప్పదు. అదేమంటే యువత దేశంలోని ప్రస్తుత పరిస్థితులమీద, వ్యవస్థలమీద, జుగుప్స చెంది తిరుగుబాటు చేస్తున్నది. ఆ తిరుగుబాటుకి కర్తవ్యోన్ముఖమైన నిర్దిష్ట స్వరూపం లేకపోవచ్చుగాని 'మార్పు'ను వాంఛించే ప్రవృత్తి మాత్రం స్పష్టంగా ఉన్నది. మొదటిది విశ్వవిద్యాలయ వ్యవస్థలో మార్పు - ఉన్నత విద్య ధ్యేయం శతాబ్దాల విజ్ఞానాన్ని అందజెయ్యడం మాత్రమేనా? నేటి సామాజిక విప్లవానికి విశ్వవిద్యాలయమే కేంద్రమూ సాధనమూ ఎందుకు కాగూడదు? అనే ప్రశ్న వస్తున్నది. "తత్త్వశాస్త్ర మంటే విశ్వాన్ని అవలోకించి వర్ణించే శాస్త్రంగా యిన్నాళ్ళూ ఉన్నది. ఇకనుంచీ అది లోకాన్ని మార్చి తారుమారు చేసే సాధనంగా వృద్ధిపొందాలి" అనే భావాన్ని మార్క్స్ ఒకచోట వెలిబుచ్చాడు. నేటి విద్యార్థులు విశ్వ విద్యాలయ వ్యవస్థలో కూడా అటువంటి మార్పునే కోరుతున్నట్లు గోచరిస్తుంది. రెండవది: నాయకత్వంలో మార్పు. సోషలిజం - మార్క్సిజం మీద ఒక అర్ధ శతాబ్దంగా దేశం ఆశలు పెంచుకున్న తర్వాత, స్వాతంత్ర్యం వచ్చి యించుమించు పాతిక శతాబ్దం గడచిన తర్వాత, ఆశించిన మార్పులేవీ రాకపోవడంతో నేటి యువతరానికి పెద్దవాళ్లు అంటే నలభై - డెభ్భైఏళ్ళ వయస్సు గలవాళ్ళ నాయకత్వంమీద నమ్మకం పోతున్నది. విప్లవ నాయకత్వం ముప్పైఏళ్ళకు లోబడినవాళ్ళే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంటే విశ్వవిద్యాలయ విద్యార్థులే చేపట్టాలనే నమ్మకం కుదురుతున్నది. విప్లవానికి తగిన చొరవ, ఉద్వేగం, చేవ ముప్పైఏళ్ళ వయస్సు తర్వాత తగ్గుముఖం పట్టి, వ్యక్తి ఎంత విప్లవకారుణ్ణని చెప్పుకుంటున్నా, మాటలు చెప్పడానికె తప్ప విప్లవానికి నాయకుడుగా పనికి రాడనే అభిప్రాయం నేడు కలుగుతున్నది. ఈ అభిప్రాయంలో ఎంత సబబు ఉన్నదో చెప్పటం కష్టమే. కానీ యువతరం మాత్రం ఈ విశ్వాసాన్ని ఏర్పరచుకుంటున్నది. అందుకే "విద్యార్థుల శక్తి" (Student power) అనే దాన్ని ఒక్కదాన్నే సాంఘిక విప్లవశక్తిగా వారు భావిస్తున్నారు. ఈ విధంగా పై తరంవాళ్ళమీద అప నమ్మకం, నేటి వ్యవస్థలన్నిటిమీదా జుగుప్స, మార్పుకోసం తీవ్రమైన ఆకాంక్ష, ఆ మార్పు స్వరూపాన్ని నిర్వచించలేని అశక్తత - యివీ నేటి యువతరానికి చెందిన ఆధునిక రాజకీయ మానవుని లక్షణాలు. విద్యా సము పార్జనకంటె రాజకీయాలే పై చెయ్యి కావడం ఇక్కడ ఆధునికత. ఈ పరి స్థితినే తెలుగు సాహిత్య రంగంలో దిగంబర కవిత్వం ప్రతిబింబిస్తున్నది.

అయితే యువతరంలో రాజకీయ మానవుని ప్రాబల్యమే తప్ప మరొకటి లేదనుకోవడం కూడా పొరపాటు. పూర్వమే చెప్పినట్లు ఇంద్రియ సుఖాన్వేషణ కూడా ఉన్నది. అది ఒకవైపూ, విప్లవాకాంక్ష మరొకవైపూ, సమంగా తూగుతూ ఉన్నాయని చెప్పాలి. అంటే వచ్చే యుగంలో ఆర్థిక మానవుని ప్రాబల్యం తగ్గి రాజకీయ మానవుడు శృంగార మానవుడు యించుమించు సమానమైన ప్రతిపత్తిని పొందుతూ సరి క్రొత్తగా రూపం దిద్దుకుంటారనడంలో సందేహం లేదు.

3. శృంగార మానవుడు

భావనాత్మక సాహిత్యము ప్రతిపాదించిన "ప్రేమ" వ్యక్తినిష్ఠమే అయినా ప్రచారంమూలంగా దానికి వివాహ వ్యవస్థతో సంబంధం ఏర్పడి, వివాహానికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాతిపదికగా గ్రహింపబడింది. నేటి వ్యవహారంలో యీ 'ప్రేమ' కు నిర్వచనం, స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ అని మాత్రమే. అంతకంటె విశేషార్థం అన్వయించదు. ఈ "ప్రేమ" ఎంత అస్థిరమైనదో జీవితానుభవంలో తెలిసి వస్తున్నది. ప్రేమ స్థిరత్వానికి లేక అస్థిరత్వానికి వ్యక్తి బాధ్యత ఎంత వరకు? అనే ప్రశ్నకు ఫ్రాయిడ్ సిద్ధాంతాల అన్వయంవల్ల బాధ్యత లేదు అనే సమాధానమే సిద్ధిస్తున్నది. ఇది ఆధునికత ఈ శతాబ్దిలో. ఆర్థిక - రాజకీయ మానవుని విషయంలో మార్క్స్ ప్రభావంవలెనే, సెక్స్ విషయంలో ఫ్రాయిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్నది. చిన్నతనంలో పరిసరాలతోను తల్లిదండ్రులతోను ఒక వ్యక్తికి ఉన్న సంబంధాన్నిబట్టి ఆ వ్యక్తి తర్వాతి సెక్స్ ప్రవర్తన నిబద్ధ మవుతున్నది, అనే విశ్వాసం ఫ్రాయిడ్‌నుంచీ వచ్చింది. అందువలన ఒక వ్యక్తి మనోధర్మం శైశవావస్థలోనే ఒకరకంగా తీర్చి దిద్దబడినప్పుడు ఆ వ్యక్తి పెద్దవాడైన తర్వాత అతని ప్రవర్తనకు ఎంతవరకు బాధ్యుడు? అంతేగాక సాంఘికమైన నియమాల ద్వారా, ఏర్పాట్లద్వారా, వ్యక్తి జీవితాన్ని కఠినంగా నిబద్ధంచేస్తే అందువల్ల కలిగే బాధ, వ్యక్తి వికాసానికి అవరోధమూ, సమర్థనీయమేనా? అనే మరొక ప్రశ్న ఉదయిస్తుంది. ఈ విధమైన దృక్పథం క్రమంగా, దానిమూలం ఫ్రాయిడ్ అని తెలిసినా తెలియకపోయినా, లోకంలో వ్యాప్తికి వచ్చింది. తెలుగు దేశంలో చలంవంటి భావనాత్మక అతివాద రచయితలు సెక్స్‌ని ఒక సహజమైన, స్వచ్ఛందమైన సుఖానుభూతిగా చిత్రించే ప్రయత్నం చేశారు. దాన్ని ధనంతో, నైతిక నియమాలతో, కులమత భేదాలతో వావి వరుసలతో సామాజిక వ్యవస్థాబద్ధం చెయ్యడం న్యాయం కాదని చలం ప్రతిపాదించాడు పాశ్చాత్య దేశాల్లో ఫ్రాయిడ్‌ద్వారా కలిగిన ప్రభావమే తెలుగు దేశంలో చలం వంటి రచయితల ద్వారా వృద్ధిపొంది సెక్స్‌పట్ల ఒక ధారాళమైన దృక్పథం ఏర్పడింది. స్త్రీ విద్య, స్త్రీ జనోద్ధరణ, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యంవంటి ఉద్యమాలు, స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీ పురు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షులు కలసి మెలసి వ్యవహరించిన అవకాశాలు పై దృక్పథానికి దోహదం చేశాయి. దేవదాసీ వ్యవస్థను రద్దు చేయడంతో వ్యభిచారం నైతిక వ్యతిక్రమణ పోయాయి అనుకోవడం ఒక భ్రమ. 1947 తర్వాత క్రమంగా ధనేషణ జీవితంలో ప్రాధాన్యం వహించడంతో, సెక్స్ కూడా ధనేషణకు సాధనంగా రూపొంది వ్యభిచారం వివిధ రూపాల్లో విజృభించింది అనడంతో అతిశయోక్తి లేదు. పోతే సెక్స్‌లో నైతిక వ్యతిక్రమణ ప్రతిదాన్నీ వ్యభిచారం అనడానికి వీల్లేదు. సెక్స్ జీవితంలో నేడు పూర్వపు ధార్మిక నియతి చాలవరకు శైథిల్యం పొందినదనే చెప్పాలి. ఒకపైపు వరకట్నం వంటి దోషాలు ధనేషణమూలంగా వివాహ వ్యవస్థను అంటిపెట్టుకుని మరింత పెరగటమే కాకుండా, తత్ఫలితంగా వివాహానికి నోచుకోక రకరకాలుగా జీవనోపాధి గడించుకునే ప్రయత్నం చేసే యువతుల సంఖ్యను పెంచాయి. అటువంటి స్త్రీల సెక్స్ జీవితాల్లో వారి వారి పరిస్థితులనుబట్టి అశాంతి, అరక్షణ, అవ్యవస్థ ఏర్పడింది. కేవలం గృహిణిగాకాక సమాజంలో విశేష పాత్ర నిర్వహింపబూనుకునే ప్రతి స్త్రీకి ఏదో ఒక ధార్మిక సమస్య నేడు తప్పడంలేదు. ఇలా కలుగుతున్న క్లేశం, పూర్వం వ్యవస్థాబద్ధం కావడం వల్ల స్త్రీ వ్యక్తిత్వానికి కలిగిన బాధకంటే తక్కువదేమీ కాదు. సెక్స్ సంబంధాల్లో అవ్యవస్థ స్త్రీకే ఎక్కువ బాధ కలిగిస్తున్నది. నేటి నవలలూ, కథలూ, యీ పరిస్థితిని ప్రతిబింబిస్తూ ఉన్నాయి.

ధనేషణకంటే క్రమంగా ఇంద్రియ సుఖాన్వేషణ ప్రాధాన్యం వహించే సూచనలను గురించి ఇదివరకే ప్రస్తావించాను. ఆ సూచనలు ముఖ్యంగా నేటి సినిమాలలో కనిపిస్తున్నాయి. కళ జీవితాన్నీ, రాబోయే జీవితాన్నీ ప్రతిబింబిస్తుంది అనడంలో సందేహంలేదు. నేటి సినిమాలో సమస్య, కథ, సన్నివేశము ప్రాధాన్యం కోల్పోయి స్త్రీ పురుషులు సన్నిహితంగా వ్యవహరించే దృశ్యాలు, స్త్రీల అర్ధ నగ్న లాస్యాలు ప్రాముఖ్యం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వహించాయి. ఖోస్లా కమిటీ వివేదిక ముద్దు పెట్టుకోవడాన్నీ; నగ్నతాదృశ్యా లని అనుమతించింది. కేవలం సెక్స్‌ని అందించే పుస్తకాలమాట చెప్ప నక్కరలేదు. ఇంద్రియ సుఖాన్వేషణ. అందులో సెక్స్ సుఖాన్వేషణ మరింత విశృంఖలత్వాన్ని పొందే సూచనలు ఎన్నో ఉన్నాయి. దీనికి కుటుంబ నియంత్రణ ప్రచారమూ, ఆ సాధనాల సరఫరా మరింత దోహదం చేస్తున్నది. నేటి యువతరం వారు క్రమంగా (Permissive Society) విశృంఖల సమాజంపైపు పయనిస్తున్నారు అనడంలో సందేహంలేదు. ఇది అవాంఛనీయమని ఎవరు ఎలా బాధపడ్డా, మారుతున్న యుగలక్షణమైన యీ ధోరణిని అరికట్టే మార్గం ఏమీ కనిపించదు :

ఒక విధంగా చూస్తే సెక్స్ వ్యవహారాల్లో స్వేచ్ఛ మరింతగా సాగి విశృంఖలత వస్తే తప్ప మళ్ళీ వైవాహిక వ్యవస్థ సహజంగా ధర్మబద్ధం కావడం జరగదేమో అని తోస్తుంది. మన దేశంలో స్త్రీ పురుషులు సామాన్య సాంఘిక వ్యవహారాల్లో, విద్యా సంస్థల్లో, ఆఫీసుల్లో, కర్మాగారాల్లో కలుసుకుంటూ ఉన్నప్పటికీ, నేటికీ సెక్స్ తాలూకు "కుళ్ళు" బుద్ధి (Repression and jealousy resulting in scandal - mongering) క్షీణించలేదు. స్త్రీ పురుషులు సహజంగా, అంటే వ్యక్తులుగా, స్నేహ పూర్వకంగా కలుసుకునే క్లబ్బులుగాని సరదా సమావేశాలు (Socials) గాని మనకు లేవు. బస్సులో, సినిమాలో, అపరిచిత స్త్రీ అపరిచిత పురుషుని ప్రక్కన కూర్చోవడానికి భయపడుతుంది. ఈ అసహజమైన "కుళ్ళు" వదలడానికి సెక్స్‌లో మరింత విశృంఖలత ప్రబలి, సెక్స్ మొగం మొత్తితే తప్ప వేరు దారి లేదేమో। సెక్స్‌లోని అసహజమైన తీవ్రత, ఆకర్షణ, అప్పటికి కాని పోదు. అలా సెక్స్ యొక్క సహజత్వాన్ని దర్శించిన మానవుడు కనబడ్డ చీరకొంగు వెంటబడకుండా వివాహ వ్యవస్థ మీద గౌరవం పెంపొందించుకుంటాడు. ఇదంతా కేవలం ఒక అభిప్రాయం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాని ఊహాగానం కాని కాదు. అమెరికాలో యువతరంవారిలో "హిప్పీ"లుగా వ్యవహరిస్తున్న వాళ్ళు ఈ రకమైన ప్రయోగాల్నే చేస్తూ ఉన్నారు. యూరప్‌లో కొన్ని విశ్వవిద్యాలయాలలో విద్యార్థి విద్యార్థినులు తాత్కాలికమైన వివాహబంధం వంటిది ఏర్పరచుకొని జంటలుగా లాడ్జిలో ఉంటూ సంసారం చేస్తూ చక్కగా చదువుకుంటూ (అటువంటి ఏర్పాటు చదువుకు దోహదమట) నాలుగైదేళ్ళు గడిపి తర్వాత యిష్టం ఉంటే ఆ వివాహాన్ని ఖాయం చేసుకోవడం, లేకపోతే ఎవరిదారిన వాళ్ళు వెళ్ళడం చేస్తున్నారు. కొమార్తె వివాహాత్పూర్వమే గర్భవతియై ఇంటికి వస్తే ఆ అమ్మాయికి పురుడుపోసి ఆ మనుమసంతానాన్ని పోషించే బాధ్యత ఆమె తల్లి దండ్రులే సంతోషంగా వహిస్తున్నారు. ఈ ఆచారం ఇప్పుడు సాంఘికమైన ఆమోదాన్ని గూడా క్రమంగా పొందుతున్నది. ఇవన్నీ మనకు విపరీత ధోరణులుగా ఇప్పుడు తోచవచ్చు, కాని రేపు మన ధోరణులు కూడా ఇలానే ఉంటాయేమో !

రానురాను శ్రేయోరాజ్యము వ్యక్తి మంచి చెడ్డల భారాన్ని వహిస్తూ వచ్చేటప్పటికి పై జెప్పిన స్వేచ్ఛాశృంగారమానవుని మూర్తి స్పష్టంగా బహిర్గతం అవుతుంది. కమ్యూనిస్టు దేశమైన హంగరీలో నేటి పరిస్థితిని గూర్చి 'సెక్స్ సమస్య'లు అనుపేర "హంగేరియన్ క్వార్టర్లీ" నుంచీ ఒక వ్యాసాన్ని అనువదించి "భారతి" పత్రిక 1965 లో ప్రకటించింది. అందులో హంగరీ ప్రజల సెక్స్ జీవితంలో వచ్చిన మార్పునిగూర్చి ఇలా ఉన్నది: "విచిత్రమేమిటంటే జీవనోపాధి సమస్య తీరిపోతూ వచ్చినప్పటి నుంచీ భార్యాభర్తలమధ్య విడాకులు ఎక్కువైనై. జీవితంలో మరో వ్యక్తిని తోడు నీడగా పొందలేక ఏకాంతంగా ఏకాకిగా కాలం గడపవలసి వచ్చేవారి సంఖ్యకూడా ఎక్కువైంది. ఇద్దరు వ్యక్తుల్నీ బంధించి ఉంచడంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూర్వం ఆర్థికమైన హేతువులు చూపే ప్రభావం యిప్పుడు సన్నగిల్లిపోయింది. కూడూ గుడ్డా కోసం విధిగా వివాహం చేసుకోవలసిన అవసరం ఏ అమ్మాయికీ నేడు లేదు. అవతలి వ్యక్తికి ఎంత డబ్బు ఉన్నది అనే దృష్టితో ప్రియుణ్ణిగాని, ప్రేయసినిగాని ఎన్నుకునే పరిస్థితి నేడు ఎవరికి లేదు. ఇలా ఆర్థికమైన ఒత్తిడి లేకపోగానే, వ్యక్తి హృదయగతభావాలు ప్రాముఖ్యం వహిస్తున్నాయి." ఇలా పరిస్థితి మారినప్పుడు, వ్యక్తికి స్వేచ్ఛ లభించినప్పుడు, సెక్స్ ప్రవర్తనకు సంబంధించిన ధర్మ ప్రమాణాలలో మార్పు తప్పనిసరి అవుతుంది. ఆ మార్పు సంకల్పించి తీసుకుని రాకపోతే వ్యక్తికీ సమాజానికీ ఆవేదన, క్లేశం తప్పదు. హంగరీలో అటువంటి ధార్మికమైన మార్పు విషయమై జరిగిన చర్చ పై వ్యాసంలో ఉన్నది. అందులో హైబర్ హూజార్ అనే మేధావి యిలా అన్నాడు : "ఈనాటి సమాజాల్లో మానవ సంబంధాలు సంకీర్ణంగా అనంత వైవిధ్యంలో రూపొందాయి. అజ్ఞాపనం (Ten commandments) ఇరుకు గోడల్ని ఛేదిస్తూ జీవితం బహుముఖాల విస్తరిల్లింది. నీతులు చెప్పే ప్రశ్నోత్తరావళి కాదు నేడు కావలసింది. ప్రవర్తనకూ పరస్పర వైయక్తిక సంబంధాలకూ అన్వయించే ప్రధాన సూత్రాల సంఖ్యను పరిమితంచేసి వాటిని స్పష్టం చెయ్యటం అవసరం. వాటినిబట్టి వ్యక్తి - ఆ వ్యక్తి గుణ దోషాల్ని పరిశీలించే సమాజమూ....ఆయా పరిస్థితుల్లో ఆ వ్యక్తి ఆ విధంగా వ్యవహరించడం తప్పా ఒప్పా అనే నిర్ణయాన్ని స్వయంగా చేసుకునేందుకు వీలుగా ఆ సూత్రాలు అమరాలి. తద్వారా భవిష్యత్తులో వ్యక్తి స్వయం నిర్ణయశక్తి, బాధ్యతా, యితోధికంగా అభివృద్ధి చెందుతవి." అంటే ధార్మిక వ్యవస్థ యొక్క బాధ్యతాభారం సమాజం మీదకంటే వ్యక్తిమీదే క్రమంగా ఎక్కువ అవుతుంది అని సూచన. నూతన శృంగార మానవుని సమస్య అమెరికా వంటి దేశాలలోనే గాక కమ్యూనిస్టు దేశాలలోను ప్రారంభమైందని గ్రాహ్యం. ఇది మానవాళి ప్రవేశిస్తున్న క్రొత్త యుగానికి నాంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేటి తెలుగు సాహిత్యంలో శృంగార మానవునికి నూత్న ధార్మిక ప్రమాణాలను గూర్చి చర్చించే ముందుచూపు ఎంతవరకూ ఉన్నది? సెక్స్ వర్ణనలతో నిండిన నవలలూ, కథలూ ఒకవైపు వస్తూఉన్నవి. అవి సెక్స్ విషయమై వ్యక్తిగతమైన ధర్మప్రమాణాల ఆవశ్యకతను సూచించటం లేదు. గోపీచంద్ వ్రాసిన "పిల్ల తెమ్మెర" "గడియపడిన తలుపులు" మెరుపుల మరకలు", "యమపాశం" నవలల్లో కొంత ఆ ప్రయత్నం సాగింది. బుచ్చిబాబు నవల "చివరకు మిగిలేది", అతని కథలూ చాలా మందికి నచ్చాయి. కాని వాటిలో వ్యక్తమవుతున్న నూతన ధర్మ ప్రమాణాలని ఎవరూ గుర్తించిన జాడలేదు. గోపీచంద్ చిత్రించిన 'కోటేశ్వరమ్మ', 'శమంతకమణి', 'ఉషారాణి', బుచ్చిబాబు 'కోమలి'. 'అమృతం', సెక్స్ విషయంలో క్రొత్తయుగపు వ్యక్తులు. ఇక్కడ వీరికీ చలం చిత్రించిన 'రాజేశ్వరి' (మైదానం) 'అరుణ' వంటి స్త్రీలకూ గల భేదాన్ని ముఖ్యంగా గమనించాలి. చలం పాత్రలు స్వేచ్ఛతప్ప వేరే ధర్మ నిర్ణయం ఎరుగని, భావనామయ ప్రపంచానికి చెందిన పాత్రలు. సమాజంలో యిముడక అతీతంగా వెళ్ళేపాత్రలు. గోపీచంద్, బుచ్చిబాబు పాత్రలు సమాజంలో యిముడటానికి ప్రయత్నించేవి. నా నవల 'అసురసంధ్య' లోనూ క్రొత్త యుగపుపోకడలు, ధర్మనిర్ణయ సమస్యలు చర్చకు వచ్చాయి. సాహిత్యంతో పాటు కళలలో కూడా మార్పు తప్పదు. సుఖలోలత్వానికే రూపొందుతూ ఉన్న నేటి కళలు (సినిమా, నృత్యమువంటివి) క్రమంగా ఒక విశేషమనః స్థితిని ప్రతిపాదించేలాగా ముందుముందు తయారవుతాయి. (Psychedelic) Art అనేది అమెరికాలో L. S. D. సేవించిన వాళ్ళు సృష్టిస్తున్న కళకు పేరు. Surrealism లాగా వాస్తవికతను దాటి దానికి అతీతమైన భావనా లోకాల్లో విహరిస్తూ కళ మనస్సుయొక్క జాగ్రదవస్థకంటె దాని స్వప్న

(5)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమాధ్యవస్థల్ని ఎక్కువగా ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఇది సాహిత్యంలో, కళల్లో ఆధునికత.

4. ఆధ్యాత్మిక మానవుడు

ఏ యుగంలోనైనా నిజమైన ఆధ్యాత్మిక మానవుల సంఖ్య తక్కువగనే ఉంటుంది. అందరూ మోక్షాన్ని కర్హులే. అందరూ అందుకు ప్రయత్నం చెయ్యాలి అనేది మత ప్రచారకుని మాట. మతం పేరు, ఆధ్యాత్మికత వేరు. ధార్మిక మానవుడు, ఆర్థిక మానవుడు, శృంగార మానవుడు యుగ లక్షణం దృష్ట్యా అలా భాసిస్తూనే, లోక వ్యవహారాల్లో పాత్ర నిర్వహిస్తూనే, ఆధ్యాత్మిక మానవుడుగా ఉండవచ్చు, సంఘంలో ఆధ్యాత్మికత ఏ స్థాయిలో ఉన్నదని నిర్ణయించడంగాని అంచనా వెయ్యడంగాని కష్టం. మత ప్రచారకులూ, ధర్మబోధకులూ, సంప్రదాయజ్ఞులు, సన్న్యాసులూ పుష్కలంగానే కనిపిస్తూ ఉంటారు. వీరందరూ ఆధ్యాత్మిక మానవ రూపాలనుకోవడం పొరపాటు. వీరిలో చాలమంది ధార్మిక, లేక ఆర్థిక, శృంగార మానవులుగా ఉండవచ్చు. మానవ జీవితానికి ప్రయోజనమూ ప్రాతిపదికా నిర్ణయించడంలో మనస్తత్త్వ శాస్త్రంలో ఫ్రాయిడ్ తృతీయ పురుషార్థాన్నీ ఆడ్లర్ ద్వితీయ పురుషార్థాన్నీ ఎంచుకున్నారు. నేటి మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు పై రెండింటితోపాటు ప్రథమ పురుషార్థమైన ధర్మాన్ని కూడా ఎన్నుకుంటున్నారు. వ్యక్తి స్వధర్మాన్ని గుర్తెరగటమే అతని మనస్తత్త్వానికి కీలకమైనవిషయంగా భావిస్తున్నారు. అది ఎరక్కపోవటమే అతని క్లేశానికి కారణం అంటున్నారు. ఇది ఆధునికత. రాబోయే యుగంలో ధర్మనిర్ణయ సమస్యకూ మానవుడి మనశ్శాంతికీ గల కీలకమైన సంబంధాన్ని ఇది సూచిస్తున్నది. విక్టర్ ఫ్రాంక్ అనే మనస్తత్త్వ శాస్త్రజ్ఞుడు 'వ్యక్తికి స్వధర్మం తెలిసినప్పుడే తన జీవితం తనదిగా, కష్టమైనా. సుఖమైనా, తృప్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిస్తుంది' అంటున్నాడు. ('We may define the existential vacuum as the frustration of the most basic motivational force of man, the will to meaning, in contrast to the Adlerians' will to power and Freudians' will to pleasure, People do not care so much for pleasure and avoidance of pain; they do care for meaning...happiness must issue as a side-effect of meaning fulfilment.' - Vicktor E. Frankl - Encounter, November 1969) కాని స్వధర్మం నిర్ణయించుకోగల స్థితిని పొందినప్పటికీ మానవ జీవితంలో అర్థంకాని భాగం ఇంకా మిగిలే ఉంటుంది. తను చేసే కర్మతో తన ధర్మ నిర్వహణతో, బాధ్యతతో, ప్రమేయం లేకుండా సంభవించే అనుభవాల్ని మనిషి ఎలా అన్వయం చేసుకోవాలి? వాటిని యాదృచ్ఛికమనీ. దైవికమనీ వ్యవహరిస్తూ ఉంటాం. ఒక స్త్రీ తన కుమారుడు హఠాత్తుగా మరణించడం చూచి అంతులేని ఆవేదనకు గురియైంది. ఆమె పొందే బాధను ఏ ధర్మంతోనూ అన్వయించడానికి సాధ్యంకాదు. ఇక్కడ శాస్త్రజ్ఞుడు విక్టర్ ఒక సామ్యం చెప్పాడు. ఒకానొక కోతిని శాస్త్ర పరిశోధనలో మానవులకు కావలసిన రోగ నివారణౌషధం కనిపెట్టడంకోసం మాటిమాటికీ సూదితో పొడిచి రక్తం తీస్తూ ఉంటారు. ఆ కోతి అనుకుంటుంది: "ఈ యాదృచ్ఛికమైన అకారణమైన బాధ ఏమిటి నాకు? ఇంకా ఎన్నిసార్లు అనుభవించాలో" అని. దానిబాధకూ మానవలోకంలో ఒకానొక ప్రయోజనానికీ సంబంధం ఉన్నదని దాని కెట్లా తెలియటం? ఎట్లా తెలియజెప్పటం? వీలుకాదన్నమాట! అలాగే పై జెప్పిన స్త్రీతో "అమ్మా నీవు పొందే ఆవేదనకు అర్థం, మానవుని మేధకూ అవగాహనకూ అందని ఏ లోకంతో ఏ పరమార్థంతో ముడిపడి ఉన్నదో ఎవరు చెప్పగలరు?" అంటూ శాస్త్రజ్ఞుడు ఆమెతో సాంత్వనం పలికాడట. అలా చెప్పిన తర్వాత అతని ముగింపు వాక్యాలు యిలా ఉన్నాయి: (Are you absolutely sure that it - the human world - is the last dimension, a terminal in the Cosmos as it were, that there is no dime-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

nsion beyond the human world, a dimension in which the ultimate meaning of our human sufferings would be under standable ? But then we too have no access to this higher dimension ... the question, of course, cannot be answered either by doctor or scientist. It must be left open ... the answer can never be given intellectually but only existentially not in words but by our life, by our whole existence.) ద్వైవికమూ అన్నదానికి అర్థం ఏమిటి? ఆ ప్రశ్నకు సమాధానం మాటల్లో అనగా బుద్ధితో ఆలోచించి తేల్చేది కాదు. ఆ సమాధానం జీవించటంలో, ఎవరికి వారు తమ ఆస్తిత్వంనుంచీ పొందవలసిందే. అలా పొందగలిగిన వాడే 'ఆధ్యాత్మిక' మానవుడు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యాంశం - తత్త్వ జిజ్ఞాస చెయ్యడం, సాధన, "ఆధ్యాత్మికత" కాదు. తత్త్వమే తాను కావటం. ఆస్తిత్వ వైశిష్ట్యం ద్వారా సర్వ సందేహ నివృత్తి పొందటం "ఆధ్యాత్మికత". ఒక్కొక్క యుగలక్షణా న్ననుసరించి ధార్మిక, ఆర్థిక రాజకీయ, శృంగార మానవత్వములలో ఏదో ఒక్కొక్కసారి భాసించినా మిగతావాటిపై ప్రాబల్యం వహించినా, దానిపరిపూర్ణత, సాఫల్యం, చరమ స్థాయి ఆధ్యాత్మికత. ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు.... పురుష లందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు ఆధ్యాత్మిక మానవుడు యుగలక్ష ణాన్ని బట్టి అందరిలాగానే వ్యవహరిస్తూ, ఆస్తిత్వ వైశిష్ట్యంవల్ల నిర్ణిప్తుడై వేరుగా ఉంటాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహిత్యము : ఆధునికత

జీవితం గతానుగతికమై, సంప్రదాయాలు అర్థరహితమై పోవడమేగాక దుఃఖానికీ బాధకూ కారణమై, ఆచారాలూ అలవాట్లూ ఆత్మహత్యా సదృశాలుగా మారినప్పుడు, కొత్తదనాన్ని అన్వేషించడం మానవ సహజ ప్రవృత్తి. ఒక్కొక్క సమయంలో అలా ఏర్పడే సవాలును (Challenge) ఎదుర్కొనే ప్రతిక్రియను (Response) బట్టి మానవుని పునరుజ్జీవనం కొనలు సాగుతూ, నూత్నసృష్టి, జీవితానందం, నూత్న చైతన్య విలసనంతోబాటు నవసమాజ నిర్మాణము జరుగుతూ వుంటుంది. మత, సామాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలు పునరుజ్జీవనం లక్షణాలు. వీటిని ఒక్కొక్కదాన్ని వేరుగానూ, పరస్పరాశ్రితాలుగానూ కూడా ఉపలక్షించటానికీ పరిశీలించటానికీ వీలున్నది.

19-20 శతాబ్దులలో భారతజాతి పొందిన పునరుజ్జీవనానికి, పాశ్చాత్య దేశాలలో వచ్చిన పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య విప్లవం వంటి మార్పులతోనేగాక, కాల్పనిక వాదము, మానవతావాదము వంటి భావ సంచలనాలతోగూడా సన్నిహిత సంబంధం ఉన్నది. అయినప్పటికీ భారతజాతీయ పునరుజ్జీవనంలో, ప్రధానపాత్ర వహించిన రాజా రామమోహనరాయ్ (బ్రహ్మసమాజము), దయానంద సరస్వతి (ఆర్యసమాజము), రామకృష్ణ పరమహంస, వివేకానందులు, (అనుష్ఠాన వేదాంతము), తిలక్ (గీతా రహస్యము), గాంధీ (సత్యాహింసలు) ప్రభృతుల ఉద్యమాల స్వభావాన్ని పరిశీలించిచూస్తే, తేటతెల్లం అయ్యే సత్యం ఒకటి ఉన్నది. పాశ్చాత్య సంస్కృతి మన జీవన విధానంమీద చూపిన ప్రభావం సంక్షోభానికి (Crisis) దారితీస్తే, దాన్ని సవాలుగా (Challenge) తీసుకుని ప్రభవించిన పై ఉద్యమాలు ప్రతిక్రియగా (Response)గా కనిపిస్తాయే తప్ప, పాశ్చాత్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంస్కృతిని పుణికి పుచ్చుకుని, స్వీయ సంస్కృతిని ఊచముట్టుగా కోల్పోయిన పరిస్థితి కనిపించదు. బ్రహ్మసమాజంమీద క్రైస్తవ మత ప్రభావం కనిపించినా, ఆ ఉద్యమం ఉపనిషత్తులను భూమికగా స్వీకరించి, విగతా హైందవ సంప్రదాయాలను నిరాకరించడం ద్వారా, భారతీయుల్లో స్వీయ సంస్కృతిపట్ల జాగరణ కలిగించి నూత్న చైతన్యాన్నీ, ఉత్తేజాన్నీ సృష్టించింది. అది ఒక ఆధునికత. ఆర్యసమాజం కేవలం వేదాల్ని ప్రమాణంగా స్వీకరించి, కులభేదాల్ని నిరసించి నవచైతన్యానికి దోహదం చేసింది. బ్రహ్మసమాజం ప్రభావంతో హైందవులు మూర్తి ఆరాధనను నిరసించి, వ్యక్తిగతమైన మూర్తి ఆరాధన, భక్తి ప్రపత్తుల ఆధ్యాత్మిక సాధన మార్గాలనూ విస్మరించే తరుణంలో రామకృష్ణుడు ఆయా విశిష్ట మార్గాలను పునరుద్ధరించడమేగాక, వేదాంతానికీ, క్రైస్తవ మహమ్మదీయ సాధన మార్గాలకూ విప్రతిపత్తి లేదని చాటిచెప్పగలిగాడు. వివేకానందుని అనుష్ఠాన వేదాంతం పేర్కొన్న 'దరిద్ర నారాయణుడు' గాంధీగారికి యిష్టదైవం అయ్యాడు. 'గీత' కర్మనూ కర్తవ్యాన్నీ బోధిస్తున్నదని వ్యాఖ్యానించి తిలక్ జాతిని స్వాతంత్ర్య యుద్ధోన్ముఖుల్ని చేశాడు. ఇలా పరిశీలిస్తే 'ఆధునికత' అంటే పునరుజ్జీవన ప్రతిక్రియ (Response of rejuvenation) అనీ, అది జాతి సంస్కృతి భూమికల్ని పునర్దర్శించడమనీ (rediscovery of the cultural bases) అవగాహన అవుతుంది.

ప్రకృత విషయం 'సాహిత్యంలో ఆధునికత'. మొదట పాశ్చాత్య సాహిత్యంలో ఆధునికతను గూర్చి ప్రస్తావిస్తాను. ఫ్రెంచి విప్లవం తర్వాత 19వ శతాబ్ది సాహిత్యంలో వచ్చిన కాల్పనికోద్యమం, ఆనాటి పారిశ్రామిక, వైజ్ఞానిక పరిణామాలు జీవితంలో కలిగిస్తున్న నీరసత్వానికి ప్రతిక్రియ; ఘనీభవించిన రాజకీయ, సామాజిక వ్యవస్థలపై తిరుగుబాటు చెయ్యడానికి వ్యక్తికి స్ఫూర్తిని కలిగించినది ఆ నవచైతన్యం. ప్రకృతి గాంభీర్యానికీ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రామీణుల వ్యక్తిత్వాలకూ, వారి నిసర్గ సుందరమైన భాషకూ వర్డ్సువర్తు ప్రాధాన్యం యిచ్చాడు. మధ్యమ యుగాలకు చెందిన మార్మికతకు, అద్భుత రసానికీ కోలెరిడ్జ్ మానవుని నైతిక ప్రవృత్తిని సంధానించి చూపాడు. వైయక్తికమైన సౌందర్యానుభూతిలో జీవిత సత్యం ఉన్నదని కీట్స్ కవిత్వం చాటింది. కీట్స్ గ్రీకు సంస్కృతివైపు మొగ్గుచూపాడు. ఇంగ్లండులో కంటె ఫ్రాన్స్‌లో కాల్పనికవాద కవులు భాషతో చేసిన ప్రయోగాలు విచిత్రమైనవి. సాదాతనంనుంచీ తప్పించుకోవడానికీ, కవిత్వాన్ని అలౌకికమయిన ప్రక్రియగా మలిచేందుకూ ఈ ప్రతీకవాద కవులు (Symbolists) ప్రయత్నించారు. రాంబో (Rimbaud, 1871 లో పాల్ డీమెనీకి వ్రాసిన లేఖలో అంటాడు.[1] "ఈ కొత్త భాష ఆత్మ పలికే భాష। ఆత్మ నుద్దేశించిన భాష. శబ్ద వర్ణ గంధ సర్వస్వమూ ఒక సముచ్చయమైన భాష. భావం భావంతో ముడివడి లాక్కువెడుతుంది. కవి జీవిస్తున్న క్షణంలో జాగృతమైన విశ్వాత్మ తాలూకు అజ్ఞాత పరిమాణాన్ని అభివ్యక్తం చేసేందుకు జరిగే ప్రయత్నం యిది." రాంబో అన్వేషణ మౌనంలో పర్యవసించింది. కారణం తాను కోరినది మనస్సుకు అతీతమైన స్థాయిలో ఆత్మ సంవాదము. "Not communication but communion." ఈ కవుల్లో కొందరు కవిత్వాన్ని సంగీతం స్థాయికి మార్చే ప్రయత్నంతో భాషలోని పరుష శబ్దాలనూ, మేధను స్పృశించే చమత్కారాలనూ అలంకారాలనూ పరిహరించి శ్రుతిపేయమైన శైలిని రూపొందించారు. భాషా ప్రపంచాన్ని దాటి, మేధతో

1. "This new language will be of the soul, for the soul, summing up everything, smells, sounds, colours; thought latching on to thought and pulling. The poet would define the quantity of the unknown awakening in the universal soul in his time...." (Rimbaud to Paul Demeny.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భావంతో సంబంధంలేని అలౌకికానుభూతిని, అనంతమైన స్వేచ్ఛను ఆపాత మధురంగా అన్వేషించే ఈ సాహిత్య ప్రయోగాలు, సమకాలీన జీవిత సంఘర్షణకి ఒక వైయక్తికమైన ప్రతిక్రియ. అది ఆనాటి సాహిత్యంలో ఒక అధునికత. అదే కాలంలో వాస్తవికతా వాదం సాహిత్యంలో మరో అధునికతగా రూపొందింది. బాల్జాక్ (1799-1850) ఫ్లాబర్ (1820-80), జోలా (1840-1902) వ్రాసిన నవలా సాహిత్యం ఆనాటి జీవితానుభవానికి సాహిత్య రూపేణ మరో రకం ప్రతిక్రియ. బాల్జాక్, డికెన్స్ వంటి ఈ కోవకు చెందిన నవలా రచయితలను కార్ల్‌మార్క్స్ మెచ్చుకున్నాడు. అదే కాలంలో కాల్పనికవాదం నవలా సాహిత్యంలో కూడా రూపొందింది. స్కాట్ వంటి ఇంగ్లీషు నవలా రచయితా, విక్టర్ హ్యూగో, డ్యూమాస్ వంటి ఫ్రెంచి రచయితలూ సుప్రసిద్ధులే. ఏతావాతా తేలిందేమటంటే - 19 వ శతాబ్ద సాహిత్యంలో 'అధునికత' (1) కాల్పనికవాదం ద్వారాను (2) వాస్తవికతావాదం ద్వారాను రెండు విధాల రూపుదిద్దుకొన్నది.

20-వ శతాబ్ది సాహిత్యంలో పై చెప్పిన 'వాస్తవికత', 'కాల్పనికత' ఎలా పరిణామం చెందాయో పరిశీలించేముందు, 'వాస్తవికత', 'కాల్పనికత' అనబడే రెండు దృక్పథాలను గూర్చి కొంత తాత్త్విక అనుశీలన అవసరమౌతున్నది. తద్వారా అధునికత యొక్క రెండు ముఖాలను అవగాహన చేసుకోవడం సూత్రీకరించడం సులభమవుతుంది.

భౌతిక శాస్త్రవేత్తలు యధార్థం (Reality) రెండు విధాలుగా వుంటుందని అన్నారు. జె. రాబర్ట్ ఓపెన్ హైమర్ వాటిని కాలబద్ధమైనదనీ (the way of time and history), కాలతీతమైనదనీ (the way of eternity and timelessness) విభజించాడు. హైసెన్‌బర్గ్ ఇలా వివరించాడు : "దేశకాలబద్ధమై నడిచే వస్తు ప్రపంచం (the objective word

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

pursuing its regular course in space and time); ప్రపంచం యొక్క ఏకత్వాన్ని ఆత్మానుభూతిద్వారా గ్రహించి, వస్తువునూ వస్తు ప్రపంచాన్నీ తనకంటె భిన్నంగా చూడని విషయి (a subject mystically) experiencing the unity of the world and no longer confronted by an object or by any objective world). ఓపెన్‌హైమర్ ఈ రెండింటినీ సమీకరించుకోవడం శాస్త్రజ్ఞునికి (మనిషికి) చాల అవసరం అంటాడు. "అనుభూతిని భిన్నరూపాలలో అభివ్యక్తం చెయ్యడంలో దేని సార్థకత దానికి ఉన్నది. భౌతిక ప్రపంచాన్ని సమగ్రంగా వర్ణించేందుకు రెండు మార్గాలూ అవసరమే. అయినప్పటికీ ఒక సందర్భంలో ఒక మార్గమే పనికివస్తుంది తప్ప రెండోది పనికిరాదు; రెండోది పనికివచ్చే సందర్భంలో మొదటిది పొసగదు. అలా యీ రెండు మార్గాలూ ఒకదాని కొకటి ప్రత్యామ్నాయంగా కనిపించినా, సమగ్రమైన జ్ఞానానికి రెండూ అవసరమే" (Various ways of talking about experience may each have validity and ma y each be necessary for the adequate description of the physical world and yet may stand in nutrally exclusive relationship to each other, so that in a situation to which one applies, there may be no consistent possiblity of applying the other.) ఈ సూత్రీకరణ చాల మౌలికమైనది. అనవసరమైన అపోహలకూ, వివాదాలకూ స్వస్తిచెప్పే ప్రాముఖ్యం, ప్రయోజనం దీనికి ఉన్నది. 'వాస్తవికత' 'కాల్పనికత' రెండింటిలో ఏది ప్రయోజనకారి, ఏది కాదు; ఏది సత్యం, ఏది అసత్యం అనే మీమాంస అంతమై, రెండూ మానవుని జ్ఞానచక్షువులుగా నిలుస్తాయి. 'వాస్తవికత' బాహ్య ప్రపంచాన్ని, సామాజిక, ఆర్థిక, చారిత్రక ప్రమాణాలతో, కొన్ని జీవిత ప్రయోజనాలకు అనుగుణంగా అవగాహనకు తీసుకువస్తే, 'కాల్పనికత' విషయికి అత్యవసరమైన స్ఫూర్తినీ, ఆనందాన్నీ,

(6)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉత్తేజాన్నీ ప్రసాదిస్తుంది. లోకంలో జీవిస్తూ లౌకిక సమస్యలను ఎదుర్కొంటూనే, లోకానికి అతీతంగా, అలౌకికమైన అనుభూతినీ ఆనందాన్నీ పొందటానికి రెండు మార్గాలూ అవసరమే.

వాస్తవికతా దృక్పథంలో వ్రాయబడిన సాహిత్యంలో వ్యక్తి 'విషయి' లేకపోలేదు; అది లేకపోతే సాహిత్య రచనలో అర్థం, ఆకారం సాధ్యంకావు. అలాగే కాల్పనికతా దృక్పథంలో వ్రాయబడిన సాహిత్యంలో వస్తు ప్రపంచం లేకపోలేదు; కాని, ఈ వస్తు ప్రపంచం విలక్షణంగా, విస్తృతంగా దర్శనమిస్తుంది. 'ఆధునికత' అంటే సమకాలీన జీవితం నుంచి ఎదురయ్యే సవాలు (Challenge) ని ఎదుర్కొనే ప్రతిక్రియ (Response) అన్నప్పుడు, 19-వ శతాబ్ది ఆర్థిక, సామాజిక వ్యవస్థల అవగాహనకు 'వాస్తవికతా' సాహిత్యం దోహదంచేస్తే, ఆనాటి జీవితంలో వ్యక్తి పొందే నిర్వేదానికీ, నిస్పృహకూ, సద్యోవిముక్తి మార్గంగా 'కాల్పనికతా' సాహిత్యం రూపుదిద్దుకొన్నది. రాజకీయవాదులు మొదటి మార్గాన్నీ, మనస్విత కలిగిన వ్యక్తులు రెండో మార్గాన్నీ ఎన్నుకొని, తాము అభిమానించే సాహిత్యమే మానవ శ్రేయస్సుకు అవసరమనీ, రెండోది పనికిరాదనీ వాదిస్తారు. ఈ వాద ప్రతివాదాలు అంతంలేని ఆక్రోశం మాత్రమే. రెండూ మానవ జాతికి సహజమైన, అవసరమైన ప్రవృత్తులేనని గుర్తించడమే వివేకులు చేసే పని.

పైన వివరించిన 'వాస్తవికతా', 'కాల్పనికతా' సాహిత్య వైఖరులకూ, మనోవిజ్ఞానశాస్త్రం (Psychology) ప్రతిపాదించే చేతన (Conscious), అవచేతన (Unconscious) లకూ కూడా సంబంధం గుర్తించవచ్చును. కార్ల్‌యూంగ్ పరిశోధనలు సాహిత్యానికి బాగా అన్వయిస్తాయి. అవచేతన (Unconscious) లో ఆయన వ్యక్తి అవచేతన (Personal

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Unconscious), సామూహిక అవచేతన (Collective Unconscious) అన్న రెండు లోతుల్ని గుర్తించారు. వ్యక్తిగత జీవిత సంస్కారాలతో నిండినది వ్యక్తి అవచేతన; అంతకంటె విశాలంగా మానవజాతి చరిత్రలో రూపుదిద్దుకొన్న సంస్కృతి విశేషాలతో నిండినది సామూహిక అవచేతన. చేతన, అవచేతనల సంఘర్షణ, సమీకరణ, సమన్వయమే సాహిత్య సృష్టికీ, సాహిత్యంలో నవ్యత (ఆధునికత) కూ మూలం అనుకోవడం ఒక రకమైన సూత్రీకరణ అవుతుంది.

ఇక 20 వ శతాబ్ది సాహిత్యంలో "వాస్తవికత", "కాల్పనికత" పొందిన పరిణామాల్ని పరిశీలిద్దాము. కవిత్వంలో ప్రతీకవాదం (Symbolism) క్షీణించి దానిపై తిరుగుబాటుగా ప్రతిమావాదం (Imagism) వచ్చింది. ఇక్కడ 'వాస్తవికత' - 'కాల్పనికత'ల సమన్వయ ప్రయత్నం చూడవచ్చు. "జీవితానికి సంబంధించిన భౌతిక సత్యాలను వ్యాఖ్యానం లేకుండా, సూటియైన భాషలో అభివ్యక్తం చెయ్యడం కవిత్వం" అన్నాడు ఫోర్డ్‌మాడక్స్ ఫోర్డ్, ఇమేజిస్ట్ కవిత్వాన్ని సమీక్షిస్తూ. ఉద్యమ నాయకత్వం వహించిన ఎజ్రాపౌండ్ బాహ్య ప్రపంచమే సత్యం అన్నాడు, ప్రతీకవాదుల్ని నిరసిస్తూ. ప్రతీక వాదులు (Disordering of the senses) యింద్రియ గోచరమైన వస్తు ప్రపంచాన్ని చిందరవందర చేస్తూ దానికి ఆవల, అతీతంగా 'అజ్ఞాత'మైన దేన్నో అందుకోవటానికి ప్రయత్నించారు; కాని, అందుకోవలసిందీ, పొందవలసిందీ మన చుట్టూ వున్న వస్తు ప్రపంచమే. దీన్ని కొత్తగా చూచే చూపు కవిత్వం ప్రసాదిస్తుంది. అలా చూడటం అంటే "వస్తువుల పేర్లని ఒకసారి విస్మరించడం" అన్నాడు పాల్ వాలెరీ. "కొత్తగా చూడటం అంటే కొత్తదాన్ని సృష్టించడమే" (To see something new, we must make something new) - లిక్టెన్‌బర్గ్. ప్రూస్ట్, వాలెరీ, రిల్కె, ఎలియట్ వంటి రచయితలు తమ రచనల్ని వస్తు ప్రపంచంలో ప్రత్యేక ప్రతిపత్తి గల కళా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వస్తువులుగా (Artifacts) పేర్కొన్నారు. "ఆధునిక కళకు సంబంధించిన రచన కళా వస్తువుగా ప్రత్యేక ప్రతిపత్తి కలిగినది; దాన్ని భాషలో సమాజంలో భాగంగా పరిగణించరాదు." (A work of modern art insists on its own status as an artifact and that it cannot therefore be treated like a piece of language or an aspect of society). "రచయిత ఏ ఉద్దేశంతో రచన చేశాడో అంతకంటె భిన్నంగా స్ఫూర్తి నివ్వగలిగిన శక్తి దానికి ఉన్నప్పుడే, ఒక రచన కాలం ధాటికి తట్టుకొని నిలవగలదు" (వాలెరీ) "The work of art endured to the extent that it is capable of appearing quite other than as its author created it" (Valery). 19 వ శతాబ్ది 'కాల్పనికత' విశ్వరహస్యాల్ని, జీవిత రహస్యాల్ని వర్తమాన వస్తు ప్రపంచాన్ని నిరాకరించి, అధిగమించి, గతంలోనో, తాత్త్వికతలోనో, అనుభూతి వైశిష్ట్యంలోనో, అన్వేషించింది. 20 వ శతాబ్ది 'కాల్పనికత' వస్తు ప్రపంచానికి తిరిగి వచ్చి, దాన్ని పునర్దర్శించడం ద్వారా జీవితానికి స్ఫూర్తినీ రక్తినీ కలిగించే ప్రయత్నం చేసింది. "ఒక వస్తువును గురించిన జ్ఞానానికి పరిమితి ఉందనుకోవడం అజ్ఞత. ఒక్కొక్క వస్తువు కొత్తగా దర్శనమిస్తుంది; మనం దాన్ని దాన్నిగానే వివరించుకోవాలి" (క్లాడెల్) (It is stupid to think that any object of knowledge can be exhausted. Each thing springs forth as new, to be explained by reference to itself alone-' Claudel.) కళ. సాహిత్యమూ కూడా 'వస్తు ప్రపంచానికి తిరిగిరావడమే' (a return to things in themselves) 'ఆధునికత'గా పరిగణింపబడింది. కాల్పనికత పొందిన ఈ పరిణామాన్ని ఆల్బర్ట్ బెగిన్ యిలా పేర్కొన్నాడు : "ఆత్మాశ్రయ పద్ధతిని దాని చివరి అంచులదాకా కొనసాగిస్తే, బాహ్యప్రపంచాన్ని పునర్దర్శించే పరిణామం తప్పదు". (The way of subjectivism pursued to the utmost possible limit, results in a discovery of the exterior world—Albert Beguin)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బెగిన్-నిగమనాన్ని పరిశీలిస్తే. బహిశ్చేతనకూ అంతశ్చేతనకూ గల సంబంధాన్నిగూర్చి ఈ కవుల అభిప్రాయమేమిటో మరికొంత బోధపడుతుంది. మార్సెల్ రేమండ్ అంటాడు: "ఒక భావము, ఒక స్పందన, ఒకానొక కోరిక మన ఆంతరిక జీవితానికి సంబంధించిన వీటి స్వరూపం ఏమిటి? మనస్సు అనేదాన్ని అవలోకిస్తే అది బాహ్యవస్తు సముదాయంగానే కనిపిస్తుంది." (What is a thought, a feeling, or a certain desire, what are all phenomena of interior life, in the contemplation of the mind, if not exterior things—Marcel Raymond). అయినప్పుడు ఇమేజిస్ట్ కవులు బాహ్యవస్తు ప్రపంచాన్ని అంతశ్చేతనలోకి మారుస్తున్నారా, లేక అంతశ్చేతనలోని భావాన్నీ స్పందననూ, ప్రవృత్తినీ బాహ్యవస్తు స్వరూపంలోకి అనువదిస్తున్నారా అనే మీమాంస వస్తుంది. డొనాల్డ్ డేవీ అంటాడు: "పౌండ్ అభిప్రాయం బాహ్యప్రపంచం ఆంతర్యంలోకి మారుతుంది అని. కాని, భావమే తన వస్తులక్ష్యాన్ని వెదుక్కుంటుంది అనే వారిలో ఆంతర్యం ప్రధానం అవుతోంది." ఇది ఒక్కొక్క కవి పద్ధతినిబట్టి ఉంటుంది. ఇక్కడ గమనించవలసింది బహిరంతర ప్రపంచాల సమీకరణ. టి.ఎస్. ఎలియట్ తన పద్ధతి నిలా వివరించాడు: "రసవిహీనమైన వాస్తవికతను, స్వాప్నికమైన కాల్పనికతను సమ్మిశ్రితం చెయ్యడమెలాగో, గట్టి భౌతిక సత్యాన్ని ఊహాలోకం సరసన కూర్చడం సాధ్యమెలాగో, ఆ ప్రక్రియ మొదట బోద్‌లేర్ నుంచే నేర్చుకున్నాను" అంటాడు.

(I think that from Baudlaire I learned first... of the possibility of fusion between the sordidly realistic and the phantasmogoric, the possibility of the juxtaposition of the mother - of - fact and the fantastic —T.S. Eloit.) ఎలియట్ సమకాలీన సమాజంలోని అవ్యవస్థనూ, జీవితాల నైరాశ్యాన్నీ, అల్పత్వాన్నీ చిత్రించిన గొప్పకావ్యం 'వేస్ట్‌లాండ్'లో నగర దృశ్యాల వాస్తవికతతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాటు, మానవుని అంతశ్చేతనకూడా అభివ్యక్తమైంది. నవలా రచయిత జేమ్స్ జాయ్స్ 'యులిసిస్' కూడా నగర జీవితాన్ని పురాణ కథా నేపథ్య స్ఫూర్తితో వర్ణించే వచనకావ్యమే. జాయ్స్ నవల ప్రభావం ఎలియట్ కవితాపద్ధతిమీద ఉన్నది. ఇద్దరికీ పద్ధతిలోగల సామ్యం-గతాన్నీ ప్రకృతాన్నీ సమాంతరంగా కావ్యంలో నడిపించడం. పురాణ సాహిత్యంలోని కథలూ, పాత్రలూ, బింబాలూ ప్రకృత జీవితంలోని ఉదంతాల్నీ, వ్యక్తుల్నీ, చర్యలనీ వర్ణించేప్పుడు స్ఫూర్తి కల్గిస్తుంటాయి. కాలం ప్రసక్తి లేకుండా మానవ చరిత్రయొక్క పూర్వాపరాల సమన్వయం ఏకోన్ముఖంగా పాఠకునికి అందివ్వడం. ఇక్కడ కాలం తన ప్రవాహశీలతను కోల్పోయి, స్థలానికి (Space) నాలుగో పరిణామంగా అనుభూతికి వస్తుంది. (This is spatialized, a mere auxiliary to the other three dimensions. Space is curved, boundless and finite, the same anew).

జాయ్స్ 'యులిసిస్', ఎలియట్ 'వేస్ట్‌లాండ్' 20వ శతాబ్ది గొప్ప కావ్యాలనడం నిర్వివాదం. వీటి 'ఆధునికత' ఎలాంటిదో పైన సూచించాను. భూత వర్తమానకాలాల సమన్వయమూ, కవి బహిరంతర చేతనల సమ్మేళనమూ ఈ 'ఆధునికత' లక్షణము. యూంగ్ మనోవైజ్ఞానిక సిద్ధాంతంరీత్యా ఈ రచయితలు వ్యక్తి అవచేతన, సామూహిక అవచేతన లోతులు తరచారు. ఎలియట్‌లో వచ్చిన పరిణామం అందరెరిగినదే. ఆయన యూరపియన్ క్రైస్తవ సాంస్కృతిక, ఆధ్యాత్మిక భూమికల్ని పునర్దర్శించడం ద్వారా సమకాలీన జీవితానికి అర్థం, అన్వయం సాధించాడు.

పోతే, పాశ్చాత్య సాహిత్యంలో అదే కాలంలో ప్రభవిల్లిన ఉద్యమాలు - సర్రియలిజమ్, డాడాయిజమ్ వంటివి వ్యక్తి అవచేతనను సమీకరించి జీవితానుభూతికి కొత్త అభివ్యక్తిని కలిగించే ప్రయత్నాలు. కాని, వ్యక్తి అవచేతనలో లభించే భూమికలు, సామూహిక అవచేతనతో సమన్వయం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొందనప్పుడు, కవిత్వానికి స్ఫూర్తిని యివ్వలేవు. (Surrealism invents without discovering—Wallace Stevens). వర్తమాన జీవిత సంక్షోభాన్నుంచీ ఆయా రచయితలకూ, వారి సన్నిహితులకూ విముక్తినీ స్వేచ్ఛనూ కలిగించినట్లు భాసించాయే తప్ప, సాహిత్యంలో స్థానం పొందడం జరగలేదు. అలా ఈ రచనల్లో ఏదైనా కళాఖండంగా నిలిచిందంటే, దానికి సామూహిక అవచేతన స్పర్శ ఉండటమే కారణం. ఈ ఉద్యమాలు ఫ్రాయిడ్ సిద్ధాంతాలను ఆధారం చేసుకొన్నవి.

సాహిత్యంలో 'వాస్తవికతా' ధోరణి 20 శతాబ్దిలో పొందిన పరిణామాన్ని పరిశీలిస్తే, "వాస్తవికత" విమర్శనాత్మక వాస్తవికత (Critical realism) గా, సామ్యవాద వాస్తవికత (Socialist Realism) గా రూపొందింది. దీనికి ఆధారం మార్క్సిజమ్. 19 వ శతాబ్ది వాస్తవికతను బూర్జువా వాస్తవికత అన్నారు. కారణం బూర్జువా రచయిత తనకు ఎదురైన భౌతిక సత్యాల వైవిధ్యంలో ఒక దారీ తెన్నూ కనుగొనలేక, దాన్ని భౌతిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలతోనో, తనకు తోచిన కవితాన్యాయంతోనో ముడిపెట్టాడు. (మొదటి దానికి జోలా, రెండో దానికి డికెన్స్ ఉదాహరణలు.) విమర్శనాత్మక వాస్తవికత సమాజంలోని వైరుధ్యాలను, వ్యక్తిలోని వైరుధ్యాలను గతితార్కిక ఏకత్వం నుంచీ చిత్రిస్తుంది" అంటాడు జార్జి లూకాచ్. (It display's controdictions within society and within the individual in the context of a dialectical unity —George Lukacs). మార్క్సిజమ్‌ను సిద్ధాంతంగా, వర్తమాన ప్రపంచ అవగాహనకు ప్రాతిపదికగా గ్రహించినప్పటికీ, రచనలో, సాహిత్యాభివ్యక్తిలో రచయిత తన అనుభూతిమీద ఆధారపడితే తప్ప విజయం సాధించలేడు. (A writer's greatness springs from the depth and richness of reality —Lukacs) సామ్యవాద వాస్తవికతకూ విమర్శనాత్మక వాస్తవికతకూ తేడా వివరిస్తూ లూకాచ్ అంటాడు : విస్పష్టమైన సామ్యవాద దృక్పథం దానికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భూమిక కావటమే కాకుండా సామ్యవాదం వైపు సమాజాన్ని నడిపించే శక్తులను అంతరికంగా గుర్తించడానికి ఆ దృక్పథాన్ని ఉపయోగించే మెంకువకూడా దానికి అవసరం. (Socialist realism differs from critical realism, not only in being based on a concrete socialist perspective but also in using this perspective to describe the forces working towards socialism from the inside - Lukacs.) వాస్తవికతను ప్రదర్శించే రచనలో సామ్యవాదాన్ని అంతరికంగా గుర్తించడం, చిత్రించడమంటే అది భవిష్యత్తును బీజప్రాయంగా సూచించడమే తప్ప, యథాస్థితిగా కాదు అని హెచ్చరిస్తాడు లూకాచ్. (Socialist realism is a possiblity rather than an actuality.) అలా కాకుండా ప్రతిమించితే అది "విప్లవకాల్పనికత"గా మారుతుంది. మనం మనస్సులో ఆకాంక్షిస్తున్న పరిణామాలను యధార్థంలో ఉన్నట్లు చిత్రించడమే "విప్లవ కాల్పనికత." (Confusing what is subjectvely desirable what is objectively there). అందువల్ల విమర్శనాత్మక వాస్తవికతే కొత్తగా సామ్యవాది వ్యవస్థ ఏర్పడిన సమాజాల్లో కూడా చాలాకాలం సాహిత్యంలో ప్రాభవం వహించే అవకాశం ఉన్నదని లూకాచ్ అభిప్రాయపడ్డాడు.

20 - శతాబ్ది సాహిత్యంలో "వాస్తవికత" మార్క్సిజమ్‌ను ఆలంబనం చేసుకోవడం అంటే సమకాలీన జీవిత సంక్షోభం సవాలు (Challenge) కి మార్క్సిజమ్ చూపే భవిష్యద్దర్శనము ప్రతిక్రియ (Response) కావడమన్న మాట. నవలలో దీని అభివ్యక్తి ఎలావుంటుందో ఆలెక్ స్వింజ్‌వుడ్ వర్ణిస్తాడు : "వర్తమానం చరిత్రగా. పర్యవసానాన్ని గూర్చిన అనిర్దిష్టతలో, స్వేచ్ఛనూ విధాయకత్వాన్నీ సమతూకంగా పొందిక చేస్తూ, సంక్షోభంలో నాయకుడూ అతని సమాజమూ తలపడినట్లు చిత్రిస్తూ ఉండే లక్షణా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విప్లవాన్నీ, శ్రామికవర్గ రాజకీయాల్ని చిత్రించే నవలలకు ముఖ్యమని తోస్తుంది. పై చెప్పిన విషయాల్ని అర్థవంతమైన ఏక నిర్మాణంగా రూపొందించడంలో సామ్యవాద, విప్లవవాద నవలలని పేర్కొనబడే రచనలు పొందుతున్న వైఫల్యానికి కారణం - ధనస్వామ్య, సామ్యవాద సమాజాల్లో శ్రామికవర్గం యొక్క అధికారం నిజంగా నెలకొనక పోవడమే.... వ్యక్తిని చారిత్రక సిద్ధాంతాలకూ, ధోరణులకూ, భవిష్యద్దర్శనానికీ బలి యివ్వడమే.... గోర్కీ 'అమ్మ' నవల, పాల్ నిజాన్ 'ఆంట్వాయిన్ బ్లాయ్' (1933) నవలా, మార్క్సిజమ్ సాహిత్యంతో సమ్మేళనం చెందిన అరుదైన నవలలు." (The Novel and Revolution - Alan Swingewood pp. 264-268) మార్క్సిజమ్ తాలూకు భవిష్యద్దర్శనం కాని మరో భవిష్య ద్దర్శనం కాని జీవిత సంక్షోభానికి ప్రతిక్రియగా చేసుకోవడంవల్ల, సాహిత్య సృష్టిలో, యదార్థ జీవిత చిత్రణలో కొన్ని వైరుద్ధ్యాలూ సమస్యలూ తటస్థిస్తాయి. ఈ సమస్యల్ని అధిగమించి విజయవంతంగా భాసించిన నవలలు 'అమ్మ', ఆంట్వాయిన్ బ్లాయ్' మాత్రమే అంటున్నాడీ విమర్శకుడు. ఆ వైరుద్ధ్యాలూ, సమస్య లేమిటో మరోచోట వివరించాడు : "నవలలో రాజకీయమైన నిబద్ధత స్వేచ్ఛకోసం అని ఓవైపు చెబుతూ, పాత్రలలో ఆ స్వేచ్ఛ కనబడకుండా చెయ్యడం; పాత్రపోషణా, రాజకీయ భావ సంచలనమూ ఒకటి కావడం, నవలా స్వరూపంలో సమస్యా పరిష్కారానికి అన్వేషణ బదులు సామ్యవాదమే పరిష్కారమని మొదటినుంచీ తేల్చి చెప్పడం, ఇలా నిర్మింపబడిన రచనలో పాత్రల్లో సంశ్లిష్టతగాని, సహజ ప్రేరణగాని కనిపించకపోవడం; కార్య-కారణ సంబంధం ఒకే పద్ధతిలో కొనసాగడం; కథానాయకుడు భవిష్యద్దర్శనాన్ని సమర్థించే పాత్రగా మాత్రమే రూపొందడం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తప్ప సమస్యకు కేంద్రం కాలేకపోవడం, —యిలాంటి నిర్మాణం కలిగిన రచనలు సామ్యవాద, విప్లవవాద ఛాందసానికి ఉదాహరణలుగా ఉంటూ సామ్యవాద విప్లవం విప్లవాత్మక కళను నిరోధిస్తుంది అనే ఆరోపణకు ఆస్కారం కలిగిస్తాయి." ఇలాంటి రచనలు స్టాలిన్ రష్యాలోనూ యితర చోట్లా వచ్చాయి. పాస్టర్‌నాక్, సోల్జన్ స్తీన్‌ల రచనలు ఆమోదయోగ్యం కాలేకపోయాయి. ఈ మధ్య రష్యా ప్రభుత్వం పాస్టర్ నాక్ రచనల్ని ముద్రించడానికి ఆమోదించినట్లు తెలుస్తున్నది.

మార్క్సిజమ్‌ని భూమిక చేసుకొని సమకాలీన జీవితాన్ని చిత్రించే వాస్తవికతావాద రచయితలు గమనించవలసిన హెచ్చరిక మరొకటున్నది. సమకాలీన సమాజ చిత్రణలో, ఆయా దేశ సంస్కృతి ప్రభావం మనుష్యుల మీదా, వారి ప్రవర్తన మీద ఎలా ఎంత వరకు ఉన్నదో గ్రహించకుండా, వారిమీద ఆర్థిక శక్తుల, రాజకీయ శక్తుల ప్రభావం మాత్రమే ఉన్నదని భావించడంలోనూ, రచయిత వైఫల్యాన్ని పొందే అవకాశం ఉన్నది. "తన జాతి సంస్కృతితో రచయితకు ఎంతటి గట్టి బంధం ఉంటే, అంత మౌలికంగా, విశిష్టంగా అతని రచన ఉంటుంది. తన సమాజాన్ని వ్యతిరేకిస్తూ, విదేశీ భావాల్ని సంప్రదాయాల్నీ ఆహ్వానిస్తూ రచన చేసే రచయితకు కూడా పై చెప్పిన సూత్రం అన్వయిస్తుంది" అంటాడు లూకాచ్. ("The stronger a writer's ties with the cultural heritage of his nation, the more original his work will be, even where he is in opposition to his own society and calls in a foreign tradition to redress the balance."—George Lukacs).

20.వ శతాబ్ది సాహిత్యంలో ఇమేజిస్ట్ కవితద్వారా 'కాల్పనికత' పొందిన పరిణామాన్నీ, మార్క్సిస్ట్ భవిష్యద్దర్శనం ద్వారా 'వాస్తవికత'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొందిన పరిణామాన్నీ పరామర్శించాము. ఇవి రెండూకాక కాఫ్కా, సార్త్రే, కేమూ రచనలు ప్రతిపాదించిన 'ఆధునికత' మరొకటున్నది. 'అస్తిత్వవాదం' అని పేరు.

వర్తమాన ప్రపంచానికి, గత సాహిత్యంనుంచీ, సంస్కృతి భూమికలనుంచీ, సామూహిక అపచేతనలో బహిశ్చేతనని సమీకరించటం ద్వారా, అర్థాన్ని ఆపాదించడం ఒక పద్ధతిగానూ; మార్క్స్ భవిష్యద్దర్శనం ద్వారా, అర్థాన్నీ ప్రయోజనాన్నీ అన్వేషించడం మరో పద్ధతిగానూ ఉండగా, వర్తమాన ప్రపంచాన్ని 'అర్థరహితమైనది' (absurd) గా భావిస్తూ, వ్యక్తి అస్తిత్వపు లోతుల్నుంచి పొందే స్వేచ్ఛకూ, అనుభూతికీ విలువనిచ్చే దృక్పథం అస్తిత్వవాదం. "నేను భావించేదికాదు ప్రపంచం, నేను జీవించేది ప్రపంచం" (మెర్లిపోంటె) (The world is not what I think but what I live). 'అర్థరాహిత్యం' (the absurd) ఒక భావంకాదు. అది ఒక చేతనావస్థ. మనిషి యాంత్రిక జీవనంలో గతానుగతికంగా, అలవాటుపడిన భావాలూ, చేష్టలూ - ఈ బంధాలు తెగిన క్షణంలో అతనిలో ఉదయించే 'ఎందుకు ?' అనే ప్రశ్నకు సమాధానం అన్వేషించకుండా, ఆ 'అర్థరాహిత్యాన్ని' అస్తిత్వ సత్యంగా అంగీకరించే లబ్ధిని, కేమూ "అది నా తిరుగుబాటు, నా స్వేచ్ఛ, నా మహదావేశం" అని వర్ణించాడు. (My revolt, my freedom, and my passion). "అర్థరాహిత్యాన్ని గుర్తించిన క్షణంలో మనిషి అర్థరహితమైన జీవితంనుంచి బయటపడతాడు" (The absurd man becomes free the moment he recognizes his own absurdity). 'అర్థరాహిత్యాన్ని' గుర్తించడమంటే, పలాయనవాదం కాదు. ఎటువంటి అర్థాలూ, ప్రయోజనాలూ లేకుండా జీవితాన్ని యథాతథంగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంగీకరించడమే : (The absurd human being is, by definition wedded to life; all evasion of life is a capitulation. Life is our rock.) కాఫ్కా, సార్త్రే, కేమూ తర్వాత అప్‌డైక్, స్టైరాన్, సాల్ బెల్లోవంటి అమెరికన్ నవలా రచయితలు ఈ కోవకు చెందిన సాహిత్యాన్ని వైవిధ్యంతో సృష్టించారు. (చూ. "The absurd Hero in American fiction" by David Galloway). ఇది 20 - శతాబ్ది సాహిత్యంలో 'ఆధునికత' యొక్క మూడవ రేకు.

తెలుగు సాహిత్యంలో 'ఆధునికత'ను పరిశీలిస్తే, 'కాల్పనికత' - రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బాపిరాజు, చలం మొదలైన వారి రచనల్లోనూ; 'వాస్తవికత' - గురజాడ, ఉన్నవ, కుటుంబరావు, గోపీచంద్ గార్ల రచనల్లోనూ వ్యక్తమైంది. శ్రీశ్రీ తెచ్చిన ఆధునికతలో ఇమేజిస్ట్ కవితాశిల్పం, మార్క్సిస్ట్ విప్లవవాదం సంగమించి, భావ చిత్రాలలో దేశ సంస్కృతి ప్రతిఫలించింది. ఉదాహరణకు :

"కనకదుర్గా చండ సింహం జూలు దులిపి, అవులించింది !
ఇంద్ర దేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ, సవాల్ చేసింది :
నందికేశుడు రంకెవేస్తూ గంగడోలును కదిపి గంతేడు !
ఆదిసూకరవేదవేద్యుడు ఘుర్ఘురిస్తూ, కోర సాచాడు !
పుడమితల్లికి పురుటి నొప్పులు కొత్తసృష్టిని స్ఫురింపించాయి !"

బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' అస్తిత్వవాద దృక్పథానికి చేరువగా వచ్చిన నవల. ఇతర సమకాలీన సాహిత్యాన్నిగూర్చి, రచయితల్ని గూర్చి యిక్కడ ప్రస్తావించడం లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముగింపుగా 'ఆధునికతను' గూర్చి ఈ వ్యాసం పరిధిలో తేలిన సారాంశం ఏమిటో మనవి చేస్తాను. జాతి పునరుజ్జీవనంలోగాని, సాహిత్య పునరుజ్జీవనంలోగాని పూర్వ చరిత్ర, సంస్కృతి - వీటిని పునర్దర్శించే ప్రయత్నం ఉంటుంది. రచయితగా వ్యక్తి తన అంతశ్చేతనకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు 'కాల్పనికతా', బహిశ్చేతనకు ప్రాధాన్యం యిచ్చినప్పుడు 'వాస్తవికతా' అభివ్యక్తమౌతవి. ఈ రెండింటికీ స్పందనతోనూ హేతు వివేచనతోనూ సంబంధం వుంటుంది. రచయిత సామాజికుడుగా సమాజాన్ని దర్శించి, విమర్శించి, పునర్నిర్మాణముచేసే ప్రయోజనమూ వుంటుంది. కాని, అస్తిత్వవాద సాహిత్యంలో వ్యక్తి సమాజాన్ని అధిగమించే అన్వేషణ ఉంటుంది. దాన్ని కాల్పనికత, వాస్తవికత అని చెప్పడానికి వీల్లేదు. దాని సందేశం మనిషి ఆంతర్యం నుంచీ మనిషి ఆంతర్యానికే, దానిలో కనిపించే సమాజం 'అర్థరాహిత్యాన్ని' ప్రకటిస్తుంది. దాని ప్రయోజనం ఆత్మ దర్శనం, స్వేచ్ఛ. "ప్రపంచం ఊరికే ఉన్నది, అందుకే అది దివ్యం" (నీషే) (The world is divine because it is gratuitous —Nietzsche).

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మార్క్స్ దృష్టిలో సాహిత్యం

"సమాజంలో ఉత్పత్తిద్వారా ఏర్పడే మానవ సంబంధాలకూ, భౌతికమైన ఉత్పత్తి శక్తులకూ పరిణామదశరీత్యా సంఘటితమైన వ్యవస్థ ఆర్థికవ్యవస్థ. ఇది పునాది. దీనిమీద న్యాయశాస్త్ర, రాజ్యాంగ నిర్మాణమూ, దాని తాలూకు సామాజిక చైతన్య నిర్దిష్ట స్వరూపాలూ ఏర్పడిఉంటవి. భౌతిక జీవనోత్పాదకమైన విధానమే సామాజిక, రాజకీయ, విజ్ఞాన జీవిత క్రమాన్ని నియమిస్తుంది. మనుష్యుల చైతన్యంకాదు వారి సత్తాను నిర్ణయించేది, వారి సామాజిక సత్తాయే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. భౌతికమైన ఉత్పత్తి శక్తులు ఒక పరిణామదశలో అప్పటికి ఏర్పడి ఉన్న ఉత్పత్తి సంబంధాలతో (అంటే ఆస్తిపాస్తుల తాలూకు సంబంధాలతో) ఘర్షణ పడటం ప్రారంభమౌతుంది. ఉత్పత్తి శక్తుల పరిణామానికి దోహదం చేసే బదులు ఈ సంబంధాలు వాటికి సంకెళ్ళగా మారుతవి. అప్పుడు సామాజిక విప్లవం ప్రారంభమౌతుంది. ఆర్థిక వ్యవస్థ అనే పునాది మారడంతో దానిమీది బృహన్నిర్మాణం యావత్తు యించుమించు త్వరితంగా మారిపోతుంది. ఈ మార్పులను అవగాహన చేసుకోవడంలో ఒక ముఖ్యమైన తేడాను గమనించాలి. ఉత్పత్తి యొక్క ఆర్థిక పరిస్థితుల్లో కలిగే భౌతికమైన మార్పుని ప్రకృతి శాస్త్రంలాగే స్పష్టంగా నిర్ధారణ చేయవచ్చు, కాని న్యాయశాస్త్ర, రాజ్యాంగ, మత, దర్శన శాస్త్ర, కళా సంబంధమైన - అంటే భావసంబంధమైన - మార్పుల విషయం అలాకాదు. వాటిద్వారా మనుషుల్లో ఘర్షణను గూర్చిన చైతన్యం అభివ్యక్తమై వాళ్ళు పోరాటాన్ని సాగిస్తారు" [1] అన్నాడు మార్క్స్. ఇక్కడ ఆర్థికవ్యవస్థ "పునాది" : సాంస్కృతిక స్వరూపము 'నిర్మాణము'గా అభివర్ణింపబడింది. పునాదిగా అభివర్ణింపబడటంతో ఆర్థిక వ్యవస్థ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక్కటే విప్లవాన్ని నిర్ణయిస్తుందనే వ్యాఖ్యానాన్ని, అపోహగా ఎంగెల్స్ తిరస్కరించాడు. ఒకలేఖలో 1890 లో ఎంగెల్స్ యిలా వివరించాడు : "చరిత్రను భౌతికవాదం దృష్ట్యా వీక్షించడంలో, చరిత్రలో చివరకు పరిణామాన్ని నిర్ణయించేది ఉత్పత్తి దాని తాలూకు జీవితవాస్తవికత అనడమే తప్ప, అంతకంటే మార్క్సుగాని నేనుగాని చెప్పలేదు. ఆర్థికవ్యవస్థను ఒక్కదాన్నే నిర్ణయశక్తిగా ఎవరైనా వక్రభాష్యం చెబితే అది సిద్ధాంతాన్ని అర్థరహితం చెయ్యడమే అవుతుంది. ఆర్థిక పరిస్థితి 'భూమిక' అవటం సరే, కాని 'నిర్మాణం తాలూకు అంశాలు - వర్గ సంఘర్షణల రాజకీయాలు, విజేతయైన వర్గం ఏర్పరిచే రాజ్యాంగం న్యాయవిచారణా మార్గాలూ, వీటి తాలూకు ఘర్షణలు ఆయా మనుష్యుల బుర్రల్లో కలిగించే సంచలనాలూ, రాజకీయ ధార్మిక సిద్ధాంతాలూ, మతాభిప్రాయాలూ - అన్నీకూడా చారిత్రక సమరం యొక్క గతిని ప్రభావితం చెయ్యడమేకాదు, చాలాసార్లు దాని స్వరూపాన్ని నిర్ణయించడంలో ప్రధానంగా పై చెయ్యిగా ఉంటాయి. ఈ అన్నిటి యొక్క సంకుల సమరం ఫలితంగానే (ఈశక్తుల, సంఘటనల పరస్పర సంబంధం అంచనా వెయ్యడం అసాధ్యం) చివరకు ఆర్థికమైన ఉద్యమం తన విజయాన్ని సాధిస్తుంది. అది అలా ఉండకపోతే, సిద్ధాంతాన్ని చరిత్ర సన్నివేశానికి అన్వయించడం గణితంలో సామాన్య సమీకరణం లెక్క చేసినంత సులువుగా ఉండేది" 2

చరిత్ర గతిలో ఆధారభూతమైన శక్తులు ఆర్థికశక్తులే అయినా విప్లవంలో రాజకీయాలకూ, సాంస్కృతిక సాహిత్యోద్యమాలకూ ప్రధాన పాత్రే ఉన్నది అనడం మార్క్సు దర్శనం. ఇందులో ఆర్థిక శక్తుల పరిణామ స్వరూపం గోచరించినంత నిర్ధారణగా, శాస్త్రీయంగా రాజకీయ, సాంస్కృతిక, సాహిత్యోద్యమాల స్వరూపం, వాటి దారితెన్నులూ గోచరించవు. గమనించవలసింది ఏమిటంటే ఇక్కడ రాజకీయవాది, సాహిత్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కారుడూ మేధావులుగా సమానమే తప్ప రాజకీయవాదికి సాహిత్యకారుడికి లేని దివ్యదృష్టి ప్రత్యేకంగా మార్క్స్ దర్శనం ప్రసాదించడంలేదు. సామాజిక చైతన్యంలో విప్లవ సృజనశక్తి అభివ్యక్తమయ్యే రంగభూమి రాజకీయవారి బుర్రే కానక్కరలేదు. రచయితా అందుకు అర్హుడే.

ఉత్పత్తి సాధనాలను కైవసం చేసుకోవడం ద్వారా పార్టీ నియంతృత్వంద్వారా,, ఆర్థిక వ్యవస్థలో మార్పుల్ని తీసుకువచ్చే బాధ్యత రాజకీయవాదులైన మేము వహిస్తున్నాము కాబట్టి, సాహిత్య ఉత్పత్తికి సాధనాలైన రచయితలను గూడా కైవసం చేసుకుని వారిని నియంత్రించడంద్వారా సాంస్కృతిక ('నిర్మాణం') విప్లవం తీసుకు వస్తామంటే కుదరదు. స్టాలిన్ రష్యాలోనూ, మావో చైనాలోనూ ఈ ప్రయత్నం చేశారు. ఫలితం ఈనాడు అందరికీ విదితమే !

సాహిత్యమూ, మార్క్సిస్ట్ దర్శనసూత్రాల కవిలెకట్టా (Ideology) రెండూ ఒకటే, రెండింటికి అభేదమే అంటే అది మార్క్స్ దర్శనానికి విరుద్ధమే అవుతుంది ! ఆ అభిప్రాయంతో రచనలుచేసి మెప్పు సంపాదించటానికి ప్రయత్నించిన కొత్త రచయితల్ని గూర్చి ఎంగెల్స్ ఏమన్నాడో చూడండి : "చిల్లర రచయితలకు యిదో పెద్ద అలవాటైపోయింది. ప్రజ్ఞ లేకపోవడాన్ని దాచి పెట్టుకుంటూ, రాజకీయాలనుగూర్చి ఉల్లేఖిస్తుండడం. యిది కేవలం ఆకర్షించే ప్రయత్నం. కవిత్వము, నవలలు, సమీక్షలు, నాటకాలూ, సాహిత్యమంతా ఇలా 'గాలివాటు' (tendency) రచనగా తయారైపోయింది...." "ప్రతిభలేని వెధవ ఒకడు, తన విశ్వాసాన్ని ప్రకటిస్తూ, సొంతడబ్బా వాయించడంలో మరీ శ్రుతిమీరి పోయాడంటే అది నలుగుర్నీ ఆకర్షించడానికే" [3] ఇలాంటి రచయితలు తెలుగులో మనకూ ఉన్నారంటే మనం ఆశ్చర్యపడనక్కరలేదు ! చరిత్ర పునరావృతమౌతూ ఉంటుంది దేశ కాలాల్నిబట్టి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సోషలిస్టు విశ్వాసాల్ని వల్లించడమే సాహిత్యం కాదంటూ మార్క్సు సామాజిక 'స్పృహ' అన్న రచయితలుగా ఫ్రెంచి రచయిత బాల్జాక్‌నీ, ఆంగ్లనవలా రచయితలు డికెన్స్, థాకరే, బ్రాంటేవంటి వారిని ఉగ్గడించాడు. "నేటి ఇంగ్లీషు నవలా రచయితల పుటల్లో ధారాశుద్ధిగల శైలిలో కన్నులకు రూపుకట్టేవిధంగా ఎన్నో రాజకీయ, సామాజిక సత్యాలు ప్రపంచానికి ఆవిష్కరింపబడ్డాయి. రాజకీయవాదులూ, ప్రచారకులూ, నీతిబోధకులూ అందరూ కలిసికట్టుగా సాధించలేని కార్యం వీరు సాధించారు" అన్నాడు మార్క్సు!

'ఫ్రాంజ్‌వాన్ సికింగెన్' అనే నాటకాన్ని మార్క్సు ఎంగెల్స్‌లు సుదీర్ఘంగా సునిశితంగా చర్చించడం చూస్తే ఒకనాటి చారిత్రక - సామాజిక సంక్షోభాన్ని అవగాహన చేసుకునేందుకు సాహిత్యం ఎలా ఉపయోగిస్తుందో బోధపడుతుంది. ఆటువంటి విలువా, సామాజిక స్ఫూర్తీ సోషలిస్టు సిద్ధాంతాన్ని వల్లిస్తూ ప్రచార సాధనంగా సృష్టించే సాహిత్యానికి రాదు.

ఇక్కడే రచయితయొక్క 'నిబద్ధత' (Commitment) ను గూర్చి సరియైన అవగాహన అవసరం అవుతుంది. సార్త్రే అంటాడు: "సాహిత్యము (రచయితకు) సర్వస్వమూ కాకపోతే అది ఎందుకూ కొరగాదు. కమిట్‌మెంట్‌కి నేనిచ్చే అర్థం యిదే." 5 "దాన్ని అమాయకత్వానికీ పాటలకూ దిగజారిస్తే నశిస్తుంది. వ్రాసినవాక్యం, మనిషీ - సమాజమూ అన్ని స్థాయిలలోనూ ప్రతి శబ్దించకపోతే దానికి అర్థం శూన్యం. ఒక యుగం సాహిత్యమంటే ఏమిటి? యుగాన్ని తన సొంతంచేసుకున్న సాహిత్యమన్నమాట, రచయితలు అర్థాన్ని సృష్టిస్తూ సామాజిక సత్యాన్ని ఆవిష్కరిస్తారు, నిరూపిస్తారు, నివేదిస్తారు. తర్వాత జనం ఒకరిమొహం ఒకరు చూచుకుని కార్యోన్ముఖులు కావచ్చును." 6

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మార్క్సు అభిప్రాయాలు సాహిత్యాన్ని గూర్చి యిలావున్నా, ఆచరణలో రష్యాలోనూ చైనాలోనూ భిన్నంగానే జరిగింది. "రచయిత తన భావాల మేరకు సృష్టించవచ్చు ఏ నిబంధనా లేకుండా" అని లెనిన్ మొదట అన్నప్పటికీ, రష్యన్ విప్లవ సమయంలో అదే లెనిన్, సంస్కృతి పరంగా రచయిత "అయోమయంగా ఏవైపుకంటే ఆ వైపుకి లాగటానికి వీల్లేదని" అన్నాడు. 7 అక్కడినుంచీ ప్రారంభమైంది రచయిత దాస్యం. క్రమంగా రచయితయొక్క 'కమిట్‌మెంట్', 'మానవత' అనే ఆదర్శం నుంచి 'జనత' అనీ, జనత నుంచీ 'విప్లవం' అనీ, 'విప్లవం' నుంచీ 'పార్టీ' అనీ, అక్కడినుంచీ 'మార్పుజెందే పార్టీ నిర్దేశాలు' అనీ అలాసంకుచితమై పతనమైపోతూ వచ్చింది. స్టాలిన్ పరిపాలనలో యీ విషమ పరిస్థితి సాహిత్యాన్నీ, కళారంగాన్నీ రాహువులా కప్పివేసింది. దీన్నిగూర్చి 1966 లో సోవియట్ రచయితలు ఏమన్నారో చూడండి: "వ్యక్తిపూజ వలన కలిగిన దుష్ఫలితాల్లో ఒకటి - కళల్లో వైయక్తిక ప్రమాణాల్నీ, సామాజిక ప్రమాణాల్నీ, యాంత్రికంగా (విచక్షణా రహితంగా) ఒకటి చేసెయ్యడం. దానికి సమర్థన యిలా ఉండేది: ఆదర్శాల్లో రాజకీయాల్లో భావసమైక్యమూ, దృక్పథంలో ఏకత్వమూ సాధించాము. కాబట్టి మనకు కళా ప్రమాణాల్లోనూ ఒకటే వ్యవస్థ ఉండాలి, కళాభినివేశం సర్వమూ ఏక ముఖంగానే రూపొందాలి అనడం. కళాభిరుచులు సమాజంలోని సౌందర్య భావనల యొక్క అభివ్యక్తి కావడం నిజమే అయినా, వాస్తవంలో వైయక్తికమైన అభిరుచులన్నింటినీ ఒకే సామాజిక కళాసూత్రంగా సంక్షిప్తం చెయ్యడం కానిపని. ఏమంటే కళల్లో వ్యవస్థ ఒక్కటే అయినా అభిరుచుల వైవిధ్యం పుష్కలంగా ఉండటానికి వీలున్నది. ఈ వైవిధ్యం ఒక్కొక్క జాతిని బట్టి, మన స్తత్వాన్నిబట్టి, వయోభేదాన్ని బట్టి వైయక్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కంగా ఉత్పన్నమౌతుంది....అందుకే కళాభిరుచులూ, హృదయ ప్రేరణలూ ఒకే ప్రమాణానికి కట్టుబడి ఉండాలన్న నిర్దేశాన్ని మేము నిరాకరిస్తాము." 8

స్టాలిన్ తర్వాత రష్యాలో కళలూ, సాహిత్యమూ, వైవిధ్యంతో వైయక్తికాభిరుచులతో వికాసం చెందాలి అన్న గుర్తింపు ఏర్పడినా, రచయితకు మాత్రం సామాజికునిగా (as a social being) ఉండవలసిన స్వతంత్ర ప్రతిపత్తి లభించలేదనే తెలుస్తోంది. సోవియట్ రచయిత లేమంటున్నారో చూడండి : "మార్క్సిస్ట్ - లెనినిస్ట్ దృక్పథం కళాభిరుచిలో వైయక్తికమైన అంశను గుర్తిస్తుంది. కాని దాన్ని కేవలం ఆత్మాశ్రయమైన దానిగా అంగీకరించదు. సమాజంలో అభిరుచుల వైవిధ్యానికి కూడా ఒక స్పష్టమైన కళావ్యవస్థ, ఆదర్శాలు (ideology) ఆధారమనీ తద్వారా అందులో ఒక ఏకత్వంకూడా ఉంటుందనీ నొక్కిచెబుతుందీ దృక్పథం. అభిరుచులలో వైవిధ్యం సరేగాని, ఏదంటే అది కుదరదు అనడమే యీ నిర్దిష్ట దృక్పధం." 9 ఈ నిర్దిష్ట దృక్పథం పరిధిలోకి ఏ అభిరుచి వస్తుందో ఏదిరాదో నిర్ణయించే అధికారం ఎవరిది ? అది రాజకీయవాదికి కాకుండా మొత్తం సమాజానికి వుండాలనే యిక్కడ మనవి చేయడం. అప్పుడే అది సరియైన మార్క్స్ దృక్పథం అవుతుంది.

మార్క్స్ దర్శనంలో వ్యక్తికీ రచయితకూ నిర్దిష్టమైన ప్రతిపత్తి ఉన్నా, దాన్ని గూర్చి మార్క్సిస్ట్ రాజకీయవాదులు వక్రభాష్యం పలుకుతూ, భావవాద సంప్రదాయంలో వ్యక్తికీ - సమాజానికీ గల వైరుధ్యాన్నే పునశ్చరణం చేస్తూ వచ్చారు. సమాజవాదం అంటే వ్యక్తిని కొన్ని సూత్రాల మేరకు సమాజానికి తొత్తుగా లొంగదీసుకోవడమేననే అపోహ కల్పిస్తూ రావడం, మార్క్స్ దర్శనమంటే మేధావుల్లో రచయితల్లో భయమూ, వైముఖ్యమూ ఏర్పడటానికి కారణమైంది. మార్క్స్ దర్శనంలో "వ్యక్తి"ని గూర్చిన తాత్త్విక వివరణ (metaphysical description ను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అర్థం చేసుకుంటే యీ అపోహలు అదృశ్యమౌతవి. ఆ వివరణ వైపు యిప్పుడు దృష్టి మళ్ళిద్దాం.

మార్క్సు దర్శనం గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism).

దీనికీ అంతకు పూర్వం ప్రచారం పొందిన భౌతికవాదానికీ మౌలికంగా చాలా భేదమున్నది. భౌతిక ద్రవ్యము (Physical matter) చరమ సత్యమే అయినా అది నిత్యపరిణామశీలమనీ, దాన్ని పరిణామం ద్వారానే చైతన్యవంతంగానే అవగాహన చేసుకోవాలనీ చెబుతుంది గతి తార్కిక భౌతికవాదం. "ఇంతవరకూ వచ్చిన భౌతికవాదాలలో ప్రధానమైన లోపం ఏమిటంటే - విషయము, (object) సత్యము, అంటే మనం యింద్రియాల ద్వారా గ్రహించేది. అది కేవలం దృశ్యవిషయంగా యథారూపంలోనే అర్థం చేసుకుంటున్నాము. దాన్ని సేంద్రియ మానవ చైతన్యంగా, వ్యవహారంగా తీసుకోవడంలేదు. అంటే 'విషయి' (subject) పరంగా తీసుకోవడంలేదు. అందువల్లనే భౌతికవాదానికి ప్రతిద్వంద్విగా, చైతన్యవంతమైన భాగాన్ని ఒక అమూర్త వస్తువు (abstraction) చేసి భావవాదం పెంపొందించడం జరిగింది - దానికీ సేంద్రియ చైతన్యం యొక్క యథాస్వరూపం తెలియదు." [10] ఇలా 'విషయి-విషయము' అనే ద్వంద్వాన్ని అధిగమించే తాత్త్విక భూమికమీద ఏర్పడింది మార్క్సు ప్రవచించిన భౌతికవాదం. సమాజానికీ వ్యక్తికీ గల సంబంధం పరిణామశీలమైనది. గతితార్కిక బద్ధమైనది. "భాష"ను గూర్చి మార్క్సు దర్శనము ఏమి చెబుతుందో పరిశీలిస్తే మనం సులువుగా అర్థం చేసుకోవచ్చు దీన్ని.

భాష, చైతన్యం అంత ప్రాచీనమైనది. భాష వ్యావహారిక చైతన్యం. అంటే అది ఇతరులకు గ్రాహ్యమౌతున్నది గాబట్టి వ్యక్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గతంగా నాకూ గ్రాహ్యమౌతున్నది. భాష, చైతన్యంలాగే, మనుష్యులు ఒకరితో నొకరు సాంగత్యం. సంబంధం నెరపవలసిన అవసరంనుంచీ, ఆవశ్యకతనుంచీ పుట్టుతున్నది". 11 భాషకూ సామాజిక చైతన్యానికీ గల అభేదస్థితి అవగాహన చేసుకోవలసిన కీలకమైన విషయం మార్క్స్ దర్శనంలో (భావవాద సంప్రదాయచ్ఛాయలు అవగాహనకు అవరోధం. వాటిని తొలగించుకొని చూడాలి). భాషలో శబ్దాలు సామాజిక వ్యవహారంలో ఉద్భవించినవి. అయినా వాటి అర్థవిన్యాసంలో వాటికి రెండు ముఖాలుంటవి. ఒకటి పూర్వప్రయోగంవల్ల సిద్ధించిన రూఢమైన అర్థం (నిఘంటువు లోనిది). రెండోది, వ్యవహారంలో శబ్దాన్ని విచక్షణంగా, సృజనాత్మకంగా వ్యక్తి ప్రయోగించటంవల్ల భవిష్యత్తులో సిద్ధించే కొత్త అర్థం. మొదటిదాన్ని అనుసరించేఉన్నా, వ్యవహారంలో సహజంగా సిద్ధించేదే అయినా, యీ రెండో అర్థాన్ని అది పుట్టకముందే ఊహించి నిఘంటువులో వ్రాయడం సాధ్యంకాదు గదా! కొత్త అర్థాన్ని సంతరించుకోవడానికి వీల్లేదంటూ శబ్దాన్ని నియమించడమే జరిగితే భాష స్తంభించి మృతప్రాయమే అవుతుంది. భాష సామాజిక చైతన్యస్ఫూర్తిని కోల్పోతుంది. 12

ఈ కీలకాన్ని అర్థంచేసుకుంటే వ్యక్తి చైతన్యానికీ, సామాజిక చైతన్యానికీ గల సంబంధం అర్థమౌతుంది. వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంయొక్క అభివ్యక్తికీ. పరిణామానికీ రంగభూమి. తద్వారా వ్యక్తి జీవితసాఫల్యమూ అందులోనే యిమిడివుంటుంది. జీవభాషలో శబ్దానికి ఎటువంటి ప్రాధాన్యం వున్నదో, తాత్త్వికంగా సామాజిక చైతన్య పరివర్తనలో వ్యక్తి చైతన్యాని కటువంటి ప్రాధాన్యమే ఉన్నది. 13 వ్యక్తీ-సమాజమూ చైతన్యంయొక్క రెండు ముఖాలు. "సమాజం ఒక అమూర్త వస్తువుగా (as an abstraction) వ్యక్తి నెదుర్కొంటున్నట్లు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రతిపాదించడం మనం మానుకోవాలి. వ్యక్తి సామాజికుడు. అతని జీవితంయొక్క అభివ్యక్తి - సామాజికమైన అభివ్యక్తిగా, ఇతరులతోడి వ్యవహారంగా రూపొందకపోయినప్పటికీ తప్పకుండా అది సామాజిక జీవితం తాలూకు అభివ్యక్తే అవుతుంది. మనిషి విశిష్టత కలిగిన వ్యక్తి అయినప్పటికీ—అతనిలోని ప్రత్యేకతేగదా అతన్ని వ్యక్తిని చేస్తున్నదీ, వ్యక్తిగా విశిష్ట సామాజికుణ్ణి చేస్తున్నదీ—అతను సంపూర్ణుడే (శకలం కాదు). ఎందుకనగా సమాజం తాలూకు 'విషయి'గా దాని ఆలోచనకూ అనుభూతికీ నెలవుగా అతడు భావపూర్ణుడు ideal whole) అవుతున్నాడు." 14

మానవుడు సామాజికుడు (Social being) అనడంలో ప్రతివ్యక్తికీ సమాజంలో "విషయి"గా కేంద్రస్థానాన్ని, భావస్వాతంత్ర్యాన్ని ప్రతిపాదిస్తున్నది మార్క్సు దర్శనం. అందువల్లనే మార్క్సిజం గొప్ప మానవతా దర్శనం అవుతున్నది. ఈ నిర్వచనానికి మార్క్సిస్ట్ రాజకీయవాదులూ, వారి పరివారమైన రచయితలూ వక్రభాష్యం చేస్తూనే ఉన్నారు. మానవుడు సమాజం అనే అమూర్త వస్తువుతో లీనం కావలసినవాడుగానూ, మందిలో ఒక శాల్తీగానూ, వ్యక్తిని మార్చి, హతమార్చి వ్యవహరిస్తూవచ్చారు. "సామాజికుడు" అంటే కొన్ని నిశ్చిత ప్రమాణాలనూ, భావాలనూ, (రాజకీయవాది ఏర్పరచినవి) సామాజిక చైతన్య వ్యవస్థగా తీసుకుని ఆ పరిధిలో వ్యక్తిత్వాన్ని యిముడ్చుకునేవాడు (collective being) అని భాష్యం చేశారు.

వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యం తాలూకు విషయిగావడం వల్ల ఒక విశిష్టవ్యక్తి (రచయిత) యొక్క సృజనాత్మక కృషి సామాజిక చైతన్యం తాలూకు సృజనాభివ్యక్తే అవుతున్నది. (భాషా, సామాజిక చైతన్యమూ ఒక్కటే అయినందువల్ల భాష లేకుండా భావాలు లేవు;

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తి అంతరంగంలోని తలంపులుకూడా సామాజిక చైతన్యంలోని భాగమే). అయితే 'సృజన' ఏమిటి? కొత్తభావాలు ఎలా వస్తున్నవి? వ్యక్తికీ వ్యక్తికీ మధ్య భిన్నాభిప్రాయాలూ, అభిరుచుల వైవిధ్యం వీటి తత్త్వం ఏమిటి? సామాజిక చైతన్యం తాలూకు "విషయి"గా వ్యక్తి స్థితినిబట్టి దృశ్యం భిన్నస్వరూపాలలో, పరిణామాలలో కన్పించడంవల్ల భిన్నభావాలూ, సామాజిక చైతన్య పరిణామంవల్ల కొత్తభావాలూ ఉదయిస్తున్నవని సమాధానం. అన్నికొత్త భావాలకూ విప్లవ గతిలో సార్థక్యం ఉంటుందా? అంటే వుండదు; కాని ఆ విషయం సమాజమే, సామాజిక చైతన్య పరిణామమే, నిర్ణయించి తేల్చివేస్తుంది. చరిత్ర గతిలో రాజకీయవాదికి ప్రత్యేకమైన అధికారంలేదు యీ విషయంలో.

మార్క్స్ గొప్ప మానవతావాది. విప్లవకారుడుగా, కమ్యూనిస్టు ఉద్యమ విజయంకోసం సాహిత్యాన్ని సాధనంగా నిర్దేశించినప్పటికీ, కాలాతీతమూ నిత్యనూతనమూ విశ్వజనీనమూ అయిన సృజనాత్మక సాహిత్యానికి ఆయన ప్రత్యేకస్థానం యిచ్చారు. హోమర్, షేక్స్పియర్, డాంటే, గధే ఆయనకు అభిమాన రచయితలు. వారి కావ్యాలలోని మాటలూ, నుడులూ మార్క్స్ వ్యాసంగంలో సర్వత్రా దర్శనమిస్తాయి. "సామాజిక స్పృహ" కలిగిన సాహిత్యంగా డికెన్స్, థాకరే, బాల్జాక్ వంటి రచయితల నవలల్ని మెచ్చుకున్నాడు మార్క్స్. వాటిలో చారిత్రక సామాజిక సన్నివేశాన్ని బహుముఖాల అవగాహన చేసుకొనే అవకాశాన్ని దర్శించాడు. ఆరచయితలు సోషలిస్టు రచయితలు కాకపోయినా సరే ఉత్తమ సాహితీ స్రష్టలుగానే పరిగణింపబడ్డారు ఆయన దృష్టిలో. విప్లవభావాలను వెదజల్లే రచనలూ, సృజనాత్మకం కాకపోయినా, ప్రచార సాహిత్యంగా వాటి విలువను గుర్తించాడు మార్క్స్. పై మూడురకాల సాహిత్యాన్నీ విస్పష్టంగా వేరు వేరుగా దర్శించాడు మార్క్స్. మార్క్సిస్టులు యీ మూడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రకాల సాహిత్యాన్నీ ఒకే ప్రమాణంతో తమ రాజకీయాలకు పనికి వస్తుందా ? రాదా ? అన్నదృష్టితో చూచి మార్క్సు మానవతా వాదానికి అపచారం చేశారు.

కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో యిలా ఉన్నది. “మానవుని భావాలూ, అభిప్రాయాలూ, ఊహలూ - అంటే మానవ చైతన్యం అనేది భౌతిక పరిస్థితులతోబాటు, మానవ సామాజిక సంబంధాల మార్పుతోబాటు మారుతూ ఉంటుందనే అవగాహనకు లోతైన గ్రహణశక్తి ఏమీ అవసరం లేదు. భావాలు మారుతూ వచ్చిన చరిత్రగతి చూస్తే భౌతికమైన ఉత్పాదనతో సరితూగుతూ భౌతిక ఉత్పాదనల లక్షణం కూడా మారుతున్న వైనమే నిరూపణ అవుతున్నది. ఒక్కొక్క యుగంలో వైభవాన్నీ, ప్రాధాన్యాన్నీ గడించిన భావాలు ఆనాటి అధికార వర్గంయొక్క భావాలే గావడం ఎప్పుడూ ఉన్నవిషయమే.” 15 ఆ చివరి వాక్యం ఆధారంగానే రాజకీయవాది రచయితనూ సాహిత్యవేత్తనూ తనకు లొంగి ప్రవర్తించ మంటున్నాడు.

కాని కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో మార్క్సు ప్రధానంగా బూర్జువా రచయితల్ని గూర్చి ప్రస్తావిస్తున్నాడనటంలో సందేహం లేదు. “బూర్జువా వ్యవస్థ ప్రతి వృత్తినీ భ్రష్టంచేసి దాని సహజ మర్యాదనూ గౌరవాన్నీ మంటగలిపింది. వైద్యుణ్ణీ, న్యాయవాదినీ, మతాచార్యుణ్ణీ, కవినీ, శాస్త్రవేత్తనూ కూలివానిగా మార్చివేసింది... తత్ఫలితంగానే జర్మనీలో సోషలిస్టు కమ్యూనిస్ట్ పేరు పెట్టుకొన్న ప్రచురణలు, ఏవో కొన్ని తప్ప మిగిలినవన్నీ కుళ్ళిన నిర్జీవమైన సాహిత్యంక్రిందే వస్తాయి.” 16 ఇక్కడ ఒక రచన సోషలిస్ట్ కమ్యూనిస్ట్ భావాలతో నిండిఉన్నదా, లేదా అని చూడటంలేదు మార్క్సు. అది బూర్జువా ‘ఉత్పత్తి’ క్రింద వస్తుందా, రాదా, అని చూస్తున్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక రచన బూర్జువా "ఉత్పత్తి" క్రింద ఎలా పరిగణింపబడుతుంది? దాన్ని మార్క్స్ యిలా వివరిస్తాడు: "ఒక రచనే 'ఉత్పత్తి' గానూ, తద్భిన్నంగానూ కూడా ఉండవచ్చు. మిల్టన్ 'పారడైజ్‌లాస్ట్' అయిదు పౌన్లకి వ్రాయడం అది ఆయన్ని 'ఉత్పత్తి' శ్రామికుణ్ణి చేయదు. పుస్తక విక్రేతకోసం కూలివాడుగా వ్రాసే రచయితే ఉత్పత్తి శ్రామికుడు. మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' వ్రాశాడంటే అది పట్టుపురుగు పట్టును ఉత్పత్తి చెయ్యడం వంటిది. అది అతని సహజధర్మం. ఫలితాన్ని అయిదు పౌన్లకి అమ్మితే అమ్మివుండవచ్చు.... .... తన పాటని తనుగా అమ్ముకునే గాయని చేస్తున్నదీ ఉత్పత్తి శ్రామికత్వంగాదు. ఒక వ్యాపారి ఆమెని నియమించి ఆమె పాటద్వారా డబ్బు సంపాదించడం ప్రారంభించగానే ఆమె ఉత్పత్తి శ్రామికుల్లో చేరుతుంది. అప్పుడామె పెట్టుబడిని ఉత్పత్తి చేస్తున్నది." 17 మార్క్స్ మానవతా దృక్పథాన్ని సరిగా అవగాహన చేసుకోవలసిన సందర్భం యిది. దీన్ని అవగాహన చేసుకోని రాజకీయవాది తను కమ్యూనిస్టునని చెప్పుకుంటూనే, రచయితని ఉత్పత్తి శ్రామికుసిగా దిగజారుస్తూ అతని శక్తిని రాజకీయాలకు పెట్టుబడిగా మార్చే ప్రయత్నం చేస్తున్నాడన్నమాట.

కాల ప్రభావానికి లొంగని విశ్వజనీన సాహిత్యాన్ని గూర్చి, కళలను గూర్చి, మార్క్స్ యిలా చర్చించాడు: "కళల విషయం చూస్తే కొన్ని యుగాల్లో అవి పొందిన వికాసం, మానవ సమాజం యొక్క ఆనాటి అభివృద్ధిస్థాయి దృష్ట్యా చాల విపరీతంగానూ, అసంబద్ధంగానూ కనిపిస్తుంది. అంటే సమాజంయొక్క భౌతిక ప్రాతిపదికలో, ఆనాటి సామాజిక సంవిధానం అనే అస్థిపంజరంలో పొసగని పరిమాణంతో ఆ కళల ఔన్నత్యం ఉంటున్నది. ఉదాహరణకు ఆధునిక రచయితలతో గ్రీకుల్నీ, షేక్స్పియర్నీ పోల్చండి. అంతే కాదు, కొన్ని ప్రక్రియలు "ఇతిహాసం"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(ఎపిక్) వంటివి ఆ స్థాయిలో, ప్రపంచ చరిత్రలో గణనీయమైన స్థాయిలో, స్పృహణీయమైన ఆ స్వరూపంలో మళ్ళీ ఉత్పత్తి చెయ్యడం అసాధ్యం అని కూడా గుర్తించక తప్పదు. అందువల్ల కళారంగంలో కొన్ని విశిష్ట రచనలు బహుశా సమాజ పరిణామంయొక్క తొలిపరిస్థితులలోనే సాధ్యమేమో అనిపిస్తుంది. కళారంగంలోనే యిలాంటి వైవిధ్యాలూ వాటి అంతర సంబంధాలూ నిర్ణయించడం కష్టమైతే, కళారంగం మొత్తాన్నీ తీసుకొని దానికీ సమాజ పురోగతికీ గల సంబంధాన్ని నిర్ణయించడం అసాధ్యం కావడంలో ఆశ్చర్యంలేదు. ఈ వైరుధ్యాలను సూత్రీకరించడమే కష్టం. వాటిని గుర్తిస్తే మనకు వివరణ లభించినట్లే." 18

తన దర్శన సిద్ధాంతం ప్రకారం విశ్వజనీనమైన కళా సృష్టిని సూత్రీకరించడం కష్టమని అంగీకరించినా, మార్క్స్ బూర్జువా వ్యవస్థ దృష్ట్యా మానవుని సృజనశక్తిని గూర్చి ఆలోచించినప్పుడు మరొక వివరణను అందించాడు: "తొలియుగాల్లో మానవత్వం, జాతి, మత, రాజకీయ సంకుచిత పరిధుల్లో బందీయై ఉపలక్షింపబడినప్పటికీ, ఆనాటి 'ఉత్పత్తి'కి ధ్యేయం మానవుడే అయినట్లు కనిపిస్తుంది. ఆ స్థితి ఆధునిక ప్రపంచంతో పోలిస్తే ఉన్నతంగానే తోస్తుంది. ఇక్కడ మనిషి ధ్యేయం ఎంతసేపూ ఉత్పత్తి; ఉత్పత్తిధ్యేయం సంపద (వెల్త్). బూర్జువా ముసుగు తొలగిస్తే "సంపద" అంటే ఏమిటి? వ్యక్తుల తాలూకు అవసరాలూ, సామర్ధ్యాలూ, విలాసాలూ, ఉత్పత్తి శక్తులూ వగైరా. ప్రకృతి వనరులమీద, మనుష్య ప్రకృతిమీద పెత్తనం సాగించడంలో అభివృద్ధి సాధించడమేనా దీని అర్థం? మానవ సృజన శక్తుల్ని ఎటువంటి ముందుచూపూ, ఆలోచనా లేకుండా (గత చరిత్ర స్ఫురణ తప్ప) సాగదీసుకుంటూ పోవడమే. ఎటువంటి ప్రమాణం లేకుండా, దానికదే లక్ష్యం అనే ధోర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ణిలో తప్పు మరేమున్నది? ఒక నిర్దిష్ట స్వరూపం ధ్యేయంగా పెట్టుకొని మానవుడు పునఃసృష్టి కావడం బదులు, తన సర్వస్వాన్నీ ఉత్పత్తిగా మార్చడమే జరుగుతున్నది. ఈ బూర్జువా ఆర్థిక వ్యవస్థలో, దీని తాలూకు ఉత్పత్తియుగంలో, మానవ ఆంతరిక శక్తియుక్తుల పూర్ణ విజృంభణ ఫలితం పూర్తిగా పట్టిపోవడమూ, ఖాళీఅయిపోవడమూ, మనిషి తాను వస్తువుగామారి ఆత్మప్రత్యాఖ్యానం పొందటమూ, లక్ష్యశుద్ధి కోల్పోయి తన స్వాతంత్ర్యాన్ని తనకుగాని లక్ష్యానికి బలిపెట్టడమూ, అందుచేత పాత ప్రపంచపు పసితనమే మనకంటే ఉన్నతంగా భావిస్తోంది. మరోవిధంగా చూస్తే ఆనాటి సృజన ఒక నిర్ణీత పరిధిలో, పరిణతి పొందిన ఆకృతిగా, స్వరూపంగా అన్నింటిలోనూ వ్యక్తం అవుతూ ఉండ డంవల్ల, అది నిజంగానే మనకంటే ఉన్నతస్థితి అవుతున్నది. ఆ పాత్ర లోకం ఒక సంకుచిత దృక్పథంనుంచీ మనిషికి పరితృప్తినిస్తుంది. ఈ ఆధునిక లోకం అటువంటిదేమీ యివ్వలేదు; ఎక్కడైనా తనలో తను తృప్తి పడినా ఆ అనుభవం అల్పమైనదిగానూ, అతి సాధారణమైనది గానూ ఉంటున్నది." 19

మానవుని పరిశ్రమ, సృజన, అతనికి తృప్తినీ ఆనందాన్నీ యివ్వాలి. అది లోపించడమే బూర్జువా వ్యవస్థలో 'ఉత్పత్తి' లక్షణం అయి మానవుడు తన శ్రమ తాలూకు ఫలితంనుంచీ అన్ని విధాల వంచితు డౌతున్నాడు? మార్క్స్ ఏ వ్యవస్థలోకానీ 'సృజన'ను 'ఉత్పత్తి'గా పరిగణించడు. దాన్ని మానవ సహజ ధర్మంగానూ, స్వేచ్ఛకు లక్షణంగానూ వర్ణిస్తాడు. ఆయన ఊహలో, కమ్యూనిస్టు వ్యవస్థలో 'స్వేచ్ఛ' దాని ఫలితమైన 'సృజన' పరాకాష్ఠ పొందుతవి, భౌతిక 'ఆవశ్యకతను' అధిగ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మించే మానవ స్వేచ్ఛ ప్రతియుగంలోనూ ఎంతో కొంత సాధ్యమే అయినా బూర్జువా వ్యవస్థలో దానికి అవకాశం అతిస్వల్పమనీ, కమ్యూనిస్టు వ్యవస్థలో అత్యధికమనీ మార్క్స్ భావనగా తోస్తుంది. 'కాపిటల్ - 3 భాగం' లో మార్క్స్ యిలా వ్రాశాడు :

"ఆవశ్యకత (నెసెసిటీ) నిర్దేశించే పరిశ్రమా, యితర ప్రాపంచిక నిర్బంధాలూ ముగిశాకే స్వేచ్ఛాలోకం ప్రారంభమౌతుంది. అందువల్ల సహజంగానే అది భౌతికమైన ఉత్పత్తి పరిధికి చెందదు. అనాగరక మానవుడు నైమిత్తికాల కోసం ప్రకృతితో పెనుగులాడిన రీతిగానే, ఆధునిక మానవుడు సామాజిక వ్యూహంలో అన్నిరకాల ఉత్పత్తి విధానాల మధ్యన పెనుగులాడక తప్పదు. నాగరికతతోబాటు వాంఛలూ, వాటితో భౌతిక ఆవశ్యకతా ఇతోధికంగా పెరుగుతూ ఉంటాయి. వాంఛల్ని తీర్చేందుకు ఉత్పత్తి శక్తులూ పెరుగుతవి. అటువంటి పరిస్థితుల్లో స్వేచ్ఛా స్వరూపం ఏమిటి? సామాజికులైన మానవులు ఒకరిమీద ఒకరు ఆధారపడిన ఉత్పత్తిదారులుగా ఉంటూ ప్రకృతితో తమ లావాదేవీలను హేతుబద్ధంగా నియమించుకొని, ప్రకృతి శక్తులకు గుడ్డిగా లోబడిపోకుండా, ప్రకృతిని ఉమ్మడిగా అదుపులోనికి తెచ్చుకొని మానవశక్తి వ్యయం చాల తక్కువగా ఉండేలా చూస్తూ, మానవ ధర్మానికి అనుగుణమైన పరిస్థితుల్ని సృష్టించుకోవడం. అయినప్పటికీ ఆవశ్యకతా బంధం ఆధారంగానే ఆ స్వేచ్ఛాలోకం రేకు విప్పగలదు. రోజులో పనిచెయ్యవలసిన కాలం తగ్గడం దానికి మొదటి మెట్టు...." [20]

ఆవశ్యకతను దాటి వికసించే మానవ శక్తియుక్తుల సృజనాత్మకత ప్రతి యుగంలోనూ, సైన్సులో, కళల్లో, సాహిత్యంలో వైవిధ్యంతో సంస్కృతి పరంగా అభివృద్ధి పొందుతుందనే మార్క్స్ అవగాహన. భౌతిక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆవశ్యకత నుంచీ 'సృజన'ను సూత్రీకరించడం, నియమించడం సాధ్యం కాదనే ఆయన భావం.

బూర్జువా వ్యవస్థలో మార్కెట్, పెట్టుబడి, లాభం ప్రాముఖ్యం వహించడంవల్ల కళాకారునికీ, రచయితకూ న్యాయం జరుగదు. "పెట్టుబడిదారీ ఉత్పత్తి కొన్ని రకాల మేధాగతమైన ఉత్పత్తికి విరోధి - ఉదా : కళలకూ, కవిత్వానికి" అన్నాడు మార్క్స్. 21 జరుగుతున్న విడ్డూరం ఏమిటంటే ఈ బూర్జువా వ్యవస్థలో మార్క్సిస్టు ముసుగువేసుకున్న వాళ్లు ఒక రకం సాహిత్యాన్ని పెట్టుబడి చేసుకొని రాజకీయంగా లేక ధన రూపేణా లాభం పొందాలని ఆశిస్తూఉండటం. తెలుగుదేశంలో నేటి సాహిత్యం అటు పుస్తక విక్రేతల చేతుల్లోనూ ఇటు మార్క్సిజం విక్రేతల చేతుల్లోనూ పెట్టుబడిదారీ 'ఉత్పత్తి'గా మారడం వల్ల సాతహ్యంలో సృజన క్షీణించి 'సామాజిక స్పృహ' నేతిబీరకాయలో నేయిగానే మిగిలిపోతున్నది. ఆశ్చర్యమేమీలేదు. ఇది మార్క్స్ ప్రవచనమే. మనం బూర్జువా వ్యవస్థ సరిహద్దు ల్లోపలే ఉన్నామింకా ॥

జ్ఞాపికలు

1. "In the social production in which men engage, they enter into definite relations...... These relations of production correspond to a definite state of development of their material powers of production. The totality of these relations of production constitutes the economic structure of society – real basis, on which legal and political superstruc-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

tures arise and to which definite forms of social consciousness correspond. The mode of production of material life conditions the social, political, and intellectual process of life as a whole. It is not the consciousness of men which determines their being, but, on the contrary, their social being which determines their consciousness. At a certain stage of their development, the material forces of production in society come in conflict with the existing relations of production, or with the property relations within which they had been at work before. From forms of development of the forces of prodnction these relations turn into their fetters. Then occurs a period of social revolution. With the change of the economic foundation the entire superstructure is more or less rapidly transformed. In considering such transformations, a distinction should always be made between the material transformation of the economic conditions of production which can be determined with the precision of natural science, and the legal, political, religious, artistic or philosophical – in short, ideological forms in which men become conscious of this conflict and fight it out." (Works, Marx and Engels; from *Karl Marx and World Literature*, by S. S. Prawer, O. U. P., 1976, page 294)

2. "According to the materialist conception of history, the *ultimately* determing element in history is the production and reproduction of real life. More than this neither Marx nor I have ever asserted. Hence if somebody twists this into saying that the economic element is the *only* determin-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ing one, he transforms that proposition into a meaningless, abstract, senseless phrase. The economic situation is the basis, but the various elements of the superstructure - political forms of the class struggle and its results, to wit : constitutions established by the victorious class after a successful battle, etc., juridical forms, and even the reflexes of all these actual struggles in the brains of the participants, political, juristic, philosophical theories, religious views, and their further development into systems of dogma – also exercise their influence upon the course of the historical struggles and in many cases preponderate in determining their form. There is an interaction of all these elements in which, amid all the endless host of accidents (that is of things and events whose inner interconnection is so remote or so imposible of proof that we can regard it as non-existent, as negligible), the economic movement finally asserts itself as necessary. Otherwise the application of the theory to any period of history would be easier than the solution of a simple equation of the first degree." (Engel's Letter to Bloch in September, 1890, quoted in *Marxism and Literature*, Raymond Williams, O. U. P., 1977, pages 79–80)

3. "It became more and more the habit. particularly of the inferior sorts of *literati*, to make up for the want of cleverness in their productions by political allusions which were sure to attract attention. Poetry, novels, reviews the drama, every literary production teemed with what was called 'tendency'." (Engels, October, 1851, quoted in *Marxism and Literature*, page 200)

"......a worthless fellow who, due to lack of talent. has gone to extremes with tendentious junk to show his convictions, but it is really in order to gain an audience."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(Engels, August, 1881, quoted in *Marxism and Literature*, page 200)

4. "He instanced Drckens and Thackeray, Miss Bronte and Mrs. Gaskell, 'whose graphic and eloquent pages have issued to the world more political and social truths than have been uttered by all the professional politicians, publicists and moralists put together." (*Marxism and Literature* page 201)

5 & 6. "If literature is not everything, it is worth nothing. This is what I mean by 'commitment'. It wilts if it is reduced to innocence or songs. If a written sentence does not reverberate at every level of man and society, then it makes no sense. What is the literature of an epoch but the epoch appropriated by its literature ?" (The Purposes of Writing, 1960, Sartre, quoted in *Marxism and Literature*, page 201)

7. "Both Lenin and Trotsky saw writers, with other artists, as necessarily free to work in their own ways : 'to create freely according to his ideals, independent of anything' (Lenin, Collected Works, 1960)...... But each made reservations; Lenin on the cultural policy of the Revolution' which could not 'Let chaos develop in any direction it may......' (*Marxism and Literature*, Page 202)

8. "One of the negative effects of the personality cult was the mechanical identification of individual and social aesthetic standards. The reasoning behind this went something like this; because of our ideological and political unity and common world-outlook, we have a single system of aesthetic standards, and there must be a single genera

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

taste to correspond to it. Of course, aesthetic tastes are an expression of society's aesthetic ideas and are based on the latter, but the fact is that individual tastes cannot be entirely reduced to social aesthetic ideas, because one system of aesthetic views can and does produce a diversity of taste. This diversity is due to national, psychological, age and other individual distinctions which lay their imprint on the specific aesthetic tastes of each...... That is why we reject the dogmatic view that aesthetic tastes and emotions must conform to a single standard." (*Man and Society*, pages 161–162)

9. "Marxist-Leninist aesthetics, while recognizing the individual element in taste, do not reduce it to the purely subjective factor but emphasize that in a society diversity of taste develops on the basis of a definite aesthetic system and ideology and represents the common element in them. Diverse, but not any kind of, taste may be said to correspond to a definite world outlook." (*Man and Society*, page 163)

10. "The chief defect of all materialism up to now is, that the object, reality, what we apprehend through our senses, is understood only in the form of the *Object of contemplation*; but not as *sensuous human activity*, *practice*; not subjectively. Hence in opposition to materialism the *active* side was developed abstractly by idealism – which of course does not know real sensuous activity as such." (Marx and Engels : German Ideology, quoted in *Marxism and Literature*, page 30)

11. "Language is as old as consciousness, language is practical consciousness, as it exists for other men, and

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

for that reason is really beginning to exist for me personally as well; for language, like consciousness, only arises from the need, the necessity, of intercourse with other men." (Marx and Engels; German Ideology, quoted in *Marxism and Literature*, page 29)

12. *Marxism and Philosophy of Language*, V. N. Volosinov, New York, 1973 (see *Marxism and Literature*, pages 35-42)

13. "......Following Volosinov, we can see that just as all social process is activity between real individuals, so individuality, by the fully social fact of language (whether as 'outer' or 'inner' speech), is that active constitution, within distinct physical beings, of the social capacity which is the means of realization of any individual life. Consciousness, in this precise sense, is social being." (*Marxism and Literature*, Pages 41-42)

14. "It is above all necessary toavoid postulating society once more as an abstraction confronting the individual. The individual is a *social being*. The manifestation of his life-even when it does not appear directly in the form of a social manifestation, accomplished in association with other men-is therefore a manifestation of *social life*...... Though man is a unique individual - and it is just his particularity which makes him an individual, a really *individual* social being-he is equally the *whole*, the ideal whole, the subjective existence of society as thought and experience." (Marx, Economic and Philosophical Manuscripts of 1844, quoted in *Marxism and Literature*, page 194)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

15. "Does it require deep intuition to comprehend that man's ideas, views, and conceptions, in one word, man's consciousness, changes with every change in the conditions of his material existence, in his social relations and in his social life? What elese does the history of ideas prove, than that intellectual production changes its character in proportion as material production is changed? The ruling ideas of each age have ever been the ideas of its ruling class. (The communist Manifesto, quoted in *Karl Marx and World Literature*, S. S. Prawer, O. U. P., 1976, page 143)

16. "The bourgeoisie has stripped of its halo every occupation hitherto honoured and looked up to with reverent awe. It has converted the physician, the lawyer, the priest, the *poet*, the man of science, into its paid wage labourers. (The Communist Manifesto, quote in *Karl Marx and world Literature*, page 142)

17. "The same sort of work can be 'productive' or 'unproductive'. Milton, for instance, 'who did the *Paradise Lost* for 5' pounds, was an 'unproductive' worker. The writer, however, who turns out factory hack-work for his book-seller, is a 'productive' worker. Milton produced *Paradise Lost* for the same reason as that which makes the silk-worm produce silk. It was an activity wholly natural to him. He later sold the product for 5 pounds... A singer who sells her singing on her own initiative, is an 'unproductive- worker. But if the same singer is engaged by an entrepre' neur who lets her sing to make money for him, then she is a 'productive' worker; for then she produces capital." (Works, Marx and Engels, quoted in *Karl Marx and World Literature*, page 310)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

18. "In the case of arts it is well-known that certain periods in which they flowered are out of all proportion to the general development of society, hence also to its material basis, the skeletal structure, as it were, of its organization. The Greeks, for instance, compared with the modern or also Shakespeare. It is even recognized that certain forms of art, the epic, for instance, cannot be produced in their world-epoch-making, classical form once the production of art as such begins; that therefore certain significant formations within the domain of art itself are possible only at a low stage of development. If this is true of the relation of different kinds of art within the domain of art itself, it is already less surprising that the same should be true of the relation in which the whole do main of art stands to the general development of society. The difficulty lies only in the general formulation of these contradictions. As soon as they have been specified they are already explained." (Marx, Foundations of Political Economy, quoted in *Carl Marx and World Literature*, Pages 278-279)

19. "The ancient conception, in which man, though in various narrow national, religious, and political determinations, always appears as the aim of production, seems to be very superior to the modern world in which production appears as the aim of man and wealth as the aim of produc-tion. In fact, however, when the narrow bourgeois form is cast aside, what is wealth but the universality of the needs, capacities, enjoyments, productive forces etc. of individuals ? The complete development of human domination of natural forces, those of so-called 'nature' as well as those of the individual's own nature ? What is it but the absolute working-out of his own creative dispositions, with-

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

out any preconception except that of previous historical development, which makes the totality of this development -i. e. the development of all human powers as such, not measured by any yardstick that is already given - an end in itself? What is this but a situation in which man does not reproduce himself in some pre-determined form, but one in which he produces his totality? In bourgeois economics, and the epoch of production that corresponds to it, this complete elaboration of man's inner potential appears as complete depletion, this universal objectification as complete estrangement, and the demolition of all determined, one-sided aims as the sacrifice of autonomy to a wholly external aim. Thus on the one hand the childish ancient world *appears* to be the higher. On the other hand it is the higher world in every thing that demands a finished shape, form, given limitation. The ancient world satisfied from a narrow point, while the modern world affords no satisfaction - or, where it does appear satisfied with itself, it is common and mean." (Marx, Foundations of Political Economy, quoted in *Karl Marx and World Literature*, pages 287-288)

20. The realm of freedom truly begins only where labour determined by necessity and mundane considerations ceases; in the very nature of things, therefore, it lies beyond the sphere of actual material production Just as the savage must wrestle with nature to satisfy his wants, to maintain and reproduce life, so must civilized man, and he must do so in all social formations and under all possible modes of production. With development this realm of physical necessity expands as a result of his wants; but, at the same time, the forces of production which satisfy these wants also increases. Freedom in this domain can only mean that

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

socialized men, the associated producers, regulate their inter change with nature rationally, bringing it under their common control, instead of being ruled by it as by the blind forces of nature; and achieving this with least expenditure of human energy and under conditions most favourable to, and most worthy of, their human nature. Nonetheless this still remains a realm of necessity. Beyond it begins that development of human power which is its own end, the true realm of freedom, which, however, can blossom forth only with this realm of necessity as its basis. The shortening of the working-day is its fundamental premiss." (Marx, Capital, Part III, quoted in *Karl Marx and World Literature*, pages 312–313)

21. "Capitalist production is inimical to certain kinds of intellectual production - to art and poetry for instance." (Marx; Theories of Surplus Value, quoted in *Karl Marx and World Literature*, page 311)

BIBLIOGRAPHY

1) *Man and Society*, by a Group of Authors, Progress Publishers, Moscow, 1966.

2) *Marxism and Literature*, by Raymond Williams, O. U. P., London, 1976.

3) *Karl Marx and World Literature*, by S. S. Prawer, O. U. P. London, 1976.

4) *What is Literature*? by Jean Paul Sartre, Methuen & Co. Ltd., London, 1950 and 1967.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విప్లవము : సాహిత్యము

తిరుగుబాటుకీ విప్లవానికీ తేడా ఉన్నది. తిరుగుబాటు పరిమితమైనది. పరిస్థితులు దుర్భరమై విషమించటంవల్ల ఆ పరిస్థితుల్నీ అందుకు కారణ భూతమైన వ్యవస్థనీ ఏదో విధంగా వెంటనే అంతమొందించే ప్రవృత్తి తిరుగుబాటులో కనిపిస్తుంది. విప్లవం అలాకాదు. అది నిర్దిష్టమైన కొత్త విలువల్నీ నూతన వ్యవస్థనీ అన్వేషించి స్థాపించే ప్రయత్నం చేస్తుంది. పాత విలువల్ని త్రోసి రాజనే 'తిరుగుబాటు' కొత్త విలువల్ని రూపొందించుకొనే విస్తృత ప్రయత్నంచేసి, కొత్త వ్యవస్థని సాధించినప్పుడే 'విప్లవం' అవుతుంది. నక్సల్‌బరీ, శ్రీకాకుళంలలో కొంత కాలం క్రితం జరిగినవి తిరుగుబాట్లు, దేశంలోని కర్షక, శ్రామిక వర్గాల వంటి పీడిత ప్రజానీకం మార్క్సిస్టు దర్శనం మూలాధారంగా కొత్త సామాజిక వ్యవస్థని రూపొంపించదానికి చేస్తున్న ప్రయత్నం నేటి విప్లవం. విప్లవ శక్తులు నేటి రాజకీయ రంగంలో ఏకముఖంగా లేవు. సంస్కృతి పరంగా చూస్తే, నేటి సమాజంలో ఆచార వ్యవహారాల్లో, మనుష్యుల సంబంధాల్లో, జీవిత వైఖరివంటి విషయాల్లో ఎన్నో విభేదాలు ఉన్నాయి. వర్గ విభేదాలు లేని ఆర్థిక వ్యవస్థని సాధించడంతో పై విభేదాలు నశించి క్రమబద్ధం అవుతాయనీ, నశింపని వాటిని ప్రయత్న పూర్వకంగా నిర్మూలించడం లేక సమాజ వ్యవస్థకు అవి భంగకరం కాకుండా జాగ్రత్త తీసుకోవడం కర్తవ్యమనీ మార్క్సిస్ట్ విప్లవంలో నమ్మకమున్న వాళ్ళందరి అంచనా. కాని ప్రజాస్వామ్య పద్ధతులద్వారా విప్లవాన్ని బహుముఖంగా సాధించడంలో, వర్గరహితమైన ఆర్థిక వ్యవస్థా సాంస్కృతికమైన భావ విప్లవమూ, క్రమపరిణామంలో, కొంత ఆలస్యమైనా రెండూ ఇంచుమించు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒకే సారి సిద్ధిస్తాయని ఒక పక్షం విశ్వసిస్తున్నది. ఇందులో జాప్యమే కాదు, విప్లవానికి మొదటికే మోసంవచ్చే భ్రమఉన్నది. కాబట్టి, వీలైనన్ని చోట్ల తిరుగుబాట్లు లేవదీసి, ప్రజాస్వామ్యాన్ని కూలద్రోయడం ద్వారానే కర్షక శ్రామికవర్గ నియంతృత్వ స్థాపనమూ, రాజకీయ ఆర్థిక వ్యవస్థలని చేజిక్కించుకోవడమూ ప్రథమ కర్తవ్యమనీ తర్వాత సంస్కృతిపరంగా వచ్చే విప్లవం సులువుగా ప్రవేశ పెట్టవచ్చుననీ కొన్ని పక్షాల విశ్వాసం. వీరిలో తీవ్రవాదులు రాజకీయ పక్షాలుగా వ్యవహరించడం మాని ఎక్కడి కక్కడ విప్లవయోధులుగా (గెరిల్లాలు) వ్యక్తిగత సాహసంతో వ్యవస్థని నాశనం చెయ్య బూనుకొని, ప్రజల్లో చైతన్యాన్ని శీఘ్రగతిని రేకెత్తించ డానికి అది ఒక్కటే మార్గమని విశ్వసిస్తున్నారు. ఇది స్థూలంగా దేశంలో నెలకొనివున్న సామాజిక విప్లవ వాతావరణం.

మానవుని మనుగడలో, ప్రపంచ చరిత్రలో, తిరుగుబాట్లూ, విప్లవాలూ కొత్తగా నేడు వచ్చినవి కావు. 'విప్లవం' లేకపోతే చరిత్రే లేదు. విప్లవము మానవత్వం యొక్క చైతన్య దీప్తికి పతాక. ఒక గుంపు మరియొక గుంపుమీదా (ఆర్యులు—ద్రావిడులు). ఒక మతం మరియొక మతంమీదా (ఇస్లాం-హైందవం). ఒకజాతి మరొక జాతిమీదా (ఆంగ్లేయులు-భారతీయులు) చేసిన ఆక్రమణలూ, తత్ఫలితంగా ఏర్పడిన రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరిణామాలూ తప్పకుండా విప్లవం కోవకు చెందినవే. కాని వీటికి ప్రాదేశికమైన పరిమితి ఉన్నది. ఒకే జాతిలో ఒక మతం మరొక మతంమీద (కాథలిక్కులు - ప్రొటెస్టెంటులు - ప్యూరిటన్లు) లేక ఆస్తికతమీద నాస్తికత లేవదీసిన మత విప్లవాలూ, వివిధ దేశాల్లో రాజుమీద ప్రజలు సాధించిన రాజకీయ విప్లవాలూ జాతీయమైనవి. స్థూలంగా చూస్తే నేటివరకూ ప్రపంచ పరివ్యాప్తంగా మానవ సమాజంలో జరిగిన విప్లవాలు రెండని చెప్పవచ్చు - ఒకటి మత విప్లవం, రెండు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాజకీయ విప్లవం. అటువంటి ప్రపంచ పరివ్యాప్తమైన మూడో విప్లవం. ఈ శతాబ్దిలో ఆర్థిక వ్యవస్థపరంగా జరుగుతున్నది. మార్క్సిస్ట్ దృక్పథం రీత్యా మొదటి రెండు ప్రపంచ విప్లవాల్ని కూడా ఆర్థిక వ్యవస్థపరంగానే వ్యాఖ్యానించవచ్చు. కాని ఆ విప్లవాలు సాధించిన నిర్దిష్ట ప్రయోజనాలు, మౌలిక సూత్రాలు సవ్యంగా అర్థం చేసుకున్నట్లయితే ఆ విప్లవాల స్వరూపం ఏమిటో బోధపడుతుంది. మతం సాధించిన విప్లవంలో ఆస్తికత లేక నాస్తికత మౌలికమైన విలువగా ఉంటూ, దాన్ని ఆధారం చేసుకున్న ధర్మసూత్రాలు సమాజంలో ఏలుబడి సాగించాయి. రాజకీయ విప్లవంలో వ్యక్తి స్వామ్యం మౌలికమైన విలువగా మెజారిటీ సూత్రం ప్రధాన ధర్మంగా ఏర్పడింది. నేటి మార్క్సిస్ట్ విప్లవంలో మనిషియొక్క శ్రామిక శక్తి మౌలికమైన విలువ. ప్రతి మనిషీ తన శ్రామిక శక్తిని సమిష్టి సంక్షేమానికి దత్తం చేయడం ప్రధాన ధర్మం. ఇక్కడ ఉదయించే ప్రశ్న: మార్క్సిస్ట్ విప్లవం, అంటే ఆర్థిక వ్యవస్థా విప్లవం, ప్రపంచ చరిత్రలో చివరి విప్లవమా? మార్క్సిస్టులు చివరి విప్లవమే అంటారు. ఉత్పత్తి సాధనాలు ఉమ్మడిసొత్తు కావడం ద్వారా ఆర్థికంగా వర్గరహిత సమాజం ఏర్పడితే, తర్వాత రాజ్య వ్యవస్థ (State) అదృశ్యమై మానవుడు స్వచ్ఛంద జీవిగా వసుధైక కుటుంబం ఏర్పడుతుందనే సిద్ధాంతాన్ని, చరిత్రాంతాన్ని మార్క్స్ చెప్పాడంటారు. కాని ఆ మధ్యకాలంలో అవసరమూ అనివార్యమూ అయ్యే సాంస్కృతిక విప్లవాల తీరుతెన్నులని మార్క్స్ సూచించినట్లు లేదు. అలా నిర్దిష్టంగా చూచించడం కూడా నిజంగా అసాధ్యమే. మార్క్స్ సూచించలేదు, కాబట్టి వర్గరహిత సమాజం వెంబడే అవ్యవహితంగా స్వచ్ఛంద సమాజమూ సిద్ధిస్తుందని భావించడం సమంజసం కాదు. అందువల్ల నేటి కమ్యూనిస్టు దేశాల్లో సాంస్కృతిక విప్లవాలు తప్పనిసరి అయ్యాయి. ఈ విప్లవాల విషయంలో మార్క్స్ దర్శ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నానికి సందర్భోచితంగా, అధికారంలో ఉన్నవారు వ్యాఖ్యానంచేసి వాటి
సాగిస్తున్నారు. ఇక్కడ మార్క్స్ దర్శనానికి ఉన్న పరిమితులేమిటో
మనం గ్రహించవచ్చు. మార్క్స్ మతస్థులుగాని మేధావులు మార్క్సిస్ట్
విప్లవం చరిత్రలో తుది విప్లవం అనే మాటని సులువుగా ఆమోదించలేరు.
ఇది వివాదాంశం.

ఒక విప్లవం సాధించే విలువలు, తద్వారా ఏర్పడే వ్యవస్థ, ఒక
నైతిక దృక్పథాన్ని సృష్టిస్తాయి. ఆ విలువలు తర్వాత వచ్చే విప్లవంలో
కొంతవరకు 'రియాక్షనరీ' పాత్ర వహించడం సహజమే. మత వ్యవస్థ
తాలూకు విలువలు రాజకీయ విప్లవ సమయంలో చాలవరకు 'రాజు' అధి
కారాన్ని సమర్థిస్తూ ప్రజల ఉద్యమానికి అవరోధం కలిగించాయి. ఆదర్శా
నికీ వ్యవస్థకూ గల తేడాను గమనించాలి. మతానికికూడా ఆదర్శం సర్వ
మానవ సౌభ్రాత్రమే. కాని మత వ్యవస్థ, మతాధికారులు. ఆచరణలో
భిన్నంగా ప్రవర్తించారు. ప్రజాస్వామ్య విప్లవం వచ్చినప్పుడు వాళ్ళు
రాజు అధికారాన్నే సమర్థించారు. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్ని
కలూ, మెజారిటీలూ, పెట్టుబడిదారులకూ, ఆస్తిపరులకూ ఉపయోగిస్తూ
విప్లవానికి అవరోధం కావడం చూస్తూనే ఉన్నాము. ఇది కారణంగానే
ప్రజాస్వామ్య పద్ధతులద్వారా శ్రామిక విప్లవం సాధ్యం కాదేమోననే
సందేహం కొన్ని పక్షాల్లో ఏర్పడింది. కాని సామాజిక చైతన్యం ఏ ధోర
ణిలో నడుస్తున్నదో, ఇటీవల వచ్చిన రాజకీయ పరిణామాలు ఎటువంటివో
గమనించినవారికి యీ సందేహం నిరాధారంగా తోస్తుంది. అలాగే భవి
ష్యత్తులో శ్రామిక విప్లవానంతర సమాజంలో, వ్యక్తి తన శ్రామిక శక్తిని
సమాజ సంక్షేమానికి దత్తం చెయ్యాలి' అనే మౌలిక సూత్రం ఏ విధంగా
తర్వాతి విప్లవానికి అవరోధం అవుతుందో లేక తోడ్పడుతుందో చెప్పడం
కష్టం. దీన్నిబట్టి చూస్తే ప్రపంచ చరిత్రలో మార్క్సిస్ట్ దర్శనం అభి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రంగా ఏర్పడుతున్న నేటి విప్లవం తొలి విప్లవమూ కాదు, తుది విప్లవమూ కాదు. అది అన్వేషించే విలువలూ, ప్రవచించే ధర్మసూత్రాలూ కాలాను గతమైనవి. కాలాంతాన్ని, చరిత్ర పరిసమాప్తిని సూచిస్తాయనుకోవడం భ్రమే అవుతుంది.

ప్రపంచ విప్లవాల తీరును, మానవుని వారసత్వాన్నీ పరిశీలించి చూస్తే మరొక విషయం కూడా బోధపడుతుంది. ఏ విప్లవమూ గతంలో మానవాళి సాధించిన విలువల్నీ ధర్మసూత్రాలనీ సమూలంగా తుడిచి పెట్ట లేదు. ఒకనాటి విలువలూ, ధర్మసూత్రాలూ యుగధర్మంగా ప్రాభవాన్ని కోల్పోయినా, వాటికి ఎన్నో మార్పులూ చేర్పులూ సంభవించినా, వ్యక్తుల్లో సమాజంలో అవి సజీవంగానే ఉన్నాయి. మరొక విషయం ఏమిటంటే ప్రతి విప్లవమూ మనిషియొక్క బాధ్యతని గురుతరం చేస్తూ రావడం, భగవంతుడు లేడు అనే విప్లవం ఏ సిద్ధాంతపరంగా వచ్చినా - బౌద్ధం రూపంలోనో, భౌతికవాదంగానో, హేతువాదంగానో - అది మనిషికి వ్యక్తి గతంగా ధార్మిక భారాన్ని ఎక్కువ చేసిందేతప్ప తక్కువ చేయలేదు. భగవంతుని స్థానాన్ని సంఘమో పదార్థశాస్త్రమో అంతరాత్మో ఏదో ఒకటి ఆక్రమించక తప్పదు! అలాగే ప్రజాస్వామ్యంలో రాజు అధికారాన్ని ప్రధానమంత్రి లేక ప్రెసిడెంటు వహిస్తాడు. ప్రతి విప్లవం తర్వాతా జనం మీద రాజ్యవర్గ అధికారం కూడా పెరుగుతూనే వస్తున్నది. శ్రామిక విప్లవా నంతరం పెట్టుబడిదారు లేకపోయినా ఫాక్టరీ మానేజరు ఉంటాడు. వర్గ రహిత సమాజంలో వ్యక్తిమీద రాజ్యవ్యవస్థ చేసే అజమాయిషి మరింత ఎక్కువే అవుతుందిగాని తగ్గదు. అయితే రాజ్యవ్యవస్థ అదృశ్యం కావడం ఎప్పుడు! మానవుడు స్వచ్ఛందజీవి అయేదెలాగ? ఎంత కాలంలో?

ఆ గమ్యం సాధించేందుకే మార్క్సిస్ట్ విప్లవ నాయకులు సాంస్కృ తిక విప్లవం అవసరమంటూ వ్యక్తుల్లో మిగిలిఉన్న పూర్వవాసనల్ని తుడిచి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెట్టేందుకు కమ్యూనిస్టు దేశాల్లో ప్రయత్నిస్తున్నారు. స్టాలినిస్టు రష్యాలో జరిగింది. మావో చైనాలో జరిగింది! శ్రామిక విప్లవానికి మౌలికమైన 'శ్రామికశక్తి - సమాజము' అనే విలువలతో సంబంధంలేని వ్యక్తిగతమైన విలువల్నీ వాసనల్నీ ప్రజల్లో అంతమొందించే ప్రయత్నం ఇది. రాజ్య వ్యవస్థ అధికార బలంతో, మనో వైజ్ఞానికశాస్త్ర సహాయంతో ప్రతి వ్యక్తి మనసునీ క్షాళనంచేసి దిద్దేందుకు ప్రయత్నిస్తుంది. ఈ క్షాళనక్రియ ఎప్పుడు పూర్తి అవుతుంది అంటే సమాధానం - ప్రపంచమంతటా శ్రామిక విప్లవం నెలకొని స్థిరం కావాలి. అప్పుడు పైన చెప్పిన సాంస్కృతిక క్షాళనం పూర్తి చెయ్యడం సాధ్యమౌతుంది. అటుపైన వ్యక్తి పూర్తిగా సామాజికుడు కావడంతో రాజ్యవ్యవస్థ అనవసరమై అదృశ్యమై పోతుంది.

మార్క్సిస్టుపార్టీలు యిచ్చే సమాధానాలకు వెనుక ఒక తాత్త్విక దృక్పథం ఉన్నది. ఈ దృకృథంతో అందరూ అంగీకరించక పోవచ్చు. ఈ తాత్త్విక దృక్పథం మనిషి నైజాన్ని గురించి ఒక సిద్ధాంతం చేస్తున్నది. మనిషి సామాజికుడు. మనిషిలో సామాజిక చైతన్యం తప్ప మరేమీ లేదు అని ఆ సిద్ధాంతం. అందువల్ల సమాజాన్ని శ్రామిక విప్లవం మార్చినప్పుడు ప్రతివ్యక్తినైజమూ ఆ విప్లవానికి మౌలికమైన విలువల్ని ఆధారం చేసుకొని రూపొందుతుంది. అలా రూపొందక తప్పదు. ఆ పరిణామం పూర్తయినప్పుడు చరిత్ర అంతమౌతుంది, భూతల స్వర్గం సిద్ధిస్తుంది. ఈ విషయంలో పాత విలువల వాసనలు, గతించిన సిద్ధాంతాలు, ఉన్నవాళ్ళ దృక్పథం భిన్నంగా - ఉంటుంది - ఒకటి, ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉన్నది లేదా ప్రతి వ్యక్తికీ ఏకాంతం ఉన్నది. అది పైజెప్పిన సామాజిక చైతన్యానికి భిన్నమైనది. రెండు, ప్రతి వ్యక్తీ విశిష్టుడు. అతనికి వ్యక్తిత్వం స్వయం ప్రతిభతో స్వేచ్ఛగా వికసింప జేసుకోవడానికి హక్కు ఉన్నది. ఆ విషయంలో అతను సమాజంమీద తిరుగుబాటు చేయగలడు. అతను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తిగా సమాజంలో చేరాడే తప్ప సమాజం అతణ్ణి సృష్టించలేదు. ఇటు వంటి తాత్త్విక దృక్పథాలు భావవాదం (idealism) నుంచీ లేదా మతం నుంచీ వచ్చాయి. మార్క్సిస్ట్ దృక్పథం శాస్త్రీయ భౌతికవాదంనుంచీ వచ్చింది. ఈ భౌతికవాదం ప్రకారం పదార్థం మనసుకి అతీతమై ఆధార భూతమైనట్టిది. పదార్థం వివృతి పొందుతూ మానవ సమాజం ఏర్పడి, ఉత్పత్తి సాధనాలు ఆధారంగా గతితార్కిక పద్ధతిని (dialectical) పరిణా మాలు చెందుతూ వచ్చింది. దాని పరిణతావస్థే వర్గరహిత సమతా విలసిత సమాజం. ఇక్కడ చరిత్రగతి అనివార్యం అని సిద్ధాంతం. పోనీ ఈ సిద్ధాంతం ప్రకారమే అయినా శ్రామిక విప్లవానంతరం సమాజంలో మాన వుడు గత చరిత్ర అంతటికీ వారసుడు కాడా? క్షాళనం ఎందుకు? అని ప్రశ్నిస్తే, వారసుడైనప్పుడు అతనితో పాతవాసనలు అతణ్ణి కొత్త సమా జానికి పనికిరాకుండా చేస్తాయి. కాబట్టి అంత మేర ఆ వాసనల్ని క్షాళనం చేసి తీరాలి అని మార్క్సిస్టుల పార్టీ సమాధానం.

అలా మనిషి మనస్సుని చాకలి బట్టలుతికి ఇస్త్రీ చేసినట్లుగా చెయ్య డంలో ఎంత బాధ, ఎంత కష్టం ఉన్నది! మరి భూతలస్వర్గం, తిరుగులేని వసుధైక సమాజం కావాలంటే ఊరికే వస్తుందా? ఇక్కడ మరొక ఆసక్తి కరమైన విషయాన్ని గుర్తించాలి. ఈ సిద్ధాంతం ప్రకారమే చరిత్ర తాలూకు స్మృతుల్ని అంటే ఇటీవల జరిగిన చరిత్ర స్వరూపాన్ని కూడా నేటి సమా జానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చుకుంటూ పోవాలి. మార్చుకోవ డమే కాదు, అలా మారిన చరిత్రను సామాజికుల మనస్సుల్లో అలాగే ముద్రిస్తూ పోవాలి. వాళ్లు తదనుగుణంగా భావించాలి, నడుచుకోవాలి. ఈ పద్ధతి ప్రకారమే స్టాలిన్ రష్యాలో జరిగిన కమ్యూనిస్టు విప్లవ చరి త్రను ట్రాట్స్కీ వగైరాల ఛాయలు లేకుండా సంస్కరించాడు. కృశ్చేవ్ స్టాలిన్ చేసిన తప్పుల్ని నిరసించి చరిత్రని తిరుగ వ్రాయించాడు. కృశ్చేవ్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తరువాత మళ్ళీ చరిత్ర నేటి పాలకుల అభిప్రాయానుసారంగా సంస్కరింప బడింది. ఇక్కడ చరిత్ర అనేది ఇంకా పూర్తి కాకపోవడంవల్ల సవరిస్తూ ఉండవలసిన విషయమనిన్నీ, దానికి ప్రకృతంలో స్వతహా ఆ స్తిత్వమూ, స్వరూపమూ లేదనీ, అటువంటి నిర్దిష్ట స్వరూపం చరిత్ర ముగిసినప్పుడే లభిస్తుందనీ, అంతటితో సవరింపులు కూడా ముగుస్తాయనీ వాళ్ళవాదం. అంతదాకా సమకాలీన సమాజానికి (అంటే అధికార వర్గానికి) అనుగుణంగా గడచిన చరిత్రను దిద్దుకుంటూ పోవలసిందే!

కమ్యూనిస్ట్ దేశాల్లో రాజ్య వ్యవస్థను నడుపుతున్న నియంతలు సమాజంలోని వ్యక్తులమీద నెరపుతున్న మానసిక నియంత్రణం ఎంత వరకు సమర్థనీయం అనే ప్రశ్న మనలాంటి వాళ్ళలో ఉద్భవిస్తుంది. ఏ విప్లవంకానీ మనిషికి న్యాయం జరగాలి అనే ధ్యేయంతోనే బయల్దేరు తుంది. కమ్యూనిస్టు దేశాల్లో నేడు యీ 'న్యాయం' జరుగుతోందా? ఇక్కడ న్యాయం' అనే భావాన్ని గూర్చి కొంత జిజ్ఞాస చెయ్యాలి. మతం స్థాపించిన విలువల దృష్ట్యా నిర్వచింపబడిన ఆదర్శ మానవత్వం సాధారణ వ్యక్తి అందుకోలేని అంతరిక్షాన ఉండటంవల్లే మానవుడికి న్యాయం జరగ లేదు. మనిషిని కొలిచే కొలబద్ద మారవలసి వచ్చింది. న్యాయం భగ వంతుని వల్ల, రాజువల్ల జరగనప్పుడు అది తోడి మానవునివలననే జరుగ వలెననే మానవతా దృక్పథం ఏర్పడింది. ప్రజాస్వామ్య విప్లవంలో మాన వునికి మానవుడే కొలబద్ద. కాని ఆర్థిక వ్యవస్థవల్ల జరుగుతున్న దుర న్యాయం మూలంగా ఆర్థిక సమానత్వాన్ని కూడా సాధించడానికి మార్క్సిస్టు విప్లవాన్ని ఆశ్రయించాడు మానవుడు. ఇంతదాకా ఆర్థిక వ్యవస్థా విప్లవం నడిచిన తీరుచూస్తే, మొదట అది రష్యా, చైనావంటి దేశాలలో రావడంద్వారా, మార్క్స్ పథకం ప్రకారం. ఊహించిన అంచనాల మేరకు జరగలేదు, పైగా అది అనతికాలంలోనే ప్రపంచ వ్యాప్తం కావ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డానికి ఫాసిజం, రెండవ ప్రపంచ యుద్ధం అడ్డువచ్చాయి. యుద్ధం కూడా విప్లవ వ్యాప్తికి ఒక సాధనమే అని భావిస్తే, ఆటంబాంబు మూలంగా యుద్ధ స్వరూపమే మారిపోయి అది నిషిద్ధం అయి కూర్చుంది. అందువల్ల యుద్ధంద్వారా ఇతర దేశాల్లో విప్లవం తెచ్చే ఆశ అడుగంటింది. మార్క్స అంచనాలకు భిన్నంగా అతి పారిశ్రామిక దేశాలైన అమెరికావంటి దేశాల్లో విప్లవం వచ్చే అవకాశాలు మరీ తక్కువై పోయాయి. ఇలా ప్రపంచ చరిత్రగతి గడచిన ముప్పైఏళ్ళలో సూటిగా ఉండకపోగా, పరిస్థితి మరింత క్లిష్టమై పోతూ వచ్చి, శ్రామిక విప్లవం ప్రపంచమంతటా ఎప్పుడు పూర్తి అవుతుందో ఇదమిత్థంగా చెప్పలేని స్థితి నేడు ఏర్పడిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా విప్లవం పూర్తి అయితేనేగాని రాజ్య వ్యవస్థయొక్క సర్వాధికారం సన్నగిల్లే అవకాశం ఏర్పడదు. ఇది యిలా ఉండగా, శ్రామిక విప్లవం సాధించి నియంతృత్వాన్ని ఏర్పరచిన పురోగామి దేశాలు రష్యా, చైనాలు చూస్తే పరస్పరం సహకరించేందుకు బదులు తీవ్రంగా విరోధించి ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితిలో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక విప్లవం పూర్తి కావడం ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగో ఒకలాగ తథ్యమేనని మనం అందరం విశ్వసించినా, దానికి ఒక కాల పరిమితి అంటూ కనిపించకపోతున్నది. అది పూర్తయ్యేదాకా మనిషి కమ్యూనిస్టు దేశాల్లో రాజ్యవ్యవస్థ 'నిఘా'లో ఉంటూ, అది ఆదేశించిన ప్రకారంగా తన వ్యక్తి చైతన్యాన్ని సామాజిక చైతన్యంగా ఎప్పటికప్పుడు రూపొందించుకుంటూ ఉండవలసిందే అని సిద్ధాంతీకరించి, అలా చేస్తూ ఉండడం కొత్తరకం బానిసత్వంకాక మనిషి అనుభవిస్తున్న స్వాతంత్ర్యమా? మనిషికి జరుగుతున్నది దురన్యాయంకాక న్యాయమా? సామాజిక చైతన్యమూ, సామాజిక నీతి అనేది నేటి కమ్యూనిస్టు దేశాల్లో క్షణం క్షణం మారుతూ అనిశ్చితంగా ఉండటంవల్ల అది ఎంత మొరకుగా, కరకుగా, ఇనుపచట్రంగా వ్యక్తుల్ని నలిపివేస్తున్నదో వాళ్ళ జీవితాల్ని నాశనం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేస్తున్నదో అక్కడి పరిస్థితుల్ని అవగాహన చేసుకునే శ్రమ తీసుకుంటే గాని మనకు బోధపడదు. గతంలో భగవంతుడు లేక రాజు కారణంగా కొన్ని ధర్మసూత్రాలూ, విశ్వాసాలూ కారణంగా మనిషి దురన్యాయానికి గురి అయితే, నేడు భగవంతుడు - రాజ్యవ్యవస్థ - ఆర్థిక వ్యవస్థ మూడూ ఏకమైన నిరంకుశాధికారం, చరిత్ర గమ్యం పేరిట మనిషిని వ్యక్తిగా రూపు మాపుతున్నది.

మానవుని మానవత్వానికి నిర్వచనం ఏమిటి ? ఆధ్యాత్మిక ఆదర్శాలూ విశ్వాసాలూ కానప్పుడు, రాజు చేసిన చట్టాలు కానప్పుడు, దాన్ని అన్వేషిస్తూ సమానత్వాన్ని ఆనందంగా బ్రతికే అవకాశాన్ని సాధించదలచుకొని మార్క్సు దర్శనంమీద విశ్వాసం పెట్టుకుని మనిషి చేస్తున్న ప్రయాణానికి పర్యవసానం ఏమిటి ? సమ సామాజిక వ్యవస్థ అనే గమ్యం ఇంకా చేరుకోలేదు. మనిషి వ్యక్తిగా తన జీవితకాలంలో దాన్ని చేరుకునే ఆశ కనిపించనప్పుడు తన భవిష్యత్తుకు బలి కావలసిందేనా ? లక్ష్యాన్ని విస్మరించకుండా, నేటి బ్రతుకుని బానిసత్వానికి బలిపెట్టకుండా గమ్యం వైపు పయనించే మార్గమేలేదా ? ఈ సమస్యకు సమాధానాన్ని ఆలోచించవలసిన బాధ్యత అందరిమీదా ఉన్నది. ఇక్కడ నేటి కమ్యూనిస్టు దేశాల నుంచీ మనం నేర్చుకోవలసినది ఏమీ కనిపించదు. అక్కడి యథార్థ పరిస్థితులని సరిగా అవగాహన చేసుకోవలసిన అవసరమే కనిపిస్తుంది.

కమ్యూనిస్టు దేశాలలో 'న్యాయానికి' ఎటువంటి కొలబద్దా లేకపోవడాన్ని ప్రస్తావించాను. అలా ఎందుకు లేదంటే కారణం చరిత్ర గతి అనిశ్చితంగా ఉండి ఎప్పటికప్పుడు దాని స్వరూపం కమ్యూనిస్టు దేశాల్లో అధికారవర్గంతోపాటు మారుతున్నది. కాబట్టి అటువంటి స్థితే సిద్ధాంత రీత్యా మరొకవిధంగా మనదేశంలో కమ్యూనిస్టు పార్టీకి కూడా పట్టింది. ఉద్యమం నడపడంలో ఏ సమయంలో ఎలా తప్పు జరిగిందో ఎవరివల్ల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జరిగిందో చరిత్రగతి అవగాహన ద్వారా (అంటే గడచిన ముప్పైఏళ్ళలో సంభవించిన జయాపజయాల ద్వారా) ఎప్పటి కప్పుడు నిర్ణయించుకో బూనడంవలన చివరకు యీ దేశంలో కమ్యూనిస్టు పార్టీకి చరిత్రే లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు 1948 ప్రాంతాల్లో తెలంగాణాలో ఉద్యమాన్ని కమ్యూనిస్టు పార్టీ ఎందుకు విరమింపజేసింది? అని తెలంగాణా యువకులు ప్రశ్నిస్తున్నారు. దానికి ఎన్ని యుక్తులు చెప్పినా, సిద్ధాంత రీత్యా 'మేము చరిత్ర తోక పట్టుకుని నడవడానికి ప్రయత్నిస్తున్నాము' అనే సమాధానమే నిగ్గు తేలుతున్నది. అంటే యీ దేశంలో సోషలిస్టు విప్లవం తేవడంలో 25 ఏళ్ళుగా అన్ని రాజకీయ పక్షాలూ సమంగానే విఫల మయ్యాయి అన్న భావం యువకుల్లో నేడు వ్యాపించి నిర్ధారితమైపోయింది. ఈ ధోరణి నిర్వేదం 1965 నుంచీ ప్రస్ఫుటమౌతూ వచ్చింది. ఆంధ్రదేశం లోనే కాదు. దేశం నలుమూలలా విప్లవాకాంక్ష, రాజకీయ పార్టీలపట్ల అవిశ్వాసం ముమ్మరంగా పెరిగింది. యువకుల్లోని అసంతృప్తి నక్సలైట్ ఉద్యమంగా పెల్లుబికింది.

నక్సల్‌బరీ, శ్రీకాకుళంవంటి ప్రాంతాల్లో జరిగిన తిరుగుబాట్లు ఆదర్శంగా భావించి ఆ తిరుగుబాట్లని దేశంలో వ్యాపింపజేసి 'విప్లవం'గా రూపొందించాలనే ఉద్యయం నక్సలైట్ ఉద్యమం. కాని ఇతర ప్రాంతాల్లో శ్రీకాకుళ ప్రాంతంలో సంఘటితమైన ఆర్థిక సామాజిక పరిస్థితులు లేక పోవడంతో, ఈ ఉద్యమం వైయక్తికమైన 'టెర్రరిస్ట్' ఉద్యమంగానే భాసించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న యువకులందరూ ఒక వర్గంనుంచీ వచ్చిన వారు కారు. వీళ్ళ విభిన్న మనస్తత్వాలు. ధనికవర్గ నుంచీ వచ్చిన యువకులు జీవితం 'బోర్'గా ఉండటంవల్ల సాహస క్రియల్లో జీవితాన్ని క్రొత్తగా అనుభవించే ఉద్దేశంతో ఉద్యమంలో ప్రవేశించినవారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏ ఆదర్శమైనాసరే ప్రాణాల్ని బలిపెట్టే సాహసం చేస్తేగాని అది సిద్ధించదనే విశ్వాసంతో ముందుకు వచ్చిన ఆదర్శవాదులు కొందరు. 'ఈ సమాజం వ్యవస్థ నాకు గిట్టదు. నాకు జీవనోపాధి చూపించని ఈ సంఘంతో సంబంధంలేదు. నేను ఏ అడ్డంకులూ భయాలూ లెక్కచెయ్యను,' అనే తెగింపుతో, లేక స్వేచ్ఛా నిరూపణకోసం, వచ్చినవారు కొంతమంది. వీళ్ళందర్నీ 'నిహిలిస్టు'లు (Nihilists) అనడంలో ఏమాత్రం పొరపాటులేదు. వీళ్ళను ఉపయోగించుకున్నవాళ్ళు మార్క్సిస్టు పార్టీలోని తీవ్రవాదులు.

ఇక్కడ 'నిహిలిజం'ను గురించి కొంత చెప్పాలి. 1860 ప్రాంతాల రష్యాలో జార్ నిరంకుశ ప్రభుత్వంమీద సాగిన టెర్రరిస్ట్ చర్యల్లో పాల్గొన్న విద్యార్థుల మనస్తత్త్వానికి యీ పదం వర్తిస్తుంది. "గతాన్ని నిర్మూలించడమే భవిష్యత్తుని పుట్టించడం" అంటాడు హెర్జన్, (The annihilation of the past is the procreation of the future.) "ఈ వ్యవస్థతో నాకు ఏమీ సంబంధంలేదు" అంటాడు పిసారెవ్. (I am a stranger to the order of existing things, I have nothing to do with it.) వీళ్ళందరూ యువక టెర్రరిస్టులు. సర్వాన్నీ నిరాకరించడమే దృఢ విశ్వాసంగా రూపొందింది. Their personal solution consists of endowing their negation with the intransigence and passion of faith). 'నిర్మూలించాలనే ఉద్రేకం అది సృజనాత్మకమైన ఉద్రేకమే' అంటాడు బకూనిన్ అనే మరొక టెర్రరిస్ట్. కర్షకుల తిరుగుబాటులో నాయకత్వం వహించిన దొంగలనాయకుణ్ణి బకూనిన్ మెచ్చుకున్నాడు. కారణం వాళ్ళు ఏ సిద్ధాంతం కోసమో, విలువకోసమో కాకుండా కేవలం మానవ స్వేచ్ఛకోసమే పోరాడటం అతణ్ణి ముగ్ధుణ్ణి చేసిందట. 'ఝంఝా మారుతమూ జీవితము కావాలి. మరో ప్రపంచం అంటే బంధించే ధర్మాలు లేని స్వచ్ఛందమైన ప్రపంచం కావాలి' అన్నాడు బకూనిన్. (The tempest and life, that is what we need. A new world

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

without laws, and consequently free) ఆనాటి యీ పెట్రరిస్టుల కుర్రకారు (adolescent) మనస్తత్త్వమే విద్యావంతులైన మన యువక నక్సలైట్లలో ప్రతి ఫలించిందని వేరుగా చెప్పనక్కర్లేదు. వీళ్ళకు సిద్ధాంతాలూ సామాజిక అవగాహనా అక్కర్లేదు. నిరాకరించడమే, నిర్మూలించడమే లక్ష్యం. శ్రీకాకుళంలో నిహతులైన తిరుగుబాటు నాయకులు వీళ్ళని ఆకర్షించిన కారణం - సిద్ధాంతాలూ విలువలూ కావు, ఆ తిరుగుబాటులో ద్యోతకమైన స్వచ్ఛంద మానవత్వం ఒక్కటే. తిరుగుబాటులో మెరసిన చైతన్యదీప్తి వీళ్ళ కళ్ళని మిరుమిట్లు గొల్పింది.

కాని స్వచ్ఛందమైన మానవత్వమూ, హద్దులులేని సమాజమూ సాధ్యమా ? ఈ ప్రశ్నకు సమాధానం అన్వేషించేముందు, తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా వచన కవిత్వంలో, 1965 లో వచ్చిన దిగంబర కవులను గూర్చి ప్రస్తావించాలి. వీరి తొలి సంపుటిలో (1965 మే) సమకాలీన సమాజంపట్ల జుగుప్స, దానితోపాటు స్వచ్ఛందమైన మానవత్వాన్ని (దిగంబర మానవుణ్ణి) దర్శించాలనే తపన వ్యక్తమయ్యాయి. ఇవి సెక్స్ ఇమేజరీ ద్వారా సమాజాన్ని చిత్రించే ఖండికల్లో వ్యక్తం కావడం గమనించదగింది. "నగరం నడి రోడ్డుమీద నాగరికత బొడ్డుమీద నగ్నంగా నిలబడ్డా, మనిషీ.... మనిషీ.... మనిషీ.... ఎలుగెత్తి పిలుస్తున్నా" (మహాస్వప్న). రెండవ సంపుటిలో (1966 డిసెంబర్) మార్క్సిస్ట్ దృక్పథంవైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రకటించారు. "ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలముకున్నంతవరకు మార్క్సిస్ట్ దృక్పథాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీలేదు. అయితే వ్యక్తి స్వేచ్ఛ జనబాహుళ్యానికి అడ్డు రారాదు. కాని నియమాల నిరంకుశత్వంతో సిద్ధాంతాల వక్ర భాష్యంతో మనిషిని కీలుబొమ్మగా, యంత్రపు విడిభాగంగా తయారుచేసే నియంతృత్వానికీ అది మార్గం కారాదు" (ఆ ముఖం). ఈ రెండవ సంపుటిలో వీరి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిత్వరీతి పరిణతికి వచ్చింది, ప్రౌఢమయింది. కాని మూడవ సంపు (1966 - జూన్) నాటికి చాల ఖండికల్లో చవకబారు దూషణ, కవితా గుణ లేని వచనమూ కనిపిస్తుంది "దేశం ఒక లేవెట్రీగా తయారై కంపు గొ తూంటే, దాని క్కారణా లేమిటో ఏ మాత్రం చూడకుండా పేడ పురుగు కన్నా హీనంగా బ్రతికేస్తున్న ఆంధ్రుడు ఇప్పటికైనా తన ముండమో బతుకుని గురించి తెలుసుకోవటం అవసరం" (ఆ ముఖం). మొదటి రెండు సంపుటాల కవిత్వంతో దేశంలో ఏదో మానసిక విప్లవం వచ్చేస్తుంద నమ్మి, అలా జరక్కపోవడంతో వీళ్ళుపొందిన నైరాశ్యం మూడవ సంపు టిలో బజారు తిట్లకు లంకించుకోవడంగా వ్యక్తమైనట్లు తోస్తుంది. అ పైన వీళ్ళు 'దిగంబరత్వాన్ని' వదలి 1970 లో విప్లవ కవులుగా ప్రకటిం కొన్నారు. "మహోన్నతమైన సోషలిస్టు మానవతావాద వైఖరిని అవలం బించి మార్క్సియన్ సోషలిజంను శాస్త్రంగానేకాక శస్త్రంగా కూడా ఆమో దిస్తూ రాజకీయ మహోద్యమానికి చేదోడు వాదోడు కావాలి" (జ్వాలాముఖి తరుణ : డిసెంబర్ 1971) అని నిశ్చయించుకున్నారట ! అంతటితో వీళ్ళలో చీలికలు కూడా బయలుదేరినవి. అది విషయాంతరం. కాని దిగంబ కవులు విప్లవకవులుగా మారడంతో 'నిహిలిజం' నుంచీ మార్క్సిజంలోకి నిజంగా పరివర్తన చెందారా ? అనే విషయం పరిశీలింప దగింది. విప్ల కవులు ప్రచురించిన గేయాలు కేవలం నక్సలైట్ ఉద్యమాన్ని పొగ ప్రోత్సహించేవిగానే ఉన్నాయి. ఈ దృష్టితో చూస్తే వీళ్ళ మార్క్సి అవగాహనని గూర్చి సందేహం వెలిబుచ్చవలసి వస్తున్నది.

1965....70 సంవత్సరాలలో దేశంలోని రాజకీయ పరిస్థి దృష్ట్యానూ, యువత పొందిన నిర్వేదం దృష్ట్యానూ, సమాజంలో పెల్లుబికి నిహిలిస్టు మనస్తత్త్వం యొక్క స్వచ్ఛందమైన సాహిత్యాభివ్యక్తి దిగంబ కవిత్వం. అందుకే అది స్మరణీయమైన సృష్టిగా నిలుస్తుంది. చిత్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మేమిటంటే దానిలోని కవిత్వ లక్షణం విప్లవ కవులుగా మారిన దిగంబరుల గేయాల్లో నేడు మాత్రం కనిపించడంలేదు.

ఇంతవరకూ వచ్చిన విప్లవ కవిత్వంలో మార్క్సిస్టు అవగాహన ఛాయలు కనిపించవు. ఈ కవిత్వం కేకలతో అరుపులతో ప్రజల్లో హింసా ప్రవృత్తినీ, తిరుగుబాటు భావాన్నీ రెచ్చగొట్టే ధోరణిలో ఉంటూ నిజమైన రాజకీయ సంచలనానికి ప్రత్యామ్నాయంగా మాత్రమే చలామణీ అవుతూ ఉన్నదా ? అనే సందేహం కూడా కలుగుతున్నది. ఆ మధ్య హైకోర్టువారూ అటువంటి తీర్పే యిచ్చి విప్లవ కవులవల్ల నేటి వ్యవస్థకు వాటిల్లే ప్రమాదం ఏమీ లేదంటూ వాళ్ళని విడిచిపెట్టినట్లున్నారు। నేటి సామాజిక చైతన్య దీప్తి దృష్ట్యా చూస్తే వీళ్ళ విప్లవ కవిత్వం దాన్ని ప్రతిబింబించడానికి బదులు గతాన్ని నెమరువేసుకుంటూ (నడచిన నక్సలైట్ వీర గాథలు పాడుతూ) ఉన్నట్టే తోస్తుంది. రాత్రి వేగడానికి ఇంకా వ్యవధి ఉండగా, మెరసిన ఒక మెరుపును పగలుగా భ్రమించి అనుక్షణమూ అటువంటి మెరుపు కోసమే, ఆ మెరుపు అలాగే నిలిచిపోవడం కోసమే తపనపడే ఆలోచనాశూన్యాన్ని గుర్తు తెస్తున్నారు వీళ్ళు. మార్క్సిస్టు అవగాహనతో వీళ్లు నేటి సామాజిక చైతన్య స్వరూపాన్ని బహుముఖంగా సమగ్రంగా దర్శిస్తున్నట్లు దాఖలా కనిపించదు. పైగా ఇప్పటికే శ్రామిక విప్లవ నియంతృత్వ మేదో కాస్త వీళ్ళకి చేజిక్కినట్లు, సాంస్కృతిక విప్లవం సాధించటానికి, కమ్యూనిస్టు దేశాల్లో రచయితల్ని మేధావుల్ని అనుశాసిస్తున్న రీతిగా, యిక్కడ వీళ్ళు విప్లవ సాహిత్యం ఎలా వుండాలి అన్న విషయమై నిర్వచించే అధికారం తమకొక్కరికే ఉన్న రీతిగా అహమికతో వ్యవహరిస్తున్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'There is no question that literature is least subject to the mechanical adjustment and levelling to the rule of the majority over the minority. There is no question either, that in this field greater scope must definitely be allowed for personal lintiative, individual inclination, thought and fantasy, form and content.'' అన్న Lenin మాటల్ని ఉద్ధరించి కె. వి. రమణారెడ్డి సంస్కృతి - సాహిత్యం అనే వ్యాసంలో (సృజన, ఫిబ్రవరి (1971) "సంప్రదాయ నిరసన ధోరణి అతిశయించి నప్పుడు సంస్కృతి మొత్తంగానే నిరాకరించే ప్రమాదం" ఉన్నదని హెచ్చరిస్తూ "లెనిన్‌గాని మావోగాని సాహిత్యాన్నీ ఇతర ఉద్యమ రూపాలనూ ఒకేగాట కట్టివేయలేదు" అని హితవు చెప్పినా దాన్ని వీళ్ళు గమనించినట్టు లేదు. జ్వాలాముఖి "వేకువ" (డిసెంబర్ 1971) లో తెలుగు సాహిత్య చరిత్రని పరామర్శించిన ధోరణి చూస్తే తెలుస్తుంది. అందులో నిహిలిస్టుల లక్షణమైన స్వోత్కర్ష (rationalized egoism) కనిపిస్తున్నది. "నక్సలైట్ కార్యాచరణ ఎంతవరకు సరైంది? దానిలో విప్లవ నిర్ణాయక శక్తి ఉందా, అనేది నిర్ణయించాల్సింది ప్రజలు, రాజకీయపక్షాలు" (జ్వాలాముఖి. తరుణ: డిసెంబర్ 1971) అంటూనే. నక్సలైట్ల స్తుతిగీతాలతో హోరెత్తిస్తూ సంతృప్తి చెందుతున్న వీళ్ళు, 'నిహిలిజం' నుంచీ మార్క్సిజంకి పరివర్తన చెందారంటే అది అర్థంలేని మాట! 1860 నాటి రష్యన్ నిహిలిస్టులు కూడా యిలానే ప్రవర్తించారట! ("They believed in nothing but reason and self-interest. But instead of scepticism they chose the apostolate and became socialists. Therein lies their basic contradiction'' (The Rebel - Albert Camus) రష్యన్ నిహిలిస్టులు నిజమైన టెర్రరిస్టులైతే, వీళ్ళు సాహిత్య టెర్రరిస్టులు. అంతే తేడా.

తెలుగుదేశంలో కథలు వ్రాస్తున్న కొందరు రచయితల్లో పీడితవర్గ చైతన్యాన్ని గూర్చిన అవగాహన చక్కగా ప్రస్ఫుటమౌతూనే ఉన్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అందులో కొన్ని రచనలు ఉత్తమ సాహిత్య పరిగణనకు అర్హమైనవి కూడా ఉంటున్నాయి. కాని వీళ్ళకి విప్లవ రచయితలు అనే లేబిల్ లేదు. కొలకలూరి ఇనాక్ జనవరి 72 భారతిలో ప్రచురించిన 'తలలేనోడు' అనే కథ ఇందుకు ఒక ఉదాహరణ. ఇక్కడ చెప్పవలసింది ఏమిటంటే రచయిత సామాజిక చైతన్యదీప్తికి దూరం కాకుండా సాహిత్యాన్ని సృష్టిస్తున్నప్పుడు విప్లవాత్మకమైనవీ కళాత్మకమైనవీ రచనలు తప్పక వస్తాయి. అంతేగాని విప్లవ రచయిత అనే బిరుదు తగిలించుకున్నందువల్ల సాహిత్యాభివృద్ధి జరుగదు. పోతే తోటి రచయితలకు యిలా వ్రాయాలి అని చెప్పడం అనుశాసించడం ఎక్కడా సహ్యమైన విషయం కాదు. ఏ వ్యవస్థలో అయినా లెనిన్ చెప్పినట్లు రచయితకు కొంత స్వాతంత్ర్యం అవసరం. కమ్యూనిస్టు దేశాల్లో కూడా సాంస్కృతిక విప్లవాన్ని నడిపే భారం ఏ ఒక్క రచయితల ముఠాకో అప్పగించటం అరుదు. తోడి రచయితలను అనుశాసించే అధికారం ఏ రచయితల ముఠాకో చెందితే "పేనుకు పెత్తనం యిచ్చిన" సామెత అవుతుంది.

విప్లవానికీ సాహిత్యానికీ గల సంబంధాన్ని గూర్చి ఆలోచిస్తే, విప్లవం నూతన సామాజిక సృష్టి అయినట్లుగానే, సాహిత్యం కొత్త విలువల్ని దర్శించి జీవితానికి వాటిని అన్వయించే భావనాత్మక సృష్టి. విప్లవానికి దారితీసే విలువల్ని సృష్టించి మానసిక విప్లవం తెచ్చి మానవాళిని ప్రభావితం చేసిన రచయితలు నీషే, హెగెల్. కారల్‌మార్క్స్ వంటి దార్శనికులు. వీరిలో కారల్‌మార్క్స్ నేటి ప్రపంచ విప్లవానికి మూల పురుషుడయ్యాడు. విప్లవం మొదట మానవుల మనసుల్లో పుట్టి తర్వాత భూమిమీద (అంటే సామాజిక వ్యవస్థగా) రూపం దిద్దుకుంటుంది. అంటే మార్క్స్ భౌతిక వాదానికి విప్రతిపత్తి ఏమీలేదు. కవులకంటే మేధావుల దర్శనాలే మౌలికంగా విప్లవానికి కారణం అయ్యాయి అని తోస్తుంది. కవులకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆశక్తిని ఆపాదిస్తూ 'Poets are the unacknowledged legislators of the world' అన్న షెల్లీ పెద్ద రొమాంటిస్టు అన్న విషయం మరచి పోకూడదు. షెల్లీ నాస్తికతను గూర్చి పుస్తకం వ్రాసినా, ఆతని కవిత్వానికి మౌలికమైన ప్రేరణ గుడ్విన్, రూసోవంటి మేధావుల్నించీ వచ్చిందని విస్మరించరాదు. అయితే కేవలం దర్శనాలకు లేని గుణం ఒకటి కవిత్వం, కథ, నవల వంటి ప్రక్రియలకు ఉంది. అది సామాజిక చైతన్యాన్ని ఎప్పటికప్పుడు దాన్ని సంక్లిష్ట స్వరూపంలో అనుభూతిపరంగా ప్రతిబింబించడం. ఇటువంటి ప్రక్రియ నేడు తెలుగు కథానికలో, నవలలో జరుగుతున్నట్లుగా కవిత్వంలో జరగడంలేదు. 'తిరుగబడు' 'కొట్టు' 'చంపు' 'మార్చు' అంటూ కేకలు పెట్టడం కవిత్వంకాదు. వేదికలమీద రాజకీయ ప్రచారానికి ఈ గేయాలూ, కవితలూ ఉపయోగిస్తే ఉపయోగించవచ్చునుగాని, వీటికి సాహిత్య ప్రతిపత్తిని ఆపాదించడం సాధ్యంకాదు. సాహిత్య ప్రతిపత్తి ప్రచారంవల్ల రాదు. 'మా కొద్దీ తెల్లదొరతనమూ' 'వడకు వడకు కదుర, వడకవే కదురా!' 'కొల్లాయి గట్టితేనేమీ' సాహిత్యంగా నిలవలేదు. అందువల్ల విప్లవ సాహిత్యం అంటే కొత్త దృష్టిని కల్పించే సృజనాత్మక రచన; పాత కొత్తలకి వంతెన. భావిని గూర్చి మనస్సును ఉన్ముఖం చేసే స్వప్నం. సమాజంలో నూతన సంబంధాల కిచ్చే నిర్వచనం. యుద్ధంలో పొలికేక (battle cry) కీ, యుద్ధ వీరుల పొగడ్తలకీ సాహిత్య ప్రతిపత్తి ఎప్పటికీ రాదు.

రష్యన్ నిహిలిస్టు పిసారెవ్ అన్నాడట; "నేను రష్యన్ రాఫెల్ (చిత్రకారుడు) కావడానికంటే రష్యన్ చర్మకారుణ్ణి కావడానికే యిష్టపడతాను." (I would rather be a Russain shoe-maker than a Russian Raphael) ఈ మాటనే సాహిత్యపరంగా అన్వయిస్తే విప్లవానికి సృజనాత్మక రచయితకంటె ప్రచార పత్రికారచయితే ఎక్కువగా ఉప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యోగిస్తాడనే భావం తోస్తుంది. విప్లవానికి సాహిత్య ప్రయోజనాన్ని నిర్ణయించే పద్ధతి యిదికాదు. సృజనాత్మక రచనా, ప్రచార పత్రికా రచనా రెండూ సమాజానికి అవసరమే. అయా రచనల మధ్య విభేదమూ అనివార్యమే; ఆ విభేదాన్ని ఈ అత్యయిక పరిస్థితిలో విస్మరించమని వాదించే వాళ్ళు సృజనాత్మక సాహిత్యానికీ, తద్వారా సామాజిక విప్లవం యొక్క మూలతత్త్వానికీ బద్ధవిరోధులు।

నవల జీవితాన్ని గూర్చిన భావనాత్మక చిత్రాలని సృష్టిస్తుంది. యథార్థ సంఘటనలని ఏర్చి కూర్చడంలో కొత్త దృక్పథాన్ని కల్పిస్తుంది. మానవునిలోని సృజనాత్మక శక్తికి అభివ్యక్తి కల్పిస్తుంది. నవల కల్పించే వినోదం, ఆనందం, పాఠకునిలోని సృజనాత్మక ప్రవృత్తియైన భావనకు కలిగే స్పందన రూపంలో ఉంటుంది. సద్యః రాజకీయ ప్రయోజనాన్ని ఆశించేవాళ్లు ఆ వినోదాన్ని, ఆనందాన్ని నిరసించి పాఠకుని ఆలోచనల్ని తమ కార్యక్రమానికి అనుకూలంగా మళ్ళించే నవలలే కావాలంటారు. ఇది సమర్థనీయం కాదు. జీవితాన్ని సమగ్రంగా, ఎన్నో రీతుల్లో బహుముఖాలుగా దోసిలిలో పట్టి ఆస్వాదించాలనే మనిషి కోరికని నవలలు తీరుస్తాయి. ఇది మనిషిలో పలాయనవాదం కాదు. మనిషి జీవితాన్నుంచి పారిపోవాలనుకోడు. ఎన్ని అవకతవక లున్నా జీవితాన్ని జుర్రుకోవాలనే చూస్తాడు. స్వీయ జీవితానుభవంలో దీపాల్లా మెరిసే విడిక్షణాలూ ఉద్రేకాలూ తప్ప జీవిత స్వరూపం ఏమిటో, అసలు దానికి ఒకరూపం ఉన్నదో లేదో అతనికి అవగతంకాదు. జీవితాన్ని తన మనస్సు ముందు నిలిపి, తనివితీరా దాని వంపులూ సొంపులూ చూచుకొమ్మని అవకాశం కల్పించేది నవల మాత్రమే. ఇది దాని విశిష్ట ప్రయోజనం. అందుకే నవల అంటే అందరికీ ఆసక్తి. నిజానికి జీవితానికి నిశ్చిత స్వరూపం ఏమీలేదు. ఆ స్వరూపం ఉన్నదనే భ్రమతో దాన్ని నిరంతరం అన్వేషించడం మానవుని సృజనాత్మక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రవృత్తి ఆతని చైతన్యం. అదే నవలలో వ్యక్తమౌతూ, నవల ద్వారా పరితృప్తి పొందుతూ ఉంటుంది. ఆకృతిలేని యాథార్థ్యానికి ఆకృతి కల్పించడంలో, పాతవి కొత్తగా పునస్సృష్టించడంలో నవల సాధించే ప్రయోజనమూ, విప్లవం సాధించే ప్రయోజనమూ ఒకటే.

మార్క్సుని మతప్రవక్తగా దైవంగా కాకుండా, ఒక మహామనీషిగా మేధావిగా పరిగణిస్తే ఆయన సిద్ధాంతంతో భేదించడం తప్పుకాదు. మానవత్వం (మనిషి చైతన్యం) పూర్తిగా సామాజికమనే మార్క్సిస్ట్ సిద్ధాంతం దృష్ట్యా నేటి కమ్యూనిస్టు రాజ్యాల్లో జరుగుతున్న వైజ్ఞానిక నియంత్రణమూ, సాంస్కృతిక విప్లవాలూ మనిషి మనస్సుని ఎలా చిత్రిక పడుతున్నవో యిదివరకే ప్రస్తావించాను. అలాగే మానవత్వం ఏ హద్దులూ లేని వైయక్తిక స్వచ్ఛందతతో ఆవిష్కరింపబడాలనే నిహిలిస్ట్ ఆకాంక్షను కూడా పేర్కొన్నాను. మానవ చైతన్యానికి సమాజమూ-వ్యక్తీ రెండూ రెండు ఒడ్డులాంటివి. ఈ రెండింటి మధ్యా అది ప్రవహిస్తూ తద్వారానే నిత్య నూతనంగా ఉంటుంది; వ్యక్తిలోని తిరుగుబాటు ప్రవృత్తి - సమాజం అంతవరకూ ఎరగనిదాన్ని దర్శించి దానికోసం చేయిజాచే సృజనాత్మక శక్తి - సామాజిక వ్యవస్థతో ఎప్పుడూ ఘర్షణ పడుతూనే వచ్చింది. అటువంటి ఘర్షణకు అవకాశం లేకుండా చేసి వైయక్తిక స్వేచ్ఛను సమాజశక్తి పూర్తిగా అణిచివేసినప్పుడు, వ్యక్తి నలిగిపోతాడు. ఆవేదనకు గురియై జీవచ్ఛవమైన యంత్రపు బొమ్మగా మారిపోతాడు. అయితే అటువంటి సమస్యలూ బాధలూ చరిత్రాంతంలో ఉండవని మార్క్సిస్టుల సమాధానం. అప్పుడు అన్ని ద్వంద్వాలూ సమసిపోతాయట.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

("Communism in so far as it is real appropriation of the human essence by man and for man... it is the real end of the quarrel between man and nature, between man and man, essence and existence, between externalization and the affirmation of self, between liberty and necessity, between the individual and the species. It solves the mystery of history and is aware of having solved it.") ఇహంలో లేని సుఖం స్వర్గంలో ఉన్నదని మురిపించే ఒకనాటి మతవ్యవస్థకూ, ఈనాడు కమ్యూనిస్ట్ రాజ్యాలలో దుర్లభమైపోయిన వైయక్తిక స్వేచ్ఛ చరిత్రాంతంలో అందరికీ లభిస్తుందని మురిపించే మార్క్సిస్ట్ మతానికీ ఏమిటీభేదం? "భేదం ఉన్నది, ఇది శాస్త్రీయమైన, భౌతిక ప్రపంచంలో, కాలంలో సాధ్యమైన గమ్యం, అని వాళ్ళు వాదించినా, కనుచూపు మేర కాల గమనంలో అది లేకపోవడంవల్ల నేడు జీవించిఉన్న మనందరికీ అది దుర్లభమే, అలా అనగా "రేపటి మనిషికోసం నువ్వు యివ్వాళ త్యాగం చెయ్యి" అంటారు. ఇక్కడ 'నేనూ–సమాజం' అనే ద్వంద్వం తలెత్తుతుంది. మళ్ళీ, వాదం పునరావృత్తమౌతుంది. వ్యక్తి స్వేచ్ఛకూ విప్లవ గతికీ కలిగే ఘర్షణలో ఎప్పటి కప్పుడు సమన్వయాన్ని సాధిస్తూ పోవడమే సృజనాత్మకమైన మానవత్వ ప్రగతి అవుతుంది. అందులో విప్లవం పేరు పెట్టుకున్న రాజ్య వ్యవస్థ వ్యక్తిని నలిపివేస్తున్న పద్ధతికి స్వస్తి జరగాలి. అప్పుడే మార్క్సిజమ్ నిజమైన మానవతావాదంగా రూపొంది, చరిత్రాంత స్వప్నంలో కాకుండా, జీవిత యాథార్థ్యంలో మానవుణ్ణి చేస్తుంది. మానవునికి న్యాయం జరుగుతుంది.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహిత్యంలో సామాజిక స్పృహ

సమాజానికీ సాహిత్యానికీ గల ఆధార ఆధేయ సంబంధం ఈ నాటిది కాదు. సాహిత్యంలో 'సామాజిక స్పృహ' కోసం అన్వేషణ నేడు విమర్శలో భాగం కావడం ఒక విడ్డూరమూ కాదు! కాని 'సామాజిక స్పృహ' అంటే ఏమిటి? సాహిత్యంలో దాన్ని గుర్తించడం ఎలా? రచయిత రచనకు ఉద్యమించేటప్పుడు అతణ్ణి యీ 'సామాజిక స్పృహ' ఎంతవరకు ఎలా ప్రభావితుణ్ణి చేస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించే బాధ్యత సాహిత్యంలో అభినివేశం చూపుతున్న వాళ్ళందరిమీదా ఉన్నది. ఈనాడు ఒక వివాదంగా ప్రచారంలో ఉన్న సామాజిక స్పృహ నిజస్వరూపమేమిటి? జిజ్ఞాస, విచారణ ప్రధానం యిక్కడ. ఈ శతాబ్దిలో మార్క్సిజమ్ ప్రపంచ చారిత్రక పరిణామంలో కీలకమైన పాత్ర వహించడం, అన్ని రంగాలలోనూ మార్క్స్ దర్శన ప్రభావం కనిపిస్తూ ఉండడం ఎవరూ కాదనలేరు. 'సామాజిక స్పృహ' మార్క్స్ దర్శనం ఆధారంగా, వామపక్ష రాజకీయ వాదులు 'అభ్యుదయ సాహిత్యోద్యమ' సందర్భంగా సాహిత్య రంగంలో ప్రవేశ పెట్టిన ప్రత్యయం (concept). దాన్ని రచయితలు - ముఖ్యంగా తెలుగు రచయితలు - యథాతథంగా స్వీకరించి విచక్షణా రహితంగా ఉపయోగిస్తున్నారు. 'సామాజిక స్పృహ' అనే ప్రత్యయాన్ని గూర్చి ఒక రాజకీయవాదికీ (అందులో భిన్నవర్గాల వారూ ఉంటారు) ఒక సాహిత్యవేత్తకూ వేర్వేరు అభిప్రాయాలు ఉండక తప్పదు! 'అలా వీల్లేదు. రాజకీయాలే సమాజం ఊపిరి, కాబట్టి రాజకీయ వేత్తల, వాదుల, అర్థాన్నే సాహితీ పరులూ, మిగిలిన అన్నిరకాల వాళ్ళూ శిరసావహించాలి' అని రాజకీయ పార్టీ శాసించే పరిస్థితులు ఏర్పడితే అప్పుడు చేసేదేమీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉండదు ! అప్పుడిటువంటి చర్చా, జిజ్ఞాసా అనవసరం. అంటే, రచయితలు స్వతంత్ర ప్రతిపత్తి గల మేధావి వర్గంగా గుర్తింపబడక, రాజకీయ వాదులకు అనుయాయులుగానే పరిగణింపబడే వ్యవస్థలో 'సామాజిక స్పృహ' కూ సాహిత్యంలో దాని అభివ్యక్తికీ, నిర్దేతలూ, అధికారులూ రాజకీయవాదులే అవుతారు. అప్పుడు సాహిత్యం రాజకీయల్లో అంతర్భాగం అవుతుంది. 'అవును, అయితే ఏం? అలా కావాలనే మేంకోరేది' అనే వాళ్ళతో వాదమే లేదు! ఇప్పుడింకా ఆ పరిస్థితి రాలేదు కాబట్టి, ఈ కీలకమైన విషయాన్ని ఇక్కడ చర్చించడం జరుగు తున్నది.

రష్యాలోని కొందరు రచయితలు 1966 లో వెలువరించిన వ్యాస సంపుటి, 'మనిషీ - సమాజమూ' నుంచి ఉద్ధరింపబడిన ముఖ్యాంశాలివి : 1. అధికారంలో ఉన్నపార్టీ, సోషలిస్టు వ్యవస్థలో, మార్క్సు లెనిన్ దర్శనాన్ననుసరించి, మేధావుల కృషిని పెంపొందింపజేస్తుంది. సామాజిక స్పృహ తాలూకు సూత్రాలతో రూపొందించిన నిర్దిష్టమైన పథకం ప్రకారం, పార్టీ నిర్ణయాలూ, కలాపాలూ, సైన్సు, కళలు, సంస్కృతి అనే మూడింటినీ నియంత్రిస్తాయి (directs). 2. సైన్సూ, కళారంగాల్లో, మేధావులకు, కమ్యూనిస్ట్ పార్టీ స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నదనే విమర్శ బూర్జువా లేక రివిజనిస్ట్ విమర్శ. స్వేచ్ఛతోకూడిన సృజనాత్మకతకూ, పార్టీకి (కమ్యూనిజానికి) విధేయంగా ఉండటానికి మధ్య ఎలాంటి వైరుధ్యమూ లేదు. 3. సోషలిస్ట్ వ్యవస్థలో నిజమైన సైంటిస్టూ, కళాకారుడూ బుద్ధి పూర్వకంగా (consciously) తన కృషిని కమ్యూనిస్ట్ ఉద్యమానికి ఉపయుక్తంగా ఉండేటట్లు చూస్తాడు. కమ్యూనిజం అంటే, దానికై కృషి చెయ్యడమంటే, అది వ్యక్తి స్వేచ్ఛాయుత జీవిత పరమార్థం. కమ్యూనిజమే స్వేచ్ఛయొక్క ఉత్కృష్ట స్వరూపం. 4. వర్గవిభేదాలు పోవడంతో వ్యక్తుల్లోని వైవిధ్యం స్వేచ్ఛాయుతంగా మానవునిలో సామాజిక సత్తాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంపన్నం చేస్తుంది. 5. చరిత్రలో యింత దాకా విశిష్ట వ్యక్తులు కొందరే, కమ్యూనిజం ద్వారా ప్రతివ్యక్తి విశిష్ట వ్యక్తిగా రాణిస్తాడు.

---

1. "With Marxist – Leninist ideology as its pivot, Socialist society consciously develops its intellectual life. The party directs the development of science, art and culture. The party's decisions and practical acts conform to a definite plan and are based on the laws governing the development of social consciousness under socialism.

2. "Its bourgeois, reformist and revisionist opponents insist that the Communist party's leadership rules out freedom of scientific and artistic creativity. But there is no clash between conscious and free creativity and its subordination to the interests of the party and of communism.

3. "In socialist society, every innovator in production and every real scientist and artist is free, and consciously makes his work serve the cause of communism. To work for communism is a supreme manifestation of individual freedom. It is the whole meaning of a life in freedom, because communism itself is the highest form of freedom...

4. "The growing social homogeneity of socialist society achieved through the obliteration of social distinctions helps to bring out men's individual traits, diverse attitudes, tasts and requirements. This flourishing of individual freedom and variety of individual distinctions is an enrichment of man's social essence.

5. "There have been many out - standing men in history, and the construction of Communism and Communist ideology are designed to make everyone an outstanding personality. That will be done and has already been done in

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇది రాజకీయవాది దృక్పథం. ఇందులో ప్రకృతాన్నీ భవిష్యద్దర్శనాన్నీ కలగా పులగం చెయ్యడం కనిపిస్తుంది. ఇది పై 2, 3 అంశాల్లో గమనించవచ్చు. రచయిత స్వేచ్ఛకూ, పార్టీ ఆదేశాలకూ, ఎప్పుడూ వైరుధ్యం లేదని సిద్ధాంతము. కమ్యూనిస్ట్ వ్యవస్థ పరిపూర్ణ స్వరూపాన్ని పొందినప్పుడు ఉండదని మనం అంగీకరించినా, యిప్పుడు లేకపోదు గదా! పార్టీకీ - కమ్యూనిజానికి విధేయత అంటూ రెండింటినీ ఏకంచెయ్యడంలోనే, ప్రకృతాన్నీ - భవిష్యత్తునీ, వాస్తవాన్నీ - కలనీ, కలగా పులగం చెయ్యడం ఉన్నది. తర్వాత 4, 5 అంశాల్లో రాబోయే వ్యక్తి స్వేచ్ఛా స్వర్గాన్ని కరతలామలకంగా చూపించడమే ఉన్నది గాని, యీనాటి వాస్తవాన్ని గూర్చి లేదు. ఈనాటి వ్యవస్థ మార్పుకీ, మార్క్సు దర్శనాన్ని సాధికారంగా వ్యాఖ్యానించడానికీ, 'సామాజిక స్పృహ' స్వరూపాన్ని నిర్ణయించడానికీ, ఒక్క రాజకీయవాదికి తప్ప మరో మేధావికి అవకాశమే లేదనేది స్పష్టం! అంటే రచయిత కుండవలసిన 'సామాజిక స్పృహ' ను గూర్చిన నేటి నిర్ధారణ, పార్టీ కార్యక్రమంతో ముడిపడిన తాత్కాలిక నిర్ధారణేతప్ప, రచయిత సామాజికుడుగా తన అనుభూతినుంచీ ఆలోచననుంచీ చేసే నిర్ధారణ కాదన్న మాట!

రచయిత తన బుర్రనిలా తాకట్టు పెట్టడానికి అంగీకరించినా, సాహిత్య సృష్టిలో, సాహిత్యతత్త్వాన్ని బట్టి ఎదురయ్యే చిక్కులు ఉన్నాయి. రచయిత అనుభూతి (సాహిత్యంలో రూపం ధరించే సారవంతమైన అనుభూతి) అతని హృదయంనుంచీ, నరాలనుంచీ, సంస్కారంనుంచీ, వస్తుంది కానీ, చిలుకపలుకుల్లా నేర్చుకొని ముక్కున పెట్టుకున్న అభిప్రాయాల నుంచీ రాదు. (The material of the artist is not his beliefs as

---

many aspects." (Pages 109–113, "Man & Society" by a group of authors, Progress Publishers, Moscow, 1966)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

held, but his beliefs as felt - T. S. Eliot) పైగా రాజకీయ గురుష అందించిన 'సామాజిక స్పృహ'తో వ్రాసినదే అయినదే అయినా, ఒక కావ్యం (నవల, నాటకం) కవి కలంనుంచీ వెలువడిన తర్వాత, అది సంత రించుకునే అర్థం, సాధించే ప్రయోజనం, రాజకీయవాది ఆశించినదిగా ఉండక పోవచ్చు. (మిల్టన్ బుద్ధిపూర్వకంగా సేటన్‌ని దైవవిరోధిగా విలన్‌గా చిత్రించబూనుకొని, ఫలితార్థంలో ఆ పాత్రని విప్లవకారునిగా, స్వేచ్ఛా ప్రియునిగా, హీరోగా తయారుచేసినట్లు). A cry of grief is a sign of the grief which provokes it; but a song of grief is both grief itself and something other than 'grief'. (Sartre). 'It is never what a poem says that matters, but what it is' (I.A Richards) వాచ్యార్థం కంటే వ్యంగ్యార్థందే పై చేయి సృజనాత్మక సాహిత్యంలో. "A writer must distinguish between what an author in fact says and what he thinks he is saying. This is true even of philosophical systems." – Marx. API 1897 – MEW (works) XXXIV 506. సాహిత్యతత్త్వం యిలా ఉన్నప్పుడు, 'సామాజిక స్పృహ' అంటూ రాజకీయవాది నిర్ధారించిన లక్ష్యానికి తగినట్లుగానే వ్యంగ్యార్థాన్ని నియమించడం రచయిత పరిధిలోనూ, సామర్థ్యంలోనూ, లేని విషయం! ఈ అవగాహనలేని రాజకీయవాది - "అసలు వ్యంగ్యార్థాలతో రచనలు ఎవడు ఏడవమన్నాడు? చెప్పేది స్పష్టంగా మరో అర్థంలేకుండా చెప్పు, నీకు చేతకాక పోతే నేనే అందిస్తాను, అందులో ఉండవలసిన కీలకమైన మాటలూ, భావాలూ ఏమిటో" అంటాడు. అదే నినాదాల కవిత్వానికి, మూసలో పోసిన కథలకీ, నాటకాలకీ దారితీస్తుంది. ఈ నాడు ప్రజల భాషలో, అస దిగ్ధంగా, అందరికీ అర్థమయ్యేలా, 'సామాజిక స్పృహ'తో వ్రాయాలి అని ఘోషించడంలోని అంతరార్థం యిదే! రచనలోని సృజనాత్మకతను, వ్యంగ్యాన్ని, నిలువునా ఖూనీచెయ్యడం! సజీవమైన రచనని సహించలే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోవడం! తెలుగు సాహిత్యం యిటీవలికాలంలో అనుభవించిన దుర్దశ యిదే!

అయితే, రచయిత స్వేచ్ఛగా, సామాజికుడుగా తన సృజనాత్మక రచనా వ్యాసంగాన్ని సాగిస్తే అభివ్యక్తమయ్యే 'సామాజిక స్పృహ' ఎలా ఉంటుంది? రచయిత సామాజికుడుగా ఉండటాన్నుంచీ తప్పించుకోవడం ఎప్పుడూ సాధ్యంకాదు! మార్క్స్ దర్శనం రీత్యాకూడా సమాజం ఆధారం! సామాజికుడుగాని వ్యక్తికి అస్తిత్వమేలేదు. అయినప్పుడు ఒక రచయిత 'వ్యక్తివాదాన్ని' అభివ్యక్తం చేస్తున్నాడనీ ఒక కవి 'ఆత్మాశ్రయ' కవిత్వం వ్రాస్తున్నాడనీ, వారిలో 'సామాజిక స్పృహ' లేదనీ అభియోగాలు వెయ్యడానికి కారణం: ఆ సాహిత్యంలో కనిపించే 'సామాజిక స్పృహ' రాజకీయవాది నిర్ణయించుకుని అట్టిపెట్టుకున్న 'సామాజిక స్పృహ' కాక పోవడమూ, అది వెంటనే పార్టీ ప్రయోజనాలకు అంది రాకపోవడమూ! రచన చెయ్యడం ద్వారా రచయిత సామాజికుడుగానే ఒక పాత్ర నిర్వహిస్తు న్నాడు సమాజంనుంచీ పొందిన జీవితానుభూతిని రచనలో పునస్సృష్టిస్తు న్నాడు. (సాహిత్యం అనుకరణకాదు, సృష్టి). ఈ అనుభూతి రచయితలో మథింపబడుతున్నంత వరకు ఆత్మాశ్రయమే. భాషలో విశిష్టమైన రూపాన్ని పొందగానే అది ప్రత్యేకమైన వస్తువుగా, యికపై అతని అధికారం చెల్లని సజీవ శిల్పంగా అస్తిత్వం పొందుతుంది. ఇక్కడ రచన వస్త్వా శ్రయంకాదు. ప్రత్యేకమైన వస్తువు. సామాజికులకు అందుబాటులో ఉండే వస్తువు. సామాజికుల మీద దాని ప్రభావం ఎంత మేర, ఎలా ఉంటుందో నిర్ణయించడమూ నియంత్రించడమూ కష్టమే! ఒక్కో రచన టైమ్-బాంబ్ లాగ యిప్పుడు కాక పదేళ్ళ తర్వాత తన తడాఖా చూపించ వచ్చు కూడా! ఆ రచన తాలూకు 'సామాజిక స్పృహ'ను ఇవాళే, ఇక్కడే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తేల్చి చెప్పడమూ కష్టమే! కాని చాల రచనల విషయంలో ఇటువంటి
కష్టం ఉండదు. పఠితలకు వ్యక్తిగతంగా వారి వారి సామాజిక వైయక్తిక
విశిష్ట పరిస్థితిని గూర్చి స్పృహను మేల్కొలుపుతుంది సజీవమైన రచన.
దీన్ని సార్త్రేయిలా వర్ణించాడు :

"Each writer proposes a concrete liberation on the basis of a particular, alienation. In each one there is an implicit recourse to instituitions, customs, certain forms of oppression and conflict...to a whole world which the author and reader have in common. It is this familiar world which the writer animates and penetrates with his freedom. It is on the basis of this world that the reader must bring about this concrete liberation." (What is Literature, Sartre)

"ఒక్కొక్క రచయిత ఒక ప్రత్యేకమైన బాధనీ, పరతంత్రతనూ,
లేమినీ, కష్టాన్నీ వైరస్యాన్నీ ఆధారం చేసుకొని, విముక్తినీ, స్వేచ్ఛనీ,
మార్గాన్నీ, సామరస్యాన్నీ ప్రతిపాదిస్తున్నాడు.... ఇది తనకూ పఠితకూ
యిద్దరికీ చెందిన సమాజం నుంచీ, అనుభూతిద్వారా తన స్పృహలోకి వచ్చి
నదే. ఏ సృజనాత్మకమైన స్పృహద్వారా తన వైరస్యాన్ని అధిగ
మించాడో ఆ స్పృహనే పఠితకు పంచియిచ్చి, పురోగతికి, స్వేచ్ఛకు,
విముక్తికి మార్గం చూపిస్తున్నాడు." ఈ దృష్టితో రచయిత యొక్క రచనా
వ్యాసంగాన్ని పరిశీలించినప్పుడు, కాలంలో కరడు కట్టిపోయే చారిత్రక
బంధాల్నుంచీ మనిషికి విముక్తి కలిగించే చైతన్య స్ఫురణ, ప్రేరణ,
స్పృహ, సృజనాత్మక రచనలో వ్యంగ్యంగా అభివ్యక్తం కావడాన్నే సాహి
త్యంలో 'సామాజిక స్పృహ'గా గుర్తించడ మవుతుంది. ఇది రాజకీయ
వాది ఊహ కన్న, అభిప్రాయం కన్న, విస్తృతమైనదీ, సున్నితమైనదీ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బహురూప సమన్వితమైనదీ। బంధ విముక్తీ, సామాజిక పురోగతీ రాజకీయ చర్యద్వారానే జరుగుతవి అనే వాడు రాజకీయ వాది; అతనికి రచయిత తత్త్వమూ రచన తత్త్వమూ అవగాహనకు రావు. కేవలం రాజకీయమైన విప్లవాలు ఏ మాత్రం విముక్తినీ, పురోగతినీ సాధిస్తున్నాయో ఈ శతాబ్ది ప్రపంచ చరిత్ర పరిశీలన చేస్తే సులువుగానే బోధపడుతుంది।

పోతే మార్క్సిస్టు దర్శనం ప్రకారం - చరిత్రాంతంలో పరిపూర్ణ కమ్యూనిస్టు వ్యవస్థలో రచయితకు పూర్తి స్వేచ్ఛ అనే ప్రతిపాదనను పరిశీలిస్తే, అలా స్వేచ్ఛ పరాకాష్ఠ నందుకున్న పరిస్థితిలో సాహిత్యమే ఉండక పోవచ్చును. రచయితా పఠితా యిద్దరూ స్వేచ్ఛా జీవులైనప్పుడు ఒకరి అనుభూతినుంచీ మరొకరు ప్రేరణా, స్పృహా పొందేందుకు మాధ్యమంగా (Medium) సాహిత్యం అనవసరమే కావచ్చును। సుఖ దుఃఖాల వెలుగు నీడలు లేకపోతే సాహిత్యమూ లేదు।

★

Forwarded free of cost:
With the compliments of
Department of Education
Govt. of India, New Delhi.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదం

వ్యక్తి ప్రవృత్తికీ వ్యవస్థకూ మధ్యగల అంతరము అనాదినుంచీ ఉన్నదే. సమాజంలో ఒకడై ఉంటున్న వ్యక్తి తన ప్రవృత్తిని వ్యవస్థాబద్ధం చేసుకొని ప్రవర్తనను రూపొందించుకోవాలని సమాజం నిర్దేశిస్తుంది. అందుకై రూపొందినవి విద్యాబోధ, ధర్మప్రబోధము, మతప్రచారము, సంప్రదాయ సిద్ధమైన ఆచారాలూ, కట్టుబాట్లు, వంశగౌరవం, కుటుంబగౌరవం వంటివి. ఆచరణలో వ్యక్తి, వ్యవస్థ నిర్దేశించిన ఆదర్శాన్ని అందుకోలేకపోతాడు. అప్పుడు తీర్పు ఎలా ఉంటుంది? ఎలా ఉండాలి?

గీతాకారుడంటాడు –

"శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వభావ నియతమ్ కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్"

ఇక్కడ స్వధర్మమంటే వ్యక్తి ధర్మము, పరధర్మమంటే వ్యవస్థ నిర్దేశించే ధర్మము, స్వభావనియతమైన విధంగా వ్యక్తి తన ధర్మాన్ని నిర్వర్తిస్తే దానిలో దోషం లేదనే అంటాడు. ఇది మానవవ్యక్తి యొక్క నైజాన్నీ, వ్యక్తిలో పెరుగుదల, వికాసం ఎలా అయితే సాధ్యమో ఆ జీవ రహస్యాన్నీ తెలుసుకొని అన్నమాట.

అస్తిత్వవాదం (Existentialism) యిక్కడే ప్రారంభమౌతుంది. వ్యవస్థకంటె వ్యక్తి ధర్మానికి - అంటే వ్యక్తి వైశిష్ట్యానికీ, స్వేచ్ఛకూ, సహజ వికాసానికీ, ప్రాధాన్యాన్నిస్తుంది అస్తిత్వవాదం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కర్కెగార్డ్ (1813-55) యీ వాదానికి మూల పురుషుడు. రాజ్య వ్యవస్థతో, సాంఘిక వ్యవస్థతో, మత వ్యవస్థతో, సృష్టిలో మానవుని ప్రతిపత్తిని గురించి మేధావంతులూ శాస్త్రజ్ఞులూ నిర్మిస్తున్న ఊహా వ్యవస్థలతో, వ్యక్తి తాదాత్మ్యానికి ప్రయత్నించి, భంగపడి, వ్యక్తిగా ఆత్మవంచనకూ, ఆత్మనైచ్యానికీ పాల్పడ్డం ఆయన గుర్తించాడు. వ్యక్తి మాటలకూ చేతలకూ సంబంధం లేకపోవడం ఆయన గమనించాడు. "The philosopher of system is, as a man, like someone who builds a castle, but lives next door in a shanty...the thought of a man must be the house in which he lives, or it will become perverted" ఆలోచనకంటె అనుభూతి ప్రధానం. ఆ అనుభూతి స్వరూపాన్ని చిత్తశుద్ధితో గ్రహించే ఆత్మపరీక్ష ముఖ్యం. మనోవాక్కాయ కర్మల్లో ఏకత్వాన్ని సాధించడమే చిత్తశుద్ధితో జీవించడం (to live authentically) అదే వ్యక్తిగా రూపొందడం (to become a person). వ్యక్తి తన చేతలకు, నిర్ణయాలకు బాధ్యత వహించడం. ఇక్కడ కీలకం వ్యక్తికి ధర్మనిర్ణయం కర్మణ్యా తన అస్తిత్వ వైశిష్ట్యంమీద ఆధార పడాలి కాని, సిద్ధాంతంమీద, వ్యవస్థమీద కాదు. హేతుబద్ధమైన ఆలోచనమీద కాదు; తాత్కాలికమైన ప్రేరణమీద కాదు. ఇవన్నీ అస్తిత్వానికి ఉపాంగాలే తప్ప, ప్రాథమికం కావు. వ్యక్తి అంతరాంతరాల్లోంచీ ఉద్భూతమై, వ్యక్తిని ముందుకు నడిపించే అతని వైశిష్ట్యాన్ని 'అస్తిత్వం' (existence) అన్నాడు కర్కెగార్డ్. ఈ అస్తిత్వ నిర్వచనం ఆయన చేసిందే. ఇటువంటి ఆత్మజ్ఞానపరమైన అస్తిత్వం మనిషికే ఉన్నది. జంతువులకు లేదు.

కర్కెగార్డ్ ఆస్తికుడు, క్రైస్తవ సాధకుడు. భగవంతుడూ, క్రీస్తుమూర్తీ బయట లేరు, అంతర్యంలో అనుభూతిలోనే ఉన్నారు. భగవదన్వే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షణా, వ్యక్తి జీవితమూ ఒక్కటేనని ఆయన అభిమతం. కర్క్.గార్డ్ అంతర్ముఖత్వానికి ప్రాధాన్యం యిచ్చాడు.

నీషే (1844-1900) వ్యక్తి సంకల్పానికి (will) ఎక్కువ ప్రాధాన్యం యిచ్చాడు. సంకల్పాన్ని అస్తిత్వపు లోతుల్నుంచీ ధృఢపరచుకోవడం ద్వారా వ్యక్తి ధర్మానికి భిన్నమైన ధర్మాలను ఎదుర్కొని వాటికి లోబడక స్వధర్మ సాధన చెయ్యడానికి వీలవుతుందన్నాడు. కర్క్‌గార్డ్‌వలె నిజాయితీకి (anthenticity) స్వయం నిర్ణయత్వానికి ప్రాధాన్యం యిచ్చినా, అంతర్ముఖత్వానికి బదులు కార్యోన్ముఖతను నీషే బోధించాడు. సృజనాత్మక శక్తుల ద్వారా విలువల్నీ తనదైన ప్రపంచాన్నీ వ్యక్తి నిర్మించుకోవాలని ఆయన అభిమతం. నీతి, ధర్మం, వ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన అభివ్యక్తి మాత్రమే, వాటికి ప్రాథమికమైన విలువలేదు!

ఇరవయ్యో శతాబ్దపు అస్తిత్వవాదుల్లో మార్టిన్ హైడెగర్, యాస్పర్స్, సార్త్రే, కేమూ, పాల్‌టిల్లిచ్, గేబ్రియల్ మార్సెల్, బార్త్, మార్టిన్ బూబర్ ప్రముఖ దార్శనికులు. వీరిలో ఆస్తికులూ ఉన్నారు. నాస్తికులూ ఉన్నారు సార్త్రే నాస్తికుడు, పాల్‌టిల్లిచ్ ఆస్తికుడు. వీరందరూ దార్శనిక గ్రంథాలు వ్రాసినవారు. కాని సాహిత్యపరంగా అస్తిత్వ వాదానికి ప్రాభవాన్నీ ప్రాచుర్యాన్నీ తెచ్చిన రచయితలు సార్త్రే, కేమూ. ఇద్దరికీ నోబెల్ బహుమతి లభించింది. సార్త్రే బహుమతిని స్వీకరించలేదు.

సార్త్రే అస్తిత్వవాద దృక్పథంలో ప్రధానమైన అంశం వ్యక్తి స్వేచ్ఛ. సార్త్రే వ్యక్తి హృదయంలోని పారమార్థికాన్వేషణను గుర్తిస్తాడు, కాని యీ అన్వేషణకు గమ్యం లేదంటాడు. గమ్యమని ఊహించుకునే భగవంతుడు ఒక వ్యవస్థ, ఒక భావం, ఒక కల్పన. అందువల్ల అది మానవుని అస్తిత్వాన్నీ, దాని లక్షణమైన స్వేచ్ఛనే భంగపరిచే ఆత్మవంచన తప్ప మరేమీ కాదంటాడు. అతని దృష్టిలో అన్వేషణకు సార్థకత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కేవలం అన్వేషణే తప్ప మరొకటి కాదు. 'Man is a useless passion'. వ్యక్తిలో స్వేచ్ఛ ప్రధానం కాబట్టి, బాధ్యత, నిజాయితీ కూడా ప్రధానం అవుతాయి. నైతిక సూత్రాలు కాని, మానవత్వపు విలువలుకాని వ్యక్తి తన అస్తిత్వంనుంచీ కర్మణ్యా సృష్టించుకునేవే। (Existence precedes essence).

అస్తిత్వాన్ని మూడు పొరలుగా విశ్లేషిస్తాడు సార్త్రే. 'Being in itself' తనలో తను; 'Being for itself' తనకై తను; 'Being for others' ఇతరులకోసం తను. 'తనలో తను' అస్తిత్వంలో ఏకత్వం, అద్వైతం ఉన్నది. 'తనకై తను' లో ద్వైతం ఉన్నది. అంటే తన్ను వేరుగా ఒక వస్తువుగా చూడటం, ఇక్కడ తన్ను గూర్చిన ఆలోచనకు, ఊహకు, కల్పనకు అవకాశం ఉన్నది. ఇక్కడ ఆత్మజ్ఞానానికీ, ఆత్మ వంచనకీ కూడా అవకాశం ఉన్నది. 'ఇతరులకోసం తను' లో ఇతరుల దృష్టిలో తన్ను గూర్చిన అభిప్రాయం ఏమి ఉన్నదో దాన్ని ఊహించడం వల్ల, దాని ప్రభావం వల్ల, ప్రవర్తనను అలా రూపొందించుకోవటం. ఇక్కడ స్వేచ్ఛపోయి వ్యక్తికి జడత్వం (becomes a thing), బానిసత్వం. పరప్రత్యయనేయబుద్ధి వల్ల వినాశం, శైథిల్యం సంభవిస్తాయి. వ్యక్తి ('Being in itself) 'తనలో తను' స్థాయినుంచీ జీవించినప్పుడే నిజాయితీ, బాధ్యత, స్వేచ్ఛ అనే విలువలు సిద్ధిస్తాయి. సామాజికుడైన మానవునిలో ఈ మూడు పొరల అస్తిత్వమూ ఉంటూనే ఉన్నది. ఎవరూ దాన్ని తప్పించు కోలేరు. ఏది ప్రాధాన్యం వహిస్తున్నదన్న విషయమే కీలకం.

పాల్ టిల్లిచ్ అస్తిత్వవాదంలో మూడు రకాలైన అస్తిత్వవేదన లను (Existential Anxieties) పేర్కొని, వాటికి ప్రాముఖ్యం యిస్తాడు. (1) విధి - మృత్యువు : ఎప్పుడు ఏమౌతుందో అన్న భయం, మృత్యువు తప్పదన్న స్పృహ (2) శూన్యము - నిరర్థకత : ఎప్పుడూ ఏదో చెయ్యా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లనే ఆదుర్దా, చేస్తున్న దానికి అర్థమేమిటన్న ప్రశ్న (3) పాపము - శిక్ష: చేస్తున్నది తప్పు. పాపం అనే ఆదుర్దా. దానికి శిక్ష ప్రత్యాఖ్యానము అనే భయం. ఈ మూడు రకాల వేదనలూ వ్యక్తి అస్తిత్వానికి బంధనాలు. విముక్తిమార్గం, నమ్మకమూ ధైర్యమూ ఒకటై వేదనల్ని ఎదుర్కొనటం ద్వారా, మనస్సుని భగవత్తత్వం వైపు మళ్ళించడముద్వారా, సిద్ధించే అస్తిత్వమే। అస్తిత్వ వేదనలే ద్వారం తెరచి భగవత్సాక్షాత్కారం చేయి స్తాయి. వేదనా జన్యమైన నిరతిశయ దైన్యాన్ని (despair) ఆకళించుకొని దానితో తాదాత్మ్యం పొందటంద్వారా దాన్ని అధిగమించిన మానవ అస్తిత్వం భగవత్తత్వాన్ని చేరుకుంటుంది. భగవన్మూర్తిని ధ్యానించే స్థితి కేవలం మానసికమైనది. భగవదైక్యం పొందే అస్తిత్వం మనస్సును అధిగమించి మనస్సు కావలే ఉంటుంది. అది అనిర్వాచ్యము. దాన్నిలా వర్ణిస్తాడు టిల్లిచ్ :-

"It is both the courage of despair and the courage in and above every courage. It is not a place where one can live, it is without the safety of words and concepts, it is without a name, a church, a cult, a theology. But it is moving in the depth of all of them. It is a power of being in which they participate and of which they are fragmentary expression."

పాల్ టిల్లిచ్ దృక్పథంలో వ్యక్తికి ముఖ్యమైనవి ధైర్యమూ, విశ్వాసమూ, వాటిద్వారానే అస్తిత్వ సిద్ధి.

2

ప్రముఖ అస్తిత్వవాదుల వివరణలద్వారా యీ వాదంలో భిన్న దృక్పథాలకు ఎలా అవకాశం ఉన్నదో గమనించాము. వ్యక్తి వైశిష్ట్యాన్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుర్తించి, మానవుల్లో ఒక్కొక్క వ్యక్తికీ అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఉన్నదనీ, దాని అభివ్యక్తి భిన్నంగా ఉండక తప్పదనీ, తద్వారా వ్యక్తి జీవితమూ, ప్రవర్తనా, వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు, వ్యక్తి ధర్మాన్నే ఉత్కృష్టమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్తిత్వవాద దృక్పథంయొక్క సారాంశం.

ఈ దృక్పథం క్రమంగా విస్తరించి ప్రస్ఫుటమై ఆధునిక సాహిత్యంలో ప్రాచుర్యాన్ని పొందటానికిగల కొన్ని కారణాల్ని పరామర్శ చేస్తాను. వైజ్ఞానిక విప్లవం (Scientific Revolution), పారిశ్రామిక విప్లవం (Industrial Revolution) వ్యాప్తి చెందడంతో సంప్రదాయబద్ధమైన మతవిశ్వాసాలూ, సామాజిక నియమాలూ సడలిపోయి శైథిల్యం చెందుతూ వచ్చాయి. పూర్వయుగంలో, మతంలోకాని సమాజంలోకాని వ్యవస్థా దృక్పథానికీ వ్యక్తి దృక్పథానికీ సమైక్యం (integration) విధాయకం. ఆ సమైక్యం విశ్వాసంమీదా, భక్తిప్రపత్తులమీదా, భయంమీదా ఆధారపడినది. దానికి హేతువాదంతో, వ్యక్తి యొక్క స్వయం వివేచనతో పనిలేదు. ఒకవేళ ఉన్నా, అటువంటి హేతువివేచన, తర్కం సంప్రదాయానికి విధేయంగా జరగవలసిందే! అట్లా జరగని సందర్భాల్లో ఆ వ్యక్తి సమాజంనుంచి బహిష్కృతుడయ్యేవాడు, లేదా ఆ వ్యక్తి తన ప్రతిభతో సమాజాన్ని ఆకర్షించి, వ్యవస్థను సంస్కరించి, కొత్తబాటలు వేసి పూజ్యుడయ్యేవాడు. ఏమైనా వ్యవస్థకూ వ్యక్తికీ భిన్నమైన దృక్పథాలు ఉండటానికి వీల్లేదు. వైజ్ఞానికయుగంలో, హేతువాదం, స్వయం వివేచన ప్రాముఖ్యం వహించడంవల్ల, ఒక వ్యక్తి మనస్సుకూ మరియొక వ్యక్తి మనస్సుకూ సంబంధంఉన్నా సమైక్యం లేదు. ఆధునిక సమాజంలో మనుష్యుల సంబంధాలు పారిశ్రామిక విప్లవంవల్లా, వాణిజ్య విస్తృతివల్లా మరీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క్లిష్టమై సంకీర్ణం కావడంతో, జీవన విధానంలో వైవిధ్యంతోబాటు దృక్పథ భిన్నత్వమూ నిరవధికంగా పెరిగింది. ఈ పరిస్థితిలో జీవితాన్ని గూర్చి ఎవరి విశ్వాసాలూ విలువలూ వారివి అవుతున్నాయి. వాటికి తగినట్లే హేతువులు, వివేచనా, కర్తవ్యమూ ఉంటున్నాయి. ఇప్పుడు జీవితాన్ని గూర్చి సామాజిక దృక్పథానికీ ఏకస్వరూపం అంటూ లేకుండా పోతున్నది. ఉన్నంతమాత్రంలో దానికీ వ్యక్తి దృక్పథానికీ సమైక్యం ఏర్పడ్డం అసాధ్యం అవుతున్నది. పైకి ఏర్పడినట్లు కనిపించినా ఆచరణా అనుభవమూ వేరుగానే ఉంటాయి.

నేటి సామాజిక దృక్పథంలో, ఉదాహరణగా ముఖ్య విలువలైన 'ప్రజాస్వామ్యాన్నీ' 'మానవ సమానత్వాన్నీ' తీసుకుంటే, ఇవి అందరూ అంగీకరించినవే. అయితేనేం! ఈ అంగీకారం కేవలం నినాదాలకు మాత్రమే పరిమితమనీ, ఆచరణలో ఒక్కొక్కవర్గం, ఒక్కొక్క వ్యక్తి వీటికి ప్రత్యేకమైన అర్థాన్ని ఆపాదిస్తున్నారనీ అందరికి తెలిసిన విషయమే. అలాగే సమాజంలో వివాహంవంటి వ్యవస్థగాని, ప్రేమవంటి ఆదర్శంగాని కొలబద్దగా తీసుకుని ఒక్కొక్క వ్యక్తి జీవితాన్నీ ఆచరణనూ పరామర్శించేందుకు పూనుకుంటే, ఒక వ్యక్తి వికాసానికి సుఖసంతోషాలకు ఆ వ్యవస్థ లేక ఆదర్శం అవకాశం కావచ్చు. మరోవ్యక్తికి అదే అవరోధమో శాపమో కావచ్చు. బయటినుండి స్థూలంగా అందరి వ్యక్తుల విషయంలోనూ ఒకే కొలబద్దతో నైతికమైన తీర్పు చెయ్యడం చాల సులువు. కాని వ్యక్తి వైశిష్ట్యాన్నీ ప్రత్యేకమైన పరిస్థితులనూ గూర్చిన అవగాహన లేనిదే మన నైతిక దృష్టికీ తీర్పుకూ ఏమి విలువ ఉన్నట్లు?

సాహిత్యపరంగా ఒక వ్యక్తి అస్తిత్వానికి ఏ నవలలోనో కథలోనో ఆవిష్కరణ జరిగినప్పుడు మాత్రమే ఆ అవగాహన సాధ్యమౌతున్నది. అటువంటి అవగాహన, దాని ఫలితమైన విశాలదృష్టి, సహనమూ, సాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భూతీ, నేటి సమాజంలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య అవసరమౌతున్నవి. ఏమంటే ఈ సమాజంలో పూర్వయుగపు సామూహిక సమైక్య మనఃఫలకము ముక్కలు ముక్కలై, నేడు వ్యక్తులకు ఎవరిముఖం వారి ముక్కలో కనిపించడమే తప్ప యితరుల ముఖాలు సవ్యంగా కనిపించే మార్గం లేదు. ఒక వ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన విలువలంటూ ఏవో ఉండవచ్చు అనే దృష్టి ముఖ్యమౌతోంది. ఒకవేళ సానుభూతిద్వారా ఆ వైయక్తికపు విలువల్ని గ్రహించే ఓపిక, ఆకాంక్ష లేకపోతే, కనీసం అవతలి వ్యక్తిని వ్యక్తిగా గౌరవించే దృక్పథమైనా నేడు అవసరం. సమాజం మారింది. జీవితంలో వైవిధ్యం ఎంతో ఉన్నది. వ్యవస్థ గుర్తించిన జీవిత మార్గాలే తప్ప తక్కినవి ఉండటానికి వీల్లేదనే మొండిపట్టు పట్టడంవల్ల సాధించేది ఏమీలేదు. ఇతరులను బాధపెట్టడమూ, తన్నుతాను బాధపెట్టుకోవడమూ అవుతుందే తప్ప అది శాంతి మార్గమూకాదు, బాధావిముక్తి మార్గమూ కాదు. అస్తిత్వవాద దృక్పథంతో నేటి సమాజానికి ఉన్న అవసరం యిదే!

3

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథం అభివ్యక్తమైన రచనల్ని పరామర్శించే ముందు సార్త్రే రచించిన ఒక కథను ఉదాహరిస్తాను. ఈ కథపేరు 'సాన్నిహిత్యం' (Intimacy). కథలో భార్యాభర్తలు. ఇద్దరికీ చాలా అన్యోన్యం. భర్త నపుంసకుడు. కాని వారి అన్యోన్యానికి యిదేమీ అడ్డురాదు. భార్యకు భర్తమీద ఎంతో ఆప్యాయత, ప్రేమ, జాలి. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. ఈ సన్నివేశంలో భార్య స్నేహితురాలు ఆమెని విమర్శిస్తుంది. భర్తను వదిలి తనకు తగిన మగవానితో లేచి పొమ్మని ప్రోత్సహిస్తుంది. జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దంటుంది. భార్యాభర్తల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మధ్య ఒక చిన్న కలహం మూలంగా భార్య వెళ్ళిపోతుంది. వివాహానికి మూలమైన శారీరక సంబంధం భార్యాభర్తల మధ్య లేకపోవడంవల్ల భార్య మరో పురుషుణ్ణి వరించడం సమర్థనీయమే! అది చట్టమూ, సమాజమూ అంగీకరించే ధర్మమే. కాని కథలో తనకేది కావాలో ఆలోచించుకున్న ఆ భార్య చివరకు తన భర్త దగ్గరకే వచ్చివేస్తుంది. ఇక్కడ ఆమె భార్యకంటె, స్త్రీ కంటె, విశిష్టమైన వ్యక్తిగా, చేసుకున్న నిర్ణయం మనకు గోచరిస్తుంది. వ్యక్తి ధర్మం జయించింది. తెలుగులో చలం వంటి రచయిత, వివాహ వ్యవస్థమీద దండెత్తిన రచయిత యిలాంటి కథ వ్రాయగలడా! ఊహించండి. మన సంఘంలో వ్యవస్థా ధర్మమే పాతివ్రత్యం కావడంవల్ల, పాతివ్రత్యానికంటే 'సెక్స్' మానవతా సహజ ధర్మంకాబట్టి ఆ భార్య లేచిపోయిందనడమే చలం కథ ధ్యేయం అవుతుంది; ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే 'సెక్స్' సంబంధాల్లో 'స్వేచ్ఛ' అనే నినాదాన్ని తన రచనల్లో మొదటినుంచీ చివరిదాకా ఉద్యమంగా ప్రచారంచేసిన చలం, కాల్పనికవాదీ, సంస్కర్తా తప్ప అస్తిత్వవాది కాడు. ఆయన సెక్స్ అనే సిద్ధాంతాన్ని చూచాడు. దాన్ని అందరికీ అన్వయించాడు కాని వ్యక్తి వైశిష్ట్యంలోగల భిన్నత్వాన్ని చూడలేదు. సమాజంలో మతం, నీతి, సంప్రదాయం, నిర్దేశించిన వ్యవస్థా ధర్మంకంటె మానవత్వం ప్రధానమనేది ఒక మెట్టు; కాని యీ మానవత్వం 'సెక్స్', 'పేదరికం' వంటి ఒక సామాన్య లక్షణాన్నో, ఒక సిద్ధాంతాన్నో ఆధారం చేసుకున్నది మాత్రమే. దానికంటె వ్యక్తి అస్తిత్వ వైశిష్ట్యం ముఖ్యం అంటుంది అస్తిత్వవాదం. ఆ వైశిష్ట్యం ఏ రూపంలోనైనా ఉండవచ్చు. అది వ్యవస్థను సమర్థించేది కావచ్చు, వ్యతిరేకించేది కావచ్చు!

1947 ప్రాంతాల వెలువడిన 'అల్పజీవి' (రా.వి.శాస్త్రి) నవలలో ఆడ్లర్ మనస్తత్వ సిద్ధాంతదృష్ట్యా సుబ్బయ్యపాత్రను రచయిత సృష్టించినా,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ పాత్రలోని వ్యక్తి వైశిష్ట్యం, అనుభవాల చిత్రణ, అస్తిత్వవాదాన్ని స్ఫురింపచేస్తాయి. హైడెగ్గర్ వ్యక్తి జీవితంలో అస్తిత్వపు లోతుల్ని స్పృశించే క్లిష్ట సన్నివేశాన్ని గూర్చి చెబుతూ, వ్యక్తి మృత్యువువంటి తీవ్రమైన అనుభవం ద్వారా పునర్జన్మ పొంది తనదైన జీవితాన్ని నిర్మించుకుంటాడు అంటాడు. భయంతో జీవించే ఎన్జీవో సుబ్బయ్యని గవరయ్య అనే కంట్రాక్టరు తన మనుష్యులచేత బలవంతంగా రప్పించి బెదిరించి ప్రామిసరీ నోటుమీద సంతకం చేయిస్తాడు. బెదిరించే సన్నివేశంలో సుబ్బయ్య భయం తారస్థాయి నందుకుని కొన్ని క్షణాలు తను చచ్చిపోతున్నానని మృత్యువే వచ్చినంత అనుభూతికి లోనవుతాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్యతో నిజం చెప్పలేక, అబద్ధం చెబుతూ, ఒక గాఢమైన జాగృతిని పొందుతాడు. సుబ్బయ్య తన అస్తిత్వపు సత్యాన్ని ఎదుర్కొని గుర్తించినట్లు సూచిస్తాడు రచయిత -

"ఛస్తున్నాను బాధపడుతున్నాను
చస్తూ బాధపడుతూ అబద్ధాలాడుతున్నాను
చావబోతూ అబద్ధం చెప్పేను
చెప్పేను అబద్ధం చెప్తూ చెప్తూ చస్తాను
చెప్పేది అబద్ధం, చావబోయేది నిజం
చావేకాదు ఈ బాధకూడా నిజం
నిజంకన్న నిజం చావుకన్న నిజం అబద్ధంకన్న నిజం యీ బాధ
మనిషి మాట అబద్ధం మనిషి బాధ నిజం
మనిషి చావు నిజం
అబద్ధపు బ్రతుకు బ్రతుకుతూ నిజం బాధలు పడుతూ
అతి నిజంగా చస్తాను"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ చివరి వాక్యంలో వ్యక్తి సమాజంలో పొందే అస్తిత్వపు భంగపాటును గూర్చి అస్తిత్వవాదులు వివరించిన దర్శనాల సారాంశం అంతా యిమిడి వుంది.

1947 ప్రాంతాల్లోనే వెలువడిన మరో నవల బుచ్చిబాబు వ్రాసిన 'చివరకు మిగిలేది'. దీన్ని చాలా ఆసక్తిగా పాఠకలోకం చదివారు. నవలలోని సందేశం ఏమిటో నీతి ఏమిటో బోధపడక ఈ నవలలో మిగిలేదేమీ లేదు, చివరకు అట్టలు కూడా మిగలవు అంటూ విమర్శించారు. దయానిధి పాత్ర ఫ్రాయిడ్ ఈడిపస్ కాంప్లెక్స్ సిద్ధాంతంమీద నిర్మింపబడిందని ఒక దృష్టితో వ్యాఖ్యానించవచ్చు. కాని ఆ సిద్ధాంతాన్ని, దాని తాలూకు న్యూరాసిస్‌ని అధిగమించిన అస్తిత్వ సత్యం దయానిధిపాత్రలో అభివ్యక్తమైంది. దయానిధి వ్యవస్థతోపడ్డ సంఘర్షణ స్వరూపం యిలా ఉంది - పుట్టుకలో అంగవైకల్యం కలిగిన వ్యక్తి, తనకు అంగవైకల్యం లేదనీ, తను అందరిలానే ఉన్నాననీ నమ్మటానికి ఎంతగా ప్రయత్నించినా అడుగడుగునా ఆ కఠిన సత్యం గుర్తువస్తూనే ఉంటుంది. చివరికి ఆ విషయాన్ని మనః స్ఫూర్తిగా అంగీకరించి "అంగవైకల్యం ఉంటేనేం ? నేనూ మనిషినే" అన్న ఆత్మవిశ్వాసానికి రాగలిగినప్పుడు తనతో తను సమాధానపడటం జరుగుతుంది. దయానిధి సమస్య యిలాంటిదే. అతని తల్లి పతివ్రత కాదు. ఇది పోగొట్టుకోవడానికి వీల్లేని మచ్చ. భార్య ప్రవర్తన సరిగా లేకపోతే విడాకులిచ్చి సంబంధం లేదనవచ్చు. కాని తల్లి అటువంటి వ్యక్తి అయినప్పుడు, అది పుట్టుకలో వచ్చే అంగవైకల్యం వంటిది. దయానిధి చివరకు పతిత అయిన కోమలిని స్వీకరించడంతో తనతో తాను సమాధానపడి శాంతిని సాధిస్తాడు. ఈ స్వీకరించడంతో భార్యగాకాదు, ప్రేయసిగాకాదు, ఉంపుడుగత్తెగా కాదు. మనిషిని మనిషిగా. దయానిధి అన్వేషణలో, చేరిన గమ్యంలో, వ్యవస్థలో యిమిడే సంగతులు లేనేలేవు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యవస్థతోటి సంఘర్షణే అతణ్ణి గమ్యం చేర్చింది. సౌందర్యమూ, సౌశీల్యమూ, అభిజాత్యమూ ఏమీలేని కోమలి ఎందుకు తనని అందరికంటె ఎక్కువగా ఆకర్షిస్తున్నదో దయానిధికి అర్థంకాదు. అది శారీరకమైన వాంఛ అని తోచినా నిజానికి అదీ కాదు. నవల మొదట్లో దయానిధికి కోమలి అందుబాటులో ఉన్న క్షణాల్లో కూడా శరీరం తనతో యిలా అంటున్నట్లు తోస్తుంది: "ఇది అన్యాయం, నేనీ పనిచెయ్యలేను, నేనే సౌందర్యం, నన్ను నేను ధ్వంసం చేసుకోలేను. ఇతరులనీ ధ్వంసం చెయ్యలేను, నన్నొదిలెయ్యి". నవల చివర ఆత్మపరీక్ష చేసుకున్న దయానిధి యిలా అంటాడు. "చూడు కోమలీ, నాకు ప్రేమంటే ఏమిటో యింత వరకు తెలిసింది కాదు. అందరిలాగా, శరీరవాంఛనే ప్రేమనుకొని నన్ను నేను దగా చేసుకోలేను. ఇతరులు ఎవరితోనూ, ఏ ఒక్కరితోనూ పంచుకోలేనిది నా ప్రేమ. అదొక దృష్టి - జీవితం అంతటినీ, తుదీ మొదలూ, ముందూ వెనకా అన్నింటినీ దూరంగా చూచి అర్థం చేసుకునే, ప్రపంచంపై ఒకచూపు.... నీతో స్నేహంవల్ల ఆ దృష్టి పోతుంది" అంటాడు. దయానిధి తన ఏకాంతానికి తన అస్తిత్వానికి ప్రాథమిక విలువ యిస్తున్నాడు. శరీరవాంఛకూ ప్రేమకూ తనదైన నిర్వచనాన్ని యిస్తున్నాడు. ఈ నవలలో 'అస్తిత్వం' ప్రధానంగా, సహజంగా జీవించే పాత్ర అమృతం. నవల చివర రచయిత గుర్తించిన సత్యం "ఏ ఒక్కరి పరిస్థితులూ బుద్ధివికాసాలూ మరొకరికి రావు. ఐనా వాళ్ళందరినీ ఒక ఫక్కీలో నడచుకోమనడమే మన దౌర్భాగ్యం....మనం ముక్కలై 'నువ్వూ' 'నేనూ' అయి ఉత్తర దక్షిణాలకు ప్రయాణం చేసింది. 'అందరూ' మాత్రం లేరు. ఇది వ్యక్తి విశిష్టతను గుర్తించడం. "చివరికి మిగిలిందేమిటి ?" అనే ప్రశ్నకు "తనతో తను సమాధానపడటం - అదే మిగిలింది" అని జవాబు. "ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూచి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నప్పుడు ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఈ జీవిత రహస్యం - దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నం - ఏ గొప్ప గ్రంథానికైనా యిది పునాది. ఈ నవలకీ అదే పునాది" అంటూ రచయిత చెప్పుకున్న ముందు మాటలో అస్తిత్వవాద దృక్పథమే అభివ్యక్తమైంది.

1961 లో గోపీచంద్ 'మెరుపుల మరకలు' అనే నవల వచ్చింది. అస్తిత్వవాద దృక్పథం ఆధారంగా జీవితాన్ని పరిశీలిస్తున్నట్లు నవలలో ఒకచోట చెప్పుకున్నారు కూడా. ఉషారాణి విశిష్ట వ్యక్తిత్వ చిత్రణమే ఈ నవల వస్తువు: నైతిక వ్యవస్థ దృష్ట్యా చూస్తే, ఉషారాణి వ్యభిచారిణి. ఆమెను మనో వైజ్ఞానిక శాస్త్ర దృష్ట్యా చూస్తే ఆమె 'nymphomaniac' అనాలి. కాని నిజానికి ఆమెలో mania - పిచ్చి న్యూరాసిస్‌వంటి లక్షణాలేవీ లేవు. ఆమె నిజాయితీ, సాహసం, ఆమె ప్రియుల్నే కాదు, పాఠకుల్ని కూడా ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఆమె పోయిన పోకడలో ఆత్మ విశ్వాసం, స్వచ్ఛంద ప్రవృత్తి, స్నేహం, ఆప్యాయత ద్యోతకమౌతాయి. ఆమె అన్వేషణ వైరాగ్యంలో పర్యవసించిన క్షణంలోకూడా బాధ్యతతో భర్త దగ్గరకు వచ్చి, తన గత జీవితాన్ని దాపరికం లేకుండా చెప్పి క్షమాపణ కోరి సెలవు తీసుకుని ఆధ్యాత్మిక జీవితం గడపటానికి వెళ్ళిపోతుంది. ఉషారాణి స్వధర్మం సెక్స్ ప్రవృత్తితో ప్రారంభమై తన అస్తిత్వానికి అర్థం ఏమిటి? తనెందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నది? అనే ప్రశ్నలతో ఒక కొలిక్కి వచ్చి, అస్తిత్వపు ఏకాంతంనుంచీ భగవత్తత్వము వైపు పయనిస్తుంది.

ఈ నవలలో ఒక ఆకర్షణీయమైన సన్నివేశం ఉషారాణికి చక్రవర్తి తర్వాత శ్రీకాంత్‌తో ఏర్పడిన స్నేహాన్ని గూర్చి చక్రవర్తి ఈర్ష్యతో ప్రవర్తించి ప్రశ్నించినప్పుడు ఆమె అతనికిచ్చిన సమాధానాలూ, అతడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పసిపిల్లవానిలా సాంత్వనపరచడమూ. ఇక్కడ చక్రవర్తి తనకు ఉషారాణి పట్ల అనన్య సామాన్యమైన ప్రేమ ఉన్నదన్నప్పుడు, "అభిప్రాయాలు వెలిబుచ్చడానికేం? శ్రీకాంత్‌కూడా అలానే అంటాడు" అంటుంది ఉషారాణి. "మా యిద్దరికీ ఉన్న తారతమ్యం నీ మనస్సుకు తెలీదా?" అని ప్రశ్నిస్తాడు చక్రవర్తి. "తెలీదు" అంటుంది ఉషారాణి. మాటల్లో బహిరుపాధుల్లో నిరూపితమయ్యే సత్యం స్థూలంగానే ఉంటుంది. వాటికందని వైవిధ్యం, వైశిష్ట్యం వ్యక్తి ఆంతర్యానికి సంబంధించినది. అది మరొకరికి సానుభూతి ద్వారా తప్ప అందుబాటులో ఉండదు. వ్యక్తి అంటే కేవలం ఏకాంతం. వాచ్యంగాకాక సాహిత్యంలో పాత్ర చిత్రణద్వారా, ధ్వనిరూపేణా సూచింప గలిగిన ఒకానొక వ్యక్తి అస్తిత్వంకూడా సానుభూతి ద్వారానే గ్రాహ్యం. దాన్నే 'సహృదయత' అంటారు.

1960 లో భాస్కరభట్ల కృష్ణారావు అస్తిత్వవాద దృక్పథంతో నవల వ్రాసే ప్రయత్నంలో 'వెల్లువలో పూచికపుల్లలు' వ్రాశారు. శీర్షికలోనే భాస్కరరావు ఈ దృక్పథాన్ని గూర్చి పడిన అపోహ ఏమిటో తెలుస్తుంది. వ్యక్తి వెల్లువలో పూచికపుల్ల కాడు, కాకూడదనే అస్తిత్వవాదం నొక్కి చెబుతోంది. వ్యక్తిలో బాధ్యత, నిజాయితీ, ఆత్మపరీక్ష అనేవి అతని జీవితంలో అస్తిత్వ దర్శనానికి, విశిష్టమైన విలువల సృష్టికీ కీలకమైన గుణాలు. అవి లోపించిన వ్యక్తి వెల్లువలో పూచికపుల్లా, చరిత్రహీనుడూ అవుతాడు. ఈ నవలలో మధు సమస్యకూడా 'చివరకు మిగిలేది' లోని దయానిధి సమస్యే. తల్లి పతివ్రత కాకపోవడం. కాని మధు ఈ సత్యాన్ని ఎదుర్కొని అస్తిత్వాన్ని దర్శించే బదులు నిరీహుడై తన చేతలకు తాను బాధ్యత వహించడానికి నిరాకరిస్తాడు. ఫలితం ఏ విధంగానూ సమర్థనీయం కాని అతని నైతిక ప్రవర్తన. పాఠకుల సానుభూతిని పొందలేకపోతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1963 లో పి. వి. సుబ్బారావు వ్రాసిన 'ఆమె చెప్పింది' అనే నవలకూడా అస్తిత్వ దృక్పథాన్ని ఉద్దేశించిన రచనే. "యథార్థాన్ని మించిన నీతిగాని మానవత్వాన్ని మించిన పవిత్రతగాని ఏ యుగంలోనూ లేదనుకుంటాను. ఉంటే అది నీతికాదు, అది పవిత్రతకాదు. ఆ నీతి మేడిపండు. ఆ పవిత్రత దానిలోని పురుగులు మాత్రమే" అన్న ముగింపు వాక్యాలతో తమ నవలలో చిత్రించిన మృణాళిని అనే సినిమాతార యొక్క సంప్రదాయ విముక్తమైన జీవితాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. ఈ నవలలో మృణాళినీ రజనీ కాంతుల సంబంధం సామాజిక వ్యవస్థ సూత్రాలకు అతీతమైన ఒక అనుబంధం. అసంభావ్యమేమీ కాదు. కాని రచయిత మృణాళిని వ్యక్తిత్వం ఎలా అస్తిత్వపు ప్రాథమిక విలువలను స్పృశించిందో చిత్రించలేకపోయారు. ఇది శిల్పంలో లోపం.

అస్తిత్వవాద దృక్పథం అభివ్యక్తం కావటానికి పాత్ర చిత్రణలో గాని, సన్నివేశాల్లోగాని, ముగింపులోగాని ఎక్కడో ఒకచోట అస్తిత్వపు గాఢ స్పర్శ. అనుభూతి పాఠకునికి అందాలి. ఇది ముఖ్యం. 'అల్పజీవి', 'చివరకు మిగిలేది', 'మెరుపుల మరకలు' నవలల్లో ఈ లక్షణం ఉన్నది. 'వెల్లువలో పూచికపుల్లలు', 'ఆమె చెప్పింది' నవలల్లో లేదు. వ్యవస్థతో వ్యక్తి ధర్మానికి జరిగే సంఘర్షణ ఒక్కటే కాదు ముఖ్యం ఆ సంఘర్షణలో, ఆ వ్యక్తి వేసే ప్రతి అడుగులో, పోయే పోకడలో, గాఢమైన అనుభూతి, చిత్తశుద్ధి, ఆత్మపరీక్ష ద్యోతకమౌతూ అస్తిత్వ దర్శనం జరిగిన స్ఫూర్తి ఉండాలి. ఒక నవలలో అభివ్యక్తమయ్యే జీవితానికి వ్యవస్థాపరంగా, సిద్ధాంతపరంగా, సామాజికంగా, హేతుబద్ధంగా అర్థం లేకపోవచ్చు; అంతమాత్రాన అది అస్తిత్వవాద దృక్పథానికి అభివ్యక్తి కానేరదు. అస్తిత్వపు అనుభూతి రసధ్వనిగా అందడం ప్రధానం. అప్పుడే ఆ నవలకు ఆ పాత్రకు ప్రాణం వస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంతవరకు వ్యవస్థతో సంఘర్షణపడి తద్వారా అస్తిత్వ దర్శనం పొందిన ప్రధాన పాత్రలుగల నవలల్ని పరామర్శించాను. ఇక్కడ వ్యక్తి తనతో తాను సమాధానపడటం ప్రధానమైన పర్యవసానం. అస్తిత్వవాద దృక్పథానికి యిదే మూసకాదు. వ్యక్తి వైశిష్ట్యం కారణంగా వ్యవస్థతో ఘర్షణపడటమే జీవితం కానక్కరలేదు. ఇంతవరకూ పేర్కొన్న నవలల్లో జీవితమూ వ్యక్తిత్వమూ విడివిడిగా ఉంటూ ఒకదానితో ఒకటి ఎలా అనుసంధిస్తున్నాయో చిత్రించడం కనిపిస్తుంది. ఇది ఒక పద్ధతి. ఇదికాక మరో పద్ధతి వుంది. జీవితం, విలువలు, వ్యక్తి - మూడు వేరువేరు విషయాలు కావు. జీవించడంనుంచీ విలువలూ, వ్యక్తిత్వమూ సిద్ధిస్తాయి అనే అస్తిత్వవాద దృక్పథం నవల ఎత్తుగడలో, నడకలో, శిల్పంలోనే, ఆవిష్కృతం కావడం. ఈ రకం నవల ఒక విస్పష్టమైన వ్యక్తిత్వంతో ప్రారంభం కాదు. జీవితంతో ప్రారంభమౌతుంది. అంటే వ్యవస్థను అంగీకరించడంతోనే ప్రారంభమౌతుంది. అక్కడినుంచీ వ్యక్తిత్వమూ, కొత్త విలువలూ, జీవితంలోని వివిధ సంఘటనలు కారణంగా ప్రస్ఫుట మౌతూ వచ్చి, చివరకు జీవితంలో 'అస్తిత్వ'మే ప్రధానమైన విలువగా ధ్వనింపబడుతుంది. ఈ పద్ధతి నవలలు 'మళ్ళీ వసంతం' (ఆర్. ఎస్. సుదర్శనం) 1960, 'తాగుబోతు' (వి. నాగరాజు) 1963, 'మైనా' (శీలా వీర్రాజు) 1964.

'మళ్ళీ వసంతం' నవల ఊర్మిళ అనే పాత్ర తన జీవితాన్ని గూర్చి తాను చేసుకున్న పరామర్శ. నిశితమైన విశ్లేషణం. ఊర్మిళ తన జీవితంలో జరిగిన విశేషాలకూ తనతో సంబంధమున్న మనుష్యులకూ ఏ విలు వనూ అర్థాన్నీ ఆపాదిస్తున్నదో ఆమె కథనం ద్వారానే మనం గుర్తించాలి. ఆమెకు వ్యవస్థతో సంఘర్షణలేదు. కాని వ్యవస్థ ఆమెను వంచిస్తూ వచ్చింది. గడచిన జీవితాన్ని ఆమె పరామర్శించడంలో, ఆమె కథనంలో,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆలోచనా పైఖరిలో, ఆలోచించే గుణంలోనే ఆమె వ్యక్తిత్వం యొక్క ప్రత్యేకత మనకు గోచరమౌతుంది. ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ గతాన్నీ ప్రకృతాన్నీ సమన్వయం చేసుకుంటూ వెళ్ళడం ఆమె ప్రవృత్తి. అందువల్ల నవలలో ఆమె జీవితానికీ వ్యక్తిత్వానికీ తాదాత్మ్యం ఉన్నది. ఊర్మిళ కథనంలో ఇతర పాత్రలు కన్పించినా వాళ్ళు ఆమె మనశ్చిత్రాలే తప్ప వాళ్ళకు ప్రత్యేకమైన అస్తిత్వం లేదు. నవలద్వారా మనకు గోచరమయ్యేది ఊర్మిళ అస్తిత్వమూ, ఆ అస్తిత్వపు విలువలూ. ఊర్మిళ తను సాధించి నానని అనుకునే విలువల్ని మనం అంగీకరించవచ్చు, తిరస్కరించవచ్చు. కాని ఆమె జీవితంలో రాజీ కుదుర్చుకుంటుంది నవల చివర. ఆమెను గూర్చిన తీర్పు పాఠకులకే మిగిలి ఉంటుంది!

'తాగుబోతు' నవల చైతన్య స్రవంతి మార్గంలో వ్రాయబడింది. ఇందులో ముసలివాడైన తాగుబోతు గత జీవిత స్మృతులే అతని జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ అభివ్యక్తం చేస్తాయి. వాటి ధ్యాసతోనే వాడు ప్రాణాలు విడుస్తాడు. ఆ ముసలివాడి జీవితం, వ్యక్తిత్వం అర్థశూన్యమనీ, మనకు తెలిపిన విశేషమైన విలువలు అందులో కనిపించవనీ అనుకోవచ్చు. కాని తాగుబోతు పాత్ర చిత్రణ మనలో కలిగించే కళానుభూతిలోనే వాని అస్తిత్వపు ప్రాథమిక విలువ గోచరమౌతున్నది. అది అనుభూతికే తప్ప వ్యాఖ్యానానికి అందేదికాదు!

'మైనా'లో నాయకుడు సాయిబాబా. పోలీస్ కాన్‌స్టేబిల్. ఈ నవలలో కథ ఉన్నా, కథా సంవిధానంలేదు. అందుకు కారణం సాయిబాబా జీవితానికీ వ్యక్తిత్వానికీ రచయిత సాధించిన తాదాత్మ్యం. ఆ వ్యక్తిత్వం ఒక దృక్పథాన్నీ లేక కొన్ని విశ్వాసాలనూ ముందు పెట్టుకొని తన్మూలంగా నడిచి, లేక నడవలేక బాధపడిన వ్యక్తిత్వంకాదు. కాని సాయిబాబా జీవించిన జీవితాన్నిబట్టి చూస్తే అందులో ఒక సౌష్ఠవం, కొన్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ముఖ్యమైన మలుపులూ గోచరమౌతాయి. అందునుంచి ఉత్పన్నమయ్యే విలువల్నిగూర్చి ఎవరికివారు వ్యాఖ్యానమూ చేసుకోవచ్చు.

ఈ నవలల్లో వ్యక్తి, జీవితంలో రాజీపడటం, జీవితాన్ని అంగీకరించడం అనే పర్యవసానం ద్వారా అస్తిత్వపు స్పృహ అనుభూతమౌతున్నది.

ఇంతవరకూ పేర్కొన్న రెండు పద్ధతులూకాక మూడో పద్ధతి ఉంది. నవలలో ఒక పాత్రద్వారా కాకుండా, యిద్దరు ముగ్గురు పాత్రల ద్వారా వారి మనస్తత్త్వాలకూ, అనుభూతికీ, సాదృశ్యంలో భిన్నత్వం సూచించడం ద్వారా, అస్తిత్వవాద దృక్పథాన్ని స్పష్టీకరించడం మూడో పద్ధతి. 'అసురసంధ్య' (ఆర్. యస్. సుదర్శనం) 1965. 'హిమజ్వాల' (వడ్డెర చండీదాస్) 1974, ఈ రకం నవలలు. 'అసుర సంధ్య' లో యిద్దరు పాత్రలున్నారు. నాగరాజు మొదటినుంచీ ఏరకమైన వ్యవస్థను అంగీకరించడు. జీవితంలో తాదాత్మ్యం చెంది తద్వారా విలువల్ని సృష్టించే దృక్పథం అతనిలో మొదటినుంచీ ఉన్నది. శ్రీధర్‌పాత్ర అందుకు భిన్నం. అతను ఏవో విలువల్నీ, ధర్మాల్నీ, ఆదర్శాల్నీ ముందుపెట్టుకొని అడుగులు వేయబోయి మాటిమాటికి తూలుతాడు. క్రమంగా జీవించడంనుంచే వ్యక్తిత్వమూ విలువలూ సిద్ధిస్తాయని గ్రహిస్తాడు. అలాగే చంద్రావతి, పద్మమణి పాత్రలూ భిన్నత్వంకలిగి ఈ దృక్పథ నిరూపణకే తోడ్పడుతవి. స్త్రీ పురుష పాత్రల సాదృశ్యంలో భిన్నత్వంద్వారా ఈ నిరూపణ జరిగింది. 'హిమజ్వాల' నవలలో కృష్ణచైతన్య, గీత అస్తిత్వవాద దృక్పథాన్ని అభివ్యక్తం చేసే ముఖ్యపాత్రలు. వారికీ విజయసారధి. మాధురి పాత్రలకు ప్రవర్తనలో సాదృశ్యం కనిపించినా ఈ పాత్రల్లో అస్తిత్వపు ఆర్తీ, అన్వేషణా, కనీసం స్పృహా, లేకపోవడం అనే భిన్నత్వాన్ని నిరూపించడంద్వారా ముఖ్యపాత్రల వైశిష్ట్యాన్ని స్పష్టంచేశారు రచయిత. కాని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నవల ముగింపులో విశేషం, అస్తిత్వజిజ్ఞాసతో అన్వేషించిన గీత మరణిస్తుంది కృష్ణచైతన్య జీవితం మళ్ళీ ఒక మలుపు తిరుగుతుంది. అతని అన్వేషణలో మరో అధ్యాయం ప్రారంభమయ్యే సూచనతో నవల ముగుస్తుంది. జీవితానికి ముగింపులేదని ధ్వని.

4

అస్తిత్వవాద లక్షణాల్ని కొన్నింటిని ప్రతిఫలించిన మొదటి కథలు, నాకు తెలిసినంతవరకు, పాలగుమ్మి పద్మరాజు వ్రాసిన 'గాలివాన', 'పడవ ప్రయాణం', విశ్వనాథశాస్త్రి 'కార్నర్ సీట్', 'నీడలు'. జీవితగాంభీర్యాన్ని, అంటే ఎందుకు? అనే ప్రశ్నకి లొంగని, వివరణకూ విశ్లేషణకూ అతీతమైన అస్తిత్వపు తాలూకు రహస్యాన్ని హృదయస్పందిగా ఆవిష్కరించే రసధ్వని యీ కథల్లో ఉన్నది.

1965లో నేను వ్రాసిన 'ఏకాంతం' అనే చిన్న కథను ఉదాహరిస్తాను. ఆనందరావు ఆరోగ్యం దృష్ట్యా సిగరెట్ మానెయ్యాలని డాక్టరు సలహా. మానెయ్యాలని ప్రయత్నించి విఫలుడై, ఎందుకు విఫలుడౌతున్నాడో జిజ్ఞాసచేస్తూ జీవితాన్ని తిరగవేస్తాడు. కథ ముగింపు; 'సిగరెట్ కాలుస్తూండగా ఆనందరావుకు అర్థం స్ఫురించింది. హేతువాదం 'దృష్ట్యా, ఆరోగ్యసూత్రాల దృష్ట్యా, కుటుంబ బాధ్యత దృష్ట్యా వదలిపెట్టవలసిన సిగరెట్‌ని తను ఎందుకు వదలిపెట్టలేకుండా ఉన్నాడో అర్థం తెలిసివచ్చింది. చీకటిలో మెరుస్తూ తన ఊపిరితోపాటు స్పందించే ఈ సిగరెట్‌కొన, ఈ నిప్పుకళిక, వికసించి ముకుళించే యీ ఎర్ర గులాబిమొగ్గ, ఇది తన ఏకాంతం, తనలోని తన స్వరూపం. జీవితానుభవాలు అనే పూసలికి అర్థాన్నీ ఆకారాన్నీ కల్పిస్తున్న అంతస్సూత్రం ఏకాంతం. సిగరెట్ కాలుతూనే ఉంది' అస్తిత్వపు అనుభూతి ఎప్పుడు దేనిలో ఎలా వస్తుందో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెప్పడం అసాధ్యం. అది కలిగినప్పుడు లభించే విముక్తి, స్వేచ్ఛ. జీవితం మీద కొత్తదృష్టి, దాన్ని నిరూపిస్తాయే తప్ప, దాన్ని యిదమిద్ధమని ఉపాధుల ద్వారా వివరణద్వారా నిర్వచించడానికి వీల్లేదు.

'త్రిపుర' వ్రాసిన 'వంతెనలు' అనే కథలో అస్తిత్వపు తాలూకు తీవ్రమైన పరివేదన (Existential despair) చిత్రించబడింది. జీవితం అర్థంలేని కొన్ని సంఘటనల కూర్పు. ఆత్మాన్వేషణలో మనిషి బయలు దేరినచోటికే తిరిగివస్తాడు. తన్ను తాను వెదుక్కోవడంలో అనుభూతుల మధ్య, ఆలోచనలమధ్య వంతెనలు కేవలం బుద్ధికల్పన. అవి చాలవు. చివరకు మిగిలేది ఏదో స్ఫురణ. కథానాయకుని మనఃస్థితిని మొదటా చివరా అతని టేబిల్ డ్రాయర్‌లో ఉన్న రివాల్వర్, గార్డినాల్ మాత్రలు సూచిస్తాయి.

నేను వ్రాసిన 'మధురమీనాక్షి' అనే కథ వేదాంతపరమైన అస్తిత్వ వాదానికి ఉదాహరణ. 'క్రైస్తవ పరమైన అస్తిత్వవాదం' (కర్క్‌గార్డ్, పాల్‌టిల్లిచ్) ఒక దృక్పథం ఉన్నట్లే, ఈ కథలోని దృక్పథాన్ని 'వేదాంత పరమైన అస్తిత్వవాదం' అనవచ్చును. సంప్రదాయంలో పరాశక్తి మాతృ మూర్తి. ఇది ఒక ప్రతీక. ఒక దార్శనికమైన నిర్దేశం. భగవత్తత్వానికి లింగభేదం లేదు. వావీవరుసా లేదు. ఈ కథలో మీనాక్షి ప్రియురాలిగా కథానాయకునికి అద్వైతానుభూతి ప్రసాదిస్తుంది. ఈ అనుభవం శారీర కంగా కనిపించినా పారలౌకికమైనది. కథలో దానికి తగిన ఉపపత్తి చేకూర్చబడింది. సంప్రదాయవాదులకు మీనాక్షీదేవి ప్రియురాలు కావడం 'షాకింగ్'గా ఉండవచ్చు. ఇక్కడే అస్తిత్వవాద దృక్పథం వేదాంత పరంగా అభివ్యక్తమౌతుంది, ఈ సందర్భంలో ఒక ఐతిహ్యాన్ని ప్రస్తా విస్తాను. నా కథను ప్రభావితం చేసిన ఐతిహ్యం అదే. ధూర్జటి శృంగార ప్రియుడు. అంతకంటె శివభక్తుడు. ఇందులో అసంగతమేమీ లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అస్తిత్వవాది అసంగతం ఉండదని గ్రహించగలడు. ధూర్జటి శివరాత్రి నాడు వేశ్యపర్యంకంమీద ఉండి, వేశ్య స్తనాన్ని శివలింగంగా అర్చిస్తాడు. శ్రీ నోరి నరసింహశాస్త్రి వ్రాసిన 'ధూర్జటి' నవలలో, ధూర్జటియొక్క ఈ చర్యను శివభక్తి స్ఫోరకమైనా అపచారంగానే చిత్రించి దానికి శిక్షగా, ధూర్జటి రాజు దగ్గర అవమానం పొందినట్టు చిత్రణ జరిగింది. అస్తిత్వవాది అవగాహనలో ధూర్జటి పాత్రపోషణ మరోవిధంగా ఉంటుందని వేరుగా చెప్పనక్కరలేదు. వేదాంతంలో భగవల్లీల, భగవన్మాయ అనే దానికి సంప్రదాయం సరిహద్దుకాదు. దానికి సరిహద్దులు లేవు. వ్యక్తి వైశిష్ట్యాన్ని బట్టి ఆ లీల అనుభూతం అవుతూ ఉంటుంది. ఇదే 'మధుర మీనాక్షి' కథ ధ్వనిస్తుంది.

1973లో 'ఎరుపు' అనే కథ ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురితమైంది. ఈ కథలోని సారధి బుద్ధిజీవి. కథలో తాత్త్వక, నైతిక సామాజిక, రాజకీయ సిద్ధాంతాలతో జీవితంలోని అనుభూతికీ, ఘటనకీ (Chance) భాష్యం చెప్పుకోడానికి వీలుకాని స్థితి ఎదురౌతుంది సారధికి. సారధి క్షయరోగి. వ్యాధి ఉద్ధృతంగా ఉన్న కాలంలో అతని ప్రవృత్తికీ, అది తగ్గినట్లు తెలియగానే అతని ప్రవృత్తికీ ఎంతో తేడా కనిపిస్తుంది. ఆతణ్ణి ఆకర్షించిన రాజ్యలక్ష్మి అతని జీవితాన్ని అనుభూతి వైశిష్ట్యంతో మార్చివేస్తుంది. వ్యాధి తిరగబెడుతుంది. అతనికే తెలీని అస్తిత్వపు లోతుల్నుంచీ వచ్చిన ఉద్వేగంతో ఆమెను హత్యచేస్తాడు. 'మృత్యోర్మా అమృతంగమయ' అనే వాక్యంలోని వ్యంగ్యంతో కథ ముగుస్తుంది, బుద్ధిజీవికి జీవితంలో వ్యవహరించడం తెలీదు. అతను జీవితాన్ని హత్య చేస్తాడు.

ఇక్కడ ఉదాహరణ ప్రాయంగానే కొన్ని కథల్ని ప్రస్తావించాను. అన్నింటినీ అందరు రచయితల్నీ పేర్కొనడం సాధ్యంకాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

5

తెలుగు కవిత్వంలో అస్తిత్వవాదం ఎక్కడైనా కనిపిస్తుందా? 1965 లో కనిపించి అనతికాలంలోనే మాయమైంది. దిగంబరకవుల మొదటి సంపుటి. అస్తిత్వవాద దృక్పథాన్ని ధ్యేయంగా పెట్టుకునే అవతరించింది. రెండవ సంపుటి నాటికి ఆ ధ్యేయం మారిపోయింది. "ఈ దేశంలో ఈ గోళంలో ఊపిరిపీల్చే ప్రతి మనిషికోసం తపనపడి, అతని భావికోసం వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత.... నువ్వు లేవు. నీ అధికారం లేదు. నీ హోదాలేదు. నీపంచ జరీఅంచు లేదు.... దేన్నీ నమ్మకు. నీ లోపల, ఈ ముసుగులోపల, యీ పంచన అంచుల కిందఉన్న నీ అసలు స్వరూపాన్నీ, నీ 'తనాన్ని' నమ్ముకో.... ఒక్కటే గుర్తుంచుకో.... ఇన్నివేల ముసుగు ముఖాలమధ్య ఊపిరి సలపనీని బతుకు పోరాటంమధ్య నువ్వెప్పుడూ ఏకాకివి. జనన మరణ యాతనల మధ్య పోరుసల్పే సైనికుడివి.... ప్రతి మనిషిలోనూ అతని అసలు స్వరూపం దీపంలా వెలుగుతూ ఉంటుంది.... నీ నిజస్వరూపంతో యీ ప్రపంచాన్ని పాలించుకో." ఇలా అస్తిత్వవాద దృక్పథాన్ని ప్రబోధించారు మొదటి సంపుటిలో. రెండవ సంపుటి నాటికి 'వ్యక్తి' కాదు, 'వ్యవస్థ' ధ్యేయం అన్నారు. "నేటి చైతన్య వ్యవస్థని మూలంగా తొలగించి నిత్య నూతన మహత్తర వ్యవస్థకోసం తపనపడుతున్న దిగంబర కవులం" అన్నారు. అస్తిత్వవాదం సమాజ పరిణామం విషయంలో తాటస్థ్యం వహిస్తుందన్న సామాజికవాదుల విమర్శకు లొంగి, వీళ్ళు దిగంబరవాదాన్ని అంటే అస్తిత్వవాదాన్ని వదలుకొని, మార్క్సిస్టు లయ్యారు. "ఈ జీవితం తాటస్థ్యాన్ని వరించకూడదు. మనిషి జీవితం ద్వీపంలా కాకుండా తోటివారి ప్రేరణా స్రోతస్సుగా ఉండటం కావాలి" అన్నారు. కాని సామాజిక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నియంతృత్వంలో వ్యక్తికి ప్రాధాన్యం ఉండదనీ, వ్యక్తి నలిగిపోతాడనీ గ్రహింపుతో "మనిషిని కీలుబొమ్మగా, యంత్రపు విడిభాగంగా తయారు చేసే నియంతృత్వానికి అది (మార్క్సిజమ్) మార్గం కారాదు" అని కూడా అన్నారు. అస్తిత్వవాదానికీ, మార్క్సిజానికీ లంకె ఎక్కడో, అసలు సాధ్యమో కాదో, ఆలోచించే ఓపిక, జిజ్ఞాస, వీళ్ళకు లేకపోయింది. తర్వాత వీళ్ళు విప్లవకవిత్వపు కాల్పనికతలోకి జారిపోయారు. రాజకీయాలు వీళ్ళని కబళించివేశాయి. మొదటి సంపుటిలోని ఖండికలన్నీ ఒక స్థాయి కవిత్వం కాదు. వాటిలో అస్తిత్వ దృక్పథం స్వరూపం దిద్దుకున్న ఖండికలు తక్కువే ఉన్నాయి.

'గ్లానిర్భవతి భారత' అనే ఖండికలో మహాస్వప్న –
"మానవత మసిపాతలా మారిపోయినప్పుడు
మాసిపోయినప్పుడు
నేను వస్తున్నాను దిగంబర కవిని
స్తంభించిన కవితాస్తంభం బ్రద్దలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న
నరకేసరిని

నా చేసిన చెట్లని నడిపించేందుకు
పాతేసిన గాళ్ళని పరికించేందుకు
వికృతాకారపు శిలల్ని మానవులుగా మలిచేందుకు
మరణించిన భగవంతునికి ప్రాణం పోసేందుకు
నేను వస్తున్నాను దిగంబర కవిని – వాచవిని
రాత్రి ఉదయిస్తున్న ప్రతిభారవిని"

ఇది అస్తిత్వవాద దృక్పథాన్ని గురించిన మేనిఫెస్టో కవిత. మన కవుల్లో చాలమందికి ఏ దృక్పథమైనాసరే ఆ దృక్పథాన్ని కవితపేర వాచ్యంగా యథాతథంగా నినాదాలుగా వ్రాయడమే తెలుసుకాని, ఆ దృక్ప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

థాన్ని అనుభూతిపరంగా, ధ్వనిపూర్వకంగా సృష్టించటం, రూపొందించడం తెలీదు. దిగంబర కవుల మొదటి సంపుటిలోనూ యిటువంటి మేనిఫెస్టో కవిత ఎక్కువ. కాని ఒకటి రెండు ఖండికల్లో మంచి ప్రయత్నం కనిపిస్తుంది. భైరవయ్య 'హూరే-హూరే', నగ్నముని 'జైల్లో సముద్రం' అటువంటివి. జైల్లో సముద్రం యిలా ప్రారంభమౌతుంది.

"సూర్యుని కడ్డంగా నుంచున్న
ఆ మబ్బుతునక పేరేమిటి?"
ఇది అస్తిత్వపు అనుభూతిని ఆచ్ఛాదించే హేతువును గూర్చిన జిజ్ఞాస.
"అర్థంకాని అనంతశూన్యం అంచుమీదకి
ఆకారంలేని కుర్చీ నొకటి లాక్కుని
అర్థవంతమైన బ్రతుకు వెన్నెల చుక్కల్ని కప్పులో నొంపి
ఒక్కొక్క క్షణం పెదవులకానించి
విషాదాన్ని ఆరాధిస్తూ వుంటానా
హోయలు హోయలుగా పొగలు పొగలుగా
కెరట కెరటాలుగా కాలం
నా కాళ్ళని ముంచెత్తుతూ వుంటుందా
ఎందుకో ఒక్కసారి ఏకాంతంలోకి
నిర్జనారణ్యాలు నడిచివస్తాయి.
నిబిడాంధకార గహ్వరాలు తెరుచుకుంటాయి...."

8276

ఇలా నడుస్తుందీ పద్యం : అహంత ఒకకుర్చీ - చేతనలో ఊహలూ ఆలోచనలూ కాలగమనం – ఏకాంతంలో అవ్యక్తచేతనంలోనుంచీ వచ్చే అర్థంకాని భయాలు – ఏకాంతంలో భయవిహ్వలతరూపం 'సిగరెట్టు చివర' – విడివిడి జ్ఞాపకాలు ముసురుకుంటాయి, కాని అనుభూతిని గూర్చిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జిజ్ఞాస అలానే మిగిలిపోతుంది. 'అద్దంకోసం' అంటే ఆత్మ దర్శనంకోసం అన్వేషణ. 'మనసు మసీదు', 'మహిషం వేదం వల్లెవేయడం' మతవ్యవస్థల్ని చావుపుట్టుకల్ని ధ్వనిస్తాయి. 'మహాబోధి' 'నీరో' బౌద్ధనాగరకతనూ, రోమన్ నాగరకతనూ సూచిస్తాయి. 'నగరం అస్థిపంజరం' వర్తమాన కాలపు నాగరక జీవనపు శూన్యాన్ని తెలుపుతుంది. జైల్లో 'బంధింపబడిన సముద్రం' అరికట్టబడిన స్వేచ్ఛ. 'కూలుతున్న పిరమిడ్లు' ప్రాచీన వ్యవస్థా శైథిల్యం. 'రోదసీ ప్రయాణాలు' వైజ్ఞానిక విప్లవం చూపే ప్రగతి. 'శిశు గర్భంలో అణుకోర దిగింది' ఆ ప్రగతికి పరాకాష్ఠ. ఇంత పరామర్శ తర్వాత ప్రశ్న ప్రశ్నగానే మిగిలింది. "ఏది అద్దం? పరమార్థం?" "నీకూ నాకూ నడుమ, నాకూ యీ నటనకీ నడుమ, ప్రపంచ దేశాల ప్రళయ పరాచికాల నడుమ, సత్యానికీ సత్యానికీ నడుమ, నిలుచున్న ఆ మబ్బు తునక పేరేమిటి?" అనే ప్రశ్నతోనే పద్యం ముగుస్తుంది. 'హి హి హీ నీపేరు ఈగ' అన్నట్లే ఆ మబ్బుతునక పేరు 'మేధ' అని సమాధానం మనం చెప్పుకోవచ్చును.

6

అస్తిత్వవాదం మేధావిన్యాసంచే కప్పబడిన అస్తిత్వపు అనుభూతినీ, దానినుంచీ రూపం దిద్దుకునే వైయక్తిక వైవిధ్యాన్నీ, వైశిష్టాన్నీ ప్రాథమికమైన విలువలుగా ఎత్తిచూపుతుంది. మనిషిని జడవస్తువుగానో, యంత్రంగానో, ప్రకృతిలో, సమాజంలో, ఒక ప్రయోజనానికి సాధనంగానో, ఉపలక్షించే దృక్పథాన్ని వ్యతిరేకిస్తుందీ దృక్పథం. సామూహికమైన నినాదాలతో, ఒత్తిడులతో మనిషిలోని సృజనాత్మక శక్తిని, నవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నవోన్మేషిత్వాన్ని అంతమొందింప జూచే ధోరణులను ప్రతిఘటిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థగానీ, శ్రామిక వ్యవస్థగానీ, మరేవ్యవస్థగానీ – వ్యవస్థతో వ్యక్తికి సంభవించే ప్రతి సంఘర్షణలోనూ వ్యక్తినే సమర్థిస్తుంది. అందుకే యిది సామాజికమైన అభ్యుదయానికి తోడ్పడదని, తాటస్థ్యం వహిస్తుందని విమర్శ. సామాజికమైన అభ్యుదయాన్ని ఒక చక్రంలా ఊహించినప్పుడు, మానవుని సృజనాత్మకత దానిలో యిమిడేందుకు నిరాకరించకపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు ! సమాజానికీ వ్యక్తికీ మధ్య యిచ్చిపుచ్చుకోవడమనే సంబంధాన్ని గుర్తించినప్పుడు రెండింటికీ ప్రాధాన్యం ఉందనీ, వ్యక్తి వినాశం సమాజ స్తబ్ధతకూ, వినాశానికీ దారితీస్తుందనీ అంగీకరించక తప్పదు. మరొక్క విషయం గమనించాలి. సమాజ ప్రగతిని నిరోధించని, దాని జోలికిపోని అనుభూతిలోకం వ్యక్తిలో ఎంతో మేర ఉన్నది. రాజకీయ, సామాజిక వ్యవస్థ అనవసరంగా దానితో కల్పించుకొని, దాన్ని నియంత్రించి, శాసించే పనికి పూనుకోకపోతే చాలు ! మనిషిలో సృజనాత్మకత నశిస్తే, మనిషి వ్యక్తిగానూ సామూహికంగానూకూడా మరణిస్తాడు ! మనిషి చావకూడదు !

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగులో తాత్త్విక నవల

సాహిత్య ప్రక్రియగా నవల తొలినాటినుంచీ నేటివరకూ ఎన్నో విధాల రూపాంతరం చెందుతూ వస్తున్నది. కథ ప్రధానం, కథ కాలక్షేపం కోసం, అనుకునే ప్రథమావస్థలో అద్భుత సంఘటనలూ, సన్నివేశాలూ ప్రాధాన్యం వహించేవి. కథలోని పాత్రల్లో వైశిష్ట్యం కనిపించి, వారి సుఖదుఃఖాలూ, చిత్తవృత్తీ పఠిత మనస్సుని ఆకర్షించే లక్షణం కథకు ఏర్పడగానే అది నవల అయింది. 'కాశీరామేశ్వర మజిలీ కథల' కూ, చిలకమర్తివారి 'కర్పూర మంజరి'కీ గల తేడా యిదే! పాత్రల వ్యక్తిత్వం రూపుకట్టడం ప్రధానం కాగానే, సమాజంలో వ్యక్తుల ప్రవర్తన ఎలా ఉంటే బావుంటుందో నిర్దేశించడం నవలకు లక్ష్యంగా రూపొందింది. నవల కర్తవ్యోపదేష్టగా తయారైంది. తెలుగులో వీరేశలింగంగారి నుంచీ విశ్వనాథ, చలంగార్ల వరకూ నవల సాంఘిక సంస్కరణను గూర్చీ, సంఘంలోని వ్యక్తుల నడవడికీ వ్యవస్థకూ గల సంబంధాన్నిగూర్చీ, జీవితంలో మంచిచెడ్డల నిర్ణయంలో తిరుగుబాటునుగూర్చీ ప్రబోధం చేస్తూనే వస్తోంది. ఈనాటికీ తెలుగు నవల ఈ లక్ష్యాన్నే నెరవేరుస్తున్నదని అంటే అది అతిశయోక్తి కాదు. కాని ప్రతి కర్తవ్య నిర్దేశం వెనుకా, ప్రబోధం వెనుకా, ఏ విధమైన జీవిత దృక్పథం ఉన్నది? దాని స్వరూపం, తత్త్వం ఏమిటి? అనే విషయాన్ని చాలకాలం ఎవరూ పట్టించుకోలేదు. ఆ రోజుల్లో చలంగారు 'మైదానం' వ్రాస్తే, విశ్వనాథవారు 'చెలియలి కట్ట' వ్రాశారు. ఇవి ఒకదాని కొకటి సమాధానం ఎలా అవుతవి? ఇద్దరి తాత్త్విక దృక్పథాలూ భిన్నమైనప్పుడు రెండింటికీ సమన్వయం ఎలా కుదురుతుంది? అప్పటికి దృక్పథాల గొడవను గూర్చి స్పృహలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1935 తర్వాత హేతువాదం, మార్క్సిజమ్, అభ్యుదయ సాహిత్యోద్యమం వచ్చాయి. ఒక తాత్త్విక, రాజకీయ దృక్పథాన్ని భూమికగా చేసుకుని సాహిత్యంలో కర్తవ్య నిర్దేశం, ప్రబోధం జరగాలి అనే ధోరణి బయలుదేరింది. అసలీ ప్రబోధంతో, దృక్పథాలతో సంబంధం లేకుండా యథాతథంగా జీవితాన్ని చిత్రించాలి అనే వాస్తవికతావాదమూ (Realism) ఉన్నది. ఫ్లాబర్ట్, ఎమిలీజోలా, మొపాసావంటి ఫ్రెంచి రచయితలు ఇందుకు ఉదాహరణ. దృక్పథ నిర్దేశం లేకుండా వాస్తవికతావాదం ధోరణిలో తెలుగులో వచ్చిన నవలలు 'శారద' అనే హోటల్ సర్వర్ వ్రాసిన 'మంచీ - చెడూ', 'అపస్వరాలు'; పోతుకూచి సాంబశివరావు వ్రాసిన 'అన్వేషణ'. పోతే అనుభూతిపరమైన వైయక్తిక అన్వేషణతో, తాత్త్విక జిజ్ఞాసతో వ్రాయబడిన నవలలు - గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' హేతువాద దృక్పథ విమర్శగానూ, విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి' మానవతావాద విజయంగానూ, బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' మానవతావాది సత్యాన్వేషణగానూ రూపొందాయి. మార్క్సిస్ట్ దృక్పథం అనుభూతిపరమైన తాత్త్విక దృక్పథంగా రూపొందిన నవల వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి'. మహీధర రామమోహనరావు నవలల్లో కమ్యూనిస్టుపార్టీ రాజకీయాల చిత్రణేతప్ప, మార్క్సిజమ్ యొక్క తాత్త్విక దృక్పథ విన్యాసం కనిపించదు. 'ప్రజలమనిషి' లో వర్గరహిత, వర్ణరహిత సామాజికుడుగా కథానాయకుడు కంఠీరవం తన అనుభూతిద్వారా పరిణామం చెందడం దర్శిస్తాము. తాత్త్విక దృక్పథాన్ని నిక్షేపించే నవలలో ఈ అన్వేషణా, దాని పరిణామమూ చాల కీలకమైన విషయాలు దర్శనాన్ని గూర్చిన ఉపన్యాసాల కూర్పుకాదు తాత్త్విక నవల అంటే.

ముప్పై ఏళ్ళ క్రితం పై తెలుగు నవలల్ని గూర్చిన విమర్శ ఏ స్థితిలో ఉన్నదంటే, పాత్రల నీతి - అవినీతి ప్రవర్తననూ, సామాజికంగా ఉచితానుచితాలనూ చర్చించే విధానమే తప్ప, ఒక నవలలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అభివ్యక్తమైన తాత్త్విక దృక్పథాన్ని గూర్చి కాని, రచయిత రచనల్లో క్రమానుగతంగా ఉన్మీలనమౌతున్న అనుభూతిపరమైన తాత్త్వికాన్వేషణను గూర్చి కాని, ఆలోచించి నిగ్గు తేల్చుకునే దృష్టి దానికి లేదు. చలం రచనా వ్యాసంగం యావత్తూ ఒక బూతుల బుంగగా నిర్లక్ష్యం చేయబడింది ఆ రోజుల్లో. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'ను ఆస్కార్ వైల్డ్ 'డోరియన్ గ్రే' కి అనుకరణ అంటూ త్రోసివేశారు. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' సోమర్సెట్‌మామ్ 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' నవలకు కాపీ అన్నారు. 1964 లో 'నవ్యాంధ్ర సాహిత్యంలో దృక్పథాలు' అనే శీర్షికతో తెలుగు నవలా రచయితల అనుభూతిపరమైన తాత్త్విక దృక్పథాల్ని గూర్చిన పరామర్శ నేను ప్రారంభించాను. "సాహిత్య వ్యవసాయమూ సత్యాన్వేషణమూ జీవితంలో ఒకటైన కవీ లేక రచయితా తన దృక్పథంలో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు. రచయితకు సంబంధించిన ఆ 'ఆత్మకథ'ను అతని సాహిత్య కృషి ప్రతిబింబిస్తుంది." ఈ వరవడిలో జరిగిన పరిశీలనకు గట్టిగా నిలిచిన తెలుగు నవలా రచయితలు – ఉన్నవ, విశ్వనాథ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు. వీరి తాత్త్వికాన్వేషణను గుర్తించే విధానంలో రచనల్ని పరిశీలన చెయ్యగానే, వారి నవలలకు గల స్ఫూర్తి ఏమిటో తెలుసుకునే అవకాశం లభించింది.

ఇక్కడ చెప్పవచ్చిందేమిటంటే నవల పొందిన రూపాంతరాల్లో అత్యాధునికమైన రూపం - తత్త్వాన్వేషణకు నవల సాధనం కావడం. దీన్ని 'తాత్త్విక నవల' అనవచ్చు. ఒక నవలలో ప్రధానపాత్రా, ఆనుషంగికమైన పాత్రలూ, కథా సంవిధానమూ, అన్నీకూడా సామాజికమైన ధర్మాధర్మ నిర్దేశాన్ని కాకుండా, తాత్త్వికమైన వైయక్తిక అన్వేషణను ప్రధానంగా సూచిస్తూ రూపొందడంవల్ల అది తాత్త్విక నవల అవుతుంది. ఉదాహరణకు 'చివరకు మిగిలేది' తీసుకుందాం. తాత్త్వికమైన అన్వేషణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ నవలలో దయానిధి పాత్ర ద్వారా జరుగుతుంది. కోమలి, అమృతం అనే పాత్రలు అందుకే దోహదం చేస్తాయి. మనోవిజ్ఞానశాస్త్రం దృష్ట్యా చూస్తే దయానిధి 'ఈడిపస్ కాంప్లెక్స్'తో బాధపడుతూ ఉండటం కని పిస్తుంది. కాని 'ఈడిపస్ కాంప్లెక్స్' ఉన్న వ్యక్తులందరిలోనూ దయా నిధిలో జరిగే తాత్త్వికాన్వేషణ జరగదు. అందుకే ఈ నవల మనోవైజ్ఞా నిక నవల (Psychological novel) గా భాసించినా, తుది స్వరూపంలో తాత్త్విక నవల అయింది. "The tree is known by its fruit" అన్నట్లు దయానిధి చేరుకున్న గమ్యంవల్ల, అతను అధిగమించిన అవ రోధాలవల్ల ఆ అన్వేషణ కొక స్వరూపం ఏర్పడింది. దానికి జీవిత తత్త్వాన్ని నూత్నదృష్టితో అభివ్యక్తం చేస్తూ, హృదయంగమంగానూ, మేధాగతంగానూ ఒక వ్యాఖ్యానాన్నీ అర్థాన్నీ పాఠకునికి అందించే లక్షణం ఉన్నది. అందువల్ల అది తాత్త్విక నవల అవుతున్నది. ధర్మవివక్షకోసం చూచే సామాన్యదృష్టికి దయానిధి కోమలితో ప్రవర్తించే తీరు, కోమలే కాదు, సుశీల, నాగమణి, పెళ్ళి చేసుకున్న ఇందిర, తర్వాత అమృతం వగైరా స్త్రీలతో ప్రవర్తించే విధానం, ఎబ్బెట్టుగా, అయోమయంగా కని పిస్తుంది. చిట్టచివర కోమలిని చేరదీయడంకూడా అర్థరహితంగానే తోస్తుంది. దయానిధి పాత్రలోగాని, జీవితంలోగాని ఏ ఆదర్శమూ, ఏ నీతీ, ఏ కర్తవ్యపాలనా, అంటే సామాజికంగా అర్థవంతమైన ప్రవర్తన ఏదీ కనిపించదు. దీనికి కారణం నవల కలిగించే చివరి తాత్త్విక స్పృహ పరిత అందుకోలేకపోతే నవల స్వరూపం అర్థంకాకపోవడమే। అంటే తాత్త్విక స్పృహ, సమాజంలో సిద్ధమైన కొన్ని విలువల దృష్ట్యా వెదికితే అందేదికాదు। నవల చివర దయానిధి అనుకుంటాడు. "నేడు మన సంఘం ఆమోదిస్తున్న నీతిని ప్రతిపాదించిన వారు విచిత్రమైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గతించిపోయిన వాతావరణంలో ఉన్నారు.... మన సంఘంలో మనుష్యుల బద్ధకించి ఉన్నవాటితోనే తృప్తిపడి, మోక్షం పేరు చెప్పుకుని, యీ ప్రపంచాన్నీ, జీవితాన్నీ ఒక జాడ్యంగా, ఒక పీడకలగా భావించి ఎలాగో కాలం గడుపుతున్నారు.... చివరకు మిగిలిందేది? ప్రేమా? ధనమా, కీర్తా? ఏదీకాదు.... చివరకు మిగిలింది తను! తన్ను తాను పరిపూర్ణంగా చూశాడు. తనతో తను సమాధానపడి, తన్ను తాను స్వీకరించి, కౌగలించుకుని ఏకమయ్యాడు". ఇది ఆ నవలకు అనుభూతిపరంగా కీలకమైన తాత్త్విక దర్శనం: అక్కడినుంచీ దయానిధి పాత్రను, ప్రవర్తనను అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా నవలల్లో చిత్రింపబడే యితివృత్తం వ్యక్తికీ వ్యవస్థకూ మధ్య ఘర్షణ, యువతీ యువకుల రొమాంటిక్ ప్రేమ, త్యాగం, వర్గరహిత సమాజం, కారుణ్యం, దయ, క్షమ, విప్లవాభినివేశం, మంచి పెంచడం సమర్థించడం, ప్రవర్తనలో నిజాయితీ వగైరా విలువల్నీ, ఆదర్శాల్నీ ముందు పెట్టుకుని ధర్మాధర్మాల, మంచిచెడ్డల ఘర్షణగా నవలల్లో చిత్రణ సాగుతూ ఉంటుంది. అంతవరకే తప్ప నవలలు ముందుకు వెళ్ళవు. ఇందులో ఏ ఒక్కదానికైనా సమగ్రమైన వ్యాఖ్యానం తాత్త్వికంగా లభించాలి అంటే వ్యక్తి అన్వేషణను చిత్రించక తప్పదు. ఆ అన్వేషణలో కేవలం ఆలోచనే కాకుండా అనుభూతి ప్రాధాన్యం వహిస్తుంది అప్పుడే లోకం ఒక కొత్త వెలుగులో దర్శనమిస్తుంది.

ఈ పదేళ్ళలో వచ్చిన తాత్త్విక నవలలు, నాకు తెలిసి రెండే రెండు! ఒకటి వడ్డెర చండీదాసు 'హిమజ్వాల'; రెండోది నాదే 'సంసార వృక్షం'. 'హిమజ్వాల'లో అన్వేషణ కృష్ణచైతన్య, గీత అనే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యిద్దరు పాత్రలద్వారా జరుగుతుంది. కృష్ణచైతన్యలో 'ఈడిపస్ కాంప్లెక్స్' ఉన్నది. అదే అతను యిల్లు వదలి వెళ్ళేందుకు కారణం. కృష్ణచైతన్య మేధావి. గీత రసాన్వేషి. ఇద్దరూ మనిషిలోని రెండు ప్రవృత్తులకు ప్రతిరూపాలే. నవల చివర యిద్దరూ కలుసుకుంటారు. ఆ కలయికకు కృతార్థత ఉంటుందో లేదో, దాని స్వరూపమేమిటో నిర్ణయం కాకుండానే గీత హత్యతో నవల ముగుస్తుంది. నవలలోని అన్వేషణకు రచయిత చూపిన పర్యవసానం – మనిషిలోని రసప్రవృత్తి వ్యవస్థవల్ల అంతం చెయ్యబడటం; మేధయొక్క నిస్సహాయత; అర్థంలేని జీవితపు ఏకాంతం మిగలడం. ఇది నిరాశాపూరిత అస్తిత్వవాద దృక్పథం (Pessimistic existentialism) అయినప్పటికి అన్వేషణలో రసప్రవృత్తి స్వరూపాన్ని నిర్దుష్టంగా నిర్దిష్టంగా చిత్రించడంలో రచయిత పొందిన కృతార్థత మెచ్చుకోదగింది. ఆ రసప్రవృత్తిని సెక్స్‌లో ప్రేమగా, ఔదార్యంగా, దయగా, అస్తిత్వపు స్వేచ్ఛగా గీతపాత్ర ద్వారా చిత్రించిన తీరు జీవితానుభూతిని గూర్చిన ఒక నూత్న దృక్పథానికి నిండుదనాన్ని యిస్తోంది.... 'సంసార వృక్షం' లోని అన్వేషణ అద్వైతానుభూతితో ముగుస్తుంది. ఈ అద్వైతానుభూతి ముక్కుమూసుకుని మూల కూర్చోవడం ద్వారా రాదు; లాయరు యింటినుంచి పలాయనం కావడం, మళ్ళీ యింటికి తిరిగి రావడం అర్థరహితమైన, పిరికివాని చర్యగా కనిపిస్తుంది లోకందృష్టికి. వ్యవస్థకు వెలియైన మేధావి, వ్యవస్థకు అతీతుడు కావడం ఎలా జరిగిందో ఆ తత్త్వదర్శనమూ, దానిమూలంగా అతను వ్యవస్థలో తామరాకుమీద నీటిబొట్టులా యిమడడమూ చిత్రించడంలో అనుభూతి పరమైన అద్వైతం ద్యోతకమైంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తత్త్వదర్శనానికీ మతానికీ సంబంధంలేదు. మతం వ్యవస్థ. మతస్థే కాదు, పైనుంచీ వచ్చిన ఏ దర్శన శాస్త్రమైనా, దానితో వ్యక్తి అస్తిత్వానికీ అనుభూతికీ ఘర్షణ తప్పదు. తత్త్వానుభూతీ, తత్త్వదర్శనమూ వ్యక్తిగతమైన అన్వేషణ ద్వారానే లభిస్తాయి. అది జీవితానికి దూరంగా ఆశ్రమంలోనో కొండ కోనల్లోనో సాగించే అంతరంగిక సాధన కాదు। జీవితానుభూతినుంచీ సామాజిక సంబంధాలనుంచీ ప్రేరణపొంది, వ్యక్తి చైతన్యాన్నీ, ప్రవర్తననూ ప్రభావితంచేసి, అతనికి పునర్జన్మనూ, వినూత్న దృష్టినీ ప్రసాదించే నిరంతరాన్వేషణ అది. అందువల్ల తత్త్వశాస్త్రానికీ, సూత్రీకరణకూ అందని వైయక్తికానుభూతి యొక్క- అన్వేషణా మార్గ వైశిష్ట్యాన్ని నవలలోనే నిక్షిప్తం చెయ్యడానికి అవకాశం ఉన్నది. ఆ విధంగా అస్తిత్వవాదానికీ తాత్త్వికనవలకూ ఒక అవినాభావ సంబంధం ఉన్నది. అస్తిత్వవాదం నిర్ణీత విశ్వాసాలమీదా, సిద్ధాంతాల చట్రంలోనూ బంధింపబడే ఒక దర్శనం కాదు. జీవితానుభూతియొక్క- స్వచ్ఛందమైన అభివ్యక్తినీ అన్వేషణనూ వ్యక్తిలో గుర్తించడమూ, వ్యక్తిగా పొందడమూ అస్తిత్వ వాద దృక్పథం.

ఏదో ఒక విశ్వాసం, ఒక ఆశాభావం, ఒక సిద్ధాంతంద్వారా కాకుండా, అస్తిత్వాన్ని యథాతథంగా దర్శించే సాహసం కలిగిన రచయిత తనుకూడా దార్శనికుడే అవుతున్నాడు. కారణం అస్తిత్వమే సత్యం. అది సత్యానికి బాహ్యరూపం మాత్రమే కాదు. తన్మూలంగా సాహిత్యం దర్శనమౌతున్నది. (Literature becomes philosophy).

Existentialism reduces life from what we would like it to be, to what it is; and the instrument employed is not

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

this or that method, but lucidity. The writer who refuses to allow a faith, a hope, or a theory to interfere with his work, who has the courage to confront existence itself, is also a metaphysician because Existence is Reality and not merely its outward form.

("*Literature considered as Philosophy*" by Everett W. Knight Page 16. Pub : Collier Books, New York, 1962.)

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగు కవిత్వ పరిణామం : ఉద్యమాలు

భారత భాగవతేతిహాస పురాణాలనుంచీ నేటి 'మినీకవిత' దాకా కవిత్వంలో వచ్చిన పరిణామాల్ని అవలోకిస్తే కవిత్వం తనదైన లక్షణాన్ని ప్రత్యేకంగా నిరూపించుకోవడానికి చేస్తున్న 'ఆత్మాన్వేషణ' వంటి ప్రయత్నం కనిపిస్తుంది. వేదాంతంలో 'నేతి, నేతి' అన్నట్లుగా కవిత్వ మంటే ధర్మశాస్త్రం, నీతిశాస్త్రం, కాదు అనుకోవడంతో ప్రబంధాలు అవత రించాయి. కవిత్వం కథ నాశ్రయిస్తే మధ్యమధ్య నీరసమైన కథనం తప్పదు. అసలు కవిత్వం అంటే కథకాదు అనుకోవడంతో సన్నివేశం, సన్నివేశంలో భావప్రస్తారం ప్రధానమైన భావ కవిత్వం వచ్చింది. భావ ప్రస్తారానికి పద్య చ్ఛందస్సుకంటె మాత్రాచ్ఛందస్సు బాగా పనికివస్తుందను కోవడంతో గేయకవిత్వం వచ్చింది. కవిత్వానికి అసలు ఛందస్సుతో పనిలేదు అనుకోవడంతో వచన కవిత్వం వచ్చింది. కవిత్వానికీ వచన ప్రక్రియకూ తేడా నిరూపించి, కవిత్వ వైశిష్ట్యాన్ని నిరూపించవలసి రా డంతో బింబాల్ని (images), ప్రతీకల్ని (Symbols), భావచిత్రాల్ని (Ideo grams) ఆశ్రయించడం జరిగింది. వచనరూపంలో వస్తున్న కవిత్వం ఒక ఉపన్యాసంగా, ఒక కథగా, మళ్ళీ శరీరం పెంచుకుని కవిత్వ వైశిష్ట్యాన్ని మింగివేసే ప్రమాదం సంభవించడంతో 'మినీకవిత'గా నేడు సూక్ష్మశ రంతో సాక్షాత్కరిస్తోంది. కాని "సూక్ష్మ" శరీరానికీ "అల్ప" శరీరానికీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తేడా తెలీని రచయితలు బయల్దేరడంతో "మినీకవిత" లో మళ్ళీ బింబం, ప్రతీక, భావచిత్రం, కవిత్వానికి గీటురాయి అవుతున్నాయి. ఇదీ ప్రస్తుత స్థితి.

కవిత్వానికి ప్రధాన లక్షణం 'రసం' అనీ 'ధ్వని' అనీ ప్రాచీనులు నిర్ణయించేశారు కదా, కవిత్వానికి ఆత్మ "రసధ్వని" కాదా, అంటే యిక్కడ ఒక్క వివరణ అవసరం అవుతుంది. 'రసం', 'ధ్వనీ' అనేవి ఆత్మాశ్రయమైన, అంటే "విషయి"కి సంబంధించిన (Subjective) అనుభూతి విశేషాలు కాని, ఫలానా అని విషయంగా (Objective) గుర్తింపదగిన ప్రక్రియలు (devices) కావు. అందుకే "రసం" సామాజిక నిష్ఠం అన్నారు. పాఠకుడు లేక సామాజికుడు పొందే అనుభూతి "రసం". దానికి స్వరూపం లేదు. రచయిత అనుభూతి కవిత్వరూపం దాల్చవలెనంటే అవసరమైనది ప్రక్రియ. అది కథ కావచ్చు. ఛందస్సు కావచ్చు. అలంకారం కావచ్చు. బింబం, ప్రతీక, లేక భావచిత్రం కావచ్చు. కవిత్వంలో పరిణామం, నవ్యత, అంటే ప్రక్రియలో మార్పు. ఇది ఒకరకం మార్పు, ఒకరకం అన్వేషణ.

సామాజిక పరిణామంలో ప్రజాస్వామ్యం, బూర్జువా వ్యవస్థ, మానవతావాదం, భౌతికవాదం, సామ్యవాదం వంటి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, తాత్త్విక దృక్పథాలు ఉద్యమరూపంలో ప్రాభవం పొందినప్పుడు కవితా "వస్తువు"లో మార్పు, నవ్యత ప్రవేశిస్తాయి. అలా వస్తువులో వచ్చిన మార్పుని ఆధారం చేసుకుని ఆయా ఉద్యమాలను కవితోద్యమాలుగా భావించడం రెండోరకం మార్పు. కాల్పనికవాదం అనబడే రొమాంటిసిజమ్ సాహిత్యానికి చెందిన ఉద్యమంగా భావింపబడుతున్నా, నిజానికి అది మానవతావాదానికీ; ప్రజాస్వామ్యానికీ, వ్యక్తి ప్రధానమైన దృక్పథానికీ సంబంధించింది. రొమాంటిసిజమ్ ఫ్యూడల్ నాగరికతలో ఒక రకంగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రూపుదిద్దుకుంటే, అదే మళ్ళీ బూర్జువా నాగరికతలో మరోవిధంగా రూపు దిద్దుకున్నది. ఈ శతాబ్దిలో తెలుగులో మొదటిదైన నవ్య సాహిత్యోద్యమం, దాని తర్వాతి దశ అయిన భావకవిత్వం పరిశీలించినట్లయితే రొమాంటిసిజమ్ రెండు దశలూ కనిపిస్తాయి —

"హేమపాత్రల చందన మెండిపోయె
ద్వారములు మోయుచున్నవి హారములను
సానలం దింకె స్నానకషాయగంధ
మబల ! ఎవనికోసము సగమై తపింతు ?" (రాయప్రోలు)

ఈ రచనకూ :

"ఈ నడికిరేయి వెన్నెల ఎద చలించు
పిలుపెదో సఖాయనుచు నన్ వేగిరించు" (కృష్ణశాస్త్రి)

అన్న రచనకూ గల తేడా పరిశీలించండి. రెండూ విరహాన్ని గూర్చే అయినా రెండు భిన్న ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన రొమాంటిసిజమ్‌ని సూచిస్తున్నాయి. మొదటిదానిలో విరహిణి ఏకాకి కాదు; హేమపాత్రలూ వగైరా ఆమె స్థితిగతుల్ని సూచిస్తాయి. రెండవదానిలో విరహానికి అసలు సఖియో, సఖుడో ఎవరైనా ఉన్నారా ? అనే సందేహమూ వస్తుంది. విరహావస్థ అనే హృదయానుభూతి యొక్క అభివ్యక్తి సామాజికమైన మార్పులీన్నీ, అభిరుచుల్నీ బట్టి, జీవసరళిని బట్టి, జీవిత దృక్పథాన్నిబట్టి మారుతూ ఉంటుంది.

అభ్యుదయ సాహిత్యోద్యమంలో మానవతావాదం, సామ్యవాదం, భౌతికవాదం ప్రాభవం పొందాయి. ఇవి హృదయానుభూతికి ఎంతవరకు నవ్యాభివ్యక్తి చేకూర్చాయి అనేది కవిత్వంలో కీలకమైన ప్రశ్న. "ప్రపంచ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిణామంలో ప్రయాణికుడనై, పరివ్రాజకుడనై, విహ్వలంగా వర్తించే వేళ అభయ హస్తముద్రతో నను దరిసిన, నన్ను పునీతుని గావించిన కవితా" అంటూ శ్రీశ్రీ తన జీవితానికీ, అస్తిత్వానికీ, అర్థాన్నీ, ఆలంబనాన్నీ కల్పించిందిగా కవిత్వాన్ని ఆరాధించారు. "నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు; నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు : నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అంటూ తనలోని కారుణ్యానికీ, ప్రేమకూ. సౌందర్య రక్తికీ కవిత్వం అభివ్యక్తి మార్గమన్నారు తిలక్. విస్తరించాలి చైతన్య పరిధి, అగ్ని జల్లినా, అమృతం కురిసినా, అందం ఆనందం, దాని పరమావధి, కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి" అన్న అనుభూతివాది తిలక్. ఆరుద్ర, సోమసుందర్, నారాయణరెడ్డి, దాశరథి, అభ్యుదయవాదులలో చాలమంది, ఈ కవితా సూత్రాన్ని పాటించినవారే.

విప్లవ కవితోద్యమం పేరుతో వచ్చిన రచనల్లో అసలు దృక్పథం కనిపించదు. ఆవేశం, ఆగ్రహం, హింసాప్రవృత్తి తప్ప హృదయానుభూతి లేదు. దృక్పథాన్ని అభివ్యక్తం చేసే ప్రయత్నం ఎక్కడైనా ఉంటే సిద్ధాంతాన్ని వాచ్యం చెయ్యడమే తప్ప కవిత్వం పలకదు. ఈ దుఃస్థితిని గూర్చి 1976 లో అజంతా యిలా అన్నారు : "ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో యిది కాలుష్య యుగం. సాహిత్యేతర ప్రయోజనాల కోసం కవిత్వాన్ని బాహాటంగా నడివీధిలో ఉరితీస్తున్న రోజులివి.... కాలుష్యం అనేక రకాలు. సిద్ధాంత సంబంధమైన కాలుష్యం ఒక్కటే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాదు, అంధానుకరణంకూడా కాలుష్యమే." ("అనుభూతి గీతాలు ।" పరి చయం) శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి అభిప్రాయం : "తెలుగు కవిత్వానికి చెడ్డకాలం దాపురించింది. అభ్యుదయం పేరుతో కవిత్వంలో ప్రవేశించిన రాజకీయాలు - ఏకు మేకైనట్లు - కవిత్వాన్ని హతమార్చి తామే కవిత్వంగా ఊరేగుతున్నాయి. 'ఎగరేయ్ ఎర్రజెండా' అన్నదే గొప్ప కవిత్వంగా చప్పట్లు కొట్టించుకునే దశ కూడా దాటిపోయి 'విప్లవ దశ' వచ్చింది. 'కొట్టు, నరుకు, చంపు, రక్తం తాగు' అన్నదే యిపుడు పరాకాష్ఠగా పగటి దీపాలు పట్టించుకుంటున్నది.... ఉత్తమ కవిత్వానికి గీటురాయి ఆవేశబలం కాదు, అనుభూతి సౌకుమార్యం. ఈ విషయం తెలియడమే ఒక సంస్కార విశేషం.... ఈ సంస్కారం కలవాళ్ళు ఎప్పుడూ విప్లవ కవిత్వం రాయరు. వచ్చినా పొడుపు కథల కవిత్వం రాయలేరు." ('మిణుగురు' సంపుటికి వ్రాసిన 'మంచి మాట' 1979)

ఇప్పుడు తెలుగు కవిత్వం ఆ దుర్దశను దాటిన సూచనలున్నాయి. 'మినీ కవిత' ప్రక్రియద్వారా మళ్ళీ కవిత్వం పుంజుకుంటున్నది. దీనికి యుగకర్తలూ, పథ నిర్దేశకులూ, సంఘచాలకులూ లేరు. స్వచ్ఛందమైన ఒక ఇంద్రియ సంవేదన, ఒక హృదయానుభూతి, ఒక మెరుపువంటి ఊహ అభివ్యక్తమై పఠితలను స్పందింపజేస్తున్నాయి. ఇది రాజకీయ ఉద్యమం కాకపోవచ్చుగాని ప్రజల ఉద్యమం. రాజకీయాలు ప్రజలకు దూరం కావడంతో, కేవలం రాజకీయాలను అంటిపెట్టుకున్న కవిత్వమూ ప్రజా హృదయాలకు దూరమైపోయింది. సామాజిక చైతన్యం, ప్రజల సంస్కృతి మినీ కవితా ప్రక్రియద్వారా నేడు అభివ్యక్తి పొందుతున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెప్పవలసిన చివరిమాట – శ్రీ శ్రీ తో ప్రారంభమైన కవిత్వ పరిణామంలో వస్తువుకూ, దృక్పథానికీ సంబంధించిన 'రెండో' మార్పుకే యిన్ని సంవత్సరాలూ ప్రాధాన్యం లభించింది. దానికి కారణం జాతి జీవితంలో రాజకీయాలు పొందిన ప్రాముఖ్యం. ఆ కవిత్వ పరిణామంలో మలిదశ ప్రక్రియలకు (Devices) సంబంధించిన మార్పు - ముఖ్యంగా బింబము (Image), ప్రతీక (Symbol), భావచిత్రము (Ideogram) లకు సంబంధించినది, తెలుగు ప్రజల దృష్టికి యిప్పుడిప్పుడే వస్తున్నది. నగ్నముని (కొయ్యగుర్రం), శేషేంద్రశర్మ (నా దేశం నా ప్రజలు), మోహన్ ప్రసాద్ (చితి-చింత) శ్రీకాంతశర్మ (అనుభూతి గీతాలు), ఇస్మాయిల్ (చిలుకలు వాలిన చెట్టు), కృష్ణకుమారి (అగ్నిపుత్రి) చేసిన, చేస్తున్న కృషి ఆశావహంగా ఉన్నది. సాహిత్యంలో నవల పొందుతున్న ప్రాచుర్యం దృష్ట్యా నేడు కవిత్వాన్నే ఒక ఉద్యమంగా రూపొందించవలసి ఉన్నది.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనుభూతి కవిత్వం

కవిత్వ ప్రయోజనం సందేశం, ఆనందం అని పాశ్చాత్య విమర్శ కులూ, హితం 'కాంతా సమ్మితంగా' చెప్పడమని మనవాళ్ళూ తేల్చి చెప్పి ఉన్నారు. భావ కవిత్వానికీ అనుభూతి కవిత్వానికీ గల తేడా ఏమిటని చాలా మంది నేడు ప్రశ్నిస్తున్నారు. భావకవిత్వంలో (కాల్పనికవాద కవిత్వంలో) సందేశం, ఆనందం రెండూ ఉంటాయి. అనుభూతి కవిత్వంలో 'అనుభూతి' ద్వారా సిద్ధించే ఆనందమే ఉంటుంది. సందేశం ఉండదు ! ఉదాహరణకు కీట్స్ వ్రాసిన 'నైటింగేల్', 'గ్రీషన్ అర్న్' ఖండకావ్యాల్లో లోతైన అనుభూతి ఉన్నది. నైటింగేల్ పాట అనుభూతిలో అమృతత్వం ఉన్నదని కవి నిర్దేశిస్తాడు. గ్రీషన్ అర్న్ చివర 'Beauty is Truth and Truth Beauty' (సౌందర్యమే సత్యం, సత్యమే సౌందర్యం) అనే ప్రవచనాన్ని ఉటంకిస్తాడు. తెలుగులో కాల్పనికవాద కవులందరికీ, ప్రణయం, విరహం, ప్రకృతి సౌందర్యం, దేశభక్తి, దైవభక్తి, ఆత్మనిర్వేదం ఇతివృత్తాలు. కృష్ణశాస్త్రి 'ప్రవాసము', 'ఊర్వశి' ఖండికల్ని విడిగా చూస్తే వాటిలో కొన్ని సందేశం ఏమీలేని అనుభూతి కవిత్వంగానే కనిపిస్తాయి. కాని అవి వేర్వేరు ఖండికలు కావు. వాటిలో అంతస్సూత్రంగా ఊర్వశి తత్త్వాన్ని గూర్చిన అన్వేషణా, దాని క్రమ పరిణామం గోచరిస్తాయి. (చూడు : కృష్ణశాస్త్రి నిర్వేదం : కవిహృదయం - ఆర్. ఎస్. సుదర్శనం), జాషువా, దువ్వూరి రామిరెడ్డి వంటి కవులలో ఆలోచనా, ఊహా ప్రాధాన్యం వహిస్తాయి.

'అనుభూతి' అంటే దేన్నిగూర్చి మాట్లాడుతున్నామో స్పష్టంగా అవగాహనకు రావలసిన అవసరం ఉన్నది. ఆధునిక సమాజంలో మాటలూ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఊహలూ, సిద్ధాంతాలూ తెలిసినంతగా మనుష్యులకు 'అనుభూతి' (Experience) అంటే తెలియదంటాడు వెర్నర్ ఎర్‌హర్డ్ అనే మహాశయుడు. దాన్ని తెలియజేసి మానసిక వైకల్యాన్ని పోగొట్టేందుకు EST అనే వ్యవస్థను నెలకొల్పాడాయన. పదిహేను రోజుల శిక్షణా తరగతుల్ని నిర్వహించాడు. కొన్నేళ్ళ క్రితం బొంబాయిలో నిర్వహించాడు కూడా. ఆయన అంటాడు - అనుభూతిని గూర్చి మనం ఒక నిర్వచనం ఇస్తే, మనుష్యులకు ఆ నిర్వచనమే తెలుస్తోందిగాని, అనుభూతి అంటే ఏమిటో తెలీదు! అనుభూతిని వాళ్ళు పొందేలా కొన్ని పరిస్థితుల్ని కల్పించి ప్రయత్నం చెయ్యడమే మార్గం అంటాడు. ఉదాహరణకు 'డబ్బు' అనేది మనుష్యుల్లో అభయానికి ఒక గుర్తు. (a symbol of security) కాని 'డబ్బు' అభయం అనే అనుభూతిని మాత్రం కలిగించదు! అభయం అనే స్థితిని పొందినట్లు అనుకుంటూ డబ్బు ఇవ్వగల సౌఖ్యాల్నీ, సాధనల్నీ పొందవచ్చు. కాని డబ్బును గూర్చిన 'యావ' ఉంటూనే ఉంటుంది. 'అభయం' అన్న అనుభూతిని పొందిన మనిషి ఈ 'యావ'నుంచి విముక్తుడవుతాడు. అతనికి డబ్బు విలువ ఏమిటో తెలుస్తుంది కాని డబ్బును అదే పనిగా అన్వేషించడం ఉండదు! అందువల్ల డబ్బుని గూర్చిన విలువని బోధించడం ద్వారా ఆ మనఃస్థితి అతనిలో కలిగేలా చెయ్యడం సాధ్యపడదు. 'అభయం' అనే అనుభూతి సిద్ధించినప్పుడే అది వీలవుతుంది. అనుభూతి బుద్ధితో అర్థం చేసుకునేది కాదు! కొన్ని పరిస్థితుల్ని కల్పించి ఇతరుల్లో 'అనుభూతి' కలిగే ప్రయత్నం వరకు మనం చెయ్యవచ్చు. అప్పుడు కూడా వాళ్ళు పొందినట్లు నమ్మి ఊరుకుంటే మనమేం చెయ్యలేము. అది నమ్మకమే అవుతుంది తప్ప అనుభూతి కాదు! కవిత్వాస్వాదన కూడా అంతే!

ఆపిల్‌పండు వుంది. దాన్ని గూర్చి ఎన్ని విధాలనైనా వర్ణించవచ్చు. కాని దాన్ని కంటితో వస్తువుగా చూచినప్పుడు కలిగేది ఒక అనుభూతి; దాన్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొరికి తినడం మరొక అనుభూతి. ఈ రెండూ కాక మూడోరకం దాన్ని గూర్చి హెన్రీ మికాక్స్ చెబుతాడు, "I set an apple on the table. Then I set myself in the apple. What utter calm!" ఈ మూడోరకం అనుభూతియే "అనుభూతి కవిత్వానికి" చెందుతుంది,

మనం ఎరిగిన కవిత్వాలలో తార్కికమైన, ఆలోచనాత్మకమైన భాగం ఎక్కువగా ఉంటుంది - కథ, సన్నివేశం, జీవితాన్ని గూర్చి వ్యాఖ్యానం, సందేశం వగైరా. అనుభూతికి అంకురం, రూపకం. ఉపమ అలంకారాలలో వుంది. 'ముఖచంద్రుడు' అని మొట్టమొదట ముఖానికీ చంద్రునికీ సంబంధాన్ని గుర్తించడము కవి అనుభూతి. తర్వాత దాన్ని మామూలుగా, అనుభూతి రహితంగా వాడుకలోకి తెచ్చుకున్నాము. అరిస్టాటిల్ అన్నాడు: "A good metaphorimplies the intutive perception of the similarity in dissimilars." వర్డ్స్‌వర్త్: "The pleasure which the mind derives from the perception of similitude in dissimilitude." ముఖమూ, చంద్రుడూ తార్కికంగా భిన్నవస్తువులు: ఏ.బి. ఏ తాను ఏగా ఉంటూనే బి కూడా కావడం అనేది కవిలో జరిగిన సృష్టి అదే అనుభూతి. ఆ అనుభూతి లక్షణం ఆనందం. ఆ ఆనందాన్ని భాషలో 'ముఖచంద్రుడు' అన్నప్పుడు, ఆ ఆనందాన్నే శ్రోతకూడా పొంద గలిగితే మంచిది; అలా కాకుండా ముఖం గుండ్రంగా వున్నది, తెల్లగా వున్నది; చంద్రుడు గుండ్రంగా వున్నాడు, తెల్లగా వున్నాడు అంటూ వ్యాఖ్యానించి, తర్కించి నిరూపించడం వల్ల అనుభూతిని చంపి ఆలోచనని దాని స్థానంలో నిలబెడుతున్నాము ! 'ముఖచంద్రుడు' అన్న పదబంధాన్ని పదే పదే ఉపయోగించడంలో కూడా మనం అదే చేస్తున్నాము. అక్కిరాజు ఉమాకాన్తమ్ నవ్యకవుల కవిత్వంలో పునరుక్తి, పులుముడు ఉన్నదని విమర్శించడంలో నిజం లేకపోలేదు ! విశేషణాలను గుప్పించడం కూడా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'అనుభూతి'ని పలచబరచడమే! మధుర, మృదుల, స్వాదువంటివి మన కాల్పనిక కవులు ఎక్కువగా ఉపయోగించారు. కాల్పనికవాద కవుల కవితా సామగ్రి ఏమిటో పింగళి - కాటూరి కవులు జాబితానే ఇచ్చారు. ఇవన్నీ కాల్పనికవాద కవిత్వంలో 'అనుభూతి' భంజకాలే! భావకవిత్వంలో సంగీతం ముఖ్యపాత్ర వహించింది. 'లిరికల్ పొయెట్రీ' కి పర్యాయ పదంగానే 'భావకవిత్వం' వచ్చిందని కొందరన్నారు. అనుభూతి కవిత్వానికి సంగీతంతో అవసరం లేదు.

ఫ్రాన్స్‌లో ప్రతీకవాద కవులు (Symbolists) అభివ్యక్తం చేసిన కాల్పనికవాదం లోకాన్నీ, భాషనీ దాటిన భావలోకాల్లో, ఏదో అనుభూతి పరంపరలో విహరించే ప్రయత్నం. దానికి ప్రతిక్రియగా 'ప్రతిమావాదం' (Imagism) వచ్చింది. ఈ లోకం ఇందలి వస్తువులూ వీటిని మించిన ప్రపంచం లేదు. "A return to things in themselves" అన్నారు ప్రతిమావాదులు. కవిత్వానుభూతికి మూలకందమైన 'రూపకం' లోని సూత్రాన్నే సంక్లిష్టంగా నిర్వచించారు. 'ఇమేజ్' విషయంలో. "Image is not a comparison or simile; it is a novel entity, which results from a creative act by the poet who brings together two realities which are not normally thought of as having anything in common. For the reader the artistic emotion stands in direct proportion to the intensity of the paradox inherent in it - as a conscious effort is required to recognize the pertinent common feature in two distinct and seemingly unrelated elements." తడుముతో చీకటి జిప్పుని కొద్ది కొద్దిగా విప్పుతూ ముందుకు సాగుతోంది కారు .... ప్రియురాలి లేతరంగులకేసి, వెలుగులు జారే నున్నదనాలకేసి, మెత్తటి రాత్రి బ్లాంకెట్‌లోకి, మృదువుగా, మత్తుగా,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంకా లోతుకి ప్రయాణం" (రాత్రి కారు ప్రయాణం - ఇస్మాయిల్) ఇది అనుభూతి కవిత్వం. ఇమేజిస్టుల నుంచి నేర్చుకున్న శిల్పం.

అయితే ఇమేజిస్ట్ కవులందరూ అనుభూతివాద కవులు కారు! టి. యస్. ఎలియట్ ఇమేజిస్ట్ కవి కాని అనుభూతి కవి కాడు! కాల్పనిక వాద కవులు 'సెంటిమెంటలిజమ్' లోకి దిగజారిపోవడం కనిపిస్తుంది. అనుభూతి కవిత్వంలో అది కనిపించగూడదు; కనిపిస్తే 'అనుభూతి' భంగమౌతుంది!

కాల్పనికవాద కవుల్లో శృంగారం, కరుణవంటి సాంప్రదాయికంగా గుర్తింపదగిన రసపోషణ, పాత్రపోషణ, సన్నివేశ చిత్రణ ఉంటాయి. అనుభూతి కవిత్వంలో అనుభూతి నిర్దేశం పాఠకునికే వదలిపెట్టబడింది. పైనుదాహరించిన ఇస్మాయిల్ రచనలో 'శృంగారం' వుందని అనుకోవచ్చు. అలా అనుకోవడంతో పాఠకుడు తన అనుభూతికే అవరోధం కల్పించుకొని పేరు గుర్తింపుతో తృప్తిపడుతున్నట్లవుతుంది! మేధాగతమైన గుర్తింపులూ, విశ్లేషణలూ, తర్కాలూ వ్యక్తి అనుభూతి సాంద్రతకు భంజకాలే తప్ప దోహదాలు కావు. "As the reason destroys, the poet must create" అంటాడు వాలెస్‌స్టీవెన్స్ అనే కవి. కవి సృష్టించినదాన్ని అనుభూతిగా స్వీకరించకుండా తర్కించడం కూడా దాన్ని పాడుచేసుకోవడమే అవుతుంది!

అందువల్ల అనుభూతికి అవరోధమయ్యే ఆలోచనా సామగ్రిని వర్జించడమే అనుభూతి కవి లక్ష్యం. ఈ లక్ష్యం సాధించేదేమిటి? వ్యక్తి పరంగా, సమాజపరంగా? మార్క్యూజ్ (Marcuse) అంటాడు. "The traditional form of reason is to be rejected on the basis of the experience of Being - as - end - in - itself - as joy... The

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

tyranny of Becoming over Being must be broken if man is to come to himself in a world, which is truly his own" జీవితం యొక్క లౌకిక పరిణామంలో, నిత్యనైమిత్తికాల్లో, ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాల అన్వేషణలో నిమగ్నుడైన మానవుడు తన అస్తిత్వాన్ని, దాని అనుభూతిని విస్మరిస్తున్నాడు. ఆ అనుభూతి స్వరూపం ఆనందం, దాన్ని దాటిన గమ్యం ఏదో ఎక్కడో లేదు. అస్తిత్వపు లోతుల్ని తాకినప్పుడు మనిషి ఇతర లోకాల్ని గూర్చిన వెర్రి అన్వేషణ మానుకొని, తనదైన ఈ ప్రపంచంలో, స్వస్వరూపజ్ఞానంతో, ఆనందంతో బ్రతుకగలుగుతాడు. ఇందులో మోక్షం అనే పురుషార్థం కూడా ఒక మరీచికే। "This will happen only when the transcendence has been conquered and eternity has become present in the here and now" Marcuse. మానవుని దృక్పథంలో మార్పు అవసరం. ప్రకృతిమీద (సైన్స్ ద్వారా) తోటి మానవులమీద ఆధిక్యాన్ని, అధికారాన్ని పొందాలనే సంస్కృతి నుంచీ బయటపడాలి. "The experince of a world that is not to be mastered and controlled but to be liberated., the opposition between man and nature, subject and odject to be overcome. Being is to be experienced as gratification... Not the fruit of experience but experience itself is the goal" (Eros and Civilization : Marcuse)

ఇక్కడ విషయి - విషయము అంటూ రెండుగా భావింపబడుతూ, తత్త్వవిచారణను ముఖ్యంగా పాశ్చాత్య తత్త్వవిచారణను ప్రభావితం చేస్తున్న ద్వంద్వాలను గూర్చి కొంత ప్రసంగించాలి. ఈ దృక్పథం వల్లనే భావవాదం - భౌతికవాదం వైరుద్ధ్యాలూ, సాహిత్యంలో కాల్పనికవాదం (ఆత్మాశ్రయం)-వాస్తవికతావాదం (Realism and naturalism) విభేదాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉద్భవించాయి. 19వ శతాబ్ది పాశ్చాత్య సాహిత్యంలోగాని, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కలిగిన సాహిత్య పరిణామాలలో గాని (T. S. Eliot, James Joyce, W. B. Yeats) కాల్పనిక వాదానికీ వాస్తవికతా వాదానికీ మధ్య సంఘర్షణా సమన్వయం ఉంటూనే వున్నది. (దీన్నిగూర్చి సాహిత్యం. ఆధునికత - అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, 1987 అనే నా వ్యాసంలో విపులంగా చర్చించాను). ఆసక్తికరమైన విషయమేమంటే, రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో, అటు తర్వాత, సార్త్రే, కేమూ వంటి రచయితల ద్వారా 'ఫినామెనాలజీ' (Phenomenology), అస్తిత్వవాదం ప్రాముఖ్యం వహించాయి. ఫినామెనాలజీ అనుభవానికి ప్రాముఖ్యం ఇచ్చి, అనుభవాన్ని విశ్లేషిస్తుంది తప్ప ఆత్మాశ్రయ, వస్త్వాశ్రయ విభేదాన్ని గుర్తించదు. ఈ పరిణామం సాహిత్యంలో వస్తుందని 1930లోనే ఎడ్మండ్ విల్సన్ అనే ప్రముఖ విమర్శకుడు ఊహించాడు. "Our conceptions of objective and subjective have unquestionably been based on false dualisms; our materialisms and idealisms alike have been derived from mistaken conceptions of what the researches of science implied - Classicism and Ramanticism, Naturalism and Symbolism are, in reality, therefore false alternatives. And so we may see Naturalism and Symbolism combine to provideus with a vision of human life and its universe, richer, more subtle, more complex and more complete than any that man has yet known..." (Axcl's Castle; Edmund Wilson. 1931) విషయి - విషయము అనే ద్వంద్వాన్ని పరిత్యజించి చూచినప్పుడు సత్యంపట్ల దృష్టి మారుతుంది. సత్యం వస్త్వాశ్రయంగా (Objective)గా సామూహికమైనదిగా కేవలం (absolute)గా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాక వ్యక్తిపరమై, సాపేక్షమైనదిగా భాసిస్తుంది. "Is it true?" అని కాక "Is it true for me?" అనేది ప్రాధాన్యం వహిస్తుంది.

'అనుభూతి కవిత్వా'నికీ 'అస్తిత్వవాదా'నికీ చాలా దగ్గర సంబంధం వుంది. అస్తిత్వవాద దృక్పథంలో మనిషికీ బాహ్య ప్రపంచానికీ గల సంబంధం ఆత్మీయమైనది. ఆలోచనాత్మకం కాదు. మనం వస్తు ప్రపంచంలో మెలిగే విధానంలో ఆలోచనకంటే ఆత్మీయతే ప్రాధాన్యం వహిస్తూంటుంది. ఉదాహరణకు సైకిలు, కారు, చేతికర్ర వంటి వాటిని గూర్చి బుర్ర ఉపయోగించి ఆలోచించడం కంటే, మన శరీరం వాటితో సమన్వయం కుదుర్చుకుంటుంది. "We make them share in the extension in space of the body as such." మెర్లిన్ పొంటీ అంటాడు: "The world is not what I think, but what I live" అలా వస్తుప్రపంచాన్ని గుర్తించడమే 'అనుభూతి'. 'మనిషి'ని గూర్చిన ప్రాథమిక నిర్వచనం అంటూ ఏమీలేదు; మతం, సైన్సు, రాజకీయాలు, తత్త్వశాస్త్రం వీటినుంచీ 'మనిషి'ని గూర్చిన నిర్వచనాన్ని ఎరువు తెచ్చుకోవలసిన అవసరం అస్తిత్వవాద రచయితకు లేదు. ఇదే అనుభూతి వాదకవికీ వర్తిస్తుంది.

1950 ప్రాంతాల ఇంగ్లండులో, అమెరికాలో 'naked poetry' 'open poetry' నగ్న కవిత్వం, దిగంబర కవిత్వం, 'Confessional Poetry' or 'Poetry of experience' అనుభూతి కవిత్వం పేర్లతో కొత్త కవిత్వం వెలువడింది. దీనికి తెలుగులో వచ్చిన 'దిగంబర కవిత్వా' నికి పేరులో తప్ప ఇతర సామ్యంలేదు. అలాగే 'Poetry of experience' కి, తెలుగులో అనుభూతి కవిత్వానికీ ప్రేరణలో కొన్ని పోలికలున్నా, స్వరూపంలో తేడాలున్నాయి. రాబర్ట్ లోవెల్ (Life Studies, 1959) డబ్ల్యుడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్నాడ్ గ్రాస్ (Hearts needle) ఆన్ సెక్స్టన్ (To Bedlam, 1960), సిల్వియా ప్లాథ్ (Ariel, 1965) ఈ కోవకు చెందిన కవులు. రాబర్ట్ లోవెల్ ఈ నగ్న లేక అనుభూతి కవిత్వాన్ని గూర్చి ఇలా అంటాడు. "In life we speak with many false voices; Occasionally, if we are lucky, we find a true one in our poems. A poem needs to include a man's contradictions... In the writing of a poem all our compulsions and biases should get in, so that finally we don't know what we mean" తార్కిక శక్తిని ఆవల వుంచి, మనసులో ఉన్నదంతా వెళ్ళబోసుకోవడం ద్వారా, వ్యక్తి అనుభూతి లోతుల్ని తాకటానికి కవితా రచన ద్వారా ప్రయత్నిస్తున్నానంటాడు. లోవెల్, జేమ్స్ డిక్కి (Helmets, 1964) అదే ధ్యేయాన్ని ఇలా చెప్పాడు:

"I was interested most of all in getting an optimum presentational immediacy', a compulsiveness in the presentation of the poem that would cause the reader to forget literary judgments entirely and simply experience... Of late my interest has been in the conclusionless poem, the open or ungeneralizing poem, the unwell-made poem" ఈ కవులు ఇమేజిస్ట్ శిల్పాన్ని గాని, మరే శిల్పాన్ని గాని త్రోసి రాజనడం కన్పిస్తుంది; ఆ విధంగా పాఠకునిలో కేవలం అనుభూతిని కల్పించే ప్రయత్నం చెయ్య వచ్చునని వాళ్ళ నమ్మిక. ఈ విషయంలో తెలుగు కవులు, ముఖ్యంగా ఇస్మాయిల్, ఇమేజిస్ట్ శిల్పాన్ని నేర్పుగా, శ్రద్ధగా ప్రయోగించి అదే ధ్యేయాన్ని సాధిస్తున్నారు.

అనుభూతి కవిత్వం వ్యక్తిపరంగా, సమాజపరంగా సాధించేదేమిటి? జె. పి. రాన్సమ్ అనే అమెరికన్ కవి ఇలా అంటున్నాడు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Abstract principles - science, ethics, politics etc. tyrannise over the sensibility and restrict its innocent, profitless delight in the vividness and variety of the world; to restore the sensibility to its proper eminence in man and his society and to enable it to enjoy its harmless indulgence"

సైన్స్, రాజకీయాలూ, ధర్మబోధ వంటివి మనిషి చైతన్యాన్ని ఆక్రమించి, మనిషి వస్తు ప్రపంచంలో తన అస్తిత్వం ద్వారా పొందే సహజ స్నిగ్ధమైన ఆనందాన్ని అణచివేసి, త్రొక్కి పెడుతున్నాయి. ఆ ఆనందానికి, సహజమైన అస్తిత్వ అనుభూతికి సముచితమైన స్థానాన్నీ, విలువనీ ఏర్పరచే ప్రయోజనమే అనుభూతి కవిత్వం చేస్తున్నది.

వ్యక్తి అనుభూతి విశిష్టమైనది అన్నప్పుడు పాఠకులకు అది ఎలా అందుతుంది? అది సాధారణీకరణం చెందడం సాధ్యమా? అన్న ప్రశ్నకు రాబర్ట్‌పెన్ వారన్ ఇలా చెబుతున్నాడు: "The reader does not interpret the poem, but the poem interprets the reader. We may say that the poem is the light and not the thing seen by the light. The poem is the light by which the reader may view and review all the areas of experience with which he is acquainted..." అనుభూతి కవితను పాఠకుడు బుద్ధితో వ్యాఖ్యానించి, అర్థంచేసుకునే ప్రశ్న ఇక్కడ ఉదయించదు. ఈ కవిత్వ లక్షణం అది కానేకాదు! ఈ కవిత వెలుతురు వంటిది, వెలుతురులో కనిపించే వస్తువు వంటిది కాదు. అంటే కవిత అనే ఈ వెలుతురుతో పాఠకుడు తనలోనే అనుభూతుల్ని రకరకాలుగా గుర్తించి ఆనందించడానికి వీలవుతుందన్నమాట.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉదాహరణకు ఇస్మాయిల్ వ్రాసిన 'గోడ' అనే చిన్న కవితను తీసుకుందాం. "బైట ఉండాల్సిన వేమిటో, లోన ఉండాల్సిన వేమిటో అన్నీ నాకు తెలుసు. ఐతే ఈ కిటికీకి ఇక్కడేం పని?" ఈ కవిత కలిగించే అనుభూతిని ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా అభివ్యక్తం చెయ్యవచ్చు. అంటే అర్థాలు చెప్పుకోవచ్చు. కాని ఆ అర్థమే సరైనదన్న సమర్థనకు వీలు లేదు. కారణం ఈ కవిత దేన్ని గూర్చో తెలీదు. గోడను గూర్చి కదా, గోడ తనను గూర్చి చెబుతున్నది కదా! ఏం చెబుతున్నది? అది నా అనుభూతికి దేనికి అభివ్యక్తో నేనుగా వెదుక్కొని వ్యాఖ్యానించుకోవాలి. నా మటుకు నాకు 'గోడ' విషయినీ (లోపల ఉండాల్సినది) విషయాన్నీ (బైట ఉండాల్సినది) వేరు చేస్తున్న తాత్త్వికదృక్పథంలో, అనుభూతి, 'కిటికీ'లా రెండింటినీ కలుపుతున్నదని వ్యాఖ్యానించుకుంటాను. అనుభూతిలోనే ద్వంద్వాలు కలుస్తాయి! అయితే ఇది ఆ కవితకు 'అర్థ'మని చెప్పడానికి కవితలో ఏ ఆధారమూ లేదు. వ్యాఖ్యానం నాలోని అనుభూతికి అభివ్యక్తి మాత్రమే! "A Poem is a hypothetical verbal structure, it has no single discursive or rational meaning" (Northrop Frye) కవిత ఒక శబ్ద నిర్మాణము. దానికి తార్కికమైన, విచారణాత్మకమైన అర్థం అంటూ ఒక్కటే ఉండదు. అంటే చాలా వుంటాయి. ఏమీ లేకుండానూ పోవచ్చు!

మార్క్యూస్ అంటాడు: మనిషి జీవితంలో పని (Work) ఎంత ముఖ్యమో, ఖేల (play) అంత ముఖ్యం, పని ద్వారా లభించేది నిర్దిష్టమైన కామితార్థం. ఖేల ద్వారా లభించేది దానికదే విశిష్టమైన ఆనందం. తతిమా కవిత్వాలు, సందేశాలూ, అర్థాలూ ఇచ్చే 'పని'ని నిర్వహిస్తే, అనుభూతి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిత్వం ఆనందాన్ని, జీవితానందాన్ని, కేవలం జీవించటం ద్వారా మనిషి పొందే ఆనందాన్ని సిద్ధింపజేసే 'ఖేల'.

'కళ కళకోసమే' అన్న సిద్ధాంతం సౌందర్యోపాసనకు (Aestheticism) సంబంధించినది. అందులో నియమ నిబంధనలూ, సంప్రదాయ ప్రయోగాలూ చాలా ఉన్నాయి. అవేమీ లేని - ముఖ్యంగా సంప్రదాయం సోకని - కవిత్వం అనుభూతి కవిత్వం.

అనుభూతి కవితగా గుర్తుపట్టడానికి ప్రధానమైన లక్షణం. కవిత చదివిన తర్వాత మిగిలేది ఒక సందేశం, ఒక భావం, ఒక దృక్పథం కాకుండా కేవలం అనిర్దిష్టమైన అనుభూతి కావాలి. అది పోలికల ద్వారా, ఊహల అల్లికలద్వారా, యింద్రియ సంవేదన రేకెత్తించే వర్ణన ద్వారా కావచ్చు. కాని అందులోని నవ్యత హృదయానికి హత్తుకొనే అనిర్వచనీయమైన, అనిర్దిష్టమైన అనుభూతిగా మిగలాలి. ఇస్మాయిల్ గ్రామఫోన్ రికార్డు, టీకప్పు, సైకిలు, మేకు, సీసా గాడిద, ఫ్యానుకింద లోకం, బావి, చెట్టు, కోసిన మామిడిపండు, గోళీకాయలు. తుఫాను, గేదెవంటి శీర్షికలతో వ్రాసిన పద్యాలు ఒక్కొక్కటి ఒక వైయక్తికానుభూతిని అందిస్తూ, జీవించటంలో గల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఘర్షణ, నిర్వేదం ఎక్కడా కనిపించవు.

ఇస్మాయిల్ శిల్పం పదచిత్రాలతో, భావ సంక్షిప్తతతో కూడిన ఇమేజిస్ట్ శిల్పం. అన్వయ క్లిష్టత - ప్రతీకవాదుల సంప్రదాయానికి సంబంధించినది - ఎక్కడా కనిపించదు, కాల్పనిక వాదచ్ఛాయలు ఎక్కడా సోకవు.

శ్రీకాంతశర్మ శిల్పం భావకవుల శిల్పమే. కాని ధ్యేయం అనుభూతి, "లోకంలో ఋతువులు ఆరైతే, నీలో ప్రతి అనుభవం ఒక ఋతువే"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంటాడు. కాల్పనికవాదం తాలూకు స్వాప్నికత చాలాచోట్ల కనిపిస్తుంది. స్వప్నంకూడా అనుభూతే అయితే మనోవైజ్ఞానిక సిద్ధాంతాలకూ, సందేశాన్ని చేరవేసేందుకు కాక, అస్తిత్వపు అనుభూతిని వింతగా వినూత్నంగా ఆవిష్కరించే స్వప్న శకలాలు శ్రీకాంతశర్మ కవితల్లో లభిస్తాయి. "జీవితపు రొదకూ మెత్తని ఎదకూ ఎంతెంత దూరం - నా అస్తిత్వపు విలువ కొండ అంచున బొట్టమోపుగా నిలిచిన బొమ్మరాయి తీరు !_ లోయ నా మౌనం (లోయ) అంటాడు. "నీలో ఇరుక్కున్న ప్రపంచం బయటపడాలనుకుంటుంది, బయటనున్న ప్రపంచం నీలో జొరబడాలనుకుంటుంది. ఇది చిరు ఘర్షణ" (దుఃఖం). ఇది శ్రీకాంతశర్మ కవితల్లోని అస్తిత్వ పరిదేవన (Existentia Agony).

బాలగంగాధర తిలక్ రచనలు కొన్నింటిలో ప్రారంభమైన అనుభూతి కవిత, ఇస్మాయిల్, శ్రీకాంతశర్మ కవితల్లో ఒక స్పష్టమైన కవితా విప్లవంగా రూపుదిద్దుకొని, చిన వీరభద్రుడు, శిఖామణి వంటి యువకవుల్లో వికాసం చెందుతూ తెలుగు కవిత్వం యొక్క నవనవోన్మేషిత్వాన్ని నిరూపిస్తున్నది.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగు కథ: శిల్పం

ఈగ యిల్లు అలుకుతూ పేరు మరిచిపోయిన కథ అందరికీ తెలుసు. పేరు మరచిపోవడంతో ప్రారంభమైన కథ, ఒక అన్వేషణగా సాగి, పేరు మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడంతో ముగుస్తుంది. ఇక్కడ ఆద్యంతాలకు సమన్వయం ఉన్నది. మధ్యసాగిన అన్వేషణలో - పేదరాశి పెద్దమ్మ కొడుకూ, గొడ్డలీ, చెట్టూ వగైరాల మధ్య కార్యకారణ సంబంధం ఏమీ లేదు. ఏదో గొలుసు సంబంధంతప్ప. ఈ కథని కథా శిల్పంలో ఒక నమూనాక్రింద తీసుకోవచ్చు.

ఆత్యాధునికమైన నేటి తెలుగుకథల్లో కొన్నింటిలో, ఆత్మాన్వేషణ - నేనెవరు ? అన్న ప్రశ్నకు సమాధానం వెదుక్కోవడమే - వస్తువు. ఇలాంటి కథల్లో శిల్పంరీత్యా ఆద్యంతాలు కలుస్తాయి. కాని మధ్యలో కథాశరీరంలో, కార్యకారణ సంబంధం పనిచెయ్యదు. జీవితం అర్థంలేని కొన్ని సంఘటనల కూర్పు. ఆత్మాన్వేషణలో మనిషి బయలుదేరినచోటికే తిరిగివస్తాడు, తన్ను తాను వెదుక్కోవడంలో అనుభూతులమధ్య, ఆలోచనలమధ్య, వంతెనలు (కార్యకారణ సంబంధం) కేవలం వ్యక్తి కల్పన. అవి చాలవు. చివరకు మిగిలేది ఏదో స్ఫురణ. 'త్రిపుర' వ్రాసిన "వంతెనలు" అనే కథ ఒక మంచి ఉదాహరణ. కథానాయకుని మనఃస్థితిని మొదటా చివరా అతని టేబిల్‌డ్రాయర్‌లో ఉన్న రివాల్వర్, గార్డినల్ మాత్రలు సూచిస్తాయి. కథ మొదట్లో రాజు అనే స్నేహితునికి తిడుతూ ఉత్తరం వ్రాసినవాడు కథచివర్లో ఆ ఉత్తరాన్ని మరోవిధంగా మార్చి వ్రాస్తాడు. "రాజూ, నీ ఆయుధం నిన్ను ముందుకి వెలుతుర్లోకి తీసు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కెళ్తుంది, నాది నా చీకట్లోకి. చీకటికీ వెల్తురికీ మధ్య వంతెన ఉంటుందో లేదో.... నన్ను మన్నించు. నన్ను నమ్ము రాజూ" అంటూ ముగిస్తాడు. ఈ కథలో ఆద్యంతాల కలయిక వాటిని సూచించే ప్రతీకాత్మకమైన ధ్వనీ ముఖ్యం. రాజు అనే స్నేహితునికి అడ్రసు ఉన్నా లేకపోయినా, కథ నాయకుని మనస్సులో 'రాజు' అంటే ఆశ, ఆదర్శం. "ఏ కొండల్లో ఏ కొండలమీద, ఏ అడవుల్లో ఏ చెట్లక్రింద నిలబడి ఉంటావు రాజూ, ఏ పసిబిడ్డల భావి శాంతిస్వప్నాలలో మనిషికోసం వెక్కి వెక్కి ఏడుస్తున్నావ్ ? ఏడుస్తూ, ఏ ఆయుధం పట్టుకుంటావ్ ?" అంటూ 'రాజు'ని ఉద్బోధిస్తాడు. 'రాజు'కి సమాజంలో బ్రతికే యోగంలేదా ? అని ధ్వని.

బుచ్చిబాబు వ్రాసిన "నన్ను గూర్చి కథ వ్రాయవూ ?" మరో ఉదాహరణ. తన్నుగూర్చి కథ వ్రాయమన్న కుముదం సామాన్య స్త్రీ. ఆమె జీవితం గతానుగతికం. పెళ్ళి, పిల్లలు, సంసారం. జబ్బు. చివరికి మరణం, అందులో చెప్పుకోదగ్గ విశేషం ఏమీ లేదు. కాని అనుభూతి ద్వారా ఆమె ఆకళించుకున్న జీవితరహస్యాన్ని. మేధావి అయిన రచయిత తన ఆలోచనద్వారా. ఆదర్శాలద్వారా అందుకోలేకపోయాడు. "నన్ను గూర్చి కథ వ్రాయవూ ?" అని కుముదం అడగడంతో ప్రారంభమైన కథ, ఆమె అలా అంటూనే మరణించడంతో ముగుస్తుంది. ఈ కథలోనూ ఆద్యంతాలకే సమన్వయం. కార్యకారణ సంబంధం పనిచెయ్యదు. కుముదం జీవితానికే ప్రతీక అని కథ చివర ధ్వని.

నేను వ్రాసిన "ఎరుపు" అని కథలోనూ తాత్త్విక, నైతిక, సామాజిక, రాజకీయ దృక్పథాలకూ, జీవితంలో అనుభూతికీ, ఘటనకీ సంబంధం లేని స్థితే నిరూపితమైంది. కార్యకారణసంబంధం పనిచెయ్యదు. ఆద్యంతాలకే సమన్వయం. "ఆకాశం రక్తం కక్కుంది" అంటూ ప్రారంభమైన కథ. కథానాయకుడు రక్తం కక్కడంతోనూ, మరొక వ్యక్తిని చంపి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రక్తం చిందించడంతోనూ ముగుస్తుంది. కథ మొదట్లో సారథి క్షయరోగి. అతను మెల్లగా కోలుకొంటూ వచ్చి కథ చివర్లో మళ్ళీ రోగం తిరగబెట్టేలా చేసుకుంటాడు. ఆ మధ్యకాలంలో అతని ఆలోచనలకీ అనుభూతికీ అందికా పొందికా లేదు; అది కుదిర్చేందుకు అతను చేసే ప్రయత్నాలు విఫలం అవుతాయి. కథచివరి వాక్యం : "మృత్యోర్మాఽమృతంగమయ" - జీవితానికి మృత్యువే అర్థం అని ధ్వని.

ఇవన్నీ "ఈగ కథ" నమూనాశిల్పంగా గల కథలు.

"ఎండని చేప కథ" మనం చిన్నతనంలో చెప్పుకొనే మరో కథ. రాజకుమారులు తెచ్చిన ఏడు చేపల్లో ఒక చేప ఎండలేదు. ఎందుకు ఎండలేదు? కథలో ప్రాధాన్యం అంతా ఈ ఎందుకు? అనే ప్రశ్నకే. ఆద్యంతాల సమన్వయం మీద కాకుండా, కార్యకారణ సంబంధంమీదే ప్రధానంగా ఆధారపడే కథాశిల్పానికి ఇది నమూనాకథ. ఎండని చేపనుంచీ, పిల్లవాణ్ణి కుట్టిన చీమదాకా సహేతుకమైన సంబంధాన్ని అన్వేషించడమే. అంటే హేతుపూర్వకమైన వివరణే ఇక్కడ ముఖ్యలక్షణం.

జన్మపరంపర అనేది జీవికి తప్పదు అనే విశ్వాసంతో విశ్వనాథ సత్యనారాయణ "ఏమి సంబంధము?" అనే కథ వ్రాసినా, వర్గపోరాటం అవసరం అనే దృక్పథంతో రాచకొండ విశ్వనాథశాస్త్రి "పిపీలికం" అనే కథవ్రాసినా, ఆ రెండుకథలూ, కార్యకారణసంబధాన్ని ఒక నిర్దిష్ట దృక్పథంతో అల్లికచేస్తూ, దృక్పథానికి ప్రాధాన్యం యిచ్చేవే. ఇవి రెండోరకం నమూనాశిల్పానికి ఉదాహరణలు.

సంఘటనల్నీ, వ్యక్తుల్నీ, రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, తాత్త్వికమైన ఏదో ఒక ఆలోచనాపథంలో కార్యకారణ రూపేణా వివరించటమూ, వ్యాఖ్యానించటమూ ఈ రకం కథల లక్షణం. చలం, గోపీచంద్,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుటుంబరావు, తిలక్, జి. వి. కృష్ణారావు, హితశ్రీ, బలివాడ కాంతా రావు, బీనాదేవి, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, కలువకొలను సదానంద, శ్రీపతి, కాశీపట్నం రామారావు మొదలైనవారు ఎన్నో మంచి కథలి లాంటివి వ్రాశారు. కాల్పనికవాదము, సామాజికచైతన్యము, హేతువాద దృష్టి, మానవతావాదము, నైతికదృష్టి, నిశితమైన మనస్తత్వ విశ్లేషణము, విమర్శా ఆయా కథల్లో కనిపిస్తాయి.

మూడోనమూనా "కోతిదోలు" కథ. కోతికిముల్లు విరిగితే మంగలి వాడు తీశాడు. ఆ తీసిన ముల్లు పారేశాడు. ఆ ముల్లు తన సొంతమనీ, తనకికావాలనీ, దాన్ని పారెయ్యడానికి వాడికేం హక్కు ఉన్నదనీ, కోతి పేచీ పెట్టింది. వాడు నష్టపరిహారంగా తన కత్తియిచ్చాడు. కత్తి పుచ్చు కుని వెడుతూ, దానిబదులు మరొకటి మార్చుకుంటూ చివరకు డోలు సంపాయించింది కోతి. ఇక్కడ కార్యకారణ సంబంధంకంటె కోతిబుద్ధి, దాని మనస్తత్వం ప్రాధాన్యం వహిస్తుంది. ఏదో దృక్పథంతో ముడిపెట్ట కుండా, వ్యక్తి గుణశీలాల్నీ మనస్తత్వాన్నీ ప్రధానంగా అభివర్ణించే కథలు ఈ మూడోరకం నమూనాకి చెందుతవి.

బుచ్చిబాబు, ఇచ్ఛాపురం జగన్నాధరావు, మధురాంతకం రాజారాం, శీలా వీర్రాజు, ఆర్. వసుంధరాదేవి యీ కోవకు చెందిన మంచికథలు చాల వ్రాశారు. ఈమధ్య వల్లంపాటి వెంకటసుబ్బయ్య వ్రాసిన "మింథ్యాబింబం" అనే కథ ఈ నమూనాకు చక్కని ఉదాహరణ. ఒక వ్యక్తి బాహ్య స్వరూపాన్నీ, ప్రవర్తనను అంచెలవారీగా ఆవిష్కరిస్తూ, ఒక 'మిథ్యా బింబాన్ని' కాక స్పష్టమయిన బింబాన్నే తీర్చిదిద్దిన ఈ కథలో 'కోతి - దోలు' నమూనా శిల్పం అభివ్యక్తమైన తీరు పరిశీలిద్దాం. ప్రభాకరం యితరులతో కలుపుగోలుగా ఉండడు. బహుశా అది గర్వం కావచ్చు; గర్వంకాదు ఏకాంతంగా ఉండాలన్న యిచ్ఛ; ఏకాంతంమీద యిచ్ఛగాదు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్త్రీజాతిపట్ల వైమనస్యం; స్త్రీజాతిపట్ల వైమనస్యంకాదు సంస్కారంలేని పశువాంఛ; సంస్కారం లేకపోవడం కాదు ఆత్మదైన్యం; ఆ ఆత్మదైన్యానికి కారణం అతని భార్య ప్రవర్తన; బహుశా భార్యప్రవర్తనకాదు. అతని లోని భీరుత్వమే అతణ్ణి చివర ఆత్మహత్యకు పురికొల్పింది. కథలో మనకు లభించింది ప్రభాకరంయొక్క వ్యక్తిత్వ విన్యాసం.

మానవ వ్యక్తి వైశిష్ట్యాన్ని అభివ్యక్తం చెయ్యడంలో కథాశిల్పం ఎన్నో పోకడలు పోవడానికి వీలున్నది. ఉదాహరణకు బుచ్చిబాబు "బీ" అనే కథలో ముస్లింకన్య హాషిమాబీ వ్యక్తిత్వానికీ జీవితానికీ కీలకమైన విషయంగా - తిరిగే ఫాన్‌లో వేళ్ళుపెట్టి దాన్ని నిలపాలనే ఆ అమ్మాయి చిన్నతనపు చేష్టను తీసుకుని, దానిమీద కథ అల్లుతాడు. ఆ అమ్మాయి భర్తతో మోటారుసైకిలు వెనుకసీటుమీద కూర్చుని సరదాగా ప్రయాణం చేస్తూ వుండగా, సైకిల్ తిరగబడి భర్త మరణిస్తాడు. రెండోసారి హాఫిజ్ అనే పైలట్‌ని చేసుకుంటుంది. భర్త మరో అమ్మాయితో వెడుతున్నాడని విమానాన్ని నిలపాలనే ప్రయత్నంచేస్తూ ఎదురువెళ్ళి తనే మరణిస్తుంది. "సృష్టి ఆగదు. పరిభ్రమిస్తూ ఉంటుంది. ఆ కదలిపొయ్యే సృష్టిని, తిరిగే విశ్వాన్ని ఒక్కక్షణం ఆపుతానంటుంది హాషిమాబీ. అంతటిశక్తి యౌవనానికి తగదు. అంతటిశక్తిని ఆమె శరీరం ఉంచుకోలేదు.... తగదని తీసుకుపోయింది సృష్టి" వ్యాఖ్యానం అవసరం లేదంటూనే యిలా వ్యాఖ్యానిస్తాడు రచయిత. కొన్ని కథల్లో బుచ్చిబాబు చేసే ఈ వ్యాఖ్యానం లేకపోతేనే శిల్పం బిగువుగా ఉండేదని తోస్తుంది. 'బీ' కథలో కూడా వ్యాఖ్యానం శిల్పంమీద దెబ్బతీసింది.

బుచ్చిబాబుదే మరోకథ "ఆశాప్రియ". ఇది ఒక సినిమాతార మనస్తత్వాన్ని అభివర్ణించేది. ఇందులోని పత్రికారచయితని నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనిపిస్తూనే సినిమాతార అతని సూచనలు అనుసరిస్తూవస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పుస్తకాల బీరువా కొంటుంది. కుక్కపిల్లని పెంచుతుంది. వివాహం చేసుకుని భర్తను ఏర్పాటు చేసుకుంటుంది. సంతానాన్ని కూడా పొందుతుంది - కాని అంతటితో ఆమె సినిమారంగంనుంచీ నిష్క్రమించవలసి వస్తుంది. పత్రికారచయితకి కూడా ఉద్యోగం పోతుంది. వృత్తిపోయినా జీవితంలో ఏదో సాఫల్యాన్ని పొందిన తృప్తి ఆమెది. హుందాగా రచయితకు భృతి ఏర్పాటుచేసి స్వగ్రామం వెళ్ళిపోతుంది. ఈ కథలో "కోతి - దోలు" శిల్పానికి చమత్కారం, సహజత్వం వన్నె తెచ్చాయి.

పైజెప్పిన మూడురకాల నమూనాకథల్లోనూ ప్రతీక రచన అదనంగా మేళవింపు కావడానికి వీలున్నది. అందువల్ల కథకు మరింత స్ఫూర్తి కలుగుతుంది. కవిత్వస్థాయి వస్తుంది. "ఒక్కనాటి అతిథి" (ఆచంట శారదాదేవి) అనే కథలో రాతిబండ, పొగడచెట్టు, దానిపూలు అలాంటి స్ఫూర్తి కలిగిస్తాయి. రాతిబండ లోకంపోకడ; పొగడచెట్టు కన్నెమనసు; దానిపూలు యౌవనపు కలలు. "పొగడచెట్టుక్రింద పెదరాతి బండమీద దిగులుగా కూర్చుంది కేతకి".... ఒక బాటసారి వస్తాడు. ఆ రాతిబండకు ఒక అంచున అతను కూర్చున్నాడు. మరొక అంచున ఆమె కూర్చునది. ఇద్దరికీ మధ్యగా రాలిన పొగడపూలు దట్టంగా నిండి ఉన్నాయి." బాటసారి ఆ రాత్రి పువ్వుల్ని దండలు గ్రుచ్చుతాడు. ప్రొద్దుటే వెళ్ళిపోతాడు. కేతకికి "జీవితం అతని ఎదుట ఒక్కసారి పుష్పించి శాశ్వతంగా ముకుళించినట్టున్నది." తర్వాత కేతకికి పెళ్ళవుతుంది. భర్తతో వెళ్ళిపోతుంది. పోతూ పోతూ "పొగడపూలమూట (తల్లి యిచ్చినది) ఆ రాతిబండమీద విసరిపారేసింది. బరువుగా ఉంది నేను మోయలేను అన్నది నిస్పృహతో కేతకి." ఇక్కడి కథ రెండవ నమూనాకి చెందినది - లోకంపోకడ రాతిబండవంటిది అనే దృక్పథాన్ని అభివ్యక్తం చెయ్యడం. 'రాతిబండ' అనేవి మాటగా కాకుండా కథలో సామగ్రిగా సహజంగా అమరిపోయి ప్రతీకగా కథకి విశేషస్ఫూర్తి కలిగిస్తోంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"మనుష్యులూ - బొద్దింకలూ" (ఆర్. వసుంధరాదేవి) అనే కథ మూడవ నమూనాకి చెందింది - ఒకానొక మనస్తత్వాన్ని వర్ణించేది. "బొద్దింక ! అనుకున్నాను. కోపం, అసహ్యం కలిగాయి. బాధ్యత అంటూ బరువుమోస్తూ తనకేవీ ప్రత్యేకమైన ఆశలూ కోరికలూ లేని - రక్తంలేని జీవి !" కథాసామగ్రిలో అమరిన బొద్దింక ప్రతీకగాకూడా మంచిస్ఫూర్తి కలిగిస్తుంది.

పై నుదహరించిన ప్రతీక రచన కథానిర్మాణం (Structure) లో భాగంగా సాగుతుంది కథాకథనంలో (Texture) నే శ్రుతిలాగ, అంత కంటె వీణాస్వనంలాగా మేళవిస్తూ, ప్రతీకా వస్తువూ రెండూ తాదాత్మ్యం చెందేలాగ రచన చేస్తాడు రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఉదాహరణకి "మెరుపు మెరిసింది" అనే కథ తీసుకుందాం. ఇది జీవితాన్ని గూర్చిన ఒక దృక్పథం కథే. వర్షం - కాలానికి, కాలగమనానికి ప్రతీక; మెరుపు - విలువైన ఒకానొక అనుభూతికి ప్రతీక; వస్తువూ ప్రతీకా పడుగుపేకల్లా కాదు, దేహాత్మల్లా కలిసిపోయిన వైనం గమనించండి : "నీరజది వసం తాల ప్రాయం కాదు, వర్షాల ప్రాయమే ! వర్షం, వర్షం, జోరుగా, ప్రక్క-వాటుగా, పొడుస్తూ, వర్షం !" 'వర్షం' మీద శ్లేష, ధ్వని, సంగీతం, ప్రతీక - ఎన్నో సాధింపబడ్డాయి. "మెరుపు, మెరుపు, మరో మెరుపు. మనస్సులో మెరుస్తున్నాయి. ఆశల మెరుపులు....అతనెవరో, నేనెవరో ? మళ్ళీ కనిపిస్తాడా ఏమైనానా ? కనిపించడా ? మెరుపు. అదిగో మెరి సింది, కనిపిస్తాడు మళ్ళీ....వర్షం. పడాలి యింకా పడాలి....నిన్న కూడా యిదేవేళ. నిన్నకూడా యిదేవర్షం....ఒకటీ, రెండూ, మూడూ....చూడ కుండా పోతున్నాడే ! నిజంగా చూడకుండా పోతున్నాడా ?....చూడనట్టు నటించి వెళ్ళిపోయేడు....ఆశించమని ఎవరన్నారు ?.... వర్షం, వర్షం,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దిక్కుమాలిన వర్షం....అదంతే, ఇదింతే. అదో మెరుపు. ఇదో మెరుపు. మరో మెరుపు........మెరుపులు మెరుపులు ఆశల మెరుపులు .... ఆఖరి కిదే నిజం. ఈ చీకటే ఇదే ఈ చీకటే నిజం .... వయసు వెళ్తుంది. చావు వస్తుంది. అదిగో మెరుపు మెరిసింది. అప్పుడే మాయమైంది. ఆఖరి కింతే....ఈ అంధకారంలో ఇలా ఒంటరిగా, నిరాశతో....వర్షంలో చలితో, తడితో, చింకిగొడుగుతో, ఒంటరిగా, ఒంటరిగా .... మెరుపు మెరిసించి. మాయమయింది.'' 'మెరుపు' అనే ప్రతీక యొక్క క్రమపరిణామం యిక్కడ ముఖ్యంగా గమనించాలి. విలువైన అనుభూతిగా, ఆశ (expectation) గా, ఊహ (fancy) గా, అనంతకాలంలో క్షణికమైన ఒక మానవజీవితంగా, ఎన్నోవిధాల అర్థస్ఫూర్తి నిచ్చింది.

ప్రతీకని పెంచుకుంటూ పోవడంలో విశ్వనాథశాస్త్రి శిల్పవైశిష్ట్యం వ్యక్తమౌతూ వుంటుంది. "జరీఅంచు తెల్లచీర" అంటే కోరే మనస్సు. అలౌకికమైన, అసంభావ్యమైన, కోరిక లేమీకావు. డబ్బుంటే సులువుగా తీరే కోరికలే. కాని అవి తీరవు, దారిద్ర్యంవల్ల. జరీఅంచు తెల్లచీరకు నోచుకోలేని అమ్మాయి కట్టుమిస్తే లభించే అందాల వరుడికి నోచుకోలేదు. పైగా డబ్బున్న కనకారావులచేత అవమానాల పాలవుతుంది. "తెల్లది, జరీఅంచుది, ఒక చీర ఉంటేనా ? కనకారావు రక్తంలో ముంచనా ? ఈ లోకాన్నే జయించనా'' అనుకుంటుంది. చివరకు తండ్రి ఆ చీర కొంటానంటాడు. "రక్తం ! బజారుకి వెళ్దామన్న మనిషి బజార్లో యివ్వబొయ్యేది డబ్బు కాదు, నెత్తురు....రక్తం ధార పోస్తేనేగాని తీరని కోరికలు నా కక్కరలేదు" అనుకుంటుంది. కాని తండ్రి బలవంతంమీద వెళ్తుంది. ఎక్కడచూచినా తండ్రి దగ్గరున్న డబ్బుకి ఆ చీర వచ్చేలా కనిపించదు. అంతకంటె కొట్టువాళ్ళ ఈసడింపులు భరింపరానివి. "నెత్తురే ఖరీదుగా యిచ్చినా దొరకని వస్తువులు ! .... ఒక్క

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జరీఅంచు తెల్లచీర !" కోరే మనస్సు - కోరిక - తీరని కోరిక - డబ్బు - ప్రతీకార వాంఛ - కష్టజీవుల రక్తం - నిస్పృహ - ఇలా జరీఅంచు తెల్ల చీర కథాంతానికి ఎన్నో రంగులు మార్చుకుంటూ పోతుంది.

అలాకాకుండా ప్రతీకని కేవలం ఒక సంకేతంగా (sign) నిశ్చితార్థంలో ఉద్దేశిస్తూ, దానికే ప్రాధాన్యం యిస్తూ దానిచుట్టూ కథ అల్లినప్పుడు, కథ ఒక ప్రహేళికగా తయారై, రచయిత ఉద్దేశాన్ని ఎక్కడికక్కడ ప్రయత్నించి వ్యాఖ్యానించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. వ్యాఖ్యానం చేసుకోలేకపోతే అలాంటికథ బోధపడదు. అయోమయంగా వుంటుంది. ఇది మంచి శిల్పం అని చెప్పలేము. దీనికి ఉదాహరణ "మేడమెట్లు" (బుచ్చిబాబు) కథ. మేడమెట్లు స్త్రీ పురుష సంబంధంలోని ఆకర్షణకీ అనిర్వచనీయమైన శక్తికీ సంకేతం. కథలో అధికారి, దౌర్భాగ్యుడు అని రెండుపాత్రలు. అధికారి భర్త. దౌర్భాగ్యుడు భగ్న ప్రేమికుడు. భౌతికమైన సుఖమా? భావనాత్మకమైన అనుభూతా? స్త్రీనుంచీ ఏది పొందిన వాడు అదృష్టవంతుడు? ప్రేమికుడు తన ప్రేమకథ చెబుతాడు. అతడు ప్రేమించిన అమ్మాయిని ధనం, సరస్వతి, రాణి అనే మూడుపేళ్ళతో వ్యవహరిస్తాడు. బాల్యంలో ఒకసారి ఆ అమ్మాయిది వజ్రపుటుంగరం ఇతనికి దొరుకుతుంది. దానితో ఆ అమ్మాయిని కవ్విస్తాడు. ఇతంతా ఒక మేడ మెట్లమీద. అక్కడే ఆ అమ్మాయితో 'సరస్వతీ - భక్తుడు' అనే ఆట. తర్వాత ఆమె రాణీ తను పౌరుడు అనే ఆట. అమ్మాయి వ్యక్తురాలైంది. ఒక సన్నివేశంలో "నన్ను తోసేసింది ధనం - ఉంగరం తీసుకుని గబగబా మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది. 'ఎందుకో తెలిసింది. నీ ఉంగరం దొరికింది. అవునా?' అన్నాను. పుట్టలో ఇరుక్కుపోయిన పాములా తన్నుకులాడింది. ఉంగరం వ్రేలునుంచి తటాలున తీసేసి

(22)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కిందికి గిరవాటెట్టింది. 'తీసుకుపో' అని చరాచరా వెళ్ళిపోయి తలుపులు మూసేసుకుంది. స్వర్గం గడియలు ఎవరో వేసినట్లయింది. స్వర్గం బయటో, లోపలో మీరే నిర్ణయించాలి" అంటూ ప్రేమికుడు తన కథ ముగిస్తాడు. ప్రేమికుని కథలో జరిగిందేమిటి ? అని స్పష్టమైన అర్థం వెదకటం సులువు కాదు. మలుపులు చాలా ఉన్నాయి. ఉంగరం అంటే ప్రేమ అని అర్థం చెప్పుకుంటే, జరిగిన 'ఆట' స్త్రీ పురుషుల అహమికల మధ్య సంఘర్షణగా వ్యాఖ్యానించుకోవాలి. "నీకు ప్రేమ (ఉంగరం) కావాలి కాని 'నేను' అక్కరలేదు" అని ప్రేమికుడంటే, ఆమె ఉంగరం గిరవాటెట్టి తలుపులు మూసేసుకుంది। అంతటితో ఆ ప్రేమకథ అంతం! కాని భర్త-ప్రేమికుడు, యిద్దరిలో ఎవరిది గెలుపు ? అనే ప్రశ్న మిగిలింది. కథాంతంలో రచయిత అధికారి కూతుర్ని ప్రవేశపెట్టాడు. ఆమె ఊరినుంచి వచ్చి 'నాన్నా' అని పిలవగానే, ఆ పిలుపు అందుకున్నవాడు ప్రేమికుడే। ఆమెలో తన ప్రేయసి 'ధనం' తళతళలూ, 'రాణీ' దర్జా, గుర్తించి, ఉత్తరపాటుతో మెట్లమీదనుంచీ పడి మరణిస్తాడు. ఇక్కడ కళ్యాణి తల్లి, అధికారి భార్య, ప్రేమికుడి పూర్వప్రేయసి అని సూచన ! ప్రేమికుడు పొందిన సాఫల్యం ఆ చివరి ఆత్మార్పణ ! అది ఆ ఆత్మార్పణ "కళ్యాణి మూలాన జరిగిందో, కళ్యాణి కోసం జరిగిందో, ఆమెకే (కళ్యాణి తల్లికే) తెలియాలి" అని రచయిత ముగింపువాక్యం. ఇట్లాంటి ప్రహేళికలాంటి కథలే బుచ్చిబాబు మరికొన్ని వ్రాశాడు.

కొడవటిగంటి కుటుంబరావు 'గల్పిక' అనే పేరుతో 1940 ప్రాంతాల్లో పొట్టికథల్ని వ్రాశాడు. ఈ కథల్లో వ్యంగ్యం ప్రధాన సూత్రం. 'దయ్యం' అనే గల్పికలో రాధ అనే చిన్నపిల్ల చచ్చిపోయిన తల్లిమీద బెంగతో తనూ చచ్చిపోతుంది. రాధను తల్లి దయ్యమైపట్టి తీసుకుపోయిందని అంతా అనుకుంటారు. దయ్యాన్నిగూర్చి మనుష్యులు చేసే హడావుడికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భయపడి, రక్షణకోసం తల్లిమీద ధ్యాసతోనే రాధ పోయిందని రచయిత ఉద్దేశించిన వ్యంగ్యం. 'సంతోషం సగం బలుపు' గల్పికలో తన కోసం తపించిపోయే ప్రేమికుణ్ణి పెళ్ళాట్టానికి ఒప్పుకొని నాలుగు నెలలు గడువుపెట్టింది ఒక అమ్మాయి. ప్రేమసాఫల్యం అతని బరువు 180 పౌను లకి పెంచింది. అది కారణంగా ఆ అమ్మాయి మరొకర్ని పెళ్ళి చేసు కున్నది ! మొదటి అబ్బాయి మళ్ళీ సన్నగా నాజూకుగా, దిగులుగా తయా రైనాడు : 'చిట్టి' గల్పికలో ముద్దుబిడ్డను కోల్పోయిన యువదంపతుల మన స్సుల్లో కలిగిన పరిణామం చాల హృద్యంగా వ్యక్తం చెయ్యబడింది. "ఇద్దరూ కలిసి సమంగా కన్నీరు కార్చటం ఎంతబాగుంది ! కామంతో కాంతాన్ని కావలించుకోవటం మాత్రమే తానెరుగును. ఇట్లా దుఃఖంతో కావలించుకోవటం ఎరగడు !" యౌవనంలో దుఃఖం కొత్తచిగుళ్ళు మోసు లెత్తడానికే దోహదమౌతుందన్న జీవిత వైచిత్రిని వ్యక్తంచేసే ఈ గల్పిక మంచి రచన.

శిల్పంలో తక్కువస్థాయికి చెందినవి 'ఫార్ములా' కథలు. ఫార్ములా కథల్లో ఒక లక్షణం ఉంటుంది. కథచివర రెండుమూడు పేరాలు చదివితే చాలు, కథ ఏమిటో తెలిసిపోతుంది. ప్రేమించుకున్న అమ్మాయీ, అబ్బాయీ పెద్దల బలవంతంమీద ఒప్పుకున్న సంబంధం, లేక మేనరికం, చివరకు వాళ్ళు కోరుతున్న ప్రేమసంబంధమే కావడం. అవినీతికి పాల్పడిన డాక్టరు, ఒక హంతకుడి 'ఎలిబీ' కోసం దొంగసర్టిఫికెట్ యిస్తాడు. హతుడు ఆ డాక్టరు కొడుకే కావటం ముగింపు. వ్యభిచార గృహానికి జూదరి, తాగుబోతు అయిన భర్త వెళ్తాడు; అతని భార్య, పాపాయి మందు కోసం డబ్బులేక అది సంపాయించేందుకు అక్కడికే వెళ్ళి తన భర్తకే తారసిల్లడం ముగింపు. వారపత్రికల్లో వచ్చేకథల్లో ఎక్కువభాగం యిలాం టివే ఉంటున్నాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'సమస్యాపూరణం' కథలు, భేతాళ - విక్రమార్కుల కథల్లాంటివి, నిజానికి రెండోనమూనా - అంటే కార్యకారణసంబంధం నిర్దేశించే కథల - కోవకు చెందినవే. ఎటొచ్చీ కథకు సంబంధించిన 'తీర్పు'ని లేక 'నీతి'ని చివరలో వాచ్యం చెయ్యడం, దాన్ని పాఠకుని ఊహకే వదలిపెట్టకపోవడం ఈ కథల విశేషం. ఇది సంప్రదాయ శిల్పం. ముళ్ళపూడి వెంకటరమణ "రాజకీయ భేతాళ పంచవింశతి" కథలు ఈ కోవలో చక్కని రచన.

కథలో కథగా, పెట్టెలో ఒకటి తర్వాత మరొకటి యిమిడే పెట్టె ల్లాగ, కథల్ని అల్లుకుంటూపోవడం మరొకవిధమైన సంప్రదాయ శిల్పం. పురాణాల్లో, భారతంలో ఈ శిల్పం కనిపిస్తుంది. చార్‌దర్వేష్ కథలు (నలుగురు ఫకీర్ల కథలు) కూడా ఈ రకం శిల్పాన్నే వ్యక్తంచేస్తాయి. సాలభంజికల కథలు, మదనకామరాజు కథలవంటివి ఒకచెట్టున కాచిన కాయలు, ఒక కొమ్మకు పూచిన పువ్వుల్లాంటివి. ఈ శిల్పాన్ని అను సరిస్తూ 'ఆంధ్రపత్రిక' 'ఆంధ్రప్రభ' వారపత్రికల్లో - యూనివర్శిటీ రీసెర్చి, వివాహం చేసుకోవడం, ప్రధాన వస్తువులుగా, హేళన ప్రధానమైన కథలు వచ్చాయి.

కథాశిల్పాన్ని గూర్చి యింత విశ్లేషణ చేసినా, వస్తువుతో అంటే రచయిత దృష్టితో. దర్శనంతో, ముడిపడని శిల్పం అంటూ వేరుగాలేదు. వస్తువుని నలుగురు నాలుగువిధాల దర్శించవచ్చు. దర్శనంలో ఇలా భిన్నత్వం ఉండటంవల్లనే వస్తువూ, శిల్పమూ అనే విచక్షణ కలుగుతోంది. ఇది భ్రమ. వస్తువుకి ఆకృతిలేదు. రచయిత దర్శనమే వస్తువుకి ఆకృతి కల్పిస్తుంది. అదే కథ; కథాశిల్పం అంటే ఆ దర్శన వైశిష్ట్యమే. శిల్పంగా మనం చెప్పుకున్న నమూనాలూ, లక్షణాలూ కేవలం కొండగుర్తులు మాత్రమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధునిక శిల్పంలో వచ్చిన మార్పు : కథకుడు తన సర్వజ్ఞత్వాన్నీ, ఇదే సత్యం ఇంతకంటె సత్యంలేదు అనే ధీమానీ, వదులుకోవడం, తన దర్శనాన్ని మరింత విశిష్టంగా తనదిగా అభివ్యక్తం చెయ్యడానికి ప్రయత్నించడం. తత్ఫలితంగా శైలిలో, వాక్యరచనలో. ప్రత్యేకమైన పోకడలు పోవడం. చైతన్యస్రవంతి పద్ధతి, అంతరంగకథనం వంటి పోకడలు యిలావచ్చినవే. బుచ్చిబాబు 'చైతన్యస్రవంతి' కథలో చైతన్యస్రవంతి పద్ధతి రాణించలేదు. కారణం అది 'శిల్పం' కోసం, శిల్పాన్ని వేరుగా ఊహించి, రచయిత చేసిన ప్రయోగం కావడమే। విశ్వనాథశాస్త్రి అంతరంగకథనం పద్ధతి అతని దర్శనంతో తాదాత్మ్యం చెందినందువల్లే ఎంతో రాణించింది. బుచ్చిబాబు కథల్లో కొన్నింటిలో రచయిత స్వయంగా పాఠకునితో 'ఇది నే చెబుతున్న కథ' అన్నట్లు చేసే వ్యాఖ్యానం, ఆ కథల 'శిల్పం' మీద దెబ్బ తీసిందనటంలో సందేహంలేదు. వ్యాఖ్యానం కథతో అంటే దర్శనంతో మేళవించేటంతమేర, ప్రమాదం ఏమీలేదు. (అభివ్యక్తి కొంత వాచ్యమైనా ఫరవాలేదు). కాని కథను అలా వదిలిపెట్టి రచయిత పాఠకునితో ముఖాముఖీ ప్రారంభించడం అనే పాతపద్ధతి శిల్పానికి (దర్శనానికి) చేటుతప్ప మేలు కలిగించదు.

తెలుగుకథల్లో గొప్పవిగా చెప్పుకోదగ్గ కథలు : చలం "ఓ పువ్వు పూసింది"; పద్మరాజు "గాలివాన, పడవ ప్రయాణం"; విశ్వనాథశాస్త్రి "కార్నర్ సీట్" "నీడలు" వంటివి ఉన్నాయి. జీవిత గాంభీర్యాన్ని, అంటే ఎందుకు ? అనే ప్రశ్నకు లొంగని, వివరణకూ, విశ్లేషణకూ అతీతమైనదాన్ని - ఒక సౌందర్యాన్ని (చలం), ఒక మమకారాన్ని (పద్మరాజు) ఒక విషాదాన్ని (విశ్వనాథశాస్త్రి) హృదయస్పందిగా ఆవిష్కరించే రసధ్వని ఈ కథల లక్షణం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కథా నిర్మాణంలో (Structure) శిల్పంరీత్యా కొన్ని నమూనాలనూ, లక్షణాలనూ వెదకిపట్టుకోవడం సులువు. కాని కథాకథనంలో (Narrative texture) వైశిష్ట్యాన్ని (దీన్ని "శైలి" అని వ్యవహరించడం సబబుగా తోచదు) అలా విశ్లేషించడం, సూత్రీకరించడం కుదరదు. శిల్పం రచయిత దర్శనాపద్ధతి అయినప్పుడు, ప్రతి వాక్యానికీ పదానికీ కూడా ప్రాధాన్యం ఉన్నది. దీనికి కొన్ని ఉదాహరణలు యివ్వడమే సాధ్యం :

"ఓ పువ్వు పూసింది" కథలో మాతృత్వాన్ని వర్ణించే వాక్యాలు :- "మెల్లిగా పొట్టిపై పోయే నీడల్ని సోమరిగా చూస్తో, శాంతంగా కూచుంది. పువ్వు బలంగా శక్తిని భూమివేళ్ళలోంచి తనలోకి లాక్కుంటూ, తన అందమంతా పోతేనేం ? పరిమళం లేకపోతేనేం ? కేసరాలు అవిసి, ఒడిలి, తన పత్రాలమీదనే వాలిపోతేనేం ? తనవైపుకి కాంక్షతో మధుపాలు చూడకపోతేనేం ? ఇప్పుడు తనచూపు లోపలికి.... తన జీవితానికి అర్థమే మారిపోయింది. తనలోపల క్రొత్తప్రాణం కదులుతోంది. చోటు కోసం వెతుక్కుంటో తన పక్కల్ని సాగదీస్తోంది. మధుపం తననిండా విరజిమ్మిన పుష్పరజంతో పచ్చనై జారిపోయిన తనపత్రాల్ని ఎండ వెచ్చదనానికి వప్పజెప్పి తనచుట్టూ జరిగే సృష్టి ఉత్సవంలో తానూ ఒక ముఖ్య పాత్రధారిణిననే గర్వంతో. ఇంకేం కావాలి అనే స్థిమితంతో, నిర్లక్ష్యంగా చూస్తుంది - క్షణమైనా ఆగక నిరంతరంగా అలలమీద నాట్యంచేసే సృష్టి లీలని. గాలిమీద చిందులు తొక్కుతోంది ఎండ".... మృత్యువు ఆసన్నమైనప్పుడు - "గజ గజ వణికింది. చుట్టూ చూచింది ఏడుస్తో. 'రా' అన్నాడు. 'నా పాపాయి' అంది. 'నీ ప్రాణాన్ని నీ పాపాయికిచ్చి నాతో రా' అన్నాడు నవ్వుతో. 'ఎట్లా రానూ ?' అని అరిచింది చివరి అరుపు. తన చేతిని పట్టుకుని కళ్ళు తుడిచాడు. 'చూడు' అన్నాడు. లోకమంతా పెద్దవెలుగు. అన్ని రూపాల్నీ, భిన్నత్వాల్నీ తనలో కరిగించుకుంటున్న

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మెత్తనివెలుగు.... ఆ వెలుగంతా అతను. అన్నిచోట్లా అతను చంపుతో, ఏడుస్తో, నవ్వుతో, కోపంతో దూకుతో, ఆనందంతో ఊగుతో, ప్రతి మూలా అతను. తన పాపాయిని లాలిస్తో. తాగిస్తో అతను. 'రా'.... అతనిచెయ్యి పట్టుకొని అనంతాకాశంలోకి ఒక్కదూకు దూకింది. ఇంక భయమనేది లేదు. విచారంలేదు. సందేహంలేదు. సమస్తమైన ప్రపంచంతో అతి సన్నిహితుడతడు. అతను వేళ్ళను పట్టుకున్న తననింక ఏమూల ఏరూపంతో నిలిపినా ఆ కొత్తవుండదు.... ఆకాశంలో తేలుతూ భక్తితో అతని మొహంవంక చూచి పక్కన నవ్వింది. ఆనందాన్ని అణచుకో లేక."

"కార్నర్ సీట్" కథ ముగింపు—

"తెగ్గొట్టిన తలలా అలా పడేవుంది టోపీ. అందరూ భయపడుతూ చూసేరు. ఎవ్వరూ తియ్యలేదు. ముట్టుకోలేదు.

ప్రెయినింకా కదల్లేదు....

కిటికీలోంచి పైకి చూస్తున్నాడు రాజు.

ఆకాశం చెప్పలేనంత నీలంగా ఉంది.... కనపడీ కనపడక దాగుంది ఏదోవూరు.... మామిడిచెట్లకీ ముందున్న చెరువుగట్టున స్నానంచేసిన వృద్ధుడెవరో గావంచాతో తుడుచుకుంటున్నాడు స్టేషన్‌వైపు చూస్తూ. దూరానికి ఆకుపచ్చగా కనిపిస్తూ తెల్లటి చుక్కల్లాంటి బాతులు.... చెరువుకి పక్కగా ఉన్న తాటాకుల యింటిముందు విరగబూసిన గన్నేరుచెట్టు బరువుగా కొమ్మలు వంచుకొంది బాగా ఎదిగిన అమ్మాయెవరో నీలంగా ఉన్న చీరచెంగులోకి కెంపుల్లాంటి పువ్వుల్ని తెంపి పడేసుకొంటోంది. కోతకి సిద్ధంగాఉన్న వరిచేల మధ్యనుంచి పల్లెపడుచెవరో పోతోంది వయ్యారంగా నడుచుకుంటూ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దూరంనుంచీ, రాజు కూర్చున్న స్థలంనుంచీ చూస్తోంటే అంతా ప్రశాంతంగా, హాయిగా కనిపిస్తోంది.... రంగులబొమ్మలా.... త్రివర్ణ చిత్రంలా ఉంది. ఎంతో మనోహరంగా ఉంది.

అవన్నీ, అదంతా చూస్తోన్న రాజు మనసెందుకోగాని విచార భరితమైంది. పచ్చకోటువాణ్ణి పరమశత్రువుగా భావించిన సంగతే మరచి పోయాడు. ఆ సమయంలో అలా కూర్చుని చూస్తుంటే అకారణంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అతనికి మిక్కిలి దిగులు కలిగింది.

ఈ నీలపుకొండలు, యీ నీలి ఆకాశం, యీ శీతాకాలపు ఎండ, ఆ బాతులు, యీదే చెరువు, స్నానంచేసిన వృద్ధుడు, ఎక్కడికో పోతున్న పల్లెపడుచు, పువ్వులుకోసే జవ్వని, ఏదీ ఏదీ, ఎవర్నీకూడా చూడలేదీ పచ్చకోటువాడు !

ప్రాణాల్ని ఇనుప పట్టాలమీద పోగొట్టుకున్న పచ్చకోటువాడు జీవితంలో ఎట్టి బాధల్ని చూడలేక, భరించలేక, సహించలేక చివర కీరోజున ప్రాణాల్ని తీసేసుకున్నాడుకదా ! అని రాజు అనుకొంటూండగా ఇంజను పెనుబొబ్బ పెట్టింది. రెయిల్‌గాడీ కదిలింది. నడిచింది. పరుగుతీసింది.

ఎండలో మిలమిల్లాడుతూ పరిగెడుతూన్న టెలిగ్రాఫ్ తీగలవైపు వెనక్కి గాభరాగా జరిగిపోతున్న టెలిగ్రాఫ్ స్తంభాలవైపు, చూడక చూస్తూ కూర్చున్న రాజుకి, గుండెల్లో ఎంతో బరువుగా, మనసులో ఎంతో దిగులుగా ఎందుకుందో సరిగా అర్థంకాలేదు."

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహిత్యంలో సృజన

రచనా వ్యాసంగం యావత్తూ సాహిత్యంక్రిందే లెక్కిస్తే కవిత్వం ఒకదాన్నే పూర్వం కళల్లో చేర్చారు. నేడు కవిత్వంతోబాటు కథ, నవల, నాటకం, "సృజనాత్మక సాహిత్యం" అని పిలవబడుతున్నది. కవిత్వంతో బాటు నవల, కథ, నాటకం - వీటి రచననీ కళాసృష్టిగానే భావిస్తున్నామంటే ఏమిటి భేదం ? ఉదాహరణకు నవలలో పాత్ర పోషణ విషయం తీసుకుంటే, బాపిరాజు నవలల్లోలాగా నాయకుడు స్ఫురద్రూపి, ఆజానుబాహుడు, అతనికి సంగీతం వచ్చు, కవిత్వం వ్రాస్తాడు, టెన్నిస్ పందేలలో ఎప్పుడూ మొదటి బహుమతే గెలుచుకుంటాడు - అంటూ మొదటి ప్రకరణంలోనే కథానాయకుణ్ణి వర్ణించెయ్యడం కళాసృష్టికాదు. మరో ఉదాహరణ : మొదటి అధ్యాయంలో మార్క్సిస్ట్‌గా ఉన్న యువకుణ్ణి ప్రవేశపెట్టి తెలుగుసినిమా హీరోలాగా అఖండమైన విజయ పరంపరతో అతణ్ణి చివర అధ్యాయంలో కూడా చెక్కుచెదరని మార్క్సిస్టుగానే ఉన్నట్లు చిత్రించడం "సృజన" అనిపించుకోదు. అంటే ఇక్కడ అతను చివరి అధ్యాయంలో మార్క్సిస్టుగా ఉండగూడదనీ కాదు - ఉండలేడనీ కాదు. మార్క్సిస్టుగా సొంత అనుభవంతో అతనెదుర్కొన్న కష్టనిష్ఠూరాల్నీ, సంఘర్షణలో అతని దృక్పథంలో వచ్చిన వైశాల్యాన్నీ, అనుభూతి వైవిధ్యాన్నీ, మార్పునీ కనువిప్పుగా చిత్రించితేనే తప్ప, అంటే మొదటికీ, చివరికీ అతనిలోని పరిణామం, తద్వారా అతనిలోని మార్క్సిజం బలపడటాన్నీ నిరూపిస్తే తప్ప అది పాత్ర 'సృష్టి' కాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాటల కందని సంశ్లిష్టమైన అనుభూతిని మాటలద్వారా అందజేసే ప్రయత్నమే - సాహిత్యంలో సృజన.

కవిత్వంలో సృజన ఒక రసాత్మకమైన వాక్యంలో, ఒక పద బంధంలో, వ్యక్తం కావచ్చు. "నా తెలంగాణ కోటిరత్నాలవీణ" అన్న దాశరథి కవి వాక్కు, దాని సృజనాత్మక శక్తివల్లనే అంత ప్రచారాన్ని పొందగలిగింది. ఈ వాక్యానికి మామూలు అర్థం ఏమీలేదు. తెలంగాణా భూభాగం రత్నాలవీణ ఎలా అవుతుంది? అందులో కోటిరత్నాల వీణ అంటే అన్ని రత్నాలు పొదిగినా వీణ అనా? లేక అంత విలువైన వీణ అనా? ఇలా తర్కిస్తే, అంటే మామూలు మాటల అర్థాలను సమన్వయించుకొని చూస్తే, ఏమీ బోధపడదు.

కానీ తెలంగాణా అనగానే ప్రజలనీ, కోటి రత్నాలు అనగానే కోటిమంది రత్నాలవంటి మనుషులు అనీ, వీణ అనగానే ఆ కోటిమంది స్వేచ్ఛకోసం ఎలుగెత్తిన కంఠశ్రుతి అనీ బోధపరుచుకొన్నప్పుడు, ఆ వీణయొక్క సంగీతం వినగలిగినప్పుడు, ఆ వాక్యంలోని సృజనాత్మకశక్తి మనల్ని తాకుతుంది. మాటల కందనిది, కానీ మాటలద్వారానే అందినదీ అయిన ఆ శక్తి ఎటువంటిదో మనం గ్రహించవచ్చు. పూర్వులు 'రస' మని, 'ధ్వని' అనీ పేర్కొన్నది ఈ సృజనశక్తినే. అయితే అలంకారికుల తర్జన భర్జనలలో పడి, దాని అసలు స్వరూపం మరుగున పడి పోయింది. అంతేకాకుండా, మరొక విశేషంకూడా ఉంది. ఈ సృజన శక్తి రచయితకెంత అవసరమో పాఠకుడికీ అంత అవసరమే. కానీ, రచయితా, పాఠకుడూ ఒకటికాదు. ఈ ఇద్దరిలోనూ సాహిత్యపరంగా ఉండవలసిన సృజనశక్తి భిన్నమైనది. అది వేరు రూపాలలో ఉంటుంది. అది ఉద్భూతమయ్యే కారణాలూ సందర్భాలూ కూడా వేరు. అలంకారికులు, పాఠకుడూ లేక విమర్శకుడూ, కలిగి ఉండవలసిన దృష్టిలోనే సాహిత్యంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సృజనను తర్కించి, అభివర్ణించారే తప్ప, వాళ్ళు రచయిత దృక్పథం నుంచీ, అంటే రచయిత వ్యక్తి వైశిష్ట్యంనుంచీ ఉద్భూతమైన సృజనశక్తి ఎలా అభివ్యక్తమౌతున్నదో విచారించే ప్రయత్నం చెయ్యలేదు. అటువంటి ప్రయత్నానికి సూచనప్రాయంగా కొన్ని మాటలు చెప్తాను :

"తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్బహిర్యుద్ధారావమే కవిత్వమంటాడు చలం". శ్రీ శ్రీ కవిత్వానికి యోగ్యతాపత్రం రాస్తూ ఇంకోమాట కూడా అన్నాడు చలం - "కృష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే, శ్రీ శ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధ;" 'కృష్ణపక్షం' ద్వారా కృష్ణశాస్త్రీ, మహాప్రస్థానం' ద్వారా శ్రీ శ్రీ ఆయా కవితోద్యమాలకు రథసారథులు అయారంటే, ఆయా కావ్యాలలోని సృజనశక్తి అందుకు కారణం. కృష్ణశాస్త్రికి ముందూ తరువాతా, ప్రేమనుగూర్చి, నిర్వేదాన్నిగూర్చి వ్రాసిన వారున్నారు. అలాగే శ్రీ శ్రీ అనుయాయులు పేదల్నిగూర్చి, బాధల్నిగూర్చి వ్రాశారు. కాని ఈ ఇద్దరిదే విశిష్టమైన స్థానం కావడానికి కారణమేమిటి ? వ్యక్తి ప్రపంచాన్ని, అంటే సమాజాన్నీ, సామాజికవ్యవస్థనీ ప్రతిఘటించి నిలబడడంలో ఉద్భూతమయ్యే శక్తి సృజనశక్తి. కాల్పనికవాది సమాజాన్ని తిరస్కరించినా, సామాజికవాది సమాజాన్ని విమర్శించి మార్చే ప్రయత్నం చేసినా, సాహిత్యంలో సృజనశక్తి రచయిత వ్యక్తిత్వం ఆలంబనగానే జీవితానుభూతిని ప్రతిబింబిస్తుంది. సమాజాన్ని విమర్శిస్తుంది. క్రొత్తగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తుంది. రచయితలో ఆ వ్యక్తిత్వం లేకపోతే సృజనశక్తిలేదు, కవిత్వమూ లేదు. సామాజిక చైతన్యంలో మార్పు వస్తున్నప్పుడు. సాహిత్యంలో అది ప్రతిఫలించేందుకు, ఆ చారిత్రాత్మక తరుణంలో వ్యక్తిగా రచయిత పడుతున్న ఆవేదన, వ్యవస్థతోడి సంఘర్షణలో పొందుతున్న అనుభూతి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక సృజనాత్మక రచనగా అభివ్యక్తమైనపుడు సమాజం అతణ్ణి ఒక సాహిత్యోద్యమానికి రథసారథిగా నిలబడుతుంది. సాహిత్యంలో కాల క్రమంలో క్రొత్తదనం ఎలాగూ వస్తుంది. కానీ, ఏ తరుణంలో ఏ ఫలానా రచయిత మెడలో ఆ పూలమాల పడుతుందో చెప్పడం కష్టం. "Many are called but few are chosen" అని ఒక సామాన్యోక్తి. సాహిత్యోద్యమంలో "Even among the chosen few, only one will be the leader." వ్యక్తి చైతన్యానికీ, సామాజిక చైతన్యానికీ గల ఈ సంబంధం గుర్తించినప్పుడు ఒకసారి ఒక ఉద్యమానికి నాయకత్వం లభించిందని, మరోసారి మరో ఉద్యమానికికూడా నాయకత్వం వహించే ప్రయత్నంచేసే ముసలి పెళ్ళికొడుకులను ఏమనాలి ? అది రాజకీయాల్లో సాధ్యమేమోగానీ, సాహిత్యసృజనలో కాదు !

నవలలు చదివి నవలలు వ్రాసేవాళ్ళు, సినిమాలు చూసి కథలు వ్రాసేవాళ్ళూ, కవిత్వాన్ని చదివి కవిత్వం వ్రాసేవాళ్ళూ సాహిత్యస్రష్టలు కాలేరు ! అంటే చదవకూడదనికాదు. మొదట్లో రచన అనేది అలానే ప్రారంభం అవుతుంది. షేక్స్పియర్ కూడా పాతనాటకాలను అనుసరించాడు. ఆర్. ఎల్. స్టీవెన్సన్ ఆంగ్లంలో వచనశైలికి పేరుపడ్డ రచయిత. "To pay the sedulous ape" అంటూ తన రచన అనుకరణతో ఎలా ఎలా ప్రారంభమైందీ చెబుతాడు. కీట్స్ తన కవితా సాధనలో మిల్టన్, షేక్స్పియర్ కవుల ప్రభావంనించి బయటపడి, కవిగా తనదైన ఓ రీతిని సాధించుకోవడానికి ఎంత ప్రయత్నం చేశాడో అతని లేఖలద్వారా మనకు తెలుస్తుంది. ఒక కవిగానీ, రచయితగానీ, పూర్వరచయితల ప్రభావం నుంచీ, ప్రతిభావంతులైన సమకాలీనుల ఛాయలనుంచీ, తన్ను తాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రక్షించుకొని తనదైన వ్యక్తిత్వపు ముద్రను - భాషమీదా, ప్రక్రియమీదా, శిల్పంమీదా, చూపగలిగితే తప్ప అతని రచనలోని సృజనశక్తి నిరూపణ కాదు. ఇక్కడ, రచయిత ప్రగాఢమైన అనుభూతి, భావనా తీవ్రత, చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి, అతనికి అండగా ఉంటాయి. అండగా ఉంటాయే తప్ప సృజనశక్తి లోపించినప్పుడు అవి మాత్రమే సాహిత్యానికి అక్కరకురావు. అప్పుడు ఆ వ్యక్తి శిష్టుడూ, విశిష్టుడూ కావచ్చు కాని సాహిత్య స్రష్ట కాలేడు. మొదట్లో సృజనశక్తి ఉండి, తర్వాత వ్యక్తిలో పైజెప్పిన లక్షణాలు లోపించేకొద్దీ, రచనలో సృజనకూడా లోపించి, మృగ్యమైపోతుంది. ఇది ఒక రకమైన శైథిల్యం. అంటే కేవలం మాటలగారడీ పనిచేయదు. సాహిత్యంలో సృజనకు వ్యక్తిలో నిత్యనూతనత్వం అవసరం. ఇదే సాహిత్యంలో నవనవోన్మేషిత్వం.

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహిత్య విమర్శ స్వరూపం

విమర్శ అంటే విశ్లేషించి వివరంగా తెలుసుకోవటం. సాహిత్యాన్ని గూర్చి విమర్శ రెండు విధాలుగా ఉంటున్నది. ఒకటి : రచనల్ని సాముదాయికంగా పరిశీలిస్తూ సాహిత్య తత్త్వాన్ని గూర్చీ, ప్రక్రియాపరంగా దాని లక్షణాల్ని గూర్చీ విచారించి తెలుసుకోవటం. రెండు : ఒక నిర్దిష్ట రచనను పరిశీలించటం. మొదటిరకమైన సాహిత్య విమర్శ తెలుగులో సాంప్రదాయికంగా సంస్కృతంనుంచీ వచ్చింది. అప్పకవీయంలాంటి అలంకారశాస్త్ర గ్రంథాలు తెలుగులో సాహిత్య విమర్శకు వరవడిపెట్టాయి. కాని ఒక నిర్దిష్ట రచనను గూర్చి తెలుసుకోవటానికి అలంకారశాస్త్రం ఎంత వరకు పనికివస్తుంది ? అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కోవడంలోనే సంప్రదాయప్రియులకూ ఆధునికులకూ భేదాభిప్రాయం రావటానికి అవకాశం ఉన్నది.

ఒక కాలానికి అందుబాటులో ఉన్న గ్రంథ సముదాయాన్ని లక్ష్యంగా పెట్టుకొని లక్షణం నిర్వచింపబడుతుంది. ఈ లక్షణ నిర్వచనంలో సాహిత్య ప్రక్రియలను గూర్చిన వింగడింపే కాకుండా, మరీ సూక్ష్మమైన భేదాలవరకూ విచారణ సాగటం ఉన్నది. ఉదాహరణకు నాయక నాయికా భేదాలు, భాషలో ఉక్తి వైచిత్రి భేదాలు అటువంటివి. ఈ విచారణని ఆధారంగా పెట్టుకొని రచయితలు రచన సాగిస్తారు. సాగించారు. అలంకార శాస్త్రానికి ఏ మాత్రపు విలువ యివ్వాలి ? అనే ప్రశ్న ఉన్నది. ఇది రచయితను ఎదుర్కొనే ముఖ్యప్రశ్న. అలంకారశాస్త్రం అధిగమింపరాని సాహిత్య సత్యాలనే చెబుతున్నదన్న భ్రమలో పడి అందులో చెప్పబడిన ప్రతి అంశాన్నీ, తు. చ. తప్పకుండా అనుసరించ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వలె ననుకోవడంవల్ల తెలుగులో సాహిత్య వికాసం కొరవడిన దృష్టాంతాలూ ఉన్నాయి. అలాగే అలంకార శాస్త్ర పరిధిలో పూర్తిగా యిముడని రచనల విషయంలో వాటి సాహిత్య ప్రతిపత్తిని గూర్చి వివాదాలు సంభవించటమూ ఉన్నది. అలంకారశాస్త్రంయొక్క పుట్టుకను గూర్చీ, ప్రయోజనాన్ని గూర్చీ మన వాళ్ళలో సరియైన దృక్పథం లేకపోవడమే యిందుకు కారణమని తోస్తుంది. సంస్కృతంలో అలంకారశాస్త్రం ప్రతిపాదించిన ఔచిత్యము, రసము, ధ్వనివంటి విచారణమార్గాలు ఒక కోవకు చెందినవి. అవి నిర్దిష్ట రచనను గూర్చి తెలుసుకోవటానికి పనికివచ్చేవే అనుకుందాము. కాని నాయక నాయికా విభేదాలవంటివీ. అష్టాదశ వర్ణనలూ, గుణదోషాల పట్టికలూ, తెలుగువాళ్ళు అలంకారశాస్త్రానికి పెట్టుకున్న చిలవలూ పలవలూ బొత్తిగా కాలదోషం పట్టిపోయాయి. ఇలా అలంకార శాస్త్రంలో పనికివచ్చే భాగాన్నీ, పనికిరాని భాగాన్నీ ఎప్పటికప్పుడు విడమర్చుకోవడం కూడా సాహిత్య విమర్శలో ముఖ్యాంశమే !

ఔచిత్యము, రసము, ధ్వని అనే సాంప్రదాయిక మార్గాలని తీసుకున్నా వీటిని ఒక నిర్దిష్ట రచనకి అన్వయించటంలో ఎంతో క్లిష్టత ఉన్నది. ఔచిత్యనిర్ణయము పూర్తిగా విమర్శకుని సంస్కారంమీదా, సహృదయత మీదా ఆధారపడి ఉంటుంది. ఇక్కడే జీవితానుభవమూ, జీవితంపట్ల వివేచనాదృష్టి, వివిధ విషయానుశీలనా, అభినివేశమూ, అవగాహనా విమర్శకునికి అవసరం అనే విషయం గుర్తుకు వస్తుంది. 'రసము' విషయంలోనూ, ఆ పదాన్ని ప్రయోగిస్తున్నప్పుడు, తను ఏ అర్థంలో ప్రయోగిస్తున్నాడో నేటి విమర్శకుడు నిర్వచించి చెప్పటం ముఖ్యం. 'రసవంతంగా ఉంది', 'రసపోషణ జరిగింది', లేక 'రసాభాసమైంది' అని ఊరికే ఆ పదాన్ని వాడటంలో అస్పష్టత తప్ప మరేమీ లేదు. విమర్శ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కునికి ఏదో సంతృప్తి కలిగింది, లేకపోతే అసంతృప్తి కలిగింది అని స్థూలంగా తప్ప మరేమీ తెలియటంలేదు. ఒక నిర్దిష్టరచనని తీసుకున్నప్పుడు అందులో కలిగిన సంతృప్తి లేక అసంతృప్తి యొక్క లక్షణం ఏమిటో ఆ రచనకు అన్వయిస్తూ నిరూపించనంతవరకు పైరకం అధికారిక వాక్యాలూ, తీర్పులూ అర్థరహితంగానే ఉంటాయి; నామటుకు నాకు 'రసము' అంటే "Unity of mood" అని అన్వయించుకోవచ్చునేమో అని తోస్తుంది. ఒక విశిష్టమైన మనఃస్థితిని నాలో కలిగించగల రచనని, రచనాభాగాన్ని, లేక వాక్యాన్ని రసవంతమైందిగా చెప్పవచ్చు. ఇక్కడ మనఃస్థితి అంటే ఒక హృదయానుభూతే కాదు. దానికి అనుబంధమై మేధాగతమైన విశేషభావ స్ఫురణకూడా అని ఉద్దేశం. 'శృంగారరసం' అనగానే స్త్రీ పురుషుల మధ్య లైంగిక వ్యాపారం మాత్రమే కాదు. ఆ స్త్రీ పురుషుల ప్రత్యేక వ్యక్తిత్వాలూ, వ్యక్తిత్వాల సంఘర్షణా, సమీకరణా, కథా సందర్భమూ, ఆ సందర్భానికి ఆ రచన మొత్తంమీద నిర్దేశితమైన అర్థమూ, ప్రయోజనమూ- అన్నీ వివరించుకోవలసిన. అన్వయించుకోవలసిన ఆవశ్యకత ఉన్నది. ఆ విశ్లేషణమూ, నిరూపణమూ లేనప్పుడు 'శృంగార రసమ'ని ప్రతి స్త్రీ పురుష సన్నివేశాన్నీ పేర్కొనటం సాహిత్య విమర్శకాదు. ఒక ఉదాహరణ : ప్రసిద్ధమైన 'మనుచరిత్ర' కావ్యంలోని వరూధినీ ప్రవరుల ఘట్టాన్ని శృంగార ఘట్టంగా గుర్తించి ఆ ఘట్టంలో శృంగార రసాభాసము జరిగినట్లుగా పేర్కొని, అంతకంటె పైన ఆలోచించకపోవటం, అన్వయించుకోలేకపోవటం - ఆ కావ్యానికి విమర్శ ఎలా అవుతుంది ? వరూధిని వ్యక్తిత్వాన్నీ, ప్రవరుని వ్యక్తిత్వాన్నీ సవ్యంగా అర్థం చేసుకోవడమే కాదు. ఆ కావ్యం మొత్తంమీద ఆ ఘట్టంలో జరిగిన 'రసాభాసా'నికి ఉన్న ప్రయోజనం, ఔచిత్యం కూడా విమర్శకుడు అర్థం చేసుకోవలసిన ఆవసరం ఉన్నది. అసలు 'మను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చరిత్ర'ని శృంగారరస ప్రధాన కావ్యమని ఎందుకనుకోవాలి? కావ్యం ధార్మికుడూ, నైష్ఠికుడూ అయిన ప్రవరుడు లోకాతీరుడైన ఒక సిద్ధ పురుషుని కలుసుకోవటంతో ప్రారంభం అయిందికదా! ధర్మానికీ కామానికీ గల సంబంధం, సంఘర్షణ, ఆ కావ్య వస్తువులో ఒక అంశం మాత్రమే! ధర్మానికీ కామానికీ చివరకు అన్ని పురుషార్థాలకూ సమన్వయం సూచించే ఆ కావ్యంయొక్క పరమార్థం కావ్యం అంతా పరిశీలిస్తేనే, దాని రచనా పద్ధతిని అవగాహన చేసుకుంటేనే బోధపడుతుంది. ఆ కావ్యంలో శృంగారం గౌణమే తప్ప ప్రధానరసం కాదు; ప్రధానమైనది శాంతము - శాంతంలో ఉన్న విశిష్టత తదితర రసాలన్నీ దానిలో అంతర్భూతం కావటం. వరూధినీ ప్రవరుల సంవాద ఘట్టంలో శృంగార రసాన్ని ఆభాసంచేసి, తద్వారా తన కావ్యధ్యేయానికి దాన్ని ఉపయోగించుకోవటం పెద్దన చేసినపని. ఈ విషయం గ్రహింపుకు రావాలంటే పెద్దన దృక్పథాన్ని గూర్చి తెలుసుకునే ఆకాంక్ష ఉండాలి; కావ్యాన్ని సమగ్రంగా, సాంతం నమ్రతతో, శ్రద్ధతో పరిశీలించే మన స్తత్త్వమూ కావాలి.

చెప్పవచ్చిందేమిటంటే ఔచిత్యము, రసము, ధ్వనివంటి ఊతకర్రలు చేతపుచ్చుకున్నా, అవి కాళ్ళకు అడ్డంవచ్చి పడిపోకుండా ఉండేందుకు కొంత నేర్పూ, ముందుకు నడిచే శక్తీ, క్రొత్తదనాన్ని చూచే చూపూ, వ్యక్తిగా విమర్శకుడికి ఉండాలి. లేకపోతే ప్రయోజనంలేదు. అలంకార శాస్త్ర పరిజ్ఞానం ఒక నిర్దిష్ట రచన విషయంలో విమర్శకునికి ఎంత సహాయకారిగా ఉండవచ్చునో, అంత ప్రతిబంధకంగాకూడా ఉండగలదనే విషయం స్పష్టమే! అయినప్పుడు ఒక నిర్దిష్ట రచన విషయంలో సాక్షాత్తూ విమర్శ ఎలా జరుగుతుందో విచారించడం ద్వారానే సాహిత్య విమర్శ స్వరూపం తేల్చుకోవాలి గాని, అది అలంకారశాస్త్రం ద్వారా తేలే విషయంకాదు!

* * *

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విమర్శకుని ప్రథమ కర్తవ్యం రచనను చదివి అడుగడుగునా అవగాహన చేసుకుని దాన్ని సమగ్రంగా దృష్టి పథంలో నిలుపుకోవడమనే సూత్రాన్ని అందరూ అంగీకరిస్తారు.[1] 'రచన చెయ్యడం అంటే ఆలోచిస్తూ ముందుకు సాగిపోవటం. అది ఒక అన్వేషణ. రచయిత వెళ్ళిన దారినే వెళ్ళటం. అతని అన్వేషణనే తనూ చేపట్టటం విమర్శకుడు చెయ్యవలసినపని. రచయిత చీకట్లో, మసకవెలుతుర్లో దారి వెతుక్కుంటూ వెళ్ళి ఉండొచ్చు; విమర్శకుడు ఆ దారినే దీపం చేతబుచ్చుకొని వెళ్తాడన్న మాట. ఇంకోవిధంగా చెప్పాలంటే కావ్యం భవనం లాంటిది. దాని నిర్మాణం సుష్ఠుగా ఉండాలి. పైకప్పు కురుస్తున్నదా. మెట్లు గట్టిగా ఉన్నాయా, గదులేవైనా తెరవడానికి వీల్లేకుండా తాళం వేయబడ్డాయా,

---

1. "...In Arnold's conception of criticism...the important thing, is to see the object as in itself it really is" (C. S. Lewis : An experiment in criticism. Page. 110)

"There is nothing more that can be usefully said about a novel until we have fastened upon the question of its making and explored it to some purpose...to study the craft, to follow the process, to read constructively..."

(Percy Lubbock : *The craft of Fiction* quoted by D. Daiches : *Critical Approaches to Literature* : Page 288.)

"His (the critic's) first concern is to enter into possession of the given poem in its concrete fullness, and his constant concern is never to lose his complete possession but rather to increase it." (F. R. Leavis : quoted by D. Daiches : *Critical Approaches* : Page 299.)

"He (a good critic) must be an adept at experiencing without eccentricities, the state of mind relevant to the work of art he is judging".

(I. A. Richards : *The Principles of Literary Criticism*, Page 114)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొదలయిన విషయాలన్నీ గమనించి తెలుసుకొని వివరించి చెప్పడం విమర్శకుని వంతు' అంటారు యూజ్ని ఆయొన్నెస్కో అనే రచయిత. [2] రచనను అవగాహన, ఆకళింపు చేసుకోవడమన్నది ఇక్కడ రెండు విధాలుగా వర్ణింపబడింది. విమర్శకుడు రచయితతో చేసే ప్రయాణంగా, రచయిత నిర్మించిన భవనంలో ప్రవేశించడంగా. అంటే విమర్శకుడు రచన చదివి దాన్ని దృష్టి పథంలో నిలుపుకోవడంతో, అతనికి రచన స్వరూపం (Form) దృశ్యంకావాలి. [3] ఆ స్వరూపం ఒక ప్రయాణంగా (A Movement) గా గాని, ఒక నిర్మాణం (Structure)గా గాని ఉండవచ్చు. ఈ రెండు రూపాలూ ప్రస్తుతం విమర్శకులు ఎక్కువగా ఉపయోగిస్తున్న గుర్తులు; ఒకటి కాలానికి (Time) సంబంధించినది. రెండోది 'దేశాని'కి (Space) సంబంధించినది. ('ప్రయాణం' బదులు. 'ప్రవాహం', 'భవనం' బదులు 'పువ్వు' గుర్తులు కావచ్చు.) ఇక్కడే ముఖ్యంగా గమనించవలసిన విషయం ఒకటున్నది. ఒక రచనను మొదటినుంచీ చివరిదాకా ఎంతగా అధ్యయనం చేసినా దాని సమగ్ర స్వరూపం మనోనేత్రం ముందు స్ఫురింపకపోతే మాత్రం లాభంలేదు. ఆ రచనయొక్క 'కదలిక' లేక 'నిర్మాణం' తాలూకు ఏకత్వం దేనిమీద ఆధారపడి ఉన్నదో ఆ రహస్యాన్ని విమర్శకుడు పట్టుకోవాలి. అది సద్యఃస్ఫురణగా గాని, నిష్పాక్షికమూ, నిశితమూ అయిన వివేచన ఫలితంగా గాని జరుగవచ్చు. అలా జరిగినప్పుడే విమర్శకునికి రచన నిర్మాణంలో ప్రతిభాగమూ, అంశమూ పరస్పరం అమరి ఉన్నాయో లేదో బోధపడి, రచనా స్వరూపాన్ని విశ్లేషించి నిరూపించడానికి

---

2. Eugene Ionesco : The Writer and his Problems : Encounter.

3. "It (Form) is the shape that the whole takes when every part has fallen into its place according to the design which the artist had in his mind throughout." (Scott James : *The Making of Litt*. Page 305.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వీలవుతుంది. పైకి కనిపించే వైరుద్ధ్యాలనీ, అసంబద్ధతలనీ అధిగమించిన ఏకత్వమూ, విశేషార్థమూ రచనలో ఏదైనా ఉన్నదో లేదో అన్వేషించడం, నిరూపించడం జరగాలి, అప్పుడు దానిలోని దోషాలు లేక విశేషాలు అవే వ్యక్తం అవుతాయి. ఇక్కడ రచన సౌష్ఠవాన్నీ, విశిష్టతనూ నిరూపించడానికి అలంకారశాస్త్రం కాని, తదితర సిద్ధాంతాలుగాని విమర్శకునికి కొలతబద్ధ కారాదు. అలంకారశాస్త్ర పరిజ్ఞానమూ, తదితరమూ విమర్శకుని అవగాహనా శక్తిని వృద్ధిచేసి తోడ్పడవచ్చుగాని, ఒక రచనయొక్క స్వరూప, వైశిష్ట్య నిర్ణయంలో మాత్రం ప్రమాణం కారాదు. ('Nothing can permanently please which does not contain in itself the reason why it is so, and not otherwise'.- Coleridge.) ఒక రచన యిచ్చే ఆనందమూ, దాని విలువా దాని నిర్మాణంలో అంతర్గతమైన ఒకానొక మూలకారణంమీదే ఆధారపడకుండా, దానికి సంబంధించని ఏదో యితర కారణంమీదే ఆధారపడితే ఆ ఆనందమూ, విలువా, తాత్కాలికమైన భ్రమమాత్రమేననీ, దాన్ని వ్యక్తం చేసిన విమర్శ సాహిత్య విమర్శకాదనీ కోలెరెడ్జి భావము. ఒక రచనయొక్క పథకమూ, దాన్ని నిర్మాణసూత్రాలూ. దాని స్వరూపాన్ని దర్శించడం ద్వారా విమర్శకుడు ఆ రచనలోనుంచే గ్రహించవలసి ఉంటుంది. ఎవరో ఎక్కడో ఏ రచనను గురించో సిద్ధాంతీకరించిన సూత్రాలను ప్రస్తుత రచనకు అన్వయించబూనటం విమర్శకాదు! [4] విమర్శకుడు రచన స్వరూపాన్ని దర్శించి దాన్ని గూర్చి చేయబూనుకొన్న విశ్లేషణాత్మక విచారణద్వారానే రచనలోని

---

4. The defects of a work are due to that in it which is not in conformity with itself; to the fact that the work departs from the rules, and therefore from itself; each work is important in so far as it invents its own rules." (Eugene Ionesco : The Writer and his Problems : Encounter.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోపాలు బహిర్గతమౌతాయి. ఈ విచారణే రచన విలువనీ నిర్ణయిస్తుంది. [5] అప్పుడు విమర్శకుడు ప్రత్యేకంగా తీర్పు చెప్పవలసిన అవసరంకూడా ఉండదు. రచనలో వాచ్యమైన అభిప్రాయాలతో తను ఏకీభవిస్తున్నాడో లేదోకూడా విమర్శకుడు చెప్పవలసిన మాటకాదు. రచననుగూర్చి లెస్సగా తెలిసికోవటమూ, తెలియజెప్పటమూ, విమర్శకుని ఏకైక లక్ష్యం. 'Description ought to be his only form of judgement : criticism is the registering of the reality of a work, of its logic; it is a task of verification and confirmation' (Ionesco).

అయితే రచన స్వరూపంలో సౌష్ఠవమూ సౌందర్యమూ అన్వేషించి నిరూపించడం తప్ప విమర్శ చెయ్యవలసిందేమీ లేదా ? అంటే అవును, అంతటితో ఆగిపోవటమే కర్తవ్యమని కొందరి అభిమతం. వీరినే Formalists అంటున్నారు అలాకాదు సాహిత్యపరంగా ఎన్నదగిన రచనకు, అది ప్రాచీనమైనా, అధునాతనమైనా, దానికి సమకాలీన జీవనంతో భావసంచలనంతో ఉన్న సంబంధాన్ని గూర్చి వ్యాఖ్యానించడంకూడా విమర్శ

---

5. "The axioms and postulates of criticism have to grow out of the art it deals with...Critical principles cannot be taken over ready made from theology, philosophy, politics, science, or any combination of these."

(Northrop Frye : *Anatomy of Criticism.* Page 6)

A work is bad when it is not itself, when it does not amount to something like a unique being or entity...The mistakes in a given work, the useless parts are those parts which do not belong to it."

(Eugene Ionesco : The writer and his Problems : Encounter)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధ్యేయమేనని మిగిలిన వారంటున్నారు. 6 సాహిత్యపరంగా ఎన్నదగిన రచన తప్పకుండా జీవితంపట్ల ఒక దృక్పథాన్ని వ్యక్తంచేస్తూ ఉండాలని వీరి అభిప్రాయము. నిర్మాణ సౌష్ఠవం సాధించిన ఒక అపరాధ పరిశోధక నవల సంగతేమిటి ? అంటే దానికి సాహిత్యపరంగా విలువ తక్కువేననీ; జీవితంపట్ల ఒకదృష్టినీ ఒక వ్యాఖ్యానాన్నీ వ్యక్తం చేయగలిగిన రచన మాత్రమే సాహిత్యపరంగా ఉత్కృష్టమైనదనీ వీరి అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని మనం ఆమోదిస్తే విమర్శ చేయవలసిన పనుల్లో రచనయొక్క దృక్పథాన్ని గూర్చిన వ్యాఖ్యానంకూడా ఒకటి అని తేలుతుంది. ఈ వ్యాఖ్యానం విమర్శకునిబట్టీ, కావ్యంయొక్క వ్యంగ్య వైభవాన్నిబట్టీ, ఎన్నోవిధాలుగా ఉండటానికి వీలున్నది. ఒక నవలనో నాటకాన్నో తీసుకున్నప్పుడు అందులోని పాత్రలనుబట్టి యీ వ్యాఖ్యాన పరంపర ఉండవచ్చు. ఈ రకం విమర్శ మనకు బాగా పరిచితమైనదే. కానీ పాత్రలమీద విడివిడిగా వ్యాఖ్యానించటంకాక, రచన మొత్తంమీద వ్యక్తమయ్యే దృక్పథం ఏమిటో దాన్ని రూపొందింపజేయటం ఆధునిక పద్ధతి. ఉదాహరణకు : షేక్స్పియర్ హామ్లెట్ పాత్రను గూర్చిన వ్యాఖ్యానాలు కోకొల్లలుగా ఉన్నాయి. హామ్లెట్ పాత్ర ఒక తీరని సమస్య. కాని ఆ పాత్రబదులు నాటకాన్ని మొత్తంగా తీసుకొని ఆ రచన స్వరూపాన్ని దర్శించినప్పుడు, హామ్లెట్ పాత్ర సమస్యగా కన్పించదు. దానికి బదులు ఒక అపూర్వ జీవిత దృక్పథం గోచరిస్తుంది. ఒక కావ్యంయొక్క దృక్పథాన్నిగూర్చి వ్యాఖ్యానించే విమర్శ మన సంప్రదాయంలో సకృత్తు.

---

6. 'Any criticism that is not purely preoccupied with technical matters must be concerned to bring out the basic moral concern, the implied valuation of human attitudes and activities that gives life to a work of art.'' (John Mander : *The Writer and Commitment*, Page 23)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బహుశా లేదనే అనుకుంటాను. అందుకు కారణం సులభంగానే ఊహించవచ్చు. ప్రాచీన కావ్యాల్లో దృక్పథం పైనిక దర్శనాలమీదా స్మృతులమీదా ఆధారపడిందే అయిఉండటంవల్ల ప్రత్యేకంగా దాన్నిగూర్చి వ్యాఖ్యానించే అవసరం అప్పటికి కన్పించి ఉండదు. కాని నా మటుకు నాకు శంకరుడు ఉపనిషత్తులకూ, గీతకూ, అద్వైత దృక్పథరూపంలో చేసిన వ్యాఖ్యానమే ఒక గొప్ప సాహిత్య విమర్శగా కనిపిస్తుంది. ప్రాచీన కావ్యాల్లోనూ, వస్తువు కల్పితమూ, లేక ఐతిహాసికమూ అయినప్పుడు కథా వైశిష్ట్యాన్నిబట్టి, పాత్రల వైవిధ్యాన్నిబట్టి, వ్యాఖ్యానానికి అవకాశం ఎంతో ఉన్నది. కాని నాయకనాయికా భేదాలంటూ సాముదాయిక సాహిత్య లక్షణ గ్రంథాల్లో పాత్రలను సిద్ధాంతీకరించి వెయ్యటంతో ఆ అవకాశం వినియోగం కాకుండా ఒక ఆంక్షలాంటిది విధింపబడింది. తెలుగు సాహిత్య విమర్శలో ఈ ఆంక్షను తొలగించి కావ్యాల్లో పాత్రపోషణకూ యథార్థ జీవితానికీ గల సంబంధాన్ని వ్యాఖ్యానిస్తూ చక్కని విమర్శ వెలయించినవారు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆ విధంగా తెలుగులో మనకు ఒక క్రొత్త సంప్రదాయం ఏర్పడింది. ఆధునిక విమర్శకు శ్రీకారం చుట్టబడింది. నిజానికి ప్రాచీన కావ్యాల విషయంలోగాని, తెలుగులో ఉత్తమ ప్రబంధాల విషయంలోగాని, ఒక నిర్దిష్ట కావ్యంలో ఆ రచన మొత్తంమీద వ్యక్తమయ్యే దృక్పథాన్ని గూర్చి వ్యాఖ్యానించేందుకు ఉన్న అవకాశం మనం యింకా ఉపయోగించుకోవడం లేదు. 'కళాపూర్ణోదయం'లో కథానిర్మాణ సౌందర్యమూ, పాత్రల వైవిధ్యమే కాకుండా, ఆ రచన ధ్వని పూర్వకంగా వ్యక్తంచేస్తున్న దృక్పథంలో కూడా ఎంతో వైశిష్ట్యం ఉన్నది. ఈ దృక్పథాన్ని గూర్చి జి. వి. కృష్ణారావుగారు కాటూరి వేంకటేశ్వరరావుగారు వ్యాఖ్యానించారు. అలాగే 'మనుచరిత్ర'లో వ్యక్తమౌతున్న దృక్పథాన్ని గూర్చి నేను చేసిన వ్యాఖ్యానము లోగడ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'భారతి' (1963)లో ప్రచురింపబడి, యిప్పుడు 'సాహిత్యంలో దృక్పథాలు' అన్న సంపుటిలో ముద్రితమై ఉన్నది. ఇక్కడ చెప్పవచ్చిందేమిటంటే మన ప్రాచీనకావ్యాల్లో జీవిత దృక్పథాన్ని గూర్చి క్రొత్తగా వ్యాఖ్యానించేందుకు ఏమీ లేదనుకోవటం పొరపాటు. ఒక కావ్యం జీవితచిత్రణ చేస్తున్నప్పుడు, లేక విశిష్టమైన కల్పనగా, యితిహాసంగా, పురాణంగా అది పదే పదే మనల్ని ఆకర్షిస్తున్నప్పుడు, రసవంతంగా ఉంటున్నప్పుడు (అంటే ఒక విశేష మనఃస్థితిని మనలో కలిగించే శక్తి కలిగిఉన్నప్పుడు) ఆ రససిద్ధిని గూర్చి విశ్లేషణాత్మకంగా వివరించ బూనుకోవటమే కాదు, దానికీ జీవితానికీ గల సంబంధాన్ని గూర్చి వ్యాఖ్యానించటం కూడా చేపట్ట వలసిన లక్ష్యమే !

ఇక్కడ ఒక మాట చెప్పవలసి ఉన్నది. నేటి విమర్శకుడు వెలయించే వ్యాఖ్యానమే ఒక ఉత్తమ కావ్యానికి భరతవాక్యం కానేరదు. అలా అయ్యే పరిస్థితివుంటే ఆ కావ్యంయొక్క జీవితం అంతటితో పరిసమాప్తి చెందిందనే అనుకోవచ్చు. అప్పుడు కావ్యాన్ని చదివినా, విమర్శ చదివినా ఒక్కటే అవుతుంది ! రచయిత దృక్పథమూ అతని కాలపు విశ్వాసాలూ వాచ్యంగాకాక, కావ్యంలో వ్యంగ్యంగా, జీవిత చిత్రణంగా నిక్షిప్తం కావటంతో ఆ కావ్యం విశ్వజనీనమైన, కాలాతీతమైన ఒక సత్యాన్ని వ్యక్తం చెయ్యడం జరుగుతుంది. 7 ఆ సత్యాన్నే ఆ కావ్యం యొక్క ఆత్మగా,

---

7. The work of imagination presents us with a vision not of the personal greatness of the poet, but of something impersonal and far greater; the vision of a decisire act of spiritual freedom, the vision of the recreation of man.

(N. Frye : *Anatomy of Criticism* : Page 94)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ లక్షణాన్ని ప్రాణంగా పేర్కొనవచ్చు. ఆ సత్యాన్ని కావ్యంలోని దృక్ప థంగా, కావ్యంయొక్క విశేషార్థంగా, రసధ్వనిగా ఏ యుగపు విమర్శకులు ఆ యుగంలో వ్యాఖ్యానించవచ్చు. దర్శించవచ్చు. కావ్యం నాలుగు కాలాల పాటు నిత్యనూతనంగా జీవించి ఉండటం యీ విధంగానే సాధ్యం.

పైె వివరించిన 'ప్రాణ' లక్షణం దృష్ట్యా, ఏ ఉత్తమ కావ్యానికి గాని చరమ విమర్శ అంటూ ఉండడం అసంభవమని గుర్తింపక తప్పదు. గొప్ప కావ్యాల్లోని గాంభీర్యము, ఉదాత్తత, వాటిలో ఏదో ఎవరికీ అర్థం కాని విషయం కొంత ఎప్పుడూ ఉండటంవల్ల ఏర్పడిందికాదు; ఆ కావ్యాల నుంచీ అర్థవైవిధ్యమూ, అనుభూతి సంపదా ఎప్పటికప్పుడు పుష్కలంగా లభించే అవకాశం ఉండడంవలన, భిన్న ప్రకృతులుగల పాఠకులందరికీ భిన్న విధాలలో రససిద్ధి కలుగుతూనే ఉంటుంది. [8] దీన్ని గమనించి విమర్శకుడు నిస్పృహ చెందవలసిన పనిలేదు. విమర్శ అంటే విశేషించి వివరంగా తెలుసుకోవటం అంటూ యీ వ్యాసం ప్రారంభించాను. కాని ఒక రచననిగూర్చి ఏమిటి తెలుసుకుంటున్నాము ? అని నిశితంగా ప్రశ్నిస్తే దానికి సమాధానంగా కావ్యంద్వారా మనలో కలిగిన అనుభూతిని మాత్రమే నని గుర్తిస్తాము ! కాని విమర్శకుడు తను చేసే ఆ స్వానుభవ వివరణలో నేలవిడిచి సాము చెయ్యకుండా రచనని ఎప్పటికప్పుడు ఉపాధిగా అంటిపెట్టుకునే వ్యవహరించాలి అనే నియమం ఉన్నది. అదే సాహిత్య విమర్శకు గీటురాయి.

8. The mystery in the greatness of *King Lear* or *Macbeth* comes not from concealment but from revelation, not from something unknown or unknowable in the work but from something unlimited in it. (N. Frye : *Anatomy of Criticism* : Page 88)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాలంలో అభిరుచులూ అభిప్రాయాలూ మారుతాయి. సాహిత్య రచనలో మార్పులూ కొత్త పోకడలూ వస్తాయి. సాహిత్యాన్ని విమర్శించి వ్యాఖ్యానించే మార్గాలూ భిన్నంగా రూపొందవచ్చు. కాని రచయిత దృక్పథానికీ అతని రచనకీ గల సంబంధం ఒక నిశ్చిత ప్రమాణం. రచన మనలో కలిగించే అనుభూతిద్వారా ఆ సంబంధాన్ని తెలుసుకొని వివరించడానికి చేసే ప్రయత్నమే సాహిత్య విమర్శ. సాహిత్య విమర్శ స్వభావము కావ్యార్థప్రకాశము; దాని స్వరూపము సత్యాన్వేషణము.

★

Forwarded free of cost:
With the compliments of
Department of Education
Govt. of India, New Delhi.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహిత్య లక్ష్యం

జీవితానికి లక్ష్యం ఏమిటి ? అని ప్రశ్నిస్తే, ఒకటి కాదు పది, పది కాదు, లక్ష సమాధానాలు లభిస్తాయి. వ్యక్తి, వర్గము, జాతి, దేశము, సంస్కృతి - వీటినిబట్టి సమాధానాలు ఉంటాయి. అందులో ఆనందం, సత్యాన్వేషణ, మోక్షం వంటి ఉదాత్తమైనవే కావు, ధనం, కీర్తి, అధికారం, ఇంద్రియ సుఖం, వంటివి కూడా జీవిత లక్ష్యాలే. సాహిత్య లక్ష్యంగా ఇవన్నీ కూడా ఎప్పుడో ఒకప్పుడు పేర్కొనబడినవే. కాని సాధనగా జీవితం - సాహిత్యం ఒకటి కావు ! జీవితంలో ఒక సాహిత్య సృష్టి, ఒక సాధనంగా సాహిత్యాధ్యయనమూ సాహిత్యలక్ష్యాన్ని నిర్దేశిస్తాయి.

సాహిత్యమంటే సృజనాత్మక సాహిత్యం - కావ్యం, నాటకం, నవల, కథ - అని నిర్వచనం : 'సాహిత్యం జీవితంయొక్క ప్రతిబింబం', అంటారు కొందరు. (Literature is the mirror of life). ఇది సరి కాదు. జీవితానికి లేని నిర్దిష్టమైన ఆకృతి, సాహిత్యంలో రచనకు ఉన్నది. అందుకే రచన జీవితానికి ప్రతిబింబం కాదని అనడం, తర్వాత 'జీవితానికి ఒక వ్యాఖ్యానాన్ని ప్రతిపాదించేది సాహిత్యం' అనే సూత్రీకరణం ఉన్నది. (Poetry is the criticism of Life) దీన్ని అంగీకరించడమూ కష్టమే. ఏమంటే వ్యాఖ్యానాన్ని ప్రతిపాదించేది మీమాంస లేక దర్శనమౌతుంది. సాహిత్యానికి రచయిత ఉద్దేశించేది నిర్దిష్టమైన అర్థమే కావచ్చు. కాని రచనగా అది ఆకృతి తాల్చిన తరువాత, దానికి రచయిత ఉద్దేశ్యంతో సంబంధం ఉండదు. సృజనాత్మక సాహిత్యంలో రచయిత ఉద్దేశ్యమూ, రచన పఠితల్లో కలిగించే అనుభూతి అర్థమూ, భిన్నంగా ఉండవచ్చు. రచయిత కేవలం వాచ్యార్థ ప్రధానమైన రచన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేస్తే దానికి సాహిత్యపు విలువరాదు. సాహిత్యరచన వ్యంగ్యప్రధానమైన సృష్టి. అంతేకాదు. రచయిత జీవితంలో తన అవసరాన్నిబట్టి, ధనమూ, కీర్తీ వంటి లక్ష్యంకోసమో, లేక మనస్సులోని దుఃఖాన్నీ, దుగ్ధనీ వదలించుకోవడానికో, లేక కేవలం ఆనందంకోసమో చేసిన రచన కావచ్చును. ఆ లక్ష్యమునకు విరుద్ధమూ, ఆ మనఃస్థితికి భిన్నమూ ఐన చిత్రమైన ఫలితాల్ని అది లోకంలో సాధించవచ్చు. అందుకే రచయిత లక్ష్యమూ రచన లక్ష్యమూ, విధిగా ఏకీభవించవలసిన అవసరం లేదు!

పోతే పఠిత దృష్ట్యా, సాహిత్య రచన సాధించే లక్ష్యాన్ని గూర్చి ఆలోచిస్తే - పఠితల సంస్కారాన్ని బట్టి సాహిత్య ప్రయోజనం ఎన్నో విధాలుగా ఉంటుంది. కొన్ని రచనలు తన్మయీభావాన్నీ, రసానుభూతినీ కలిగిస్తాయి. కొన్ని వైరస్యాన్నీ, విరక్తినీ కలిగిస్తాయి. ఈ అనుభూతికీ, జీవితం ప్రసాదించే అనుభూతికీ పోలికలూ, విభేదాలూ ఉంటాయి. కొందరు ఆ పోలికలకోసం సాహిత్యాన్ని చదువుతారు. కొందరు అనుభూతిలో భిన్నత్వం, వైవిధ్యం కోరి చదువుతారు. అలా జీవితానుభూతిని పౌనఃపున్యంగానూ, నవనవోన్మేషంగానూ. స్మరణీయంగానూ, నియమిత పరిధిలో, పరిశీలనకు అనువైన పరిధిలో, అందుబాటులోనికి తెచ్చే సాధనం సాహిత్యం. భాషతోపాటు దృశ్యాలుకూడా ఆధారంగా ఇటువంటి లక్ష్యాన్నే సినిమా, టీ. వీ., కూడా నెరవేర్చవచ్చు. జీవితానుభూతిని భాషా ప్రక్రియలో నిక్షేపిస్తుంది సాహిత్యం. జీవితం మాయ, అభాసకాదు. జీవితానుభూతిని మించిన సత్యం లేదని చెబుతుంది సాహిత్యం. సైన్సుకు, ఫిలాసఫీకీ, ఏ మేధాగతమైన అన్వేషణకూ లొంగని జీవిత రహస్యాన్ని (Mystery of Life) నిక్షేపించి అందించడమే సృజనాత్మక సాహిత్య లక్ష్యం.

8276

★

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
29883

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"విమర్శనా దారిద్ర్యంతో కృశిస్తున్న ఆధునిక ఆంధ్ర సాహిత్యానికి ఆరోగ్యవంతమైన విమర్శ అంటే ఏమిటో తెలియపరచి, చక్కని కథా రచయితలుగానే గాక ఉత్తమ విమర్శకులుగా కూడా పేరు వడసిన.... మీవంటి శేముషీ దురంధరులకు బహుమతి నొసంగి అకాడెమీ తనను తాను గౌరవించుకోవడమే గాక తనకు యితోధికమైన ఔన్నత్యాన్ని సాధించుకొన్నది...."

— దాశరథి (లేఖ, 10-11-1975)

"సుదర్శనం గారు నవలా రచయితగా, విమర్శకులుగా సుప్రసిద్ధులు. 'సాహిత్యంలో దృక్పథాలు' అనే సాహిత్య విమర్శ గ్రంథంతో విమర్శలో నూతన ద్వారాలు తెరిచారు... ప్రసిద్ధ తత్త్వవేత్తల సిద్ధాంతాలను సమన్వయించుకుంటూ, తనదైన దృక్పథాన్ని, నమ్మకాన్ని, అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే సుదర్శనంగారి విమర్శలు తెలుగు సాహిత్యంలో విలువైన రత్నాలు."

— ఎమ్వీయల్ (ఆంధ్రజ్యోతి వారపత్రిక, 9-3-1973)

"పద్యాలు, గేయాలు, కథలు, నవలలు చదివే సాధారణ పాఠక లోకమేకాక, ఎడతెగకుండా ఆయా రచనలు సాగిస్తున్న రచయితలు కూడా శ్రద్ధగా చదివి తెలుసుకొనవలసిన విశేషాలు మీ వ్యాసాల్లో అనేకం ఉన్నాయి."

— డా॥ వి. వి. యల్ నరసింహారావు
(లేఖ, 7-6-1973)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar